

ఈనాడు



గుంటూరు 5-5-2026 మంగళవారం సిటీ సంపుటి 31 సంచిక 29
THE LARGEST CIRCULATED TELUGU DAILY
రూ. 6-50 పేజీలు 18
www.eenadu.net
Guntur, Visakhapatnam, Hyderabad, Vijayawada, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajahmahendravaram, Suryapet, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam,Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru

బెంగాల్‌లో

భాజపా ప్రభంజనం



బెంగాల్‌లో భాజపా విజయం అనైతికం. 100కు పైగా స్థానాల్లో తీర్పును ఆ పార్టీ దోచుకుంది. మోదీ, అమిత్ షా, కేంద్ర బలగాల సహకారంతో ఎన్నికల సంఘం వ్యవహరించిన తీరు చట్ట విరుద్ధం.
- మమతా బెనర్జీ

తమిళనాట

దళపతి సంచలనం

మమత కోటను బద్దలు కొట్టిన మోదీ, షా ద్వయం

- బెంగాల్‌లో భారీ మెజారిటీ సాధించిన కమలదళం
- 15 ఏళ్ల తృణమూల్ అధికారానికి తెర
- ద్రవిడ పార్టీలను మట్టికరిపించిన టీవీకే
- తమిళనాడులో అతి పెద్ద పార్టీగా అవతరణ
- సొంత స్థానాల్లో ఓటమి పాలైన మమతా బెనర్జీ, స్టాలిన్
- గెలిచి పరువు దక్కించుకున్న విజయన్



భాజపా ప్రధాన కార్యాలయంలో మోదీ అభివాదం

భారతదేశ ప్రజాస్వామ్యంపై నమ్మకం కల్పించిన రోజు ఇది. భారత రాజ్యాంగం, రాజ్యాంగ సంస్థలు విజయం సాధించాయి. పశ్చిమ బెంగాల్, అస్సాం, పుదుచ్చేరి, తమిళనాడు, కేరళ ప్రజలకు తలవంచి నమస్కరిస్తున్నాను. భాజపా కార్యకర్తలనూ అభినందిస్తున్నాను. ప్రజాస్వామ్యంలో గెలుపోటములు సహజం. కానీ ప్రజాస్వామ్యానికి జననిగా భారత్ ఎందుకు నిలిచిందో మన ప్రజలు ప్రపంచానికి తెలియజేశారు. - నరేంద్ర మోదీ

కేరళలో యూడీఎఫ్ హవా | మూడింట రెండొంతుల మెజారిటీ | కామ్రేడ్లకు పరాభవం

అస్సాంలో తిరుగులేని కమలం | భాజపా హ్యాట్రిక్ విజయం

పుదుచ్చేరిలో సామాన్యుడే రారాజు | రంగసామికే పట్టం

యావద్భారతంలో ఆసక్తి రేకెత్తించిన ఐదు అసెంబ్లీల ఎన్నికల ఫలితాల్లో మార్పే మంత్రమైంది. మమతా దీదీ 15 ఏళ్ల పాలనకు బ్రేకులు వేస్తూ.. బెంగాల్‌లో భాజపా బంపర్ హిట్ కొట్టింది. ద్రవిడ పార్టీల సుదీర్ఘ ఆధిక్యాన్ని సవాలు చేస్తూ.. తమిళనాట సినీ హీరో విజయ్ అరంగేట్రంలోనే అదరగొట్టారు. కేరళలో యూడీఎఫ్ మళ్లీ పీఠమెక్కగా... కామ్రేడ్లు దేశంలో ఎక్కడా అధికారంలో లేకుండా పోయారు. అస్సాంలో కమలనాథులు ముచ్చటగా మూడోసారి జయభేరి మోగించారు. పుదుచ్చేరిలో మళ్లీ సామాన్యుడికే పీఠం దక్కింది. అస్సాం, పుదుచ్చేరి తప్పిస్తే... అంతటా ఓటర్లు మార్పునే కోరుకున్నారు.

దేశవ్యాప్తంగా నాలుగు రాష్ట్రాలు, ఒక కేంద్రపాలిత ప్రాంతంలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో అనూహ్య ఫలితాలొచ్చాయి. కీలకమైన పశ్చిమ బెంగాల్‌ను భాజపా భారీ మెజారిటీతో కైవసం చేసుకుంది. 15 ఏళ్లుగా అధికారంలో ఉన్న తృణమూల్ కాంగ్రెస్ పార్టీకి భారీ షాక్ తగిలింది. తమిళనాడులో కొత్తగా పుట్టిన తమిళగ వెట్రి కళగం (టీవీకే) అనూహ్యంగా అతి పెద్ద పార్టీగా అవతరించి అధికారం దిశగా అడుగులేసింది. ఇక కేరళలో ఆనవాయితీని పునరుద్ధరిస్తూ అధికార మార్పిడి జరిగింది. యూడీఎఫ్ జయకేతనం ఎగురవేసింది. అస్సాంలో హిమంత బిశ్వ శర్మ నేతృత్వంలో ఎన్నికలకు వెళ్లిన భాజపా ఐదింట నాలుగొంతుల మెజారిటీ సాధించింది. పుదుచ్చేరిలో రంగసామి నేతృత్వంలోని ఏఐఎన్ఆర్‌సీ అధికారం నిలబెట్టుకుంది. ఇద్దరు ముఖ్యమంత్రులు స్టాలిన్, మమతా బెనర్జీ తాము పోటీ చేసిన స్థానాల్లో ఘోర పరాజయం పాలయ్యారు. ఆయా రాష్ట్రాల్లో పలువురు మంత్రులు మట్టికరిచారు. పశ్చిమ బెంగాల్‌లో భాజపా విజయం నేపథ్యంలో దిల్లీలోని పార్టీ ప్రధాన కార్యాలయంలో సంబరాలు జరిగాయి. ఇందులో పాల్గొన్న ప్రధాని మోదీ.. ప్రతీకార రాజకీయాలుండవని, పరివర్తన సాధిస్తామని హామీ ఇచ్చారు. బెంగాల్‌లో భాజపా విజయం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. అయితే పశ్చిమ బెంగాల్‌లో తృణమూల్ ఓటమి ఖాయమైన వెంటనే ఆ పార్టీ కార్యాలయాలపై దాడులు జరిగాయి. వాటితో తమకు సంబంధం లేదని భాజపా స్పష్టం చేసింది.

- ఓటమి నేపథ్యంలో కేరళ ముఖ్యమంత్రి విజయన్ రాజీనామా చేశారు.

(మిగతా 2లో)



గెలుపు అనంతరం విజయ్ దరహాసం

విజయ్‌తో కలిసేదెవరు?
- ఏ పార్టీకీ దక్కని మెజారిటీ
- 108 స్థానాలతో అతిపెద్ద పార్టీగా టీవీకే
- ప్రభుత్వం ఏర్పాటుకు మరో 10 సీట్లు అవసరం

6లో

పశ్చిమ బెంగాల్ 293	
భాజపా	206
తృణమూల్	81
కాంగ్రెస్	2

తమిళనాడు 234	
టీవీకే	108
డీఎంకే +	73
అన్నాడీఎంకే +	53

కేరళ 140	
యూడీఎఫ్	102
ఎల్డీఎఫ్	35
ఎన్డీయే	3

అస్సాం 126	
భాజపా +	102
కాంగ్రెస్ +	21
ఏఐయూడీఎఫ్	2

పుదుచ్చేరి 30	
ఎన్డీయే +	18
డీఎంకే +	6
టీవీకే +	3

పట్టుబట్టి దీదీని పడగొట్టి
ఫలించని మమత ఒంటరి పోరాటం
విజిల్ విజృంభణ
కమ్యూనిస్టుల అధికార పర్వానికి తెర

లోపలి పేజీల్లో



విశ్వవిద్యాలయాల్లో.. 1,500 పోస్టుల భర్తీ 14లో



ఒక్కరోజు కస్టడీకి వైకాపా ఎమ్మెల్సీ అనంతబాబు 16లో

గ్రామీణ పేదలకు లక్ష ఇళ్లు!

నెలాఖరు నాటికి కేంద్రం నుంచి మంజూరయ్యే అవకాశం

6-7 లక్షల మంది అర్హులుగా గుర్తింపు

మిగతా వారికి విడతల వారీగా మంజూరు

ఈనాడు, అమరావతి: సొంతగూడు లేని గ్రామీణ ప్రాంత పేదలకు త్వరలో కూటమి ప్రభుత్వం తీపికబురు అందించనుంది. కేంద్ర ప్రభుత్వం నుంచి లక్ష ఇళ్లు మంజూరు కానున్నాయి. సంబంధిత దస్త్రం కేంద్ర గృహనిర్మాణ శాఖ పరిశీలనలో ఉంది. ఈ నెలాఖరు నాటికి మంజూరయ్యే అవకాశాలున్నట్లు రాష్ట్రానికి సమాచారం అందించింది. ఈ ఇళ్లను ప్రధానమంత్రి ఆవాస్ యోజన (పీఎంఏవై) గ్రామీణ-2.0 పథకం కింద చేపట్టనున్నారు. జూన్ నుంచి లబ్ధిదారులు ఈ గృహ నిర్మాణాలు చేపట్టేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. రాష్ట్రానికి అవసరమైన మిగతా గృహాల్ని కేంద్రం విడతల వారీగా మంజూరు చేయనున్నట్లు తెలిసింది.

వైకాపా హయాంలో ఒక్క ఇల్లూ మంజూరు చేయలేదు..

వైకాపా హయాంలో పట్టణ ప్రాంతాలు, యూడీఏల్లో మాత్రమే పేదలకు ఇళ్ల నిర్మాణాన్ని చేపట్టింది. గ్రామీణ ప్రాంతాల్లో ఐదేళ్లలో ఒక్క ఇల్లూ పేదలకు మంజూరు చేయలేదు. దాదాపుగా 4 లక్షల మంది అప్పట్లోనే సొంతింటి కోసం దరఖాస్తు చేసుకున్నారు. సొంత స్థలాల్లో ఇళ్ల (మిగతా 14లో)

మీ పనితీరు చెత్తగా ఉంది

సుప్రీంకోర్టు రిజిస్ట్రీపై సీజేఐ ఆగ్రహం

దిల్లీ: సర్వోన్నత న్యాయస్థాన పాలనా విభాగమైన సుప్రీంకోర్టు రిజిస్ట్రీపై ప్రధాన న్యాయమూర్తి(సీజేఐ) జస్టిస్ సూర్యకాంత్ సోమవారం మండిపడ్డారు. 'రిజిస్ట్రీ పనితీరు చెత్తగా ఉంది. అక్కడున్న ప్రతిఒక్కరూ తామే సూపర్ సీజేఐలం అని భావిస్తున్నారు' అంటూ చురకలు వేశారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్, ఇతరులకు నోటీసులు పంపించకపోవడంపై తీవ్రంగా ఆక్షేపించారు. రూ.37వేల కోట్ల పెట్టుబడుల మోసానికి సంబంధించిన కేసులో నిందితురాలు ఆయుషి మిత్తల్ అలియాస్ ఆయుషి అగర్వాల్ బెయిల్ పిటిషన్‌పై విచారణ సందర్భంగా సీజేఐ ఈ వ్యాఖ్యలు చేశారు. మార్చి 23నాటి ఉత్తర్వులో... ఈడీకి, ఇతరులకు ధర్మాసనం నోటీసు జారీ చేయలేదనే అభిప్రాయానికి రిజిస్ట్రీ ఎలా వచ్చిందని ప్రశ్నించారు. దీనిపై నిజనిర్ధారణ జరిపించాల్సి ఉందన్నారు. పాలనాపరమైన లోపంపై దర్యాప్తు నిర్వహించాలని జ్యుడీషియల్ రిజిస్ట్రార్‌ను ఆదేశించారు.



కాదేదీ కమీషన్లకు అనర్హం!

- అక్రమాలకు అడ్డాగా 'ఏపీఎంఎస్ఐడీసీ'
- వైకాపాతో అంటకాగినోళ్లదే నేటికీ పెత్తనం
- వర్గపోరుతో రచ్చకెక్కుతున్న ప్రభుత్వ ప్రతిష్ఠ

ఈనాడు, అమరావతి: వైద్య ఆరోగ్య శాఖకు వెన్నెముక లాంటి ఆంధ్రప్రదేశ్ వైద్య సేవలు, మౌలిక వసతుల అభివృద్ధి సంస్థ (ఏపీఎంఎస్ఐడీసీ)లో పాలన గాడి తప్పింది. సంస్థ పాలన, కార్యకలాపాలపై పట్టు ఉందంటూ కీలక స్థానాల్లో కొందరు ఏళ్లుగా తిష్ఠ వేశారు. వీరు తమ విధులను పక్కన పెట్టి.. కమీషన్లు దండుకునే వ్యవహారాలు సాగిస్తున్నారు. తాము మంత్రి వర్గమంటూ కొందరు.. తాము ఛైర్మన్ వర్గమంటూ మరి కొందరు అడ్డగోలు పెత్తనాలు చెలాయిస్తున్నారు. ఈ వర్గపోరును ఆసరాగా చేసుకుని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లకుండానే కొన్ని నిర్ణయాలను ఏకపక్షంగా తీసుకుంటున్నారు. రాష్ట్రంలో ప్రభుత్వ వైద్య కళాశాలలు, ఆసుపత్రులు, వైద్య ఆరోగ్య శాఖ పరిధిలో మౌలిక సదుపాయాల కల్పనతో పాటు మందులు, సర్జికల్స్ సరఫరా, ఆరోగ్య పథకాల అమలుకు సామగ్రి కొనుగోలు టెండర్లు ఏపీఎంఎస్ఐడీసీ ద్వారానే పిలుస్తారు. మందుల తనిఖీలు, నాణ్యత పరీక్షలు, ఇతరత్రా ఈ సంస్థే చూస్తుంది. అంతటి ప్రాధాన్యం ఉన్న సంస్థలో తీసుకుంటున్న ప్రతి నిర్ణయమూ వివాదాస్పదమవుతోంది. ఇంత జరుగుతున్నా.. ప్రక్షాళన చర్యలు లేవు. పూర్తిస్థాయి వైస్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ లేకపోవడం.. ఇదే అదనుగా కొందరు చక్రం తిప్పుతుండటంతో డ్రగ్స్, వైద్య పరికరాలు, సివిల్, ఫైనాన్స్ తదితర విభాగాలపై పర్యవేక్షణ కొరవడింది.



మంగళగిరిలోని ఏపీఎంఎస్ఐడీసీ రాష్ట్ర కార్యాలయం

నిర్ణయం తీసుకునేదీ.. ఆమోదించేదీ ఆయనే..

రెగ్యులర్ వీసీ, ఎండీ గిరీషా నిర్ణయాలు నచ్చక ఆయన్ను జనవరిలో సాగనంపారు. అప్పటి నుంచి మార్చి వరకు (మిగతా 3లో)

ఇదీ సంగతి!



(c) eenadu




ఈనాడు



గుంటూరు 5-5-2026 మంగళవారం సిటీ సంపుటి 31 సంచిక 29
THE LARGEST CIRCULATED TELUGU DAILY
రూ. 6-50 పేజీలు 18
www.eenadu.net
Guntur, Visakhapatnam, Hyderabad, Vijayawada, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajahmahendravaram, Suryapet, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam,Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru

అమ్మమ్మల ఆటలు ఆడేద్దాం

ఇప్పటి ఆటలన్నీ మనకు బాగా తెలుసు. కానీ మన అమ్మమ్మల కాలం నాటి ఆటల గురించి తెలుసా? ఇప్పుడు తెలుసుకుని ఆడేద్దాం రండి.



సెలవుల్లో సరదాగా!



నాలుగురాళ్ల ఆట

- చతురస్రాకారంలో ఓ పెట్టె గీయాలి. మళ్లీ దానికి మధ్యలో అడ్డంగా, నిలువుగా నాలుగు సమ భాగాలు అయ్యేటట్టు గీసుకోవాలి.
- మధ్యలో నాలుగు రాళ్ల పెట్టి, ఒకరు కాపలా ఉండాలి.
- నాలుగు భాగాల్లో నలుగురు ఉండి, ఆ రాళ్లను తీసేందుకు ప్రయత్నించాలి.
- కాపలా ఉండేవాళ్లు అన్ని గీతలపై నడుస్తూ.. నలుగురిలో ఒకరిని తాకేందుకు ప్రయత్నించాలి. ఒకవేళ తాకితే తగిలిన వాళ్లు దొంగ.
- అలా కాకుండా, నలుగురూ ఆ రాళ్లను తీసేయగలిగితే మళ్లీ వాళ్లే దొంగ.

అప్పడప్పడ తాండ్ర..



« అందరూ గుండ్రంగా కూర్చోవాలి.
« ఒకరు నేలమీద అరచేతిని పెట్టాలి. దాని మీద ఒక్కొకరుగా అందరూ తమ అరచేతులను పెట్టాలి.
« మొదట చెయ్యి పెట్టినవారు తన రెండో చేత్తో అన్నింటికంటే పైన ఉన్న చేతిపై 'అప్పడప్పడ తాండ్ర, ఆవకాయ తాండ్ర గంగాలమ్మ చెవి పట్టుకో' అని చరుస్తాడు.
« ఆ చెయ్యి ఎవరిదైతే వారు... ఆ చెయ్యి తీసేసి, పక్కవాళ్ల చెవి పట్టుకోవాలి.
« అలా అందరి చేతులయ్యాక, ఒకరి చెవులొకరు పట్టుకొని 'గిరి గారి.. గిరి గారి' అంటూ ముందుకు వెనక్కు ఊగాలి.

ఎక్కడి దొంగలు అక్కడే గప్‌చుప్



➤ ఒకరు కాస్త ఎత్తులో కూర్చుంటే.. వాళ్లకి కాస్త దిగువ మరొకరు కూర్చోవాలి.
➤ ముందున్న వాళ్ల కళ్లని ఎత్తులో ఉన్నోళ్లు ఒక చేత్తో మూయాలి.
➤ రెండో చేత్తో వాళ్ల చెయ్యి పట్టుకొని, వీరి వీరి గుమ్మడిపండు వీరి పేరేమి అని ఎదురుగా నిల్చున్న పిల్లల చేతికి తాకించాలి.
➤ సరైన పేరు చెబితే ఆ పేరు వాళ్లు కళ్లు మూయించుకోవాలి. లేదంటే 'ఎక్కడి దొంగలు అక్కడే గప్ చుప్ సాంబర్ బుడ్డీ' అంటూ వాళ్లను దాక్కోమనాలి.
➤ కళ్ల మీద నుంచి చేతులు తీయగానే. అందర్నీ వెతికి పట్టుకోవాలి. ఎవరు ముందుగా దొరుకుతారో.. వాళ్లే దొంగ.



శ్రీవారి ఆలయ మాడవీధులకు
4 వేదాల పేర్లు

ఈనాడు డిజిటల్, తిరుపతి; తిరుమల, న్యూస్‌టుడే: తిరుమలలో భక్తులకు సౌకర్యాల కల్పనతోపాటు మౌలిక సదుపాయాల పెంపుపై తితిదే ప్రత్యేకంగా దృష్టిసారించింది. ఈ నెల 6న జరిగే ధర్మకర్తల మండలి సమావేశంలో కీలకాంశాలపై చర్చించి తీర్మానం చేయనున్నారు. శ్రీవారి ఆలయ మాడవీధులకు నాలుగు వేదాల పేర్లు పెట్టనున్నారు. తిరుమలలోని మిగిలిన వీధులకు.. శ్రీవారిని కీర్తించిన వాగ్గేయకారులు అన్నమయ్య, రామదాసు, పురందరదాసు, వెంగమాంబ తదితరుల పేర్లను, శ్రీవారి సేవలకు తిరుమల నంబి, అనంతాళ్వార్ తదితర పేర్లను పెట్టనున్నారు. తిరుమలలోని ముళ్లగుంత, ఆర్బీసీ సెంటర్, మేదరమిట్ట వంటి వాటి స్థానంలో మహాత్ములు, పురాణ పురుషుల పేర్లను పెట్టనున్నారు. అలిపిరిలో టౌన్‌షిప్ నిర్మించడం, తిరుమలకు వచ్చే భక్తుల వసతికి సంబంధించి కల్యాణి సత్రాన్ని ఆధునికీకరించడంపై చర్చించి నిర్ణయం తీసుకోనున్నారు.

పీఎల్ఆర్ ప్రాజెక్ట్స్‌పై విజిలెన్స్ విచారణ

ఇది మాజీ మంత్రి పెద్దిరెడ్డి కుటుంబ సభ్యుల సంస్థ

వైకాపా హయాంలో గ్రామీణ రోడ్లన్నీ ఈ సంస్థకే..

పనుల్లో నాణ్యతలేమిపై ప్రభుత్వానికి ఫిర్యాదులు

ఈనాడు, అమరావతి: వైకాపా ప్రభుత్వంలో చక్రం తిప్పిన మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కుటుంబ సభ్యులకు చెందిన పీఎల్ఆర్ ప్రాజెక్ట్స్ ఆధ్వర్యంలో చేసిన గ్రామీణ రహదారుల పనులపై రాష్ట్ర ప్రభుత్వం విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ విచారణకు ఆదేశించింది. ఆ సంస్థ ఆధ్వర్యంలో చిత్తూరు జిల్లాలో చేసిన పనులపై విచారించి నివేదిక ఇవ్వాలని పేర్కొంది. టెండర్ల ప్రాసెస్ నుంచి పనుల కేటాయింపు, నాణ్యత వరకు అన్ని కోణాల్లోనూ సమగ్రంగా పరిశీలించాలని ప్రభుత్వం ఆదేశించింది. ఏషియన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకు (ఏఐఐబీ) రుణం రూ.4,235 కోట్లతో వైకాపా ప్రభుత్వంలో పలు జిల్లాల్లో గ్రామీణ రహదారుల పనులు చేపట్టారు. అప్పటి రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కుటుంబ సభ్యులకు చెందిన పీఎల్ఆర్ ప్రాజెక్ట్స్‌కు చిత్తూరు జిల్లాలో పెద్దఎత్తున పనులు కేటాయించారు. మంత్రి మౌఖిక ఆదేశాలతో ఆ జిల్లాకే 21 ప్యాకేజీల కింద రూ.1,300 కోట్ల విలువైన 1,200 రహదారుల పనులను అధికారులు మంజూరు చేశారు. వీటిలో 17 ప్యాకేజీల్లో రూ.1,000 కోట్ల విలువైన 1,100 రోడ్ల పనులు పీఎల్ఆర్ ప్రాజెక్ట్స్ ఖాతాల్లోకి వెళ్లాయి. రూ.300 కోట్ల విలువైన 100 పనులే ఇతర గుత్తేదారు సంస్థలకు కేటాయించారు. మిగతా సంస్థలను బెదిరించడంతో వారెవరూ అప్పట్లో టెండర్లలో పాల్గొనే సాహసం చేయలేదు. దక్కిన అరకొర పనులే మహాభాగ్యం అన్నట్లుగా భావించారు.

పనుల్లో నాణ్యతకు తిలోదకాలు

పీఎల్ఆర్ ప్రాజెక్ట్స్ చేపట్టిన రహదారుల పనులపై కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక పలు ఫిర్యాదులొచ్చాయి. పనుల్లో నాణ్యత పాటించలేదని, ప్రమాణాలకు విరుద్ధంగా పనులు చేసినా ఇంజినీర్లు పట్టించుకోలేదన్నది ప్రధాన అభియోగం. టెండర్లు పీఎల్ఆర్ ప్రాజెక్ట్స్‌కు దక్కేలా మంత్రి పెద్దిరెడ్డి అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారని గుంటూరు జిల్లాకు చెందిన హైకోర్టు న్యాయవాది ఎంవీవీఎస్‌వీ ప్రసాద్ గత నెల 17న ప్రభుత్వానికి ఫిర్యాదు చేశారు. ప్రజాధనం దుర్వినియోగంపై సమగ్ర విచారణ జరిపించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అప్పటికే వచ్చిన పలు ఫిర్యాదులపై పీఎల్ఆర్ ప్రాజెక్ట్స్‌కు రూ.1,000 కోట్లకు పైగా బిల్లులు నిలిపివేసిన ప్రభుత్వం.. తాజాగా ఆ పనులపై విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ విచారణకు ఆదేశించింది. రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శశిభూషణ్‌కుమార్ రాష్ట్ర విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం డైరెక్టర్ జనరల్‌కి వారం క్రితం లేఖ రాశారు.

పీఎల్ఆర్ సంస్థకు సాగిలపడ్డ ఇంజినీర్లు

వైకాపా ప్రభుత్వంలో పీఎల్ఆర్ ప్రాజెక్ట్స్‌కు పంచాయతీరాజ్ ఇంజినీర్లు కొందరు సాగిలపడ్డారు. టెండర్లు అదే సంస్థకు దక్కేలా మిగతా సంస్థలను పోటీ నుంచి తప్పించడం నుంచి పనులకు సంబంధించిన బిల్లులు అప్‌లోడ్ చేసే వరకు వీరే కీలక పాత్ర పోషించారు. రాష్ట్ర పంచాయతీరాజ్ ఈఎన్‌సీ కార్యాలయంలో కీలక స్థానాల్లోని అధికారులతో పాటు చిత్తూరు జిల్లాలో అప్పట్లో పనిచేసిన కొందరు ఇంజినీర్లు పీఎల్ఆర్ సంస్థకు పూర్తిగా అనుకూలంగా వ్యవహరించారన్న ఆరోపణలున్నాయి. కొందరు ఇంజినీర్లు ఇప్పటికీ అదే ధోరణిలో ఉన్నారు. ఆ ఇంజినీర్ల పాత్రపైనా సమగ్ర విచారణ జరిపించాలని ప్రభుత్వానికి పలువురు విజ్ఞప్తి చేస్తున్నారు.

చెట్టుకూలి ముగ్గురు.. పిడుగుపాటుకు ఒకరు మృతి

అల్లూరి సీతారామరాజు జిల్లాలో దుర్ఘటనలు



వారపు సంతలో కూలిన చెట్టు

పెదబయలు, పెదబయలు గ్రామీణం, డుంబ్రిగుడ, న్యూస్‌టుడే: అల్లూరి సీతారామరాజు జిల్లాలో విషాదం చోటుచేసుకుంది. కూరగాయలు విక్రయించేందుకు వారపు సంతకు వచ్చి చెట్టు కూలిన ఘటనలో ముగ్గురు మహిళలు మరణించగా.. పిడుగుపడి మరొక బాలిక మృతి చెందింది. పెదబయలులో ప్రతి సోమవారం జరిగే సంతలో ఒడిశాలోని కోరాపుట్ జిల్లా పాతులుంగి పంచాయతీ జర్రాయికి చెందిన కొందరు చిన్నచిన్న కర్రలపై టార్పాలిన్లు వేసి కూరగాయలు అమ్ముతుంటారు. సోమవారం కూడా వారు సంతకు రాగా.. మధ్యాహ్నం ఒక్కసారిగా ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. దాంతో సంతలోని ఓ భారీ వృక్షం వేళ్లతో సహా టార్పాలిన్లపై కూలిపోయింది. ఈ ఘటనలో తిత్తమ్మ(30), ఇచ్చమ్మ(40) మృతి చెందగా.. పాడేరు ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ పాతులుంగికి చెందిన మొనిమ(45) చనిపోయారు. మరో ఆరుగురు గాయపడ్డారు. వారిని ఆసుపత్రికి తరలించారు. కంద్రుం పంచాయతీ సిందేరిగుడ గ్రామానికి చెందిన ఎస్. దివ్య(13).. అక్క మీరా, మరో స్నేహితురాలితో కలిసి ఆకుకూర సేకరణకు సమీప కొండకు వెళ్లింది. మధ్యాహ్నం ఇంటికి వస్తుండగా భారీ వర్షానికి పిడుగుపడింది. దివ్య అక్కడే కుప్పకూలిపోగా.. మీరా అస్వస్థతకు గురైంది. మరో స్నేహితురాలు గ్రామానికి చేరుకుని కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చింది. బాలికలిద్దర్నీ అంబులెన్స్‌లో డుంబ్రిగుడ పీహెచ్‌సీకి తరలించగా.. అప్పటికే దివ్య మృతి చెందినట్లు వైద్యాధికారి నిర్ధారించారు. మీరాకు చికిత్స అందిస్తున్నారు.



పిడుగుపాటుకు మృతిచెందిన దివ్య



(c) eenadu

భాజపా ప్రభంజనం.. దళపతి సంచలనం



తమిళనాడులో టీవీకే అతిపెద్ద పార్టీగా అవతరించడంతో ఆ పార్టీ గుర్తు అయిన విజిల్‌ను ఊదుతూ సంబరాలు చేసుకుంటున్న విజయ్ కుటుంబ సభ్యులు



పశ్చిమ బెంగాల్‌లోని ముర్షీదాబాద్‌లో భాజపా మద్దతుదారుల హర్షాతిరేకాలు

(మొదటి పేజీ తరువాయి)

కేరళలో ఓటమితో ప్రస్తుతం దేశంలోని ఏ రాష్ట్రంలోనూ లెఫ్ట్‌కు అధికారం లేకుండా పోయింది. దాదాపు 50 ఏళ్ల తర్వాత లెఫ్ట్‌కు ఈ పరిస్థితి ఏర్పడటం గమనార్హం.

- ముగ్గురు ముఖ్యమంత్రులు (స్టాలిన్, విజయన్, మమతా బెనర్జీ) పదవులను కోల్పోతున్నారు. ఇద్దరు (హిమంత బిశ్వశర్మ, రంగసామి) నిలబెట్టుకున్నారు.

బెంగాల్ దంగల్‌లో కమలం పైచేయి

తూర్పు ప్రాంతంలోని పశ్చిమ బెంగాల్‌లో భాజపా చరిత్రాత్మక విజయాన్ని సొంతం చేసుకుంది. మూడింట రెండొంతులకుపైగా మెజారిటీ సాధించింది. ఉదయం ఎన్నికల కౌంటింగ్ ప్రారంభమైనప్పటి నుంచే భాజపా ఆధిక్యం సాధించడం మొదలైంది. అక్కడా ఇక్కడా అని కాకుండా సరిహద్దుల్లో, గిరిజన ప్రాంతాల్లో, పారిశ్రామిక కారిడార్లలో భాజపా హవా కొనసాగింది. కోల్‌కతాతో పాటు కొన్ని గ్రామీణ ప్రాంతాల్లోనే తృణమూల్ కొన్ని విజయాలను సాధించగలిగింది. బెంగాల్‌లో మెజారిటీ మార్కు 147 కాగా.. భాజపా 206 సీట్లు సాధించింది. తృణమూల్ 81 సీట్లకే పరిమితమైంది.

- భవానీపుర్‌లో పోటీ చేసిన ముఖ్యమంత్రి మమతా బెనర్జీ తన ప్రత్యర్థి, ప్రతిపక్ష భాజపా నేత సువేందు అధికారి చేతిలో ఘోర పరాజయం పాలయ్యారు. ఆమెతోపాటు దాదాపు 20 మంది మంత్రులు ఓడిపోయారు. సువేందు అధికారి రెండు చోట్లా విజయం సాధించారు.
- ఎన్నికల ఫలితాలు వెలువడుతున్న సమయంలో మమతా బెనర్జీ తీవ్ర అసహనానికి గురయ్యారు. చివరి వరకూ వేచి ఉండాలని, విజయం తమదేనని మధ్యాహ్నం సమయంలో వీడియో సందేశంలో పేర్కొన్నారు. ఎన్నికల సంఘం, భాజపాపై తీవ్ర విమర్శలు చేశారు. అయితే సాయంత్రానికి తృణమూల్ పరాజయం పరిపూర్ణమైంది.
- వివాదాస్పద ఏజేయూపీ నేత హుమాయూన్ ఖాన్ తాను పోటీ చేసిన రెండు స్థానాల్లోనూ విజయం సాధించారు.
- కాంగ్రెస్ సీనియర్ నేత అధీర్ రంజన్ చౌధరి బహరంపుర్‌లో ఓడిపోయారు.
- దస్త్రాలన్నింటినీ జాగ్రత్తపరచాలని అధికారులను బెంగాల్ సీఎస్ ఆదేశించారు.



పెరంబూరు నుంచి ఎన్నికైనట్లు రిటర్నింగ్ అధికారి నుంచి ధ్రువీకరణ పత్రం అందుకుంటున్న టీవీకే అధినేత విజయ్

'స్టార్' తిరిగింది..

మెజార్టీ ఎగ్జిట్ పోల్స్‌ను తారుమారు చేస్తూ... తమిళనాడులో రెండేళ్ల అనుభవం కూడా లేని తమిళగ వెట్రి కళగం (టీవీకే) అనూహ్యంగా అధికారానికి చేరువైంది. రెండు దిగ్గజ పార్టీలైన డీఎంకే, ఏఐఏడీఎంకేలను తోసిరాజని అతి పెద్ద పార్టీగా అవతరించింది. మెజారిటీకి అతి కొద్ది దూరంలో నిలిచిపోయింది. అనూహ్య పరిణామాలేవైనా జరిగితే తప్ప ఆ పార్టీ అధినేత విజయ్ ముఖ్యమంత్రి కావడం ఖాయం. ఆయనకు మద్దతిచ్చేందుకు పలు చిన్న పార్టీలు, ప్రధాన పార్టీలు ముందుకు వచ్చే అవకాశముందంటున్నారు.

విజయ్ ముఖ్యమంత్రి అయితే ఆ పదవి చేపట్టిన తొలి మైనారిటీ నేతగా గుర్తింపు పొందుతారు.

- విజయ్ పార్టీ టీవీకే 108 సీట్లను సాధించింది. ఆయనకు ఇంకా 10 సీట్లు కావాల్సి ఉంది. తమిళనాడులో మెజారిటీ మార్కు 118. తాను పోటీ చేసిన రెండు స్థానాల్లోనూ ఆయన గెలిచారు. విజయ్‌కున్న ప్రజాదరణతోపాటు ప్రకటించిన అనేక సంక్షేమ పథకాలు విజయం కట్టబెట్టాయి.
- కొళత్తూరులో పోటీ చేసిన ముఖ్యమంత్రి స్టాలిన్ ఘోరంగా ఓడిపోయారు. ఆయన తనయుడు, ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్ గెలిచారు.
- ఎడప్పాడిలో తలపడిన ఏఐఏడీఎంకే అధినేత పళనిసామి 98వేలకుపైగా ఓట్ల మెజారిటీతో భారీ విజయం సాధించారు.



పశ్చిమ బెంగాల్‌లో తృణమూల్ పరాజయం చెందడంతో విలపిస్తున్న ఆ పార్టీ మద్దతుదారు

కేరళ యూడీఎఫ్‌దే

కేరళలో కాంగ్రెస్ నాయకత్వంలోని యూడీఎఫ్ కూటమి ఎగ్జిట్ పోల్స్‌ను మించి భారీ విజయం సాధించింది. పదేళ్ల పినరయి విజయన్ పాలనను ప్రజలు తిరస్కరించారు. యూడీఎఫ్ 102 స్థానాల్లో విజయం సాధించింది. లెఫ్ట్ కేవలం 35 స్థానాలకే పరిమితమైంది.

- కేరళలో యూడీఎఫ్ విజయం సాధించడంతో ముఖ్యమంత్రి అభ్యర్థిత్వంపై ఊహాగానాలు మొదలయ్యాయి. రేసులో సతీశన్, కేసీ వేణుగోపాల్ తదితరులున్నారు.

ఈశాన్యాన మరోసారి వికాసం

ఈశాన్యంలో పెద్దన్నలాంటి రాష్ట్రం అస్సాంలో వరుసగా మూడోసారి కమలం వికసించింది. హిమంత బిశ్వశర్మ ఒంటి చేత్తో పార్టీకి తిరుగులేని విజయం సాధించిపెట్టారు. జలూక్‌బరీలో వరుసగా ఆరో సారి హిమంత గెలిచారు. ఆయనకు లక్షకుపైగా ఓట్ల మెజారిటీ వచ్చింది.

- రాష్ట్రంలో మెజారిటీ మార్కు 64కాగా భాజపా కూటమి.. 102 సీట్లలో విజయం సాధించింది. భాజపా ఒక్కటే సొంతంగా మెజారిటీ (82) సాధించడం విశేషం.
- భాజపా 90 సీట్లలో పోటీ చేసి 82 చోట్ల గెలిచింది. బీవోపీఎఫ్ 11 చోట్ల పోటీ చేసి 10 చోట్ల విజయం సాధించింది.
- జోర్హాట్‌లో కాంగ్రెస్ రాష్ట్రశాఖ అధ్యక్షుడు గౌరవ్ గొగొయ్ ఓడిపోయారు.

రంగసామిదే పుదుచ్చేరి

కేంద్రపాలిత ప్రాంతం పుదుచ్చేరి మరోసారి సామాన్యుడైన అసామాన్యుడు రంగసామికే పట్టం కట్టింది. ఎన్డీయే కూటమిలో ఉన్న ఆయన రెండోసారి వరుసగా అధికారం చేపట్టనున్నారు. ఈ కూటమి 18 స్థానాల్లో విజయం సాధించింది. యానాంలో ఎన్డీయే అభ్యర్థి మల్లాడి కృష్ణారావు ఘన విజయం సాధించారు.



21కి చేరిన ఎన్డీయే పాలిత రాష్ట్రాలు

పశ్చిమ బెంగాల్‌లో విజయం సాధించడంతో దేశంలో ఎన్డీయే పాలనలో ఉన్న రాష్ట్రాల సంఖ్య 21కి పెరగనుంది. బెంగాల్ విజయంతో భాజపా స్వతంత్రంగా పాలించే రాష్ట్రాలు 15కు చేరనున్నాయి. అదనంగా బిహార్‌లో జేడీయూ, ఆంధ్రప్రదేశ్‌లో తెదేపా-జనసేన, నాగాలాండ్‌లో నాగా పీపుల్స్ ఫ్రంట్, మేఘాలయలో నేషనల్ పీపుల్స్ పార్టీ తదితరాలతో కలిపి భాజపా అధికారంలో ఉన్న రాష్ట్రాల సంఖ్య 21కి చేరుతోంది.

– దిల్లీ, కోల్‌కతా, చెన్నై, తిరువనంతపురం, గువాహటీ, పుదుచ్చేరి

పార్టీల వారీగా సీట్లు, ఓట్ల శాతాలు

తమిళనాడు

పార్టీ	సీట్లు	ఓట్ల శాతం
టీవీకే	108	34.92
డీఎంకే	59	24.19
ఏఐఏడీఎంకే	47	21.21
కాంగ్రెస్	5	3.37
పీఎంకే	4	--
ఐయూఎంఎల్	2	0.29
సీపీఐ	2	0.66
వీసీకే	2	1.09
సీపీఎం	2	0.60
భాజపా	1	2.97
డీఎండీకే	1	1.20
ఏఎంఎంకేఎం ఎన్‌కేజెడ్	1	--

కేరళ

పార్టీ	సీట్లు	ఓట్ల శాతం
కాంగ్రెస్	63	28.79
సీపీఎం	26	21.77
ఐయూఎంఎల్	22	11.01
సీపీఐ	8	6.64
కేరళ కాంగ్రెస్	7	5.03
ఆర్ఎస్‌పీ	3	1.21
భాజపా	3	11.42
ఆర్జేడీ	1	0.82
ఆర్ఎంపీవోఐ	1	--
కేరళ కాంగ్రెస్ (జాకబ్)	1	--
సీఎంపీకేఎస్‌సీ	1	--
స్వతంత్రులు	4	--

పుదుచ్చేరి

పార్టీ	సీట్లు	ఓట్ల శాతం
ఏఐఎన్ఆర్‌సీ	12	23.12
డీఎంకే	5	13.74
భాజపా	4	12.19
టీవీకే	2	16.72
కాంగ్రెస్	1	17.54
ఎల్‌జేకే	1	--
ఏఐఏడీఎంకే	1	1.09
ఎన్‌ఐఎంకే	1	--
స్వతంత్రులు	3	--

అస్సాం

పార్టీ	సీట్లు	ఓట్ల శాతం
భాజపా	82	37.81
కాంగ్రెస్	19	29.84
ఏజీపీ	10	6.47
బీవోపీఎఫ్	10	3.73
ఏఐయూడీఎఫ్	2	5.46
ఆర్‌జేఆర్‌డీ	2	--
తృణమూల్ కాంగ్రెస్	1	0.89

పశ్చిమ బెంగాల్

పార్టీ	సీట్లు	ఓట్ల శాతం
భాజపా	206	45.85
తృణమూల్	81	40.80
కాంగ్రెస్	2	2.97
ఏజేయూపీ	2	--
సీపీఎం	1	4.45
ఆల్ ఇండియా సెక్యులర్ ఫ్రంట్	1	--

వాణిజ్య పన్నుల శాఖలో వివాదాల పరంపర

ఈనాడు, అమరావతి: రాష్ట్ర వాణిజ్య పన్నులశాఖలో ఉద్యోగ సంఘాలకు, పన్నులశాఖ చీఫ్ కమిషనర్ అహ్మద్‌బాబుకు మధ్య వివాదాలు కొనసాగుతున్నాయి. అహ్మద్‌బాబును ఆ శాఖ నుంచి తొలగించాలంటూ రాష్ట్రవ్యాప్తంగా ఆ శాఖ ఉద్యోగులు చేస్తున్న ఆందోళనలు సోమవారమూ కొనసాగాయి. మరోవైపు చీఫ్ కమిషనర్ కార్యాలయంలో సూపరింటెండెంట్ గ్రేడ్ 1 పదోన్నతులు కల్పిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ముగ్గురు సూపరింటెండెంట్లకు గ్రేడ్ 1 హోదా కల్పిస్తూ.. పదోన్నతులిస్తూ అహ్మద్‌బాబు సోమవారం ఉత్తర్వులిచ్చారు. పదోన్నతుల కమిటీ ఆమోదం పొందిన ప్యానెల్‌లోని పేర్లు ప్రచురించకుండా, ఇందుకు సంబంధించి దరఖాస్తు చేసుకున్న వారికి సమాధానం ఇవ్వకుండా.. పదోన్నతులు కల్పించడాన్ని ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నేతలు, వాణిజ్య పన్నులశాఖ సర్వీస్ అసోసియేషన్ నేతలు ప్రశ్నించారు. మరోవైపు అహ్మద్‌బాబు హైకోర్టును ఆశ్రయించారు. హైకోర్టు ఆయనపై విచారణకు ఆదేశించిన అంశంపై అప్పీలు చేసుకున్నారు. ఇది మంగళవారం విచారణకు రానుంది.

14న కృష్ణా బోర్డు సమావేశం

ఈనాడు, హైదరాబాద్: కృష్ణా నది యాజమాన్య బోర్డు(కేఆర్ఎంబీ) సమావేశం హైదరాబాద్‌లో ఈ నెల 14న నిర్వహించనున్నట్లు బోర్డు మెంబర్ సెక్రటరీ సతీశ్ కంబోజ్ తెలంగాణ, ఏపీలకు సోమవారం సమాచారం పంపారు. ఇప్పటికే రెండు రాష్ట్రాలు పలు అంశాలతో కూడిన ఎజెండాలను బోర్డుకు సమర్పించాయి.

తితిదే జూనియర్ కళాశాలల్లో ప్రవేశాల ప్రక్రియ ప్రారంభం

- రేపటి నుంచి దరఖాస్తుల స్వీకరణ

తిరుపతి (తితిదే, విద్య) న్యూస్‌టుడే: పదో తరగతి ఫలితాల నేపథ్యంలో తిరుపతిలోని తితిదే జూనియర్ కళాశాలల్లో ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశాల ప్రక్రియ ఈ నెల 6 నుంచి ప్రారంభం కానుంది. విద్యార్థులు తమ దరఖాస్తులను https://admission.tirumala.org ద్వారా జూన్ 3 లోపు సమర్పించాలని దేవస్థానం విద్యాశాఖ విభాగం సోమవారం ప్రకటనలో తెలిపింది. శ్రీపద్మావతి కళాశాలలో బాలికలకు, ఎస్వీ జూనియర్ కళాశాలలో బాలురకు, ఎస్వీ ఓరియంటల్ కళాశాలలో బాలబాలికలకు కలిపి మొత్తం 2 వేలకు పైగా సీట్లు భర్తీ చేయనున్నారు. జూన్ 11 నుంచి 13 వరకు మొదటి విడత కౌన్సెలింగ్ జరగనుందని పేర్కొంది.

అడ్వాన్స్‌డ్ క్వాంటమ్ ఆల్గరిథమ్స్‌పై కార్యశాల నేడు

ఈనాడు, అమరావతి: రాజధాని అమరావతిలోని ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో అడ్వాన్స్‌డ్ క్వాంటమ్ ఆల్గరిథమ్స్‌పై మంగళవారం వర్క్‌షాప్ నిర్వహిస్తున్నారు. అమరావతి క్వాంటమ్ మిషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ కార్యశాలలో సీఎస్ఐఆర్, సీడాక్, ఎన్ఎస్‌టీఎల్ వంటి ప్రముఖ సంస్థలతో పాటు వివిధ యూనివర్సిటీలకు చెందిన ప్రొఫెసర్లు, టెక్నాలజీ నిపుణులు, పరిశోధకులు సుమారు 300 మంది పాల్గొంటున్నారు. వారికి ఐబీఎం టెక్నాలజీ నిపుణులు శిక్షణ ఇస్తారని అమరావతి క్వాంటమ్ మిషన్ డైరెక్టర్ శ్రీధర్, ఎస్ఆర్ఎం వర్సిటీ వీసీ సతీష్ కుమార్ సోమవారం ఒక ప్రకటనలో వెల్లడించారు.

విజయవాడ, విశాఖ రీజియన్లకు ప్రిసైడింగ్ అధికారుల నియామకం

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలోని విజయవాడ, విశాఖపట్నం రీజియన్ల పరిధిలో భూసేకరణ, పునరావాసం, పునరుద్ధరణ అథారిటీలకు ప్రిసైడింగ్ అధికారులుగా విశ్రాంత జిల్లా న్యాయమూర్తులను ప్రభుత్వం నియమించింది. విశాఖపట్నం రీజియన్‌కు పి.భాస్కరరావు, విజయవాడ రీజియన్‌కు టి.వెంకటేశ్వర్లు నియమితులయ్యారు. భూసేకరణ చట్ట నిబంధనలకు అనుగుణంగా హైకోర్టుతో సంప్రదింపుల మేరకు వీరి నియామకం చేపట్టినట్లు పేర్కొంది.

గ్రహం అనుగ్రహం

5–5–2026 మంగళవారం

శ్రీ పరాభవ నామ సంవత్సరం; ఉత్తరాయణం; వసంత రుతువు, వైశాఖ మాసం, బహుళ పక్షం

చవితి: తె.4-51 తదుపరి పంచమి; జ్యేష్ఠ: ఉ.10-41 తదుపరి మూల వర్జ్యం: రా.7-33 నుంచి 9-19 వరకు; **అమృత ఘడియలు:** లేవు **దుర్ముహూర్తం:** ఉ.8-07 నుంచి 8-58 వరకు తిరిగి రా. 10-48 నుంచి 11-33 వరకు; **రాహుకాలం:** సా. 3-00 నుంచి 4-30 వరకు **సూర్యోదయం:** ఉ.5.36; **సూర్యాస్తమయం:** సా.6.16; సంకటహర చతుర్థి

ఎండాకాలం

ప్రాంతం	గరిష్ఠ	కనిష్ఠ
కర్నూలు	42.0	29.8
రాజమహేంద్రవరం	42.0	26.5
అనంతపురం	41.6	28.0
కడప	40.8	24.9
హైదరాబాద్	40.6	27.4
విజయవాడ	40.2	27.6
నెల్లూరు	39.6	26.7
తిరుపతి	39.2	27.5
గుంటూరు	39.0	31.0
ఒంగోలు	37.9	21.8
శ్రీకాకుళం	36.0	28.0
నరసాపురం	35.9	25.5
తాడేపల్లిగూడెం	35.0	27.0
విశాఖపట్నం	33.0	26.0
విజయనగరం	32.0	17.0

AMARAVATI DEVELOPMENT CORPORATION LIMITED (ADCL)
RAYAPUDI, AMARAVATI
No.02/CE/ADC/Engg/2026-27 Dt.03.05.2026
E-PROCUREMENT –TENDER NOTICE
Supply, Installation & Commissioning of AutoCAD Licenses with 3 years subscription for the use of ADCL official purposes - **Estimate Cost- Rs.25.32 lakhs.** The bid can be downloaded from **05.05.2026 to 19.05.2026** and last date for submission of Bids on **19.05.2026**, bid opening on **19.05.2026** on **"ap-eprocurement" portal @ tender.apeprocurement.gov.in** For any further clarifications, **Contact Sri. G. Siva Sagar, Sr. IT Executive, ADCL, Rayapudi, Amaravati, Ph. No.: 7095599566.**
Sd/- CHAIRPERSON & MANAGING DIRECTOR
ADCL, AMARAVATI

తిరుమల తిరుపతి దేవస్థానములు: చీఫ్ ఇంజనీర్ కార్యాలయం: తిరుపతి
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన
ADV No.06/DS/CE/TTD/2026-27 తేది.04-05-2026
TTD ఇంజనీరింగ్ శాఖలోని ... SE-II: NIT No.73 నుండి 90/SE-II/2026-27 (18 పనులు), SE-III: NIT No.4 నుండి 5/SE-III/2026-27 (2 పనులు), SE(Elec): NIT No.5/SE(Elec)/2026-27 (1 పని), EE-I: NIT No.7 నుండి 23/EE-I/2026-27 (17 పనులు), EE-II: NIT No.2 నుండి 20/EE-II/2026-27 (19 పనులు), EE-III: NIT No.43 నుండి 44/EE-III/2026-27 (2 పనులు), EE-VII: NIT No.8 నుండి 10/EE-VII/2026-27 (3 పనులు), EE-XI: NIT No.8 నుండి 9/EEXI/2026-27 (2 పనులు), EE-XII: NIT No.6 నుండి 33/EEXII/2026-27 (28 పనులు), EE(FMS)-TML: NIT No.8 నుండి 10/EE(FMS)-TML/2026-27 (3 పనులు), DE(Elec)-I: NIT No.16 నుండి 17/DE(Elec)-I/2026-27 (2 పనులు), DE(Elec)-II: NIT No.30 నుండి 33/DE(Elec)-II/2026-27 (4 పనులు), DE(Elec)-TML: NIT No.11 నుండి 13/DE(Elec)-TML/2026-27 (3 పనులు) వివరాల కొరకు www.tirumala.org ... https://tender.apeprocurement.gov.in ...
TTD-40021(31)/1/2026-PRO SEC (Adv.No:36). Dt: 04-05-2026 కార్యనిర్వహణాధికారి

SPORTS AUTHORITY OF ANDHRA PRADESH
IGMC STADIUM, LABBIPET, BANDAR ROAD, VIJAYAWADA
ADVERTISEMENT
Sports Authority of Andhra Pradesh, Vijayawada desires to engage one Middle Level Consultant-1 to provide advisory support for preparing a comprehensive, coherent, and forward-looking policy for the development and promotion of Sports in Andhra Pradesh.
Please check eligibility and engaging terms and conditions, Remuneration per month, and Application form etc., at our Website: www.sports.ap.gov.in. The eligible candidates may submit the application on or before **20-05-2026 at 5.00 PM** through Online only. For details, **Contact 0866-2499699.**
Sd/- Vice Chairman and Managing Director
DIPR No.5058PP/CL/ADVT/1/1/2021-22

ACHARYA N.G. RANGA AGRICULTURAL UNIVERSITY
ADMINISTRATIVE OFFICE, LAM, GUNTUR-522 034: A.P.
NOTIFICATION
POLYTECHNIC ADMISSIONS-2026-27
No. 000319/Admissions-Polytechnics/A1/2026, Dated: 30-04-2026
Online applications are invited from the candidates who passed SSC or its equivalent examination and who are seeking admission into Diploma courses offered by **ANGRAU, Lam, Guntur for the academic year 2026-27.** No separate entrance examination will be conducted by **ANGRAU.**
Important Dates: Commencement of online Registration: Dt. **05-05-2026,** Last Date of Registration Dt. **21-05-2026.** For detailed information, online application and regular updates, please visit University website: **www.angrau.ac.in**. Please note that no further notification will be given regarding admissions, **2026-27.**
DIPR No. 5057PP/CL/Advt/1/1/2021-22 Sd/- REGISTRAR

ఉద్యోగ అవకాశాలు

VIVEKA EDUCATIONAL INSTITUTIONS
BURRIPALEM ROAD -TENALI - Guntur Dist. (STATE & C.B.S.E.)
WALK-IN-INTERVIEW
PRE PRIMARY Teachers : L.K.G & U.K.G Trained Teachers
PRIMARY TEACHERS (PRT) (I to V Classes) : English, Telugu, Hindi, EVS, Maths Olympiad Maths & Science
TGTs (VI to X Classes) : English, Telugu, Hindi, Maths, Social Studies, N.S., P.S., Maths, Physics, Chemistry, Biology (JEE & NEET Foundation - VI-X)
P.G.Ts (11 & 12 Classes JEE/NEET & Inter) : English, Maths, Biology (Botany & Zoology), Physics, Computers (AI), Chemistry, Accountancy, Physical Education, Economics, Sanskrit
Special Subjects : Music, Dance, Art Edn, Crafts, Spoken English, Care Takers
63099 20386, 94099 59999
INTERVIEW DATE 07.05.2026 & 10.05.2026 (9 a.m. to 5 p.m.)
* Minimum 2 to 5 Years experience in C.B.S.E. Curriculum
* Original Certificates of X and other Education Qualifications
* Come prepared to take written test and Model Class
SECRETARY & CORRESPONDENT
Venue: Vivekananda Central School, Burripalem Road, Tenali

NRI's Indian Springs — The School by NRI Educational Society
Join our Growing School Network
Patamata | Satyanarayanapuram | Gollapudi | Kondapalli | Poranki
WALK-IN INTERVIEW
Academic Coordinators, AOs, Vice Principals, Floor Incharges,
Pre-Primary & Primary Teachers (Nursery, Montessori Preferred)
High School Teachers (All Subjects), IIT Program Faculty (Maths & Science)
ELIGIBILITY : PG/Graduation with/without B.Ed Freshers & Experienced can apply.
SKILLS REQUIRED : Strong Communication Subject Knowledge Passion for Teaching
INTERVIEW SCHEDULE
PATAMATA, PORANKI SATYANARAYANAPURAM, 06-05-2026 New P & T Colony, Patamata, Vijayawada. Ph: 90325 80111, 90634 42629
GOLLAPUDI 07-05-2026 Sai Puram Colony Road, Gollapudi, Vijayawada. Ph: 90323 08222.
KONDAPALLI 08-05-2026 Opp: Arya Vysya Kalyana Mandapam, Kondapalli, Vijayawada. Ph. 90323 63444.

VNRVJIET
VALLURUPALLI NAGESWARA RAO VIGNANA JYOTHI INSTITUTE OF ENGINEERING & TECHNOLOGY
AUTONOMOUS INSTITUTION — 31 Years of Excellence — www.vnrvjiet.ac.in
RECRUITMENT NOTIFICATION
VNR Vignana Jyothi Institute of Engineering & Technology, Hyderabad. A premier engineering college with NIRF Ranking and NAAC A++ Accreditation, known for cutting-edge research and innovation, invites applications for:
TEACHING:

Position	Department	Eligibility
Professor, Associate Professor, Assistant Professor	CSE & Allied Branches, IT, Civil, Mechanical, Automobile, EEE, ECE, EIE, Biotechnology, Robotics & AI, Humanities & Sciences	Applicants are required to have a B.E / B.Tech. and M.E. / M.Tech. in a related discipline with 60% aggregate marks, Ph.D. is must for Professor & Associate Professor. Preference will be given to candidates holding a Ph.D from an NIT / IIT / Central University

NON-TEACHING:
◆ Manager-Finance & Accounts • Junior Accountant ◆ Counsellor (Psychologist)
◆ Manager - HR • Assistant Manager-HR • Executive - HR ◆ Computer operator
◆ Librarian ◆ Physical Director • Assistant Physical Director (Female)
◆ Laboratory Assistant (EEE, ECE, ME & Chemistry)
For further details visit website www.vnrvjiet.ac.in Interested candidates should email their resume along with application in prescribed format to careers@vnrvjiet.ac.in on or before 23.05.2026, 4:00 PM
Date: 05-05-2026 Sd/- GENERAL SECRETARY VIGNANA JYOTHI

WALK-IN INTERVIEW
Date: 5th, 6th & 7th MAY 2026 | Time: 10:00AM-4:00PM
Venue: 2nd Floor, Surya Towers, Near Fortune Murali Hotel, MG Road, Vijayawada-10
GOLD LOAN MANAGERS
SALES HEAD - LAP
Any Graduate with Relevant Experience
LOCATIONS: VIJAYAWADA, GUNTUR, PONNUR, TENALI, MACHERLA, GUDIVADA, REPALLE, NARASARAOPET, JANGAREDDYGUDEM, VIZAG, SRIKAKULAM, VIZIANAGARAM
PEOPLES CO-OPERATIVE SOCIETY LTD.
A Leading Co-operative Society in Andhra Pradesh
9705709977 / Virtual Interviews @ zoom

WALK- IN INTERVIEW
TEACHING STAFF

POST	SUBJECT	SALARY
SENIOR IIT FOUNDATION TEACHERS (For 8th to 10th Classes)	MAT, PHY, CHEM	18 – 25L per year
IIT FOUNDATION TEACHERS (For 6th to 8th Classes)	MAT, PHY, CHEM	6 – 9L per year
SECONDARY SCHOOL TEACHERS	ENGLISH, MATHS, BIOLOGY	45,000 to 55,000 per month
MIDDLE SCHOOL TEACHERS	HINDI	30,000 to 40,000 per month
STUDENT COUNSELOR (M.A Psychology/MSW)		25,000 to 35,000 per month
JUNIOR LECTURERS (JLs)	MAT, PHY, CHEM	15,000 to 20,000 per month
ROBOTICS TEACHER		25,000 to 30,000 per month

NON-TEACHING STAFF

ACCOUNTANT (Min 5Yrs of Experience)	20,000 – 25,000 per month
COOK/CHEF for Hostel	50,000 – 70,000 per month

Also required Male/Female Experienced Wardens.
Note: You can forward your resumes to the email address raja.newvision@gmail.com
NEW VISION EDUCATIONAL INSTITUTIONS
Cell: 8189998555, 9848327775 Near Dist. Court, Wyra Road, Khammam.

HARI Heartfulness Academy of Research and Innovation
(Deemed to be University)
Approved under section 3 of the UGC ACT, 1956 by the HE, Govt. of India.
Kanha Shanti Vanam, Rangareddy (Dist.), Hyderabad-509328
www.haridu.in Ph. 8143241135
STAFF RECRUITMENT – NOTIFICATION No. 04/2026
Applications are invited from eligible and distinguished candidates for the Proposed School of Agricultural Sciences, Engineering, Management and Social Sciences (M.A. Philosophy).
ACADEMIC POSITIONS
Director/ Dean/ Dean CDC /Dean R & D / Controller of Examinations / Placement Officer Professor/ Associate Professor/ Assistant Professor
Disciplines: Agriculture (Agronomy, Agricultural Economics, Agricultural Extension, Agricultural Statistics, Agricultural Microbiology, Agricultural Engineering, Crop Physiology, Genetics and Plant Breeding, Entomology, Soil Science & Agricultural Chemistry and Plant Pathology).
Horticulture (Vegetable Science, Fruit science, Floriculture and Landscaping, Plantation, Spices, Medicinal and Aromatic Crops and Post-Harvest Management).
Engineering (CSE, AI & ML, Data Science, Cyber Security, Mechanical Engineering and Electrical & Electronics Engineering), Mathematics, Physics, Chemistry, English, Librarian, Assistant Librarian and Director of Physical Education
Bachelor of Business Administration
Philosophy
NON-TEACHING POSITIONS
Administrative Officer, Accounts Officer, Assistant Registrar, Programmers, HR Executive, System Administrators, System Networking, Estate Officer, Lab Technicians and Lab Assistants (Agronomy, Entomology, Soil Science & Agricultural Chemistry, Plant Pathology, Horticulture, EEE, Chemistry, Physics, Language Lab and Workshop), Field Assistants, Computer Operators, Warden (Men &Women) and Transport In-charge
Salary: As per UGC norms
Eligibility: As per ICAR / AICTE/ UGC norms
Apply with academic, experience certificates and publications (Single PDF) to: Email: info@haridu.in on or before 20.05.2026
Place : Hyderabad
Date : 05.05.2026
OSD/- Heartfulness Academy of Research and Innovation (HARI) (Deemed to be University)



A for Appointments
ప్రత్యేక ధరకే 'ఈనాడు'లో ఉద్యోగ ప్రకటనలు
ఈనాడు
పాతూరు, గుంటూరు
Cell: 7416834488

(c) eenadu

భానుడి భగభగలు.. మారిన పనివేళలు!



ఈ భవన, నిర్మాణరంగ కార్మికులు రాత్రి పూట పనులు చేస్తున్నారేంటా అనుకుంటున్నారా..! పగటి పూట భానుడి భగభగలకు తాళలేక ఇలాంటి ఆలోచన చేశారు. ఎండాకాలం పగటి పూట వడదెబ్బకు గురవుతుండటంతో కార్మికులు పనులకు రావడం లేదు. వారి ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని కొంత మంది గుత్తేదార్లు.. సాయంత్రం 5 నుంచి అర్ధరాత్రి ఒంటి గంట వరకు పనులు చేయిస్తున్నారు. కృష్ణాజిల్లా పెనమలూరు మండలం కానూరు కల్పనానగర్‌లో అర్ధరాత్రి 12 గంటలకు కనిపించిన దృశ్యమిది.

– ఈనాడు, అమరావతి

రాష్ట్రంలో రూ.లక్ష కోట్లతో యుద్ధ విమానాల తయారీ ప్రాజెక్టు

- 15న పుట్టపర్తిలో సీఎం శంకుస్థాపన!



ఈనాడు, అమరావతి: శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తి సమీపంలో ఐదో తరం(ఫిఫ్త్ జనరేషన్) స్టెల్త్ యుద్ధ విమానాల తయారీ ప్రాజెక్టు ఏర్పాటు కానుంది. ఈ ప్రాజెక్టు, దాని అనుబంధ పరిశ్రమల ద్వారా సుమారు రూ.లక్ష కోట్ల పెట్టుబడులు వస్తాయని అంచనా. దీనికి ఈ నెల 15న సీఎం చంద్రబాబు శంకుస్థాపన చేసే అవకాశం ఉంది. గతంలో రక్షణమంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌ను సీఎం కలిసి ఏపీలో ఎడ్వాన్స్‌డ్ మీడియం కంబాట్ ఎయిర్‌క్రాఫ్ట్‌ల తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కోరిన సంగతి విదితమే. దేశీయ ఎడ్వాన్స్‌డ్ మీడియం కంబాట్ ఎయిర్‌క్రాఫ్ట్(ఏఎంసీఏ)లు సుమారు 140 ఇక్కడ తయారుకానున్నాయి. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ డిఫెన్స్ రీసెర్చ్, డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్(డీఆర్‌డీవో) దీన్ని ఏర్పాటుచేస్తోంది. ఏఎంసీఏకు అవసరమైన సిస్టమ్స్ డిజైన్, టెస్టింగ్, మాడ్యూల్స్ అసెంబ్లింగ్‌ను బెంగళూరుకు చెందిన ఏరోనాటికల్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ(ఏడీఏ)లో పూర్తి చేయనున్నారు. అక్కడి నుంచి శ్రీసత్యసాయి జిల్లాలో ఉన్న పుట్టపర్తికి మాడ్యూళ్లను తరలించాలన్నది ప్రతిపాదన. పుట్టపర్తిలో విమానాలనమూనాల తుది అసెంబ్లింగ్, ఆన్‌గ్రౌండ్ టెస్టింగ్‌లను నిర్వహించనున్నారు.

★ ఫ్లైట్ టెస్టింగ్ కాంప్లెక్స్, శాస్త్రవేత్తల కోసం నివాస ప్రాంతాలు, ప్రొడక్షన్ ఫెసిలిటీ కేంద్రం ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం డీఆర్‌డీవోకు 600 ఎకరాలను కేటాయించింది. ఈకేంద్రాన్ని ఏడీఏ ప్రైవేటుభాగస్వామ్యంతో నిర్మించనుంది.

★ ఏఎంసీఏ అభివృద్ధి, తయారీ కోసం టాటా ఎడ్వాన్స్‌డ్ సిస్టమ్స్, ఎల్అండ్‌టీ, భారత్ ఫోర్జ్ కంపెనీల సహకారాన్ని తీసుకోవాలని భావిస్తున్నారు.

★ ప్రాజెక్టుకు అనుబంధంగా యూనిట్లు ఏర్పాటు కానున్నాయి. వీటికోసం ప్రాజెక్టుకు సమీపంలోనే మరో 400 ఎకరాలను ప్రభుత్వం అందుబాటులో ఉంచనుంది.

పోలవరం ఎడమ కాలువ ప్రారంభంలో సర్‌ప్లస్ ఛానల్

ఈనాడు, అమరావతి: పోలవరం ప్రాజెక్టు ఎడమ కాలువ 13.150 కిలోమీటరు వద్ద సర్‌ప్లస్ ఎస్కేప్ నిర్మించాలని ప్రతిపాదించారు. ఈ సర్‌ప్లస్ ఎస్కేప్ నుంచి వచ్చే ఛానల్ పుష్కర ఎత్తిపోతల పథకం కాలువను 12.885 కిలోమీటరు వద్ద దాటుతుంది. ఇలా దాటే క్రమంలో అక్కడ డ్రెయిన్ సైఫర్ నిర్మించాలని ప్రతిపాదించారు. ఈ రెండు పనులను గతంలో ఎడమ కాలువ మొదటి ప్యాకేజీ పనుల్లో కొంత భాగం చేసిన గుత్తేదారు కంపెనీకి ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. 2017 ఒప్పంద ధరల ప్రకారం అప్పట్లో వారు రూ.171.39 కోట్ల విలువైన మొదటి ప్యాకేజీ పనులు చేశారు. అప్పటి ధరలతో ఈ పనులు చేసేందుకు అంగీకరించడంతో రెండు పనులకు కలిపి రూ.7.48 కోట్లకు అప్పగించేందుకు నిర్ణయించారు. ఈ మేరకు జలవనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్ సోమవారం ఉత్తర్వులుఇచ్చారు.

కాదేదీ కమీషన్లకు అనర్హం!

(మొదటి పేజీ తరువాయి)

అదనపు బాధ్యతలను ఆరోగ్య శాఖ కమిషనర్ వీరపాండియన్ చూశారు. మార్చి 24 నుంచి ఆ బాధ్యతలు వైద్య ఆరోగ్య శాఖ కార్యదర్శి సౌరభ్‌గౌర్ చూస్తున్నారు. ఎండీ హోదాలో తీసుకున్న నిర్ణయాలకు ఈయనే స్వీయ సమీక్ష చేసుకుని, కార్యదర్శి హోదాలో పచ్చజెండా ఊపుతుండటం గమనార్హం. టెండర్లు పిలవడం, తనిఖీ చేయడం, ఆమోదించడం అన్నీ ఒక్కరే చేస్తుండటం విమర్శలకు తావిస్తోంది. రూ.వేల కోట్ల ప్రాజెక్టుల టెండర్ల ఖరారు, పాలన వ్యవహారాలు ఏపీఎంఎస్ఐడీసీ ద్వారానే సాగాల్సి ఉండడంతో ఒకే వ్యక్తికి రెండు బాధ్యతలు ఎలా అప్పగిస్తారన్న వాదన వినిపిస్తోంది.

★ వైకాపాతో అంటకాగిన కొందరు ఉద్యోగులు నేటికీ ఇక్కడ పెత్తనం చెలాయిస్తున్నారు. పదవీ విరమణ పొందిన తర్వాత పొడిగింపుతో కొనసాగిన ఓ చీఫ్ ఇంజినీర్ సీఎం, ప్రభుత్వంపై బాహాటంగా వ్యాఖ్యలు చేయడం వివాదాస్పదం కావడంతో ఈయనకు సెలవిచ్చారు. మరో విశ్రాంత సీఈకి పదవీ విరమణ తర్వాత ఏడాది చొప్పున మూడుసార్లు పదవీ కాలాన్ని పొడిగించారు. ఇద్దరు ఎస్ఈలకూ రెండుసార్లు అవకాశం ఇచ్చారు. మరో ఆరుగురికి ఏడాది చొప్పున పొడిగించారు. వీరిలో కొందరి తీరు వివాదాస్పదమవుతోంది.

మచ్చుకు కొన్ని బాగోతాలివీ..

★ ఏపీఎంఎస్ఐడీసీలో టెండర్లు దక్కేలా వెసులుబాటు కల్పించడానికి, రేట్ కాంట్రాక్ట్‌లో ఉన్న పరికరాలకు పర్చేజింగ్ ఆర్డర్స్ (పీవో) ఇవ్వడానికి వసూళ్లకు పాల్పడుతున్నారు.

★ ఆసుపత్రుల్లో ఐసీయూ వెంటిలేటర్ల ఏర్పాటుకు టెండర్లు పిలిచారు. డెమో పూర్తయి బీఎఫ్‌సీలో చేర్చి టెండర్ ఖరారుపై నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. ఈ క్రమంలో మరోసారి ప్రీ బిడ్‌కు అవకాశం ఇవ్వడం.. గతంలో విఫలమైన వారిని అర్హులుగా తేల్చడం విమర్శలకు తావిచ్చింది. ఓ సంస్థకు మేలు చేయడానికే సడలింపు ఇచ్చారనే వాదన వినిపిస్తోంది.

★ కావాల్సిన కంపెనీలకు మేలు చేసేలా.. అంతగా అవసరం లేని ఈఎన్‌టీ సిమ్యులేటర్లు మార్కెట్ ధర కంటే ఎక్కువకు కొనుగోలు చేసే అంశమూ వివాదాస్పదమైంది.

★ ఆరు వైద్య కళాశాలల్లో రూ.1.70 కోట్లు చొప్పున వెచ్చించి డిజిటల్ మెమోగ్రఫీ యూనిట్ల ఏర్పాటుకు అనుకూలమైన దిల్లీ సంస్థకు మేలు చేసేలా సింగిల్ బిడ్‌కు టెండర్ ఖరారు చేయడం విమర్శలకు తావిచ్చింది.

★ టీబీ పరీక్షలకు పోర్టబుల్ హ్యాండ్‌హెల్డ్ చెస్ట్ ఎక్స్‌రే మిషన్ కొనుగోలుకు ఎన్‌హెచ్ఎం నుంచి ఇండెంట్ వచ్చింది. ఈ టెండర్‌లో ఐదుగురు బిడ్డర్లు పాల్గొన్నారు. అందులో ముగ్గురు అర్హత సాధించారు. డెమోలో ఇద్దరే పాల్గొన్నారు. టెండరు పూర్తయినా బీఎఫ్‌సీలో ఆమోదించకుండా జాప్యం చేయడం వివాదాస్పదం అవ్వడంతో ఎట్టకేలకు ఈ టెండరు ఖరారు చేశారు.

★ కీలకమైన డ్రగ్ విభాగాన్ని గుప్పెట్లో పెట్టుకోవడానికి జీఎంను సాగనంపి.. రాష్ట్ర స్థాయి కీలక బాధ్యతలు అర్హతలేని జూనియర్ ఎనలిస్ట్‌కు అప్పగించారు. ఇది చాలదన్నట్లు బదిలీ అయిన సూపరింటెండెంట్ బాధ్యతలు సైతం ఆయనకే అప్పగించి అన్ని నిర్ణయాలు ఒక్కరే తీసుకునే వెసులుబాటు కల్పించారు.

★ బిల్లులు ప్రాధాన్య క్రమంలో అప్‌లోడ్ చేసి చెల్లించాలి. ముందుగా అప్‌లోడ్ చేసిన బిల్లులు పక్కన పెట్టి, ఆ తర్వాత వచ్చిన తమకు అనుకూలమైన వారికి చెందిన వాటికి ఆమోదం తెలుపుతున్నారన్న విమర్శలున్నాయి.

కమిషనరేట్‌కు ఉమ్మడి ప్రవేశ పరీక్షల ప్రవేశాల బాధ్యతలు

ఈనాడు, అమరావతి: ఈ విద్యా సంవత్సరం (2026-27) నుంచి అన్ని ఉమ్మడి ప్రవేశ పరీక్షల ప్రవేశాలతో పాటు డిగ్రీ ఆన్‌లైన్ ప్రవేశాల నిర్వహణ బాధ్యతలను ఉన్నతవిద్య కమిషనరేట్‌కు అప్పగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటి వరకు ఉన్నత విద్యామండలి పర్యవేక్షణలో ఈ ప్రవేశాలు జరుగుతుండగా.. ఈ ఏడాది నుంచి ఉన్నత విద్య కమిషనరేట్ నిర్వహించనుంది. ఈ మేరకు ఉత్తర్వులను సవరిస్తూ ఉన్నత విద్య కార్యదర్శి కోన శశిధర్ విడివిడిగా ఉత్తర్వులను జారీ చేశారు. ఈసెట్, ఐసెట్, లాసెట్, పీజీ లాసెట్, ఎడ్‌సెట్, బీపీఈడీ, యూజీడీపీఈడీ, ఫార్మాడీ, పాలిసెట్, ఆర్‌సెట్, పీజీసెట్, ఆర్కిటెక్చర్, పీహెచ్‌డీ, ఇంజినీరింగ్, ఫార్మసీ, డిగ్రీ ఆన్‌లైన్ ప్రవేశాల నిర్వహణను ఉన్నత విద్య కమిషనరేట్ పర్యవేక్షిస్తుంది. ఏపీ ప్రైవేటు ఉన్నత విద్యా సంస్థల నిబంధనలు-2021 సవరించి, ప్రైవేటు డిగ్రీ, న్యాయ విద్య, బీఈడీ, ఎంఈడీ, ఎంపీఈడీ కళాశాలల పరిపాలన నియంత్రణను కమిషనరేట్ పరిధిలోకి తీసుకొచ్చారు.

రబీ ధాన్యం సేకరణకు రూ.1,800 కోట్ల రుణం

ఈనాడు, అమరావతి: రబీ ధాన్యం సేకరణ, ప్రజా పంపిణీ వ్యవస్థ కార్యకలాపాలకు జాతీయ సహకార అభివృద్ధి సంస్థ (ఎన్‌సీడీసీ) నుంచి రూ.1,800 కోట్ల రుణం తీసుకునేందుకు మార్క్‌ఫెడ్‌కు ప్రభుత్వం అనుమతిచ్చింది. దీనికి సర్కారు హామీ ఇవ్వనుంది. ఇప్పటికే తీసుకున్న రూ.12,053 కోట్ల రుణానికి ఇది అదనం. ఈ మేరకు వ్యవసాయ శాఖ ఎక్స్ అఫీషియో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు.

వేసవిలో శ్రీవారి దర్శనం వేగిరంగా..

- మూడురోజుల్లో రెండున్నర లక్షల మందికి అవకాశం
- ఫలిస్తున్న తితిదే ప్రణాళికలు

ఈనాడు డిజిటల్, తిరుపతి: వేసవి సెలవుల నేపథ్యంలో తిరుమలకు పోటెత్తుతున్న భక్తుల రద్దీని తితిదే సమర్థంగా ఎదుర్కొంటోంది. ఒకప్పుడు శ్రీవారి దర్శనం కోసం కంపార్ట్‌మెంట్లలో పడిగాపులు కాసిన సామాన్యులు ఇప్పుడు ఏడెనిమిది గంటల్లోనే స్వామి వారిని దర్శించుకుంటున్నారు. వీఐపీ బ్రేక్ సిఫార్సు లేఖల రద్దు, కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా క్యూలైన్ల నిరంతర పర్యవేక్షణతో తితిదే వేసవి ప్రణాళికలు సత్ఫలితాలనిస్తున్నాయి. సర్వదర్శనానికి వచ్చే భక్తుల నిరీక్షణ సమయం ఎనిమిది గంటలు దాటకుండా (రెడ్‌మార్క్) తితిదే అధికారులు చర్యలు చేపట్టారు. ఒక దర్శనం కోసం మరో స్లాట్ దర్శనాన్ని ఆపకుండా.. ఏఐ ఆధారిత ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్(ఐసీసీసీ), సీసీ కెమెరాల ద్వారా ఎప్పటికప్పుడు మాడవీధులు, క్యూకాంప్లెక్స్‌లను పర్యవేక్షిస్తున్నారు.

★ స్లాటెడ్ సర్వదర్శనం రెండు నుంచి మూడు గంటల్లోపు, రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శనం రెండున్నర గంటల్లోపు పూర్తవుతోంది. శనివారం లక్ష మందికి పైగా భక్తులు వచ్చినప్పటికీ దర్శన సమయం 13 గంటలకు మించకుండా అదుపు చేయగలిగారు.

సిఫార్సుల రద్దుతో రెండు గంటల ఆదా

వీఐపీ బ్రేక్‌కు సంబంధించి సిఫార్సు లేఖలను పూర్తిగా నిలిపివేయడం, స్వయంగా వచ్చే ప్రొటోకాల్ ప్రముఖులకు మాత్రమే అవకాశం కల్పిస్తుండటంతో రెండుగంటల సమయం ఆదా అవుతోంది. దీనివల్ల క్యూలైన్ల కదలిక వేగవంతమైంది. సాధారణ రోజుల్లో సగటున 70 వేల మందికి దర్శనం కల్పిస్తుండగా.. తాజా చర్యలతో ఆ సంఖ్య 90 వేల నుంచి లక్షకు చేరువవుతోంది. అభిషేకం కారణంగా శుక్రవారం రోజుల్లో సాధారణంగా 65 వేల మందికి మాత్రమే దర్శనం జరిగేది. ఇప్పుడు ఆ సంఖ్య 71 వేలు దాటుతోంది.



శ్రీవారి ఆలయం ఎదుట ఏర్పాటుచేసిన జర్మన్ షెడ్ల కింద సేదదీరుతున్న భక్తులు

★ గత మూడు రోజుల్లో 2,45,686 మంది స్వామివారిని దర్శించుకోగా మొత్తం రూ.11.95 కోట్ల ఆదాయం సమకూరింది. మే 2న అత్యధికంగా 91,005 మందికి దర్శన భాగ్యం లభించగా మే 3న అత్యధికంగా రూ.5.06 కోట్ల హుండీ ఆదాయం సమకూరింది.

ఆ దర్శనాలు, సేవలు యథాతథం

సామాన్య భక్తులకు దర్శన సమయాన్ని పెంచుతూనే ముందుగా నిర్ణయించిన కోటా విషయంలో తితిదే యథాతథ స్థితిని కొనసాగిస్తోంది. రూ.300 దర్శనం, శ్రీవాణి ట్రస్టు టికెట్లు, ఎన్ఆర్ఐ కోటా, ఆర్జిత సేవలతోపాటు వృద్ధులు, దివ్యాంగుల దర్శనాలు ఎప్పటిలాగే నిర్దేశిత సమయాల్లో కొనసాగుతున్నాయి.

డోలీ మోత.. మారని తలరాత!



గర్భిణిని డోలీలో తీసుకెళుతున్న కుటుంబసభ్యులు

హిరమండలం, న్యూస్‌టుడే: శ్రీకాకుళం జిల్లా హిరమండలం పరిధి లింగుపురం గిరిజన గ్రామానికి రహదారి సౌకర్యం లేకపోవడంతో వైద్యం అవసరమైనవారికి డోలీ మోతలు తప్పడం లేదు. ఆదివారం సాయంత్రం గ్రామానికి చెందిన గర్భిణి బి.సునీతకు పురిటి నొప్పులు రావడంతో వేరే దారి లేక కుటుంబ సభ్యులు, వైద్య సిబ్బంది 3.5 కి.మీ. దూరంలోని మామిడిజోల గ్రామానికి డోలీలో తీసుకొచ్చారు. అక్కడి నుంచి ఆటోలో చొర్లంగి పీహెచ్‌సీకి, తర్వాత పాతపట్నం సీహెచ్‌సీకి తరలించగా అక్కడ బిడ్డకు జన్మనిచ్చారు. తమ గ్రామానికి కొద్ది నెలల కిందట రోడ్డు పనులు ప్రారంభించి మధ్యలో వదిలేశారని, ఇప్పటికయినా పాలకులు, అధికారులు స్పందించి పనులు పూర్తి చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు. దీనిపై సీతంపేట ఐటీడీఏ డీఈఈ రాజు మాట్లాడుతూ.. చర్యలు తీసుకుంటామన్నారు.





(c) eenadu

ఈనాడు

మార్పును అనుశాసించిన ప్రజాతీర్పు

ఆకర్షణీయమైన రాజకీయ సిద్ధాంతాలు, భావజాల భావోద్వేగ బలప్రదర్శనలకు ఆవల తమ బతుకులు బాగుపడాలనుకునే సామాన్యుల ఆశలుంటాయి... ఉన్నవూరిలో కన్నవారితో కలిసి ఉంటూనే జీవితంలో ఎదగాలనుకునే యువత కలలుంటాయి... అడుగడుగునా పొంచి ఉండే గండాలను దాటుకుంటూ పండించిన పంటకు గిట్టుబాటు ధరలను ఆశించే రైతుల ఎదురుచూపులుంటాయి. సంవత్సరాలు గడిచిపోతున్నా ఇవేమీ తీరడం లేదనే వ్యక్తిగత నిరాశ సామూహిక అసంతృప్తిగా మారినప్పుడు- పాలనా వ్యవస్థను సమూలంగా మార్చాలనే సంకల్పం జనంలో బలీయమవుతుంది. ఇలాంటి మార్పునే కోరుకున్న ప్రజల నిశ్చితాభిప్రాయమే నిన్నటి ఎన్నికల ఫలితాల్లోనూ ప్రతిఫలించింది. వరసగా నాలుగోసారి పశ్చిమబెంగాల్‌లో పాగావేసి, ఆపై దిల్లీని చేజిక్కించుకుంటామన్న మమతా బెనర్జీ అతిశయాన్ని ఆ రాష్ట్ర ఓటర్లు నేలకు దించేశారు. ఎగ్జిట్ పోల్స్‌ను కొట్టిపడేసి, కనీసం 226 సీట్లను సాధించబోతున్నామంటూ సొంత జోస్యం చెప్పిన దీదీ చివరికి భవానీపూర్‌లో తానే గెలవలేకపోయారు! అయితే డీఎంకే, లేకపోతే అన్నాడీఎంకే తప్ప మరో పార్టీకి జైకొట్టని తమిళులు ఈసారి పంథా మార్చి టీవీకేకు కిరీటాన్ని అలంకరించారు. అవినీతిని అరికట్టి, పాలనను సంస్కరించి, స్థానికంగానే ఉపాధి అవకాశాలను సృష్టిస్తానంటూ వీనసొంపు వాగ్దానాలు చేసిన విజయ్‌పై వారు విశ్వాసముంచారు. పెరిగిపోతున్న నిరుద్యోగం, ఆర్థిక వెతలు, ధరల మోతలు, కుంభకోణాలపై ప్రజాగ్రహాన్ని పట్టించుకోకుండా సంక్షేమ పథకాలు, సంస్థాగత వనరుల దన్నుతో అధికారాన్ని నిలబెట్టుకోగలననుకున్న ఎల్డీఎఫ్‌కు కేరళవాసులు నిర్మొహమాటంగా వీడ్కోలు పలికేశారు. వెరసి, మిగిలిన రాష్ట్రాల్లోని అధికారపక్షాలన్నింటికీ ఈ ఫలితాలు గుణపాఠాల వంటివి. సామాన్యుల నిత్య జీవితాలను ప్రభావితం చేస్తున్న మౌలిక సమస్యలను విస్మరించి గాలిలో మేడలు కట్టేవారు తమ నీటిమూట మాటలకు తగిన మూల్యం చెల్లించుకోక తప్పదనే వాస్తవాన్ని తాజా ఎన్నికలు మరోసారి గుర్తుచేశాయి!

ఓటర్ల జాబితాల్లో మార్పుచేర్పులు, కేంద్ర బలగాల మోహరింపులు, ఈసీతో తృణమూల్ బాహాబాహీలు ప్రచారంలోకి వచ్చినంతగా బెంగాలీ రైతుల కడగండ్లు దేశం దృష్టికి రాలేదు. దేశవ్యాప్తంగా ఉత్పత్తి అయ్యే బంగాళాదుంపల్లో దాదాపు పాతికశాతం వాటా కలిగిన ఆ రాష్ట్రంలో సుమారు పది లక్షల కుటుంబాలు ఆ పంటనే నమ్ముకుని బతుకుతున్నాయి. వేలకువేలు అప్పులు తెచ్చి సాగు చేసి మంచి దిగుబడులు సాధించినా- వ్యాపారుల మాయాజాలంలో కిలోకు మూడు రూపాయలు కూడా ధర పలక్కపోవడం, సర్కారీ మద్దతు దొరకకపోవడంతో రైతాంగంలో నిరాశానిస్పృహలు అధికమయ్యాయి. పారిశ్రామికాభివృద్ధి పడకేయడంతో రాష్ట్రంలో ఉద్యోగాలు, అనుబంధ ఉపాధి మార్గాలు దుర్లభమై యువత వలసపోవాల్సి వస్తుండటమూ టీఎంసీపై వ్యతిరేకతను పెంచింది. శాంతిభద్రతలకూ పూచీలేని మమత రాజ్యంపైనా ప్రజాగ్రహం పెల్లుబికి భాజపాపై ఓట్ల వర్షం కురిపించింది!

సీఎం స్టాలిన్‌కు సైతం పరాజయ భారాన్ని మిగిల్చిన టీవీకే ప్రభంజనం- ద్రవిడ రాజకీయాలకు పట్టుగొమ్మ అయిన తమిళనాడులో కొత్త శకానికి నాంది పలికింది. కులమత ప్రాంతాలకు అతీతంగా యువత అభిమానాన్ని విపరీతంగా చూరగొన్న విజయ్- ఎంజీఆర్ తరవాత సొంతంగా పార్టీ పెట్టిన తొలినాళ్లలోనే తమిళనాడు అధికార ఉట్టిని కొట్టిన నాయకుడిగా రికార్డు సృష్టించారు. మౌలిక సదుపాయాల విస్తరణ, సంక్షేమ ఫలాల వితరణకు అస్తిత్వ రాజకీయాలను జతకలిపిన హిమంత బిశ్వశర్మ- ఒకనాటి కాంగ్రెస్ కంచుకోట అస్సాంలో కాషాయధ్వజాన్ని మళ్లీ రెపరెపలాడించారు. ఇటు పుదుచ్చేరిలోనూ ఎన్డీయే జెండా ఎగిరితే- హస్తం పార్టీ ప్రభ కేరళకే పరిమితమైంది. టీఎంసీ, డీఎంకేల ఓటమితో జాతీయస్థాయిలో మరింతగా బలహీనపడిన ప్రతిపక్ష కూటమి- ప్రజాస్వామ్యంలో తన బాధ్యతలను ఇక ఏమేరకు నిర్వర్తించగలదో చూడాలి!




సంపాదించుకున్న వస్తువుల్ని మనం దాచుకున్నామనుకుంటాం కానీ నిజానికి అవే మనల్ని బంధించి ఉంచుతాయి. వాటి వల్ల మన ఆలోచన, వ్యవహార పరిధి పరిమితమై పోతుంది.

– సిగ్రిడ్ అన్సెట్, నార్వేజియన్ రచయిత్రి, నోబెల్ గ్రహీత

సేవామార్గం

జ్వరంతో బాధపడుతున్న నాలుకకు ఆహారం రుచి తెలియనట్లే, లౌకిక సంబంధాల కల్మషంతో సతమతమవుతున్న మనిషి దైవాన్ని అర్థం చేసుకోలేడు. ప్రాచీన కాలం నుంచి మనిషి దేవుణ్ని వెతుకుతూనే ఉన్నాడు. హిమాలయాలకు వెళ్లి తపస్సు చేశాడు. సత్యాన్ని అర్థం చేసుకోవడానికి గ్రంథాలెన్నో చదివాడు. తీర్థయాత్రలకు వెళ్లాడు, దేవతలను స్తుతించాడు, యజ్ఞయాగాదులు చేశాడు. ఆత్మానుభవం ప్రసాదించమని దేవుణ్ని వేడుకున్నాడు. ఎన్ని చేసినా చాలామంది తాము కోరుకున్న ఆత్మతత్వాన్ని పొందలేకపోతున్నారు. ఎందుకంటే అది ఎక్కడి నుంచో వచ్చేది కాదు. మనలోనే ఉంది. అహంకారం, అనుబంధం అనే మేఘాలు చెదిరిపోయినప్పుడు ఆత్మ అనే సూర్యుడు ప్రకాశిస్తాడు. అప్పుడు మాత్రమే ఈ ఆత్మతత్వం బోధపడుతుంది.

ఆహార సేకరణ, వంట చేయడం, తినడం వంటి పనుల్లోనూ బ్రహ్మ భావనను కలిగి ఉండాలి. ప్రతిదీ దైవానికే అర్పించినట్లు భావించడం ద్వారా, ఆ భోజనం ఒక సాధారణ పనిలా కాకుండా బ్రహ్మజ్ఞానాన్ని పొందే సాధనగా మారుతుంది. అర్పణే బ్రహ్మం. సమర్పించేది బ్రహ్మకే. దాన్ని సేవించేవాడు, ఆనందించేవాడు కూడా బ్రహ్మే. ఇవ్వడం, తీసుకోవడం, పూజించడం వంటివన్నీ కూడా బ్రహ్మమే. అలా ప్రతిచోటా దేవుడు ఉన్నాడనే అవగాహనను పెంచుకోవాలి. ఈ భావనతో సేవ చేస్తే 'యద్భావం తద్భవతి- మనం ఎలా ఆలోచిస్తామో అలాగే అవుతాం' అనే సత్యాన్ని గ్రహిస్తాం. సేవ ఎప్పుడూ సాధనగా ఉండాలి. సేవ చేసేటప్పుడు దేవుణ్ని తప్ప మరెవరినీ తలవకూడదు. ఎవరికి సేవ చేసినా దేవుడికే సేవ చేస్తున్నానని భావించాలి. ఆ క్రమంలో అహంకారాన్ని వదిలించుకోవాలి. దైవాన్ని అర్థం చేసుకోవడానికి ఇదే అత్యుత్తమ మార్గం.



అంతర్యామి

భగవంతుణ్ని చేరడానికి అనేక మార్గాలున్నాయి. అయితే భగవత్ సాక్షాత్కారానికి దగ్గరి దారి మాత్రం నిస్వార్థంగా సేవ చేయడమే. మనల్ని సంతోషపరుస్తుంది కాబట్టి సేవ చేయాలి కానీ, ఎవరో మనల్ని గుర్తించాలని, ప్రతిఫలం పొందాలని చేయకూడదు. ఎటువంటి అంచనాలు లేకుండా సేవ చేసినప్పుడు అహం, కోరికలు, అనుబంధాలు, అంచనాలు, నిరాశలు ఉండవు. అప్పుడు హృదయం స్వచ్ఛంగా మారుతుంది. దాంతో లోపల ఉన్న దివ్యత్వాన్ని గ్రహించి ఆనందానికి దగ్గరవుతాం. నిజానికి ఈ చర్యల ఉద్దేశం ఏంటంటే మనలోని స్వార్థాన్ని వదిలించుకుని, దివ్యత్వాన్ని అనుభవించడమే. కంట్లో శుక్లం ఉన్న వ్యక్తి కళ్లెదురుగా ఉన్నవాటిని చూడలేడు. అదేవిధంగా అహంకారం, అనుబంధాలతో నిండిన వ్యక్తికి అవి తన మూడో కంట్లో పొరగా మారి, దైవాన్ని చూడనివ్వవు. సేవ అంటే అవసరం ఉన్నవాళ్లకు సాయపడటం. ఈ సేవే అంతర్గతంగా ఉన్న దైవాన్ని చూడటానికి సహాయపడే శస్త్రచికిత్స. సేవలో ఏదైనా ఆశ ఉంటే, దానికి గుర్తింపు కోరుకుంటే ఈ చికిత్స విజయవంతం కాదు. జ్ఞాన నేత్రాలతో ఎవరికి వారు వాస్తవాన్ని గమనిస్తూ, భగవంతుడి సాన్నిధ్యానికి చేర్చే మార్గం మీద అవగాహనతో చేయాల్సిన సాధన ఇది.

– శ్రీమధుసూదన్ సాయి


సంక్షోభంలోనూ స్థిరంగా ముందడుగు



దశాబ్దకాలంగా ప్రపంచం ఒక సంక్షోభం నుంచి మరో సంక్షోభంలోకి పయనిస్తూ వస్తోంది. ఆ క్రమంలోనే ఇరాన్‌పై అమెరికా- ఇజ్రాయెల్ ప్రారంభించిన యుద్ధం మునుపెన్నడూ లేనంతగా చమురు సరఫరాకు షాక్ ఇస్తోంది. ఇలాంటి తరుణంలో, భారత ఆర్థిక వ్యవస్థపై ఈ యుద్ధ ప్రభావం ఎలా ఉంటుంది? పశ్చిమాసియా సంక్షోభాన్ని నిభాయించడానికి ఇండియా తీసుకున్న చర్యలేంటి?

మన దేశం ముడిచమురు అవసరాల్లో 90శాతాన్నీ, గ్యాస్(ఎల్ఎన్‌జీ) అవసరాల్లో 50శాతాన్నీ విదేశాల నుంచి వచ్చే దిగుమతుల ద్వారానే తీర్చుకుంటోంది. ఇరాన్ యుద్ధం వల్ల వాటి సరఫరాలకు అంతరాయం కలుగుతున్నా, భారత్ సమర్థంగా తట్టుకోగలుగుతోంది. ద్రవ్యలోటు జీడీపీలో 4.4శాతంగా; కేంద్ర ప్రభుత్వ రుణ-జీడీపీ నిష్పత్తి 56శాతంగా, రాష్ట్రాలతో కలిపితే 81శాతంగా ఉన్నాయి. ఇతర దేశాలతో పోలిస్తే భారత్ తలమీద అప్పుల భారం తక్కువే! విదేశీ రుణాలు-జీడీపీ నిష్పత్తి 19.1శాతమే కాగా, ప్రస్తుత కరెంట్ ఖాతా లోటు సుమారు 1.2శాతం. ప్రభుత్వం పెట్టుబడి వ్యయాన్ని పెంచుతుండటం; బ్యాంకింగ్, ప్రైవేట్ రంగాల పరిస్థితి మెరుగ్గా ఉండటం వంటి సానుకూలతలనూ ఇక్కడ గమనించాలి.

క్రమబద్ధమైన విధానాలు అవసరం



ప్రయాణ సాధనాలు, భారీ రవాణా వాహనాల విక్రయాలు, జీఎస్టీ వసూళ్లు వంటివి వస్తుసేవలకు డిమాండ్ బలంగా ఉన్నట్లు చూపుతున్నాయి. మార్చిలో సరకుల వాణిజ్య లోటు 2,169 కోట్ల డాలర్ల నుంచి 2,067 కోట్ల డాలర్లకు దిగివచ్చింది. దేశం నుంచి ఎగుమతులు మెరుగ్గా ఉండటం వల్ల యుద్ధ ప్రభావాన్ని తగ్గించుకోగలిగామని తెలుస్తోంది. అమెరికా డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ క్షీణించి 94 నుంచి 95కి చేరుకున్న మాట వాస్తవం. భారతీయ స్టాక్ మార్కెట్ నుంచి విదేశీ పోర్ట్‌ఫోలియో పెట్టుబడిదారులు(ఎఫ్‌పీఐలు) నిధులను ఉపసంహరించుకోవడం దీనికి ఒక కారణం. పశ్చిమాసియా పరిస్థితులు సాధారణ స్థితికి వచ్చాక ఎఫ్‌పీఐలు తిరిగి వస్తాయి. 2025-26లో స్థూల ఎఫ్‌డీఐ ప్రవాహం 9 వేల కోట్ల డాలర్లుగా ఉండవచ్చని అంచనా. సంస్కరణలు, సరఫరా గొలుసులలో మార్పు వల్ల 2030 నాటికి వార్షిక ఎఫ్‌డీఐ ప్రవాహాలు పదివేల కోట్ల డాలర్లకు చేరవచ్చు. స్పష్టమైన విధానాలు, సంస్థాగత నిబద్ధత, భారతీయ వ్యవస్థలపై అంతర్జాతీయ పెట్టుబడిదారులకు ఉన్న నమ్మకమే దేశంలో పెట్టుబడులు ఊపందుకోవడానికి కారణమవుతున్నాయి. చురుకైన విధానాలు, మౌలిక సదుపాయాల అభివృద్ధి వల్ల ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, గుజరాత్, మధ్యప్రదేశ్ వంటి రాష్ట్రాలు అగ్రగామి పెట్టుబడి గమ్యస్థానాలుగా ఎదిగాయి.

కొవిడ్-19 సమయంతో పోలిస్తే భారత్ ప్రస్తుతం బలమైన వృద్ధి, అదుపులో ఉన్న ద్రవ్యోల్బణంతో పశ్చిమాసియా యుద్ధ షాక్‌ను ఎదుర్కొంటోంది. 2025-26లో జీడీపీ వృద్ధిరేటు 7.6శాతమని అంచనా. 2026-27లో ఇది ఏడు శాతం వరకు ఉండవచ్చు. రిజర్వు బ్యాంకు అంచనాల ప్రకారం, ముడిచమురు ధర పీపాకు 85డాలర్లుగా ఉంటే 2026-27లో వాస్తవ జీడీపీ వృద్ధి 6.9శాతంగా, ద్రవ్యోల్బణం 4.6శాతంగా ఉంటుంది. ఒకవేళ పీపా ధర 95 డాలర్లకు చేరితే, వృద్ధిరేటు 6.7శాతం, ద్రవ్యోల్బణం అయిదు శాతంగా ఉండవచ్చు. ప్రపంచ ముడిచమురు ధరలు పెరిగినా భారత్ ఆర్థికాభివృద్ధి, ద్రవ్యోల్బణంపై ప్రభావం పరిమితంగానే ఉంటుందంటున్నారు. అయితే, ఈ విశ్లేషణ ఎంతవరకు నిజమవుతుందనేది ఇరాన్ యుద్ధం ఎంతకాలం కొనసాగుతుందనే దానిపైనే ఆధారపడి ఉంటుంది.

యుద్ధ సంక్షోభాన్ని ఎదుర్కోవడానికి కేంద్రం ద్రవ్య, వాణిజ్య, సరఫరాల పరంగా పలు చర్యలు తీసుకుంటోంది. మన కరెన్సీ స్థిరత్వాన్ని నిర్ధారించడం, నగదు లభ్యతను పెంచడం, ఎగుమతి రుణాల కాలపరిమితిని పొడిగించడంపై ఆర్‌బీఐ దృష్టి సారించింది. సాధారణ వినియోగదారులపై భారం పడకుండా వంటగ్యాస్ ధరల పెంపును వాణిజ్య రంగానికే పరిమితం చేశారు. విమాన ఇంధన ధరల పెంపును అంతర్జాతీయ ఫ్లైట్లకే వర్తింపజేశారు. ఇంకోవైపు ఇంధన వనరుల వైవిధ్యీకరణ, దీర్ఘకాలంలో ఇంధన సరఫరాకు ఢోకా లేకుండా చూసుకోవడం, తగినన్ని నిల్వలు నిర్వహించడంపైనా దృష్టి సారించారు. చమురు ధరల పెరుగుదల వంటి విఘాతాలను అధిగమించడానికి క్రమబద్ధమైన విధానాలు అవసరమని పశ్చిమాసియా సంక్షోభం నొక్కి చెబుతోంది. మొదట ఇంధనం, ఆహారం, ఎరువులు, లోహాల వంటి కీలక రంగాల్లో నష్ట భయాలను తగ్గించుకోవాలి. వ్యూహాత్మక పెట్రోలియం నిల్వలను పెంచుకోవాలి. తరవాత దిగుమతులపై అతిగా ఆధారపడకుండా చూసుకోవాలి. ఏదిఏమైనా పునరుత్పాదక ఇంధనాలకు వేగంగా మళ్లడం ద్వారా శిలాజ ఇంధనాలపై ఆధారపడటాన్ని తగ్గించుకోవడమే శాశ్వత పరిష్కారం. దేశీయ ఔషధ పరిశ్రమలకు కావాల్సిన ముడి పదార్థాలైన 'యాక్టివ్ ఫార్మాస్యూటికల్ ఇన్‌గ్రెడియంట్స్'లో సుమారు 70-90 శాతం చైనా నుంచే వస్తున్నాయి. అలాగే లిథియం-అయాన్ బ్యాటరీల కోసమూ ఆ దేశంపైనే అతిగా ఆధారపడుతున్నాం. దీన్ని తగ్గించడానికి పకడ్బందీ చర్యలు అవసరం.

నిశితంగా పర్యవేక్షించాలి...

పశ్చిమాసియా యుద్ధం వల్ల కలుగుతున్న ఇంధన షాక్... శిలాజ ఇంధనాలను వదిలి హరిత ఇంధనాలను చేపట్టే ప్రక్రియను వేగవంతం చేస్తుంది. 2070 నాటికి కర్బన ఉద్గారాల తటస్థతను సాధించాలని భారత్ ఇప్పటికే తలపెట్టింది. ఆ దిశగా 2031-35 కాలానికి సంబంధించిన జాతీయ లక్ష్యాల కింద కర్బన ఉద్గారాల తీవ్రతను తగ్గించడం, శిలాజేతర వనరులతో విద్యుదుత్పాదన సామర్థ్యాన్ని పెంచడం వేగంగా జరగాలి. అణుశక్తి విషయంలో ప్రైవేట్ భాగస్వామ్యానికి 'శాంతి చట్టం' అనుకూలమైన వాతావరణాన్ని కల్పిస్తోంది. రవాణా రంగంలో జీవ ఇంధనాలు, ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం చమురుపై ఆధారపడటాన్ని తగ్గిస్తున్నాయి. చమురు గుత్తాధిపత్యం కాలక్రమేణా తగ్గుతుంది. ఈ ఏడాది దేశీయ సేద్య రంగంపై 'ఎల్‌నినో' ప్రభావం ఉండటం ఆందోళన కలిగిస్తున్నా- మెరుగైన నీటి పారుదల వసతులు, నాణ్యమైన విత్తనాలు, పంటల వైవిధ్యీకరణ వల్ల 1970, 80ల నాటి పరిస్థితులు ఇప్పుడు లేవు. అయినప్పటికీ, రైతుల పెట్టుబడి ఖర్చులు, దిగుబడులపై ప్రభావం వంటి అంశాలను నిశితంగా పర్యవేక్షించాల్సి ఉంది. ఏతావాతా పశ్చిమాసియా యుద్ధం దేశార్థికానికి ఆందోళనకరంగా పరిణమిస్తున్నా, బలమైన ఆర్థిక పునాదుల కారణంగానే భారత్ నిబ్బరంగా ఉంది.



ప్రొఫెసర్ ఎస్.మహేంద్ర దేవ్
ప్రధానమంత్రి ఆర్థిక సలహా మండలి ఛైర్మన్



రొటీన్ మంచిదే!

విజేతల్ని ఆరాధిస్తారు కానీ, వాళ్లు ఆ స్థాయికి ఎలా వెళ్లారో తెలుసుకునే విషయం మీద చాలామంది దృష్టిపెట్టరు. ఏ విజయమూ ఒక్కరోజులో రాదు. స్థిరంగా చేసే సాధనతోనే వస్తుంది. దినచర్యలో భాగంగా చేసుకున్న చిన్న చిన్న అలవాట్లే పెద్ద విజయాన్ని సాధించిపెడతాయి. కాకపోతే 'రోజూ అదే పనా.. బోర్!' అనుకోకుండా ఉండాలంతే!

వ్యాయామం, కొన్ని పేజీలు చదవడం, సమయానికి భోజనం చేయడం... అబ్బా అందరూ చెప్పేవి అవే కదా... అనుకుంటున్నారా? వ్యాయామం రొటీన్‌లో భాగమైతే ఫిట్‌నెస్ మీ సొంతమవుతుంది. కొన్ని పేజీలు చదివే అలవాటు క్రమంగా గొప్ప చదువరిని చేస్తుంది. మంచి ఆహారపుటలవాట్లు ఆరోగ్యవంతుల్ని చేస్తాయి. కొద్దికొద్దిగా దాచే డబ్బు దీర్ఘకాలంలో పెద్దమొత్తం అవుతుంది. టోటల్‌గా అన్నీ కలిసి ఉత్పాదక సామర్థ్యాన్ని పెంచుతాయి. ఇలాంటి మంచి అలవాట్లతో తమ తమ రంగాల్లో నిదానంగా పురోగతి సాధించినవాళ్లే కొన్నేళ్లకి విజేతగా నిలుస్తారు. అందుకే 'దీర్ఘకాలంలో సాధించిన చిన్న చిన్న విజయాలే పెద్ద ఫలితాన్ని ఇస్తాయి' అంటారు 'ది కాంపౌండ్ ఎఫెక్ట్' అనే పుస్తకంలో డారెన్ హార్డీ. ఇది తెలుసుకోలేక చాలా మంది అపజయానికి సాకులు వెతుక్కుంటూ ఉంటారు.

రొటీన్‌లో రోజుకో సర్‌ప్రైజ్ ఉండకపోవచ్చు. క్రమశిక్షణ ఉంటుంది. గొప్ప థ్రిల్ లేకపోవచ్చు. కానీ, ఒత్తిడీ బర్న్అవుట్‌లు దరిచేరవు. వాస్తవంలో జీవిస్తాం. దాంతో కుటుంబంలో ఆఫీసులో అంతటా మనపట్ల నమ్మకం ఏర్పడుతుంది. చాలామంది అనుకుంటారు... జీవితం ఎప్పుడూ కొత్తగా ఉండాలి, ఒకే రకం దినచర్య మహా విసుగని. కానీ అత్యుత్తమంగా రాణించాలంటే బోరింగ్ రొటీన్‌తో మళ్లీ మళ్లీ ప్రేమలో పడాల్సిందే అంటారు 'అటామిక్ హ్యాబిట్స్' పుస్తక రచయిత జేమ్స్ క్లియర్. మీరు ఏ ప్రముఖుల దినచర్యనైనా గమనించండి. వారంతా రొటీన్‌గా ఒకే టైమ్‌కి ఒకే పనిని చేస్తున్నవాళ్లే అయి ఉంటారు. కాకపోతే, ఒక్కొక్కరి దినచర్యా ఒక్కోలా ఉండవచ్చు. కాబట్టి మీదైన రొటీన్ ఒకటి సిద్ధం చేసుకోండి.

- యోగా, వ్యాయామం చేయండి లేదా పాడ్‌కాస్ట్‌లు వింటూ పచ్చని ప్రకృతి మధ్య నడవండి.
- రోజుని సమీక్షించుకోండి... ఆ రోజు చేయాల్సిన పనుల్ని లిస్టు రాసుకోండి. పడుకునే ముందు వాటిలో ఎన్ని చేశారో చెక్ చేసుకోండి. అనుకున్నవన్నీ చేయగలిగితే గుడ్. ఒకటి రెండు మిగిలితే మర్నాడు పూర్తిచేయండి. క్రమంగా ఏరోజు పని ఆరోజు పూర్తిచేయడం అలవడుతుంది.
- ధ్యానంతో రోజుని ప్రారంభించండి. ఇది లక్ష్యం మీద దృష్టి నిలపడానికి తోడ్పడుతుంది.

రొటీన్‌గా చేసే పనుల బాధ్యతను మెదడులోని బేసల్ గాంగ్లియా భాగం తీసుకుంటుంది. దాంతో కొత్త ఆలోచనలకోసం మెదడులో ఖాళీ ఏర్పరుస్తుంది. అప్పుడు సృజనాత్మకంగా ఆలోచించవచ్చు, ఎక్కువ పనులు చేయవచ్చన్నమాట. అంతేకాదు, అలవాట్లతో కూడిన రొటీన్‌లో ఓ ప్రేరణ దాగి ఉంటుంది. క్రమశిక్షణ అలవడుతుంది. నిర్మాణాత్మక ఆలోచనలతో జీవితం సాగుతుంది. ముఖ్యమైన విషయాలకు ప్రాధాన్యం ఇవ్వడం, వాయిదా వేయడం తగ్గి అంతిమంగా విజయం వరిస్తుంది.

– శాంతిశ్రీ



కలగా పల్లె ప్రగతి

మౌలిక వసతుల లభ్యత, పేదరిక నిర్మూలన తదితరాల ఆధారంగా రెండున్నర లక్షలకు పైగా పంచాయతీలకు కేంద్రం ఇటీవల 'ఏప్లస్ నుంచి డి' దాకా గ్రేడ్లు కేటాయించింది. వాటిలో ఒక్కటీ 'ఏప్లస్' గ్రేడ్ సాధించలేదు. అరుణాచల్, మణిపుర్, మేఘాలయ, నాగాలాండ్‌ల నుంచి ఒక్క గ్రామమూ 'ఏ'గ్రేడ్ దక్కించుకోలేదు. దేశవ్యాప్తంగా 13వేలకు పైగా పంచాయతీలు అధమంగా 'డి' గ్రేడ్‌లో నిలిచాయి. వాటిలో ఏ రాష్ట్రాల పంచాయతీలు ఎన్ని ఉన్నాయంటే...

ఉత్తర్‌ప్రదేశ్	6,124	రాజస్థాన్	203
మణిపుర్	1,753	అస్సాం	74
ఛత్తీస్‌గఢ్	1,736	ఆంధ్రప్రదేశ్	73
మేఘాలయ	759	ఒడిశా	46
మహారాష్ట్ర	621	ఝార్ఖండ్	35
పంజాబ్	493	కర్ణాటక	31
బిహార్	418	గుజరాత్	25
అరుణాచల్ ప్రదేశ్	318	తెలంగాణ	23
మధ్యప్రదేశ్	310	తమిళనాడు	19
నాగాలాండ్	204		

(ఆధారం: పంచాయత్ అడ్వాన్స్‌మెంట్ ఇండెక్స్ 2023-24)

అమెరికా ఏఐ ఎగుమతుల వ్యూహం

కృత్రిమ మేధా రంగంలో చైనాను వెనకబాట పట్టించి, ప్రపంచవ్యాప్తంగా తన సాంకేతిక ప్రాబల్యాన్ని ప్రదర్శించుకోవాలని అమెరికా ఉవ్విళ్లూరుతోంది. అందుకనే అడ్డూఅదుపూ లేకుండా విదేశాలకు పూర్తిస్థాయిలో తన సాంకేతికతలను ఎగుమతి చేయడంపై దృష్టి సారించింది. ఇందులో భాగంగా 'ఫుల్‌శ్టాక్ ఏఐ ఎగుమతుల ప్రణాళిక'ను తీసుకొచ్చింది. దీనివల్ల భారత్ వంటి దేశాలకు ఒనగూడే ప్రయోజనాలేంటి?

కృత్రిమ మేధ(ఏఐ) రంగంలో అమెరికా, చైనాల మధ్య ఆధిపత్య పోరు ముదురుతోంది. ప్రపంచ దేశాలు చైనీస్ ఏఐ మోడల్స్, హార్డ్‌వేర్(సెమీకండక్టర్లు, జీపీయూ), సాఫ్ట్‌వేర్‌ల వినియోగానికి మళ్లకుండా తన ఏఐ చట్రంలోనే కొనసాగాలని అమెరికా ఆశిస్తోంది. తన సాంకేతిక వ్యవస్థనే ప్రపంచ ప్రమాణంగా నిలబెట్టాలని లక్షిస్తోంది. ఇంతకాలం విదేశాలకు తన సాంకేతికతల ఎగుమతిపై కొంత నియంత్రణ విధిస్తూ వచ్చిన అమెరికా, ఇకపై పూర్తిస్థాయిలో(ఫుల్‌శ్టాక్) వాటిని బదిలీ చేయాలని నిశ్చయించింది. తదనుగుణంగా గతనెల ఒకటిన 'ఫుల్‌శ్టాక్ ఏఐ ఎగుమతుల ప్రణాళిక'ను ప్రకటించింది. భాగస్వామ్య దేశాలు తమ సాంకేతికతలను సులభంగా స్వీకరించేలా లైసెన్స్ రివ్యూలను వేగవంతం చేయడం, ప్రత్యేక ఆర్థిక సాయం అందించడం వంటివి ఈ ప్రణాళికలో ఉన్నాయి. దీనికోసం మిత్రదేశాల ప్రభుత్వాలతో అమెరికా సర్కారు నేరుగా సంప్రదింపులు జరుపుతోంది. మరోవైపు, మిత్రదేశాలకు ఫుల్‌శ్టాక్ ఏఐ సాంకేతికతను అందించడానికి సంబంధించిన ప్రతిపాదనలను సమర్పించాలని స్వదేశీ కంపెనీలను అమెరికా సర్కారు ఆదేశించింది.

భారత్.. కీలక భాగస్వామి

గూగుల్ ఇప్పటికే 'ఫుల్‌శ్టాక్ ఏఐ ఎగుమతుల ప్రణాళిక'ను కార్యరూపంలోకి తీసుకొస్తోంది. తన ఏఐ సాంకేతికతను ప్రపంచవ్యాప్తంగా విస్తరించడానికి ఆ సంస్థ అనుసరిస్తున్న వ్యూహంలో భాగమే- విశాఖపట్నంలో నెలకొల్పుతున్న 1500 కోట్ల డాలర్ల ఏఐ హబ్. 12 దేశాల్లో వ్యాపించిన గూగుల్ అంతర్జాతీయ ఏఐ నెట్‌వర్క్‌లో కీలకమైన నోడ్‌గా విశాఖ హబ్ పనిచేయనుంది. భారతీయ టెక్ సంస్థలు, స్టార్టప్‌లు ప్రపంచ దేశాలకు ఏఐ పరిష్కారాలను నేరుగా విశాఖలోనే రూపొందించి ఎగుమతి చేయడానికి ఇది వీలు కల్పిస్తుంది. భారత్ ఇస్తున్న పన్ను విరామాన్ని ఉపయోగించుకోవడానికి మన గడ్డపై డేటా సెంటర్ల ఏర్పాటుకు గూగుల్, మైక్రోసాఫ్ట్, మెటా, అమెజాన్ వంటి అమెరికన్ టెక్ దిగ్గజాలు వేల కోట్ల డాలర్లను



గుమ్మరిస్తున్నాయి. భారత్-అమెరికా మధ్య వాణిజ్య ఒప్పందం ఖరారైతే ఎన్విడియా జీపీయూల వంటి అత్యాధునిక ఏఐ మౌలిక సాధనాల దిగుమతికి రాజమార్గం ఏర్పడుతుంది. ఇటీవలి దిల్లీ ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ సందర్భంగా 'పాక్స్ సిలికా'లో భారత్ లాంఛనంగా చేరింది. తద్వారా అగ్రరాజ్య సారథ్యంలోని ఏఐ, సెమీకండక్టర్, అరుదైన లోహాల సరఫరా గొలుసులలో ఇండియా భాగస్వామి అయింది.

నిజానికి అమెరికా ఏఐ ఎగుమతి ప్రణాళిక భారతదేశ 'ఏఐ మిషన్'కు మంచి ఊతమిస్తుంది. ఇండియా చేపట్టిన 10,000 ప్లస్ జీపీయూ ప్రాజెక్టుకు భారీ కంప్యూటింగ్ శక్తి అవసరం. తాజా ప్రణాళిక ద్వారా ఎన్విడియా, ఏఎండీ, గూగుల్ టీపీయూ వంటి అగ్రశ్రేణి చిప్స్‌ను నేరుగా పొందే అవకాశం కలుగుతుంది. అమెరికా నుంచి 3-5 ఏళ్ల క్రితం నాటి జీపీయూ ఆర్కిటెక్చర్‌లను దిగుమతి చేసుకోవడానికి వీలు కల్పించడంతో పాటు భారతీయ కంపెనీలకు చవగ్గా అధునాతన కంప్యూటింగ్‌ను అందుబాటులోకి తెస్తుంది. పైగా అమెరికన్ కంపెనీలను భారతీయ స్టార్టప్‌లతో అనుసంధానిస్తుంది. ఫలితంగా ఏఐ అప్లికేషన్లు, డిజిటల్ మౌలిక సదుపాయాల రంగంలో సహకారం పెరుగుతుంది. అయితే, అమెరికన్ ఏఐ సదుపాయాలు, మోడల్స్‌పైనే పూర్తిగా ఆధారపడటం ప్రమాదకరం. దీనివల్ల స్వదేశీ ఏఐ చిప్స్, ఆర్కిటెక్చర్ల తయారీపై ఆసక్తి తగ్గిపోతుంది. అమెరికా ఏఐ ఎగుమతి ప్రణాళికలో ఇండియా కీలక భాగస్వామిగా ఉన్నప్పటికీ, అధునాతన చిప్స్ కోసం తమ డేటా సెంటర్లలో పెట్టుబడులు పెట్టడమో, భద్రతా హామీలు ఇవ్వడమో చేయాలని వాషింగ్టన్ షరతులు విధించవచ్చు. అలాగే భారతదేశంలో పనిచేసే అమెరికన్ కంపెనీలకు తాజా జీపీయూలు సులభంగా దొరుకుతాయి. ఇది స్వతంత్ర భారతీయ స్టార్టప్‌లకు కొంత ప్రతికూలంగా మారవచ్చు. ఏదిఏమైనా న్యూదిల్లీ తన స్వతంత్ర విదేశాంగ విధానాన్ని కాపాడుకుంటూనే వాషింగ్టన్‌తో సాంకేతిక సంబంధాలను కొనసాగించాలి.

స్థానిక భాషల్లో...

విదేశీ ఏఐ వేదికలపై ఆధారపడటాన్ని నివారించడానికి భారత్ స్వదేశీ లార్జ్ లాంగ్వేజ్ మోడల్స్(ఎల్ఎల్ఎం)ను ప్రోత్సహిస్తోంది. వీటివల్ల హిందీ, తెలుగు, తమిళ్ వంటి స్థానిక భాషల్లో ఖాతాదారులతో సంభాషించగల చాట్‌బాట్స్ అందుబాటులోకి వస్తున్నాయి. ఇలా దేశీయంగా విభిన్న భాషల అవసరాలను తీర్చడంతోపాటు ఆంగ్లేతర భాషలు మాట్లాడే విదేశాల్లో ఏఐకి ఒక నమూనాను అందించడానికి 'బహుభాషా భాషిణి'పై భారత్ దృష్టి సారిస్తోంది. యూపీఐ, ఆధార్ విజయాల స్ఫూర్తితో ఇండియా ఆరోగ్య సంరక్షణ, వ్యవసాయం, పాలనా రంగాల్లో అప్లికేషన్ల అభివృద్ధిపైనా శ్రద్ధ చూపుతోంది. ఇలాంటి తరుణంలో ఏఐ హార్డ్‌వేర్‌ను సమీకరించుకోవడంతో పాటు దేశీయ కృత్రిమ మేధా సామర్థ్యాన్ని బలోపేతం చేసుకోవడానికి అమెరికా ఏఐ ఫుల్‌శ్టాక్ ఎగుమతి ప్రణాళికను ఇండియా ఉపయోగించుకోనుంది.

– ఏవీవీ ప్రసాద్

హాయ్! బుజ్జీ!!



అచ్చు.. మన బొమ్మల్లాగట!

హాయ్ ఫ్రెండ్స్. నిద్రలేచారా? నేను చూడండి అప్పుడెప్పుడో లేచి, మీ ఇంటికి కూడా వచ్చేశాను మీతో కబుర్లు చెబుదామని! కానీ మీరేమో ఇంకా లేవట్లేదు. తొందరగా లేవండి. పోయిన వారం అమ్మమ్మ, తాతయ్యలను ప్రశ్నలు అడుగుతానని చెప్పాను కదా! వాటి సమాధానాలతో వచ్చాను. మీరు అమ్మ ఇచ్చిన పాలు తాగేసి వస్తే మాట్లాడుకుందాం సరేనా!

మీకు చెప్పినట్లుగానే అమ్మమ్మ వాళ్ల ఇంటి నుంచి తిరిగొచ్చేటప్పుడు వాళ్లను చాలా విషయాలు అడిగాను. ఎన్ని కొత్త సంగతులు చెప్పారో తెలుసా ఫ్రెండ్స్..! తాతయ్య రోజూ ఉదయాన్నే పొలం పనులకు వెళ్తుంటారు, అమ్మమ్మేమో తోట పనులు చూసుకుంటూ ఉంటుంది. ఇలా ఎప్పుడూ ఒకే పని చేస్తుంటే బోర్‌గా అనిపించదా అని అడిగాను.. 'పొలం పని చేయడమంటే నాకు చాలా ఇష్టం. చేస్తుంటే అసలు సమయమే తెలియదు. పైగా మనం చేస్తున్న పనితో పది మంది ఆకలి తీరుతుంది.. అంతకంటే ఇంకేం కావాలి!' అన్నారు తాతయ్య. 'మన పెరట్లోనే నేను పండించిన కూరగాయలతో అందరికీ వంట చేసి పెట్టడం నాకు నచ్చుతుంది. నీకు అర్థమయ్యేలా చెప్పాలంటే.. నువ్వు వేసిన పెయింటింగో లేకపోతే గీసిన బొమ్మో.. నీకు ఎలా నచ్చుతాయో అలాగేనన్నమాట' అంది అమ్మమ్మ. అంటే.. మనకు బాగా నచ్చిన పని ఎంత చేసినా అసలు బోర్ కొట్టదని వాళ్ల మాటలతో అర్థమైంది. మీరేం చేస్తే సంతోషంగా ఉంటారంటే.. 'కేవలం ఒక పని చేస్తేనే ఆనందంగా ఉంటాం అనుకోవడం పొరపాటు! అలా అయితే.. ఒకచోటే ఆగిపోవాల్సి వస్తుంది. సందర్భాన్ని బట్టి.. చేస్తున్న పనిని, దాని తీరునీ మారుస్తూ ఉండాలి.. అప్పుడు మనకు తెలియకుండానే ఉత్సాహంగా, ఆనందంగా ఉంటాం' అని చెప్పారు. 'మరి మేమెలా ఉంటే మీకు నచ్చుతుంది' అని అడిగాను నేస్తాలూ! 'మీరు ఎలా ఉన్నా, ఏం చేస్తున్నా ఎప్పుడూ మాకు నచ్చుతారు.. మా చిన్నతనమంతా మీలోనే చూసుకుని మురిసిపోతుంటాం.. ఇలా అప్పుడప్పుడు మా దగ్గరికి వస్తే చాలు' అన్నారు తాతయ్య. మరి వీలైనప్పుడల్లా అమ్మమ్మ, నానమ్మ, తాతయ్య వాళ్ల దగ్గరికి వెళ్లి సరదాగా గడిపేద్దామా! ✦

నేనెవర్ని?

1. నాలుగు అక్షరాల పదాన్ని నేను. 'కూర'లో ఉంటాను కానీ 'చీర'లో లేను. 'చిత్తడి'లో ఉంటాను కానీ 'ఇత్తడి'లో లేను. 'పూత'లో ఉంటాను కానీ 'ఈత'లో లేను. 'బడి'లో ఉంటాను కానీ 'బల్లి'లో లేను. నేనెవర్ని?
2. నేనో మూడు అక్షరాల పదాన్ని. 'కాలు'లో ఉంటాను కానీ 'వీలు'లో లేను. 'రవ్వ'లో ఉంటాను కానీ 'అవ్వ'లో లేను. 'బాణం'లో ఉంటాను కానీ 'బావి'లో లేను. ఇంతకీ నేనెవర్ని?

జవాబులు: 1.కూచిపూడి 2.కారణం


(c) eenadu



పట్టు పట్టి.. దీదీని పడగొట్టి

బెంగాల్‌లో భాజపా చరిత్రాత్మక విజయం

- 15 ఏళ్ల తృణమూల్ పాలనకు తెర
- భవానీపుర్‌లో మమతపై సువేందు గెలుపు
- ఆర్‌జీ కర్ హత్యాచార బాధితురాలి తల్లికి దక్కిన విజయం
- 2 సీట్లతో సరిపెట్టుకున్న కాంగ్రెస్



కోల్‌కతా: కమలదళం కల నెరవేర్చుకుంది. తూర్పు భారతంలో తనకు ఇన్నాళ్లూ కొరకరాని కొయ్యగా ఉన్న బెంగాల్ కోటను ఎట్టకేలకు బద్దలు కొట్టింది. మమతా బెనర్జీ నేతృత్వంలోని తృణమూల్ కాంగ్రెస్ ప్రభుత్వ సుదీర్ఘ పాలనకు తెరదించి.. మూడింట రెండొంతులకు పైగా మెజార్టీతో రాష్ట్రంలో తొలిసారి సర్కారును ఏర్పాటు చేసేందుకు సిద్ధమైంది. తృణమూల్ అధినాయకురాలు, వరుసగా 15 ఏళ్ల సీఎంగా ఉన్న మమతా బెనర్జీ తనకు కంచుకోటలాంటి భవానీపుర్ నియోజకవర్గంలో ఒకప్పటి తన సన్నిహిత అనుచరుడైన ప్రస్తుత భాజపా కీలక నేత సువేందు అధికారి చేతిలో పరాజయం పాలవడం తాజా ఎన్నికల్లో మరో సంచలన పరిణామం. ఆమె 15,015 ఓట్ల తేడాతో ఓడిపోయారు. సువేందు నందిగ్రామ్‌లోనూ గెలిచి, ఆ నియోజకవర్గంపై తనకున్న పట్టును మరోసారి నిరూపించుకున్నారు.

ఆది నుంచీ ఆధిపత్యమే..

బెంగాల్‌లో సోమవారం ఓట్ల లెక్కింపు ప్రారంభం నుంచీ భాజపా ఆధిపత్యం స్పష్టంగా కనిపించింది. ప్రభుత్వ ఏర్పాటుకు అవసరమైన కనీస మెజార్టీ మార్కు (148)ను పార్టీ సులభంగా అధిగమించింది. ఉత్తర బెంగాల్ నుంచి జంగల్ మహల్ వరకు.. సరిహద్దు జిల్లాల నుంచి పారిశ్రామిక బెల్టుల వరకు అంతటా కమలం హవా సాగింది. తృణమూల్‌కు ఇన్నాళ్లూ పెట్టని కోటల్లా ఉన్న ప్రాంతాల్లోనూ కాషాయ పార్టీ సత్తా చాటింది. దాని జోరుతో చంద్రిమా భట్టాచార్య, ఉదయన్ గుహ, శశి పంజా, మొలోయ్ ఘటక్, బ్రత్యా బసు తదితర మంత్రులు పరాజయం పాలయ్యారు.

- 2024 లోక్‌సభ ఎన్నికల్లో పరాజయం పాలైన భాజపా సీనియర్ నేత దిలీప్ ఘోష్ ఈ ఎన్నికల్లో ఖరగ్‌పుర్ సదర్ స్థానంలో 26 వేలకు పైగా ఓట్ల తేడాతో గెలిచారు.
- పానీహాటీ నియోజకవర్గంలో భాజపా టికెట్‌పై బరిలో దిగిన ఆర్‌జీ కర్ ఆసుపత్రి హత్యాచార బాధితురాలి తల్లి రత్నా దేవ్ నాథ్ విజయం సాధించారు.
- మాథాభంగా స్థానంలో కేంద్ర మంత్రి, భాజపా నేత నిశిత్ ప్రమాణిక్ సునాయాస విజయం సాధించారు.
- 2021లో బెంగాల్‌లో ఒక్క సీటూ దక్కించుకోలేకపోయిన కాంగ్రెస్.. ఈసారి రెండు స్థానాలు (ఫరక్కా, రాణీనగర్) గెల్చుకుంది.
- సీపీఎంకు ఒక స్థానం దక్కింది. ఆ పార్టీ అభ్యర్థి మొస్తాఫిజుర్ రహమాన్ డొమ్‌కల్ నియోజకవర్గంలో గెలుపొందారు.

టీఎంసీ కార్యాలయాలపై దాడులు

ఎన్నికల ఫలితాలు వెలువడుతుండగానే బెంగాల్ వ్యాప్తంగా పలు చోట్ల తృణమూల్ కార్యాలయాలపై దాడులు జరిగాయి. ఆ పార్టీ ఫ్లెక్సీబోర్డులు, బ్యానర్లను దుండగులు చింపివేశారు. ఈ ఘటనలతో తమకు సంబంధం లేదని భాజపా పేర్కొంది.



కోల్‌కతాలో భాజపా కార్యాలయం వద్ద పార్టీ శ్రేణుల నృత్యాలు

మమత ఆరోపణలతో ఏకీభవిస్తున్నాం

బెంగాల్‌లో 100కు పైగా స్థానాలను భాజపా దోచుకుందన్న మమత ఆరోపణలతో ఏకీభవిస్తున్నాం. తమిళనాడు శాసనసభ ఎన్నికల్లో అత్యధిక స్థానాలు సాధించిన టీవీకే పార్టీ అధినేత విజయ్‌కు అభినందనలు. ఈ విజయం పెరుగుతున్న యువ స్వరానికి నిదర్శనం.

- రాహుల్ గాంధీ



ఫలించని ఒంటరి పోరాటం..

ప్రధాని నరేంద్రమోదీ... భాజపా చాణక్యుడు అమిత్‌షా... వివిధ రాష్ట్రాల నుంచి భాజపా ముఖ్యమంత్రులు... ముఖ్యనేతలు... అన్నింటికి మించి క్షేత్రస్థాయిలో ఆరెస్సెస్... వీటన్నింటినీ తట్టుకొని తృణమూల్‌ను గట్టెక్కించేందుకు మమతా బెనర్జీ చేసిన ఒంటరిపోరాటం అంతా ఇంతాకాదు! అభ్యర్థులను కాదు... నన్ను చూసి ఓటు వేయండంటూ... పశ్చిమ బెంగాల్‌ను అప్రతిహతంగా 15 ఏళ్ల పాలించిన మమతా బెనర్జీకి ఈసారి రాజకీయంగా గట్టి షాక్ తగిలింది. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి.. బెంగాల్‌లో తిరుగులేని శక్తిగా కొనసాగాలని, జాతీయ రాజకీయాల్లో కీలకంగా మారాలనుకున్న ఆమె ప్రయత్నాలకు అడ్డుకట్ట వేసింది. ప్రస్తుతానికి బెంగాల్‌లో దీదీ శకం ముగిసినట్లేనా అనే ప్రశ్న తలెత్తుతుంది. కారణం... మళ్లీ అసెంబ్లీ ఎన్నికల నాటికి ఆమెకు 76 ఏళ్లు వస్తాయి.

అందరికీ దీదీగా (అక్కగా) సుపరిచితురాలైన మమతా బెనర్జీ భావోద్వేగ రాజకీయాలు చేశారు. బెంగాల్ రాజకీయాల్లో ఆమె అందుకున్న స్థానాన్ని ఏ ప్రత్యర్థీ అందుకోలేకపోయారు. ఆమె ఆచితూచి స్పందించే నేత కాదు. వ్యవస్థాగతపరంగానూ ఆలోచించే వ్యక్తి కాదు. చైతన్యవంతమైన, భావోద్వేగపూరితమైన నేతగానే కొనసాగారు.

- మమత.. డ్రాయింగ్ రూంల నుంచి, టీవీ స్టూడియోల నుంచి ఎదిగిన నేత కాదు. రైలు పట్టాలు, నిరసన ప్రదర్శనలు, వీధి పోరాటాలు, నిరాహార దీక్షలతో ఎదిగారు.
- ఎవరూ వెళ్లడానికి సాహసించని హింసాత్మక ఘటనలు జరిగే గ్రామాలకు ఆమె భయపడకుండా వెళ్లేవారు. విషాదాలు జరిగినప్పుడు ఆసుపత్రులకు వెళ్లి బాధితులను పరామర్శించేవారు. సాధారణ కార్మికులతో కలిసి ధర్నాల్లో కూర్చునేవారు.
- ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టడానికి ముందే ఆమె దీదీగా ప్రసిద్ధి చెందారు.

అవినీతి దెబ్బ

మమత బెనర్జీ హయాంలో నేతల అవినీతి తృణమూల్‌ను భారీగా దెబ్బతీసింది. దీంతోపాటు నేతల విచ్చలవిడితనం, గర్వం నష్టం కలగజేశాయి.

- తృణమూల్‌ను అతి పెద్ద దెబ్బ.. టీచర్ల నియామక కుంభకోణం ద్వారా తగిలింది. మెరిట్, పారదర్శకత కోరుకునే సగటు బెంగాలీలను ఇది తీవ్ర కలవరపాటుకు గురి చేసింది. లంచాలు తీసుకుని ఉద్యోగాలిచ్చారన్న ఆరోపణలు చివరకు సుప్రీం కోర్టు దాకా చేరాయి.

బాధితుల పక్షాన నిలవకపోవడం

మహిళలపై దాడులు జరిగినప్పుడు వెంటనే స్పందించే మమతా బెనర్జీ ఇటీవలి కాలంలో పట్టించుకోలేదు. బాధితులను పరామర్శించలేదు. రాష్ట్రంలో జరిగిన ప్రతి సంఘటనా తృణమూల్‌ను ఇబ్బంది పెట్టింది.

- కోల్‌కతాలోని ఆర్‌జీ కర్ ఆసుపత్రిలో జూనియర్ డాక్టర్‌పై హత్యాచారం జరిగితే వెంటనే చర్యలు చేపట్టలేదు. ఈ ఘటన దేశవ్యాప్తంగా నిరసనలకు దారితీసింది. అయినా తృణమూల్ నుంచి పెద్దగా స్పందన లేదు. ఒకప్పుడు చిన్న ఘటన జరిగినా అక్కడ వాలే దీదీ.. ఈ ఘటనను తీవ్రంగా తీసుకోలేదు.

2011	**మార్పు కోసం:** 34 ఏళ్ల లెఫ్ట్ పాలనకు మమత చరమగీతం
2016	**కొనసాగిద్దాం:** మరోసారి అవకాశం ఇద్దాం. తృణమూల్‌ను బలోపేతం చేద్దాం.
2021	**కాపాడదాం:** మమత ప్రభుత్వాన్ని కాపాడదాం. గట్టిగా అండగా నిలుద్దాం.
2026	**తర్వాతేంటి:** ప్రభుత్వ వ్యతిరేకత. మమత సరే తర్వాతేంటి? మార్పునకు ఓటేద్దాం.

టీఎంసీ ఓట్ల వాటా	2016	2021	2026
	45%	48%	40%

సర్‌తో షాక్

- తృణమూల్ కీలక ముస్లిం ఓటు బ్యాంకును సర్ దెబ్బతీసింది. భవానీపుర్‌లో 93శాతం రక్షణను మమత కోల్పోయారు.
- అక్రమ వలసదారులకు తృణమూల్ అండగా నిలుస్తోందన్న ఆరోపణలకు బలం చేకూర్చింది.
- బంగ్లాదేశ్ వలసదారులకు మమత మద్దతుగా నిలుస్తున్నారన్న ఆందోళనతో హిందూ ఓట్లు ఏకీకృతమయ్యాయి.
- ఓట్లను తొలగిస్తారన్న భయంతో ఓటేయడానికి అందరూ తరలివచ్చారు. ఇది భాజపాకే ఎక్కువ లాభించింది.
- కేంద్ర బలగాలు, ఈవీఎంలపై నిఘా కారణంగా ఓటర్లు నిర్భయంగా ఓటేయడం.





భాజపా జయకేతనం అనంతరం కోల్‌కతాలో బాణసంచా కాలుస్తూ ఆ పార్టీ శ్రేణుల సంబరాలు

నాడు నమ్మినబంటు... నేడు ఓడించాడు

రాజకీయాలు.. సువేందుకు వెన్నతో పెట్టిన విద్య! తండ్రి రాజకీయ నాయకుడే కావడంతో చిన్నప్పటి నుంచీ వాటిని బాగా వంటబట్టించుకున్నారు. ప్రఖ్యాత సింగూరు, నందిగ్రామ్ ఉద్యమాల్లో క్రియాశీలకంగా వ్యవహరించి తృణమూల్‌ను క్షేత్రస్థాయిలో ప్రజలకు చేరువ చేశారు. మమతా బెనర్జీకి అత్యంత సన్నిహితుల్లో ఒకరిగా ఎదిగారు. ఆరేళ్ల కిందట అనూహ్యంగా తృణమూల్‌ను వీడిన ఆయన.. ఇప్పుడు బెంగాల్‌లో తొలిసారి భాజపాను గద్దెనెక్కించడంలో సఫలీకృతమయ్యారు.



కౌన్సిలర్ స్థాయి నుంచి..

సువేందు 1970 డిసెంబరు 15న తూర్పు మేదినీపుర్‌లోని కర్కులీలో జన్మించారు. ఎంఏ చదివారు. ఆయనది రాజకీయ నేపథ్యమున్న కుటుంబం. తండ్రి సిసిర్ అధికారి ఎమ్మెల్యేగా, ఎంపీగా పనిచేశారు. యూపీఏ హయాంలో కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయమంత్రిగానూ ఉన్నారు.

- సువేందు 1995లో తొలిసారి కాంగ్రెస్ నుంచి కౌన్సిలర్‌గా గెలిచారు. 1998లో తండ్రితో కలిసి టీఎంసీలో చేరారు.
- సువేందు 2006-09 మధ్య రాజకీయాల్లో బాగా ఎదిగారు. 2006లో తొలిసారి కొంటాయీ (దక్షిణ) నియోజకవర్గ ఎమ్మెల్యేగా గెలిచారు. అదే ఏడాది కొంటాయీ మున్సిపాలిటీ ఛైర్‌పర్సన్‌గానూ బాధ్యతలు చేపట్టి.. మూడేళ్లు ఆ పదవిలో కొనసాగారు.

నందిగ్రామ్ ఉద్యమంతో..

సువేందు రాజకీయ జీవితంలో 2007 నాటి నందిగ్రామ్ ఉద్యమానిది ప్రత్యేక పాత్ర. నందిగ్రామ్‌లో 10 వేల ఎకరాలు సమీకరించి సెజ్‌ను ఏర్పాటు చేయాలని రాష్ట్రంలోని అప్పటి వామపక్ష ప్రభుత్వం భావించింది. దానికి వ్యతిరేకంగా తృణమూల్ పెద్ద ఎత్తున ఆందోళనలు చేపట్టింది. వాటిని సువేందు ముందుండి నడిపించారు.

- నందిగ్రామ్ ఉద్యమం విజయవంతం కావడంతో.. జంగల్ మహల్ (పశ్చిమ మేదినీపుర్, పురులియా, బాంకురా జిల్లాలు) ప్రాంతానికి తృణమూల్ ఇంఛార్జిగా సువేందును మమత నియమించింది. ఈ మూడు జిల్లాల్లో పార్టీని ఆయన వేగంగా విస్తరించారు. మమతకు అత్యంత సన్నిహిత నేతల్లో ఒకరిగా ఎదిగారు.
- సువేందు 2009లో తమ్లుక్ స్థానం లోక్‌సభ ఎంపీగా గెలిచి జాతీయ రాజకీయాల్లోకి ప్రవేశించారు. 2016లో నందిగ్రామ్ ఎమ్మెల్యేగా విజయం సాధించి.. మమత సర్కారులో మంత్రి పదవి చేపట్టారు.

తృణమూల్ గూటిని వీడి..

తృణమూల్ వ్యవస్థాపక సభ్యుడైన ముకుల్ రాయ్ 2017లో పార్టీని వీడారు. అప్పటి నుంచి తృణమూల్‌లో సువేందు ప్రభావం మరింత పెరిగింది. పార్టీలో మమత తర్వాత నంబర్-2 ఈయనేనని అంతా అనుకున్నారు. అయితే క్రమంగా పరిస్థితులు మారిపోయాయి. మమత తన మేనల్లుడు అభిషేక్ బెనర్జీకి పార్టీలో అధిక ప్రాధాన్యమివ్వడం, ఆయనకే పార్టీ పగ్గాలు అప్పగించేలా కనిపించడం సువేందుకు రుచించలేదు. అప్పటికే శారదా కుంభకోణంలో తనపై ఆరోపణలు రావడంతో కొంత ఉక్కిరిబిక్కిరయ్యారు. దీంతో 2020 చివర్లో అనూహ్యంగా తృణమూల్‌ను వీడి భాజపాలో చేరారు.

మమతను మట్టికరిపించి..

సువేందు చేరికతో బెంగాల్ భాజపాలో బాగా జోష్ వచ్చింది. 2021 అసెంబ్లీ ఎన్నికల్లో తృణమూల్‌తో హోరాహోరీగా పోరాడింది. నందిగ్రామ్‌లో సువేందు, మమత ముఖాముఖీ తలపడ్డారు. ఆ పోరులో తన మాజీ బాస్‌ను సువేందు ఓడించారు. అసెంబ్లీలో ప్రతిపక్ష నేతగా బాధ్యతలు చేపట్టారు. ఈ ఎన్నికల్లో భవానీపుర్‌లో ఆమెను ఓడించారు.

- సువేందుకు క్రీడలంటే ఇష్టం. ప్రత్యేకంగా క్రికెట్, ఫుట్‌బాల్ అంటే చాలా మక్కువ. జిల్లా, సబ్‌డివిజన్ స్థాయి ఫుట్‌బాల్ సంఘాల్లో క్రియాశీలకంగా పనిచేశారు.
- సువేందు సోదరుడు దిబ్యేందు అధికారి తృణమూల్ తరఫున గతంలో ఎమ్మెల్యేగా, ఎంపీగా ఎన్నికయ్యారు. ఆయన 2024లో భాజపాలో చేరారు.

- నేషనల్ డెస్క్

బెంగాల్ పీఠంపై సువేందునా? కొత్త నేతా?

ఈనాడు, దిల్లీ: పశ్చిమబెంగాల్‌లో చరిత్రాత్మక విజయం సాధించిన భాజపా... ఇప్పుడు ముఖ్యమంత్రి పీఠంపై ఎవరిని కూర్చోపెట్టబోతోంది? ఆ రాష్ట్రంలో పార్టీ ముఖచిత్రంగా ఉన్న సువేందు అధికారికే ఆ అవకాశం ఇస్తుందా? లేదంటే వివిధ రాష్ట్రాల్లో కొత్త వారిని తెరపైకి తెచ్చినట్లు అక్కడా ప్రయోగం చేయబోతుందా? అనేవి ప్రస్తుతం ఆసక్తికరంగా మారాయి. సీఎం పదవి కోసం పార్టీ నుంచి దిలీప్ ఘోష్, మహిళా నాయకురాలు అగ్నిమిత్రపాల్, స్వపన్‌దాస్ గుప్తా, సుకాంత మజుందార్, సమిక్ భట్టాచార్య వంటి వారి పేర్లూ వినిపిస్తున్నాయి. ఇందులో కొందరిని ఉప ముఖ్యమంత్రి పదవికోసమైనా పరిగణనలోకి తీసుకోవచ్చన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ప్రస్తుత ఎన్నికల్లోనూ మమతాబెనర్జీని ఓడించి సువేందు చరిత్ర సృష్టించారు. ఈ క్రమంలో ఆయనే సీఎం రేసులో ముందుంటారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

అమిత్ షాకు ఆ ఐదుగురు తోడై..

బెంగాల్‌లో భాజపాకు చరిత్రాత్మక విజయం అంత సులభంగా ఏమీ దక్కలేదు. పార్టీలో అపర చాణక్యుడిగా పేరొందిన కేంద్ర హోం మంత్రి అమిత్ షాతో పాటు మరో ఐదుగురు కేంద్ర స్థాయి నేతలు ఈ గెలుపులో కీలక పాత్ర పోషించారు.

అమిత్ షా: 14 రోజులు మకాం

అమిత్ షా వ్యూహరచన సామర్థ్యం గురించి కొత్తగా చెప్పుకోవాల్సిన పని లేదు. బెంగాల్‌లో ఈసారి తమ ప్రభుత్వాన్ని కచ్చితంగా ఏర్పాటు చేయాలన్న దృఢ సంకల్పంతో ఆయన కనిపించారు. 14 రోజులు రాష్ట్రంలో మకాం వేసి.. పార్టీ నాయకులకు దిశానిర్దేశం చేశారు. పగలంతా ర్యాలీలు, రోడ్‌షోలతో.. రాత్రుళ్లు బాగా పొద్దుపోయే దాకా కాషాయ నేతలతో సమావేశాలతో తీరిక లేకుండా గడిపారు. రాష్ట్రంలో తాము అధికారంలోకి వస్తే.. 7వ వేతన సవరణ సంఘం సిఫార్సులను అమలు చేస్తామని ప్రభుత్వ ఉద్యోగులకు ప్రచారంలో షా హామీ ఇచ్చారు. చొరబాట్లను అడ్డుకుంటామని పదేపదే నొక్కిచెప్పారు.

ధర్మేంద్ర ప్రధాన్: ప్రచార వ్యూహకర్త

బెంగాల్‌లో భాజపా ప్రచార కార్యకలాపాల ప్రధాన వ్యూహకర్త.. కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్. వివిధ సామాజిక వర్గాలను పార్టీ వైపు ఆకర్షించడంలో కీలకంగా వ్యవహరించారు. భాజపా కేంద్ర, రాష్ట్ర నాయకత్వం మధ్య వారధిలా పనిచేశారు.

భూపేందర్ యాదవ్: క్షేత్ర స్థాయిలో..

రాష్ట్రంలో క్షేత్రస్థాయిలో పార్టీ కార్యకలాపాలను కేంద్ర మంత్రి భూపేందర్ యాదవ్ పర్యవేక్షించారు. బూత్ స్థాయిలో కార్యకర్తలు క్రియాశీలకంగా పనిచేసేలా చూశారు. ఎన్నికల ప్రక్రియకు సంబంధించి వారికి అవగాహన కల్పించారు.

సునీల్ బన్సల్: బూత్ స్థాయి సమన్వయకర్తలతో..

రాష్ట్రంలో పార్టీ కోసం శక్తిమంతమైన 'పన్నా ప్రముఖ్ (బూత్ స్థాయి సమన్వయకర్తలు)' సైన్యాన్ని భాజపా జాతీయ ప్రధాన కార్యదర్శి సునీల్ బన్సల్ తయారుచేశారు. తృణమూల్‌ను సమర్థంగా ఢీకొట్టేలా తమ పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేశారు. కమలదళ శ్రేణులు క్రమశిక్షణతో పనిచేసేలా చూశారు.

బిప్లవ్ దేవ్: దూకుడు పెంచి..

ఈయన త్రిపుర మాజీ సీఎం. బెంగాల్‌లో తమ రాష్ట్రం తరహా సాంస్కృతిక, భాషా పరిస్థితులు ఉన్న ప్రాంతాలపై ప్రత్యేకంగా దృష్టిపెట్టారు. క్షేత్రస్థాయిలో పార్టీ కార్యకర్తలను సమీకరించి, దూకుడుగా ప్రచారంలో పాల్గొనేలా ప్రోత్సహించారు.

మాలవీయ: డిజిటల్ ప్రచారంతో..

భాజపా ఐటీ విభాగం అధిపతి ఈయన. రాష్ట్రంలో డిజిటల్ వేదికగా పార్టీ ప్రచార బాధ్యతలను స్వయంగా పర్యవేక్షించారు.

భాజపా గెలిచిందిలా..

- హిందూ ఓట్ల ఏకీకరణ.
- నాలుగు పార్టీల మధ్య ముస్లిం ఓట్లలో చీలిక.
- మహిళల భద్రతపై తీవ్ర ప్రభావం చూపిన ఆర్‌జీ కర్ ఘటన.
- సందేశ్‌ఖాలీలో బాధితులంతా స్థానిక నేతలుగా మారి భాజపా తరఫున ప్రచారం.
- ఎస్ఎస్‌సీ కుంభకోణం. తాము మోసపోయామని లక్షల మంది యువత గుర్తించడం.
- 15 ఏళ్ల తృణమూల్ పాలనా వైఫల్యాలు. అవినీతి, నిరుద్యోగం, పాలనలో లోపాలు.
- ప్రభుత్వ వ్యతిరేకత తీవ్రంగా ఉండటంతో భారీగా జరిగిన పోలింగ్.
- ఉత్తర బెంగాల్ కాషాయీకరణ. రాజ్‌వంశీ, గూర్ఖా, ఆదివాసీల మద్దతు.
- పట్టణ మధ్య తరగతిలో మద్దతు.
- ప్రధాని మోదీ ప్రజాదరణ. కేంద్ర సంస్థల చర్యలు.

తృణమూల్ ఓటమిలా..

- మైనారిటీలను బుజ్జగించే క్రమంలో హిందువులను దూరం చేసుకోవడం.
- భవానీపుర్‌లో మమత ప్రాభవం కోల్పోవడం.
- సిండికేట్ రాజ్. అక్రమ వసూళ్లు, కట్ మనీ సంస్కృతితో ప్రజల జీవనంపై ప్రభావం.
- ప్రభుత్వ టీచర్ల నియామకాల్లో అక్రమాలు. యువతలో ఆగ్రహం.
- లక్ష్మీ భాండార్ ప్రభావాన్ని ఆర్‌జీ కర్, సందేశ్‌ఖాలీ ఘటనలు తుడిచిపెట్టేయడం.
- ఆర్‌జీకర్ ఆసుపత్రి ఘటన. జూనియర్ డాక్టర్ హత్యాచారంపై ప్రభుత్వ పేలవ స్పందన.
- క్యాడర్ అక్రమాలు. వారిలో గ్రూపులు, నేరాలకు పాల్పడటం, హింసతో పార్టీకి నష్టం కలగడం.
- పారిశ్రామికాభివృద్ధి కుంటుపడటం, ఆర్థికంగా బలహీనపడటం, యువత వలసపోవడం.
- సందేశ్‌ఖాలీలో స్థానిక తృణమూల్ నేతల నుంచి మహిళలకు రక్షణ కల్పించకపోగా వారికే మద్దతివ్వడం.
- లెఫ్ట్ హయాంలోని దారుణాలే మళ్లీ చోటుచేసుకోవడం.

(c) eenadu



మొత్తం సీట్లు	టీవీకే	డీఎంకే+ (డీఎంకే 59, కాంగ్రెస్ 5, ఐయూఎంఎల్ 2, సీపీఐ 2, సీపీఎం 2, వీసీకే 2, డీఎండీకే 1)	అన్నాడీఎంకే+ (అన్నాడీఎంకే 47, పీఎంకే 4, భాజపా 1, ఏఎంఎంకే 1)
234	108	73	53



- తమిళనాట అతిపెద్ద పార్టీగా టీవీకే
- రికార్డు విజయం నమోదు చేసిన విజయ్
- 59 సీట్లకు పరిమితమైన డీఎంకే
- మూడో స్థానంలో అన్నాడీఎంకే
- ముఖ్యమంత్రి స్టాలిన్ పరాజయం

తమిళ ఓటర్లు కొంత అస్పష్టమైన తీర్పు ఇచ్చినా.. టీవీకే అధినేత విజయ్ మాత్రం తన విజిల్ మోత గట్టిగానే మోగించారు. ఒంటరిగా బరిలోకి దిగిన టీవీకే.. మొత్తం 234 స్థానాలకు గాను 108 చోట్ల విజయం సాధించి అతిపెద్ద పార్టీగా నిలిచింది. ప్రభుత్వ ఏర్పాటుకు కావాల్సిన 118 సీట్లకు 10 స్థానాల దూరంలో ఆగింది. రెండేళ్ల క్రితం ఏర్పడిన టీవీకే.. తన తొలి ఎన్నికల్లోనే చరిత్ర సృష్టించేంత విజయాన్ని మూటగట్టుకుంది. డీఎంకే, అన్నాడీఎంకే కూటముల్లో మహామహుల్ని సైతం ఓడించింది. ఓడిన ప్రముఖుల్లో సీఎం స్టాలిన్, మరో 16 మంది మంత్రులు సైతం ఉన్నారు. మరెందరో ఇతర దిగ్గజ నాయకులూ ఓటమిపాలయ్యారు. ఈ విజయపరంపరలో టీవీకే అధినేత విజయ్ తాను పోటీచేసిన పెరంబూర్, తిరుచ్చి ఈస్ట్ స్థానాల్లో విజయఢంకా మోగించారు. పార్టీలో కీలకంగా ఉన్న హైలెవెల్ అడ్మినిస్ట్రేటివ్ కమిటీ ప్రధాన సమన్వయకర్త సెంగోట్టైయన్ గోబిచెట్టిపాళయంలో విజయం సాధించారు. తమిళనాడులోని 234 అసెంబ్లీ స్థానాలకు 4023 మంది అభ్యర్థులు పోటీపడ్డారు. ప్రధానంగా డీఎంకే, అన్నాడీఎంకే కూటములు పరాజయం పాలయ్యాయి. డీఎంకే కూటమి 73 సీట్లతో రెండో స్థానంతో సరిపెట్టుకోగా, అన్నాడీఎంకే 53 సీట్లతో మూడో స్థానానికి దిగజారింది.

విజిల్ విజృంభణ!



తమిళనాడులో ప్రతిధ్వనించిన
విజిల్ ఆషామాషీగా మోగలేదు..
ప్రత్యర్థుల విమర్శనాస్త్రాలు... ఇరుకున పెట్టే వివాదాలు...
అడుగు బయటపెట్టనివ్వని వ్యూహాలు...
అనేక జిల్లాల్లో ప్రచారం కూడా చేసుకోలేని పరిస్థితులు.
అయినా... అన్ని అవమానాలనూ దిగమింగి...
ఒడుదొడుకులను అధిగమించి...
సరికొత్త ప్రచార పద్ధతులతో విజయ్ వేసిన
ఈల చరిత్ర సృష్టించింది.
తమిళనాట పాంచజన్యమై మోగింది.

ఈనాడు-చెన్నై: టీవీకే అధినేత విజయ్ అంటే కష్టాలకు చిరునామా అన్నట్లుగా ఉండేది పరిస్థితి. ఆయన చుట్టూ కేసులు, ఆంక్షలు తప్ప ఏమీ కనిపించలేదు. గతేడాది సెప్టెంబరులో కరూర్ టీవీకే రోడ్‌షోలో తొక్కిసలాట జరిగి 41 మంది ప్రాణాలు కోల్పోయారు. అప్పట్లో ఆయన రాజకీయ జీవితం ఒక్కసారిగా అంధకారంలోకి వెళ్లింది. ఆ తర్వాత పార్టీ బహిరంగ సమావేశాలకు పోలీసులు అనుమతులు ఇవ్వలేదు. రకరకాల ఆంక్షలు పెట్టారు. దీంతో పలు సమావేశాలు వాయిదా వేసుకోవడం, కొద్దిమందికే సమావేశాల్లో అవకాశం ఇవ్వడం లాంటివి చేశారు. మార్చి 30న పెరంబూర్‌లో నామినేషన్‌వేసి అక్కడినుంచే ప్రచారం మొదలుపెట్టిన విజయ్‌కి పోలీసులు అడ్డుపడ్డారు. అదేరోజు సీఎం స్టాలిన్ నియోజకవర్గమైన కొళత్తూర్‌లో ప్రచారాన్ని విజయ్ అర్ధంతరంగా ముగించారు. విల్లివాక్కం ప్రచారాన్ని రద్దు చేసుకున్నారు. ఎన్నికల కమిషన్‌ను ఆశ్రయించాల్సి వచ్చింది. ఈ ఏడాది జనవరిలో విడుదల కావాల్సిన జననాయగన్ సినిమా ఆగిపోయింది. చివరకు టీవీకే జెండా కూడా వివాదమైంది. తమ జెండాను వాడుకున్నారంటూ ఓ సంఘం నేతలు కోర్టును ఆశ్రయించారు. ఎన్నికలకు ముందు భార్యతో విడాకుల సమస్య వచ్చిపడింది. వాటన్నింటినీ విజయ్ ఎదుర్కొని.. ఈలను గట్టిగా మోగించారు.


కొత్త వారితో ప్రజల ముందుకు

విజయ్ పార్టీ పెట్టాక కొన్ని పార్టీలతో పొత్తుకు ప్రయత్నించారు. డీఎంకే కూటమిలోని కాంగ్రెస్, వీసీకే, ఇతర కొన్ని పార్టీలు మొదట్లో మొగ్గుచూపాయి. అన్నాడీఎంకే నుంచి వేరుపడిన ప్రముఖులు, కొత్తపార్టీలు సైతం తొలుత విజయ్‌కు అనుకూలంగా మాట్లాడాయి. కానీ కేసులు చూసి ఆగిపోయారు. దీంతో ఆయన తప్పనిసరై ఒంటరిగానే బరిలోకి దిగాల్సి వచ్చింది. విజయ్ ప్రకటించిన 234 మంది అభ్యర్థుల్లో 10-12 మందే జనానికి తెలుసు. మిగిలినవారంతా కొత్తవారే. 'ప్రతి నియోజకవర్గంలో మీ విజయ్ ఉన్నాడనే ఓటు వేయండి' అని కోరారు.

సమయం తగినంత లేకపోవడంతో అన్ని నియోజకవర్గాల్లో ప్రచారం చేయలేకపోయారు. కానీ తన గ్లామర్‌తో సందేశాన్ని జనాలకు బలంగా చేర్చారు. ఇందుకు సామాజిక మాధ్యమాల్ని, యువతను ఆయుధంగా మలచుకున్నారు. సభలు ఏర్పాటుచేసిన చోట్ల భారీఎత్తున జనసమీకరణ జరిగింది. ప్రచారంలో ఆయన డైలాగులు బాగా పేలాయి. 'నేను మీ విజయ్‌ని.. వస్తున్నా' 'వేచి ఉండండి.. చారిత్రక విజయం తిరిగి రానుంది', 'మీరుంటేనే నేను, లేకపోతే నేను లేను' లాంటి డైలాగులతో ఆకట్టుకునేవారు. ప్రజల్ని గుండెల్లో పెట్టుకుని చూసుకుంటానని చెప్పేవారు.

కపిల్, ఆరోగ్యస్వామి తోడుగా...

విజయ్ 2024లో రాజకీయ అరంగేట్రం చేశారు. 2026 శాసనసభ ఎన్నికలే తన లక్ష్యమని స్పష్టంచేశారు. అందుకు అనుగుణంగా పార్టీని బలోపేతం చేశారు. సభ్యత్వ నమోదు కోసం వెబ్‌సైట్, యాప్‌లను అందుబాటులోకి తీసుకొచ్చారు. కొన్ని గంటల్లోనే లక్షలమంది సభ్యులయ్యారు. ప్రత్యేక బృందాన్ని ఏర్పాటుచేసుకుని, వారి సూచనలతోనే ఆరోపణలు, విమర్శలను, అవరోధాలను అధిగమిస్తూ ముందుకు సాగారు. ఆ టీమ్ సారథి ఐ ప్యాక్‌లో కీలకపాత్ర పోషించిన కపిల్‌సాహు కావడం గమనార్హం. ఆయన ఈ ఎన్నికల్లో విజయ్ ప్రతి అడుగునూ వ్యూహాత్మకంగా డిజైన్ చేశారు. గతంలో జయలలిత రెండు స్థానాల్లో పోటీచేయగా, విజయ్ ఆ ఒరవడిని కొనసాగించారు. విజయ్ ఎన్నికల వ్యూహరచనలో జాన్ ఆరోగ్యసామి కూడా కీలకపాత్ర పోషించారు. డీఎంకే, అన్నాడీఎంకేలపై ప్రజలు తీవ్ర అసంతృప్తితో ఉన్న నియోజకవర్గాలను గుర్తించి వాటిపై ప్రత్యేకదృష్టి సారించారు. 'మార్పు' నినాదంతో యువతను ఏకతాటిపైకి తీసుకురావడంలో సఫలీకృతులయ్యారు. అధికారపార్టీ లోపాలను ఆధారాలతో డిజిటల్ ప్లాట్‌ఫారాలపై ప్రచారం చేశారు.



49 ఏళ్ల తర్వాత...

తమిళనాట ఒక నటుడు పార్టీ పెట్టి ముఖ్యమంత్రి కావడం 1977లో తొలిసారి. అప్పట్లో ఎంజీ రామచంద్రన్ ఆ చరిత్ర సృష్టించారు. 1987లో మరణించే వరకూ దశాబ్దం పాటు ఆయనే సీఎంగా ఉన్నారు. 49 ఏళ్ల తర్వాత ఇప్పుడు విజయ్ అదే మ్యాజిక్ పునరావృతం చేశారు. జయలలిత కూడా సినీనటి అయినా.. ఆమె ఎంజీఆర్ వారసురాలిగానే సీఎం అయ్యారు. సొంతంగా పార్టీ పెట్టలేదు.

విజయ్‌తో కలిసేదెవరు?

ఈనాడు, చెన్నై: తమిళనాడులో విజిల్ మోత మోగించిన విజయ్ పార్టీ టీవీకే.. ప్రభుత్వం ఏర్పాటుకు అవసరమైన మ్యాజిక్ ఫిగర్ 118 సీట్లను సాధించలేకపోయింది. 108 స్థానాలతో అతిపెద్ద పార్టీగా అవతరించింది. ప్రభుత్వం ఏర్పాటు చేయాలంటే.. మరో 10 మంది ఎమ్మెల్యేల మద్దతు తప్పనిసరి. ఆ 10 మంది ఎవరు? ఏ కూటమి నుంచి వస్తారు? అనేది పెద్ద ప్రశ్నగా మిగిలింది. భాజపా, డీఎంకేలను విజయ్ సూటిగా విమర్శించారు. మరిప్పుడు ఈ రెండు పార్టీల్లో ఒకదాని సాయం కోరుతారా? ఈ రెండూ కాకుండా ఇతర పార్టీల సాయం తీసుకుంటారా..! అనేది ఉత్కంఠగా మారింది.

కాంగ్రెస్ నుంచి సానుకూల స్పందన

డీఎంకే కూటమిలోని కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు టీవీకే వైపు మొగ్గుచూపుతున్నట్లు కనిపిస్తోంది. ఫలితాలు వెలువడ్డాక కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ నేరుగా విజయ్‌కి ఫోన్‌చేసి 15 నిమిషాలు మాట్లాడారు. తర్వాత ఆయన డీఎంకే అధినేత స్టాలిన్‌తోనూ మాట్లాడారు. అనంతరం ఏఐసీసీ తమిళనాడు ఇన్‌ఛార్జి గిరీష్ చోడంకర్ కీలక వ్యాఖ్యలు చేశారు. విజయ్‌కి మద్దతిచ్చే విషయమై ఎదురుచూస్తున్నట్లు స్పందిస్తూ.. తమిళనాడులో యువత ఆకాంక్షల్ని కాంగ్రెస్ అధిష్ఠానానికి విన్నవించామని, వారి మార్గనిర్దేశం మేరకు అడుగులు వేస్తామన్నారు.

చిన్న పార్టీలవైపు చూపు


టీవీకే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలంటే 10 సీట్లు అవసరం. భాజపా, అన్నాడీఎంకే, డీఎంకే కాకుండా ఇతర చిన్న పార్టీలూ విజయ్‌తో కలిసేందుకు గతంలో ఉత్సాహం చూపించాయి. అలాంటి పార్టీల్లో డీఎంకే కూటమి నుంచి వీసీకే 2, సీపీఐ 2, సీపీఎం 2, డీఎండీకే 1 సీట్లు సాధించాయి. ఇవికాకుండా ఎన్డీయే కూటమిలో పీఎంకే 4, ఏఎంఎంకే 1 స్థానంలో గెలిచాయి.. మరి వీరి సాయం టీవీకే తీసుకుంటుందా అనేది తేలాల్సి ఉంది.

ప్రధాని అభినందనలు

ప్రధాని మోదీ ఎక్స్‌లో స్పందించారు. ఎన్డీయేకు మద్దతు తెలిపిన ప్రజలకు ధన్యవాదాలు చెబుతూనే.. విజయ్ విజయాన్ని అభినందించారు. తమిళుల సంక్షేమాన్ని ముందుకు తీసుకెళ్లడంలో కేంద్రం ముందుంటుందని తెలిపారు. మరోవైపు టీవీకేని ఎన్డీయేలో కలుపుకోవాలని తమిళనాడు భాజపా యంత్రాంగం పలుమార్లు వ్యాఖ్యలు చేసింది. ఈ నేపథ్యంలో భాజపా, అన్నాడీఎంకే, ఇతర కూటమి పార్టీల నుంచి ఏదైనా ప్రతిపాదన ఉంటుందా అనేదీ ఇప్పుడు ఆసక్తి నెలకొంది. ప్రభుత్వం ఏర్పాటుకు ఎవరి సాయం తీసుకోవాలనేదానిపై టీవీకే నుంచి ఎలాంటి ప్రకటనా ఇంతవరకు రాలేదు.

పుదుచ్చేరి... మళ్లీ ఎన్డీయే ఖాతాలోకి

- ఐదోసారి ముఖ్యమంత్రిగా రంగసామి
- 3 స్థానాలతో ఖాతా తెరిచిన టీవీకే కూటమి



ఎవరికెన్ని స్థానాలు..
ఏఐఎన్ఆర్ కాంగ్రెస్+ : 18
(ఏఐఎన్ఆర్ కాంగ్రెస్ 12, భాజపా 4, అన్నాడీఎంకే 1, ఎల్‌జేకే 1)
కాంగ్రెస్+ : 6
(డీఎంకే 5, కాంగ్రెస్ 1)
టీవీకే+ : 3
(టీవీకే 2, ఎస్ఎంకే 1)
స్వతంత్రులు : 3

పుదుచ్చేరి, ఈనాడు - చెన్నై: కేంద్ర పాలిత ప్రాంతం పుదుచ్చేరిలో ఎన్డీయే వరుసగా రెండోసారి అధికార పీఠాన్ని చేజిక్కించుకుంది. ఎగ్జిట్ పోల్స్ అంచనాలకు తగ్గట్టుగానే ఎన్డీయే కూటమిలోని ఆలిండియా ఎన్ఆర్ కాంగ్రెస్(ఏఐఎన్ఆర్‌సీ) విజయకేతనం ఎగురవేసింది. మొత్తం 30 అసెంబ్లీ స్థానాల్లో మ్యాజిక్ ఫిగర్‌ను దక్కించుకుంది. కాంగ్రెస్, డీఎంకే కూటమి రెండో స్థానానికే పరిమితమైంది. ఎన్డీయే కూటమిలోని ఏఐఎన్ఆర్‌సీ, భాజపా, అన్నాడీఎంకే, ఎల్‌జేకే పార్టీల మధ్య ఎలాంటి విభేదాలు లేకుండా సమన్వయంతో జరిగిన సీట్ల పంపిణీ విజయాన్ని మరింత సులభతరం చేసింది. నీటి ఏటీఎంలు, అటల్ క్యాంటీన్లు, మహిళలకు 2 ఉచిత ఎల్‌పీజీ సిలిండర్లు, బాలికలకు ఈ-స్కూటర్లు, స్థానికులకు ఉద్యోగ రిజర్వేషన్ల వంటి ఈ కూటమి హామీలు సైతం ఓటర్లను ఆకట్టుకున్నాయి. అలాగే ప్రభుత్వం నుంచి ఎలాంటి సాయం పొందని గృహిణులకు ఇచ్చే ఆర్థికసాయం రూ.1,000 నుంచి రూ.2,500కు పెంచుతామని చెప్పడం, మత్స్యకారుల చిరకాల డిమాండుకు అనుగుణంగా వెనుకబడిన జాబితాలో చేరుస్తామని ప్రకటించడం ఓటర్లను ఆకర్షించాయి. సీఎం రంగసామి నాయకత్వం, ఆయనకున్న క్లీన్ ఇమేజి కూడా కీలకపాత్ర పోషించాయి. ఈ విజయంతో ఆయన ఐదోసారి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టనున్నారు. ఇండియా కూటమిలోని విభేదాలు కాంగ్రెస్ - డీఎంకేలకు ప్రతికూలంగా మారి మరోసారి నిరాశ తప్పలేదు. పుదుచ్చేరిలో ఇన్నాళ్లు కాంగ్రెస్‌కు పెద్దదిక్కుగా ఉన్న వి.నారాయణస్వామి ఈ ఎన్నికల్లో పోటీ చేయకపోవడం ఆ పార్టీకి భారీ ఎదురుదెబ్బ అని చెప్పాలి. అలాగే విజయ్‌కు చెందిన టీవీకే పోటీ ప్రభుత్వ వ్యతిరేక ఓటును చీల్చింది. పుదుచ్చేరి ఎన్నికల్లో తొలిసారిగా పోటీకి దిగిన టీవీకే కూటమి 3 స్థానాల్ని దక్కించుకుంది. యానాం నియోజకవర్గ ఎన్డీయే అభ్యర్థిగా ఆలిండియా ఎన్నార్ కాంగ్రెస్ నేత మల్లాడి కృష్ణారావు నెగ్గారు.

పుదుచ్చేరి ముఖ్యమంత్రి, ఆలిండియా ఎన్నార్ కాంగ్రెస్ అధినేత ఎన్.రంగసామి తాజా అసెంబ్లీ ఎన్నికల్లో తాను పోటీ చేసిన రెండు స్థానాల్లోనూ విజయఢంకా మోగించారు. తట్టంచావడిలో 4,441 ఓట్ల మెజారిటీతో రంగస్వామి గెలవగా.. కాంగ్రెస్ అభ్యర్థి, మాజీ ముఖ్యమంత్రి వి.వైద్యలింగం 4వ స్థానంలో నిలిచారు. మంగళం నియోజకవర్గంలో 7,050 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు.

దూసుకొచ్చిన... జననాయగన్!



చెన్నై, న్యూస్‌టుడే: తమిళనాట రాజకీయాలకు, సినీ రంగానికి విడదీయరాని అనుబంధం ఉంది. కరుణానిధి, ఎంజీఆర్, జయలలిత లాంటి రాజకీయ ఉద్దండులు సినీరంగం నుంచి వచ్చినవారే. ఈ ఎన్నికల్లో డీఎంకే, అన్నాడీఎంకేలను కంగుతినిపించి తమిళ రాజకీయ చరిత్రను టీవీకే అధ్యక్షుడు విజయ్ తిరగరాశారు. టీవీకేను ఏర్పాటుచేసిన మూడేళ్లలో తమిళనాడు రాజకీయాలను శాసించే స్థాయికి చేరిన విజయ్ ప్రస్థానం..

మితభాషి..

విజయ్ జోసెఫ్ 1974 జూన్ 24న జన్మించారు. ఆయన తండ్రి ఎస్.ఎ.చంద్రశేఖర్ సినీ దర్శకుడు, నిర్మాత. తల్లి శోభ సినీ గాయని. చిన్నప్పుడు చలాకీగా ఉండే విజయ్.. తన చెల్లెలు విద్య మరణంతో ముభావిగా మారారు. కుమారుడిని బయటకు తీసుకురావాలని.. బాలనటుడిగానూ ఎస్.ఎ.చంద్రశేఖర్ అవకాశాలిచ్చారు. విజయ్ వెండితెరపై ఎంత చురుగ్గా, ఎనర్జీతో ఉన్నా.. తెరవెనుక మాత్రం మితభాషిగానే ఉంటారు.

పట్టుపట్టి కథానాయకుడిగా..

పదోతరగతి తర్వాత విజయ్‌కి చదువుపై ఆసక్తి తగ్గి సినిమాపై ఆశ పెరిగింది. డిగ్రీ చదివితేనే హీరోగా అవకాశం ఇస్తానని తండ్రి చెప్పడంతో చెన్నై లయోలా కళాశాలలో విజువల్ కమ్యూనికేషన్ డిగ్రీ పూర్తిచేశారు. 'నాళైయ తీర్పు'లో తొలిసారి కథానాయకుడిగా నటించారు. ఆ సినిమా ఫ్లాప్ కావడంతో రెండు నెలలు బయటకు వెళ్లలేదు. కుమారుడికి బ్రేక్ ఇవ్వాలని భావించి.. విజయ్‌కాంత్ నటించిన 'సెందూర పాండి' చిత్రంలో రెండో కథానాయకుడిగా చంద్రశేఖర్ అవకాశం ఇచ్చారు. అది హిట్ కావడంతో విజయ్‌కు గుర్తింపు లభించింది. 1994లో విడుదలైన 'రసిగన్' ఆయనకు బ్లాక్‌బస్టర్ హిట్ ఇచ్చింది. ఆ సినిమా కోసం విజయ్‌కు ఇచ్చిన 'ఇళయదళపతి' టైటిల్‌ను 'భైరవ'(2017) వరకు ఉపయోగించారు. తర్వాత 'దళపతి'గా మారారు. 1990 చివర్లో, 2000 ప్రారంభంలో సినీరంగాన్ని శాసించే స్థాయికి ఎదిగారు. 'ఖుషీ', 'గిల్లీ' లాంటి చిత్రాలతో సూపర్ హిట్‌లు అందుకున్నారు.

అనూహ్యంగా రాజకీయాల్లోకి

2024 ఫిబ్రవరి 2న తమిళగ వెట్రి కళగం(టీవీకే) పేరిట పార్టీ స్థాపించారు. 16 ఏళ్ల కిందట ఓ ఇంటర్వ్యూలో.. 'ఒక దశను దాటితే సహాయం చేసేందుకు పలువురు ఉండాలి. అభిమానుల సంఘం ఒక దశ వరకే ఉండగలదు. దాన్ని దాటితే అధికారం అవసరం' అని విజయ్ చెప్పడం ద్వారా అప్పట్లోనే రాజకీయ ఆలోచనలు ఉండొచ్చని తెలుస్తోంది.

- శ్రీలంకలో అంతర్యుద్ధం ఉద్ధృత రూపం దాల్చినప్పుడు ఈలం తమిళులకు మద్దతుగా 2008 నవంబరు 16న భారీ నిరసన చేపట్టారు.
- 2009 జులైలో 'విజయ్ మక్కళ్ ఇయక్కం'ను ప్రారంభించారు. ఆ సంస్థ అభ్యర్థులు 2021 అక్టోబరులో జరిగిన పురపాలక ఎన్నికల్లో పోటీచేసి 115 చోట్లకు పైగా గెలిచారు.

ప్రజా నాయకుడిగా...

వెండితెరపై విభిన్న పాత్రలు చేసిన విజయ్.. 2017 తర్వాత సినిమాల్లోనూ ప్రజా నాయకుడిగా కనిపించారు. 'తలైవా', 'సర్కార్' లాంటి సినిమాలు ఆయన రాజకీయాల్లోకి వస్తారనే సంకేతాలను ఇచ్చాయి. ఆయన ఆఖరి చిత్రమంటూ ప్రచారం జరిగిన 'జననాయగన్' టైటిల్ కూడా ప్రజా నాయకుడు అని అర్థాన్నిస్తోంది. ఈ చిత్రం పోస్టర్లలో విజయ్‌ను దివంగత ముఖ్యమంత్రి ఎంజీఆర్‌ను తలపించేలా చూపించడం, 'తిరిగి వెళ్లే ఐడియానే లేదు... ఐయామ్ కమింగ్' లాంటి పొలిటికల్ డైలాగులను పెట్టడం గమనార్హం.

ద్రవిడ పార్టీల శకం ముగిసిందా!

ఈనాడు-చెన్నై: అధికారంలో ఉన్నా, విపక్షంలో ఉన్నా..దాదాపు ఆరు దశాబ్దాలు తమిళనాడులో ఆ రెండు పార్టీలదే హవా. ద్రవిడ ఉద్యమ పార్టీలుగా, సాంఘిక సంస్కరణ సారథులుగా, తమిళ భాష పరిరక్షకులుగా, ఉత్తరభారత ఆధిపత్యాన్ని సవాల్ చేయడంలోనూ డీఎంకే, అన్నాడీఎంకే పార్టీలు ముందు వరుసలో నిలిచాయి. రాష్ట్రంలో అన్నాడీఎంకే 7సార్లు, డీఎంకే 6సార్లు అధికార పగ్గాలు చేపట్టాయి. తృతీయ పక్షానికి అవకాశం ఇవ్వలేదు. తాజా అసెంబ్లీ ఎన్నికల ఫలితాలతో ఈ పరిస్థితి ఒక్కసారిగా మారిపోయింది. సినీనటుడు విజయ్ నేతృత్వంలోని టీవీకే వాయువేగంతో దూసుకొస్తూ గత రికార్డుల్ని చెరిపేసింది.

స్వాతంత్ర్యం వచ్చాక తమిళనాడులో 1952 నుంచి వరుసగా 3 సార్లు కాంగ్రెస్ ప్రభుత్వాలు ఏర్పాటయ్యాయి. డీఎంకే ఆవిర్భావం తర్వాత...1967లో ఆ పార్టీ తొలిసారి అధికారంలోకి వచ్చింది. డీఎంకే బహిష్కరించడంతో అన్నాడీఎంకే ఏర్పాటు చేసిన ఎం.జి.రామచంద్రన్ సంచలన విజయాలు సాధించారు. ఈ రెండు పార్టీల నేతృత్వంలోని కూటముల మధ్యే విజయాలు దోబూచులాడాయి. ఎంజీఆర్, కరుణానిధి, జయలలిత, ఎం.కె.స్టాలిన్ ముఖ్యమంత్రులు అవుతూ వచ్చారు. 1967లో జాతీయ పార్టీల హవా ఎలా ముగిసిందో.. ఇప్పుడు ద్రవిడ పార్టీల పరంపరకు టీవీకే అడ్డుకట్ట వేసింది. విజయ్ 2024లో పార్టీ స్థాపించినా...2026 అసెంబ్లీ ఎన్నికల వరకు పోటీచేయకుండా ఆగారు. డీఎంకే, అన్నాడీఎంకే కూటములకు ప్రత్యామ్నాయం తానేనని ప్రకటించి మరీ సాధించారు.

1977లో ఎంజీఆర్ సారథ్యంలోని అన్నాడీఎంకే సాధించిన 30.4శాతం ఓటుషేర్‌ను విజయ్ నేతృత్వంలోని టీవీకే(34.92%) అధిగమించింది.

తల దించిన స్టాలిన్

ఈనాడు, చెన్నై: ఈనాడు, చెన్నై: ఎన్నికల సమయంలో విజయంపై డీఎంకే శ్రేణుల అతివిశ్వాసం, తామే గెలిచి తీరుతామనే ధీమా ఆ పార్టీ కొంపముంచాయి. వాస్తవానికి ఇతర పార్టీలతో పోల్చితే డీఎంకేకు క్షేత్రస్థాయిలో బలమైన శ్రేణులున్నాయి. బూత్ స్థాయిలో కూడా పటిష్ఠంగా ఉన్నారు. తమ ప్రభుత్వం తెచ్చిన సంక్షేమ పథకాలే గెలిపిస్తాయనే భరోసా ఎక్కువైంది. చివరిదాకా అదే ఆశ కొనసాగింది. పోలింగు రోజు అంతా మారిపోయింది. పోస్టల్ బ్యాలెట్స్ నుంచే ప్రజా వ్యతిరేకత కనిపించింది. అదే గాలి ఇతర రౌండ్లలోనూ కొనసాగింది. తద్వారా ప్రజలు డీఎంకేను సాగనంపడానికి సిద్ధమయ్యారనేది స్పష్టమైంది. 2021లో ఇచ్చిన హామీల్లో చాలావరకు నెరవేర్చలేదనే విషయాన్ని ప్రతిపక్షాలు బలంగా ప్రజల్లోకి తీసుకెళ్లాయి. 80 శాతం పూర్తి చేశామని డీఎంకే చెప్పినా.. ప్రజలు వినిపించుకోలేదు

సొంత నియోజకవర్గంలో ఓడిన ముఖ్యమంత్రి



డీఎంకే అధినేత, ముఖ్యమంత్రి ఎం.కె.స్టాలిన్ తన సొంత నియోజకవర్గం కొళత్తూర్‌లో ఘోర పరాజయం పాలయ్యారు. అదీ ఆ పార్టీకే చెందిన మాజీ ఎమ్మెల్యే చివరి క్షణంలో టీవీకేలో చేరి అక్కడ టికెట్ సాధించి మరీ.. స్టాలిన్‌ను 8,795 ఓట్ల తేడాతో ఓడించారు. ఆయనే వి.ఎస్.బాబు. ఈయన 2006లో పురసవాక్కంలో డీఎంకే ఎమ్మెల్యేగా గెలిచారు. ఈసారి టికెట్ దక్కకపోవడంతో ఫిబ్రవరిలో విజయ్‌ను కలిసి టీవీకే కండువా కప్పుకొన్నారు. కొళత్తూర్ సీటు సాధించి జెయింట్ కిల్లర్ అయ్యారు. చెపాక్-తిరువల్లికేణి నుంచి పోటీచేసిన స్టాలిన్ తనయుడు, ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్ తొలి మూడురౌండ్లు వెనకబడినా.. తర్వాత పుంజుకుని గెలిచారు. డీఎంకే మంత్రులు 16 మంది కూడా ఓడిపోయారు. బరిలో ఉన్న ఏకైక మహిళా మంత్రి గీతాజీవన్ తూత్తుకుడిలో ఓడిపోయారు. పార్లమెంటులో డీఎంకే పక్ష నేత టీఆర్ బాలు కుమారుడు, మంత్రి టి.ఆర్.బి.రాజా మన్నార్‌గుడిలో ఓడిపోయారు.

విజయ్ డ్రైవర్ కుమారుడి గెలుపు

విజయ్‌కి సుదీర్ఘకాలంగా కారుడ్రైవర్ గాను, వ్యక్తిగత సహాయకుడిగా చేస్తున్న రాజేంద్రన్ కుమారుడు శబరినాథన్ విరుగంబాక్కం నియోజకవర్గంలో 27,086 ఓట్ల ఆధిక్యంతో గెలిచారు. డీఎంకే నాయకుడు ఏఎంవీ ప్రభాకర్ రాజాపై ఆయన విజయం సాధించారు.

తల్లి గెలుపు.. కుమారుడి ఓటమి

సినీనటుడు విజయ్‌కాంత్ సతీమణి, డీఎండీకే అధినాయకురాలు ప్రేమలతా విజయ్‌కాంత్ విరుదాచలంలో గెలవగా.. ఆమె కుమారుడు విజయప్రభాకర్ విరుదునగర్‌లో ఓడిపోయారు. మైలాపూర్‌లో భాజపా అభ్యర్థిని తమిళిసై సౌందరరాజన్ మూడోస్థానంతో సరిపెట్టుకున్నారు. భాజపా రాష్ట్ర అధ్యక్షుడు నయినార్ నాగేంద్రన్ సాత్తూర్‌లో ఓటమిపాలయ్యారు. తమిళనాడు పీసీసీ అధ్యక్షుడు కె.సెల్వపెరుంతగై ఘోరపరాజయాన్ని చవిచూశారు. మదురై సెంట్రల్‌లో ఖుష్బూ భర్త సుందర్.సి ఘోరంగా ఓడారు.

పళనిస్వామి రికార్డు విజయం

విజయ్ పెరంబూర్‌లో 53,715 ఓట్లతో, తిరుచ్చి ఈస్ట్‌లో 27,416 ఓట్ల మెజారిటీతో గెలిచారు. అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి కె.పళనిస్వామి ఎడప్పాడి నియోజకవర్గంలో 98,110 ఓట్ల రికార్డు మెజారిటీతో విజయం సాధించారు. బోడినాయకనూర్‌లో డీఎంకే అభ్యర్థిగా బరిలోకి దిగిన మాజీ ముఖ్యమంత్రి ఒ.పన్నీరుసెల్వం గెలిచారు.

ప్రజాతీర్పును శిరసావహిస్తాం

రాష్ట్ర ప్రజల తీర్పును శిరసావహిస్తాం. ఓటమిని గౌరవిస్తాం. బాధ్యతాయుత ప్రతిపక్షంగా వ్యవహరిస్తాం. అన్ని వర్గాల ప్రజల పట్ల విశ్వాసంగా ఉన్నాం, ఆత్మప్రబోధానుసారం పనిచేశాం. నా రాజకీయ జీవితంలో ఎన్నో గెలుపోటముల్ని చూశా. డీఎంకే రాజకీయ ప్రస్థానం ఎలాంటి ఒడుదొడుకుల్లేకుండా సాగుతుంది.

- ఎం.కె.స్టాలిన్, తమిళనాడు ముఖ్యమంత్రి

(c) eenadu

మలబారు కోటలో.. యూడీఎఫ్ పాగా



తిరువనంతపురం: కేరళలో మరోసారి ప్రభుత్వం మారింది. పదేళ్లుగా పరిపాలిస్తున్న లెఫ్ట్ డెమోక్రటిక్ ఫ్రంట్(ఎల్‌డీఎఫ్) ప్రభుత్వాన్ని గద్దె దించుతూ ప్రజలు స్పష్టమైన తీర్పునిచ్చారు. కాంగ్రెస్ నేతృత్వంలోని యునైటెడ్ డెమోక్రటిక్ ఫ్రంట్(యూడీఎఫ్) అత్యధిక సీట్లను గెలుచుకుని ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు సిద్ధమవుతోంది. ఈ ఎన్నికల్లో యూడీఎఫ్ 102 స్థానాలను సాధించగా, ఎల్‌డీఎఫ్ 35 స్థానాలకు పరిమితమైంది. భారతీయ జనతా పార్టీ 3 సీట్లలో విజయం సాధించింది. కేరళలోని 140 అసెంబ్లీ స్థానాలకు ఏప్రిల్ 9న ఒకే విడతలో ఎన్నికలు జరిగాయి. ముఖ్యమంత్రి పినరయి విజయన్ ఆధ్వర్యంలోని ఎల్‌డీఎఫ్ కూటమి తమ సంక్షేమ పథకాలతో గట్టెక్కుతామని గట్టిగా విశ్వసిస్తూ వచ్చింది. అయితే బలమైన ప్రభుత్వ వ్యతిరేక పవనాల నేపథ్యంలో ఆ పార్టీ పూర్తిగా చతికిలబడింది. మరోవైపు ఇందిరా గ్యారెంటీల పేరుతో తమదైన శైలిలో హామీలు గుప్పించిన యూడీఎఫ్ ప్రజల నమ్మకాన్ని గెలుచుకోగలిగింది. ఎల్‌డీఎఫ్‌కు నేతృత్వం వహిస్తున్న సీపీఐ(ఎం) పోటీచేసిన చాలా స్థానాల్లో ఘోర పరాజయం పొందగా, కూటమిలో మరో ముఖ్యభాగస్వామి అయిన కేరళ కాంగ్రెస్(ఎం) ఒక్క స్థానాన్ని కూడా గెలవలేకపోయింది. రాష్ట్రంలోని అనేక జిల్లాల్లో ఎల్‌డీఎఫ్ తుడిచిపెట్టుకుపోయింది.


కేరళలో యూడీఎఫ్ కూటమి విజయంతో కాంగ్రెస్ నేత వి.డి.సతీశన్‌కు మిఠాయి తినిపిస్తున్న కేసీ వేణుగోపాల్. పక్కన శశిథరూర్ తదితరులు

యూడీఎఫ్ పక్షాన ముఖ్యమంత్రి రేసులో ఉన్న కాంగ్రెస్ సీనియర్ నేత రమేశ్ చెన్నితాలతో పాటు, ప్రస్తుత ప్రతిపక్ష నాయకుడు వి.డి. సతీషన్ పూర్తి ఆధిక్యాలతో గెలుపొందగా... ఎల్‌డీఎఫ్ నేత, రాష్ట్ర ముఖ్యమంత్రి పినరయి విజయన్ ఓటమి నుంచి తృటిలో బయటపడ్డారు. మంత్రివర్గంలో 20 మంది ఉంటే పినరయితో పాటు మొహమ్మద్ రియాజ్, కె.రాజన్, కె.ఎన్.బాలగోపాల్, పి.ప్రసాద్, సాజి చేర్యన్ మాత్రం గెలుపొందారు. మిగిలిన వారంతా ఓటమిపాలయ్యారు. వారిలో ఎల్‌డీఎఫ్ కన్వీనర్ టి.పి.రామకృష్ణన్ కూడా ఉన్నారు. పుతుపల్లి నియోజకవర్గం నుంచి మాజీ సీఎం ఊమెన్ చాందీ కుమారుడు, కాంగ్రెస్ అభ్యర్థి చాందీ ఊమెన్ ఘనవిజయం సాధించారు. రెండు బలమైన పక్షాల మధ్య భాజపా ఉనికిని చాటుకుంది. తిరువనంతపురం జిల్లా చాతన్నూర్ నుంచి బి.బి.గోపకుమార్, నేమమ్‌లో పార్టీ రాష్ట్ర అధ్యక్షులు రాజీవ్ చంద్రశేఖర్, కజక్కూట్టమ్‌లో కేంద్ర మాజీ మంత్రి మురళీధరన్ గెలుపొందారు. కంజిరపల్లిలో కేంద్ర మత్స్య, పాడి, పశుసంవర్ధక శాఖ మంత్రి జార్జి కురియన్ మూడోస్థానంలో నిలిచారు. అక్కడ అత్యధికంగా ఉన్న క్రైస్తవ ఓటర్లను ఆకట్టుకునేందుకు భాజపా ఆయనను రంగంలోకి దించినా ఫలితం లేకపోయింది. కాంగ్రెస్ అభ్యర్థి రోనీ.కె.బేబీ అక్కడ విజేతగా నిలిచారు.


కొచ్చిన్‌లో కాంగ్రెస్ కార్యకర్తల సంబరాలు

కాంగ్రెస్ కృతజ్ఞతలు

కేరళలో యూడీఎఫ్ ఘన విజయంపై కాంగ్రెస్ హర్షాతిరేకాలు వ్యక్తంచేసింది. ఈ మేరకు ఆ పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీతో పాటు, ప్రధాన కార్యదర్శులు ప్రియాంక గాంధీ, కె.సి.వేణుగోపాల్ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. కేరళ ఆకాంక్షలను యూడీఎఫ్ ప్రభుత్వం నెరవేర్చబోతోందని రాహుల్ పేర్కొన్నారు.

● 'కేరళలో ఎల్‌డీఎఫ్ ఓటమి వామపక్షాలకు పెద్ద ఎదురుదెబ్బ. పశ్చిమబెంగాల్, అస్సాం, పుదుచ్చేరి ఫలితాలు భాజపా నేతృత్వంలోని మితవాద మతతత్వ శక్తుల విజృంభణకు నిదర్శనం. ఈ పరిణామం అన్ని లౌకిక, ప్రగతిశీల, ప్రజాస్వామ్య శక్తులకు తీవ్ర ఆందోళన కలిగించే అంశం'. అని సీపీఎం ప్రధాన కార్యదర్శి ఎం.ఎ.బేబీ వ్యాఖ్యానించారు.

సంక్షేమం.. విజయ(న్)మంత్రం కాలేదు ఎందుకు?

ఒక్కో మెట్టూ దిగుతూ..



రాష్ట్రాల్లో కమ్యూనిస్టుల అధికార పర్వానికి తెర

అకలి లేని సమాజం, నాణ్యమైన విద్య, తక్కువ ధరకే ఇంధనం... ఇవన్నీ కేరళలో సాధ్యమైన లక్ష్యాలు. దేశంలోనే అత్యంత పేదరికాన్ని నిర్మూలించిన తొలి రాష్ట్రంగానూ నిలిపారు.

లైఫ్ మిషన్ ప్రాజెక్టుద్వారా ఎంతోమంది పేదలకు గృహ వసతిని కల్పించారు. సామాజిక భద్రతా పథకాల ద్వారా వృద్ధులు, వితంతువులకు ఆసరాగా నిలిచారు. నీతి ఆయోగ్ ప్రకటించే సుస్థిర అభివృద్ధి లక్ష్యాల (ఎస్‌జీడీ) ర్యాంకింగ్‌లలోనూ మంచి స్థానం దక్కేలాచూశారు.

మొత్తంగా కేరళ పాలనలో పినరయి విజయన్ తనదైన ముద్ర వేశారు. అయినా తాజా ఎన్నికల్లో ఓటమిని చవిచూశారు. మహిళల కోసం ప్రతిష్ఠాత్మకంగా అమలుచేసిన 'కుదుంబ శ్రీ' పథకం కూడా కాపాడలేదు. ఎందుకని?

తన ప్రత్యేకమైన అభివృద్ధి నమూనాతో రెండు దఫాలుగా లెఫ్ట్ డెమోక్రటిక్ ఫ్రంట్ (ఎల్‌డీఎఫ్)కు విజయం సాధించిపెట్టిన పినరయి విజయన్ మళ్లీ ఆ మ్యాజిక్ చేయలేకపోయారు. తమ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలే విజయాన్నందిస్తాయని ఆయన చెబుతూ వస్తున్నా ఫలితాలు భిన్నంగా వచ్చాయి. యూడీఎఫ్ ఘన విజయం సాధించింది. దీనికి కారణాలు అనేకం.

● నిజానికి కేరళ నమూనా దేశంలోనే ప్రత్యేకమైందిగా పేరొందింది. నిబద్ధతకు కొలమానంగా ప్రశంసలు పొందింది. అయితే ఈ లెక్కలు రాష్ట్రంలోని ఆర్థిక, సామాజిక, అభివృద్ధి స్థితిగతులను యథాతథంగా చూపలేదని సెంటర్ ఫర్ ఎన్విరాన్‌మెంట్ వంటి సంస్థలు అంచనావేశాయి. ముఖ్యంగా లింగ సమానత్వం, ఆరోగ్యం, విద్య, ఉపాధి, ఆర్థిక వృద్ధిలో నానాటికీ తీసికట్టుగా మారిందని చెప్పింది.

● మహిళాభివృద్ధి విషయంలో కేరళ గతంలో దేశంలోనే స్ఫూర్తిదాయకంగా ఉండేది. అయితే గత దశాబ్దకాలంలో ప్రధాన రంగాల్లో మహిళా ప్రాతినిధ్యం తగ్గుతూ వస్తోంది. ఉద్యోగాల్లో, పదవుల్లో వారికి ఏ మాత్రం ప్రోత్సాహం దక్కలేదు. వేతన సమానత్వం విషయంలోనూ వారిది వెనకబాటే. దీంతో వారిలో ప్రభుత్వంపై అసంతృప్తి గూడు కట్టుకుంటూ వస్తోంది.

● కేరళ నుంచి వలసలు పెరుగుతూనే ఉండడం చర్చనీయాంశం అవుతూ వచ్చింది. ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మైగ్రేషన్ అండ్ డెవలప్‌మెంట్ (ఐఐఎండీ) లెక్కల ప్రకారం దాదాపు 25 లక్షల మంది కేరళీయులు వివిధ దేశాల్లో పనిచేస్తుండగా, మరో 15 లక్షల మంది ఇతర రాష్ట్రాలోల ఉపాధి పొందుతున్నారు. ఇక్కడ అక్షరాస్యత సంపూర్ణంగా ఉన్నా స్థానికంగా ఉపాధి కల్పనలో ప్రభుత్వాలు ఏమాత్రం ముందుచూపు ప్రదర్శించలేదు. పినరయి సర్కారు కూడా ఇదే ధోరణిని కొనసాగించింది.

● రాష్ట్రంలో వేతన వ్యత్యాసం కూడా చాలా తక్కువ. కేరళలో నిర్మాణ రంగంలో, టీ ఎస్టేట్స్‌లో, మార్కెట్‌లలో పని చేసేందుకు ఇతర రాష్ట్రాల నుంచి పెద్ద ఎత్తున వస్తుంటారు. వారికి సగటు రోజువారీ వేతనం రూ.1,000. అదే సమయంలో... చదువుకున్న స్థానిక యువకుల సగటు నెలవారీ జీతం రూ.15 వేల కన్నా తక్కువ. దీంతో వారు మెరుగైన జీతం, జీవితం కోసం వలసబాట పట్టాల్సివస్తోంది. ఈ విషయంలో విద్యావంతులైన యువకుల్లో తీవ్ర అసంతృప్తి ఉంది. ఓ వైపు బయటి కార్మికులు ఇక్కడికి వచ్చి మంచి ఆదాయాన్ని పొందుతుంటే...స్థానిక యువత ఎక్కడికో వెళ్లడం ఏంటన్న చర్చ చాలాకాలంగా ఉంది.

ఇలా ప్రజల్లో పెరుగుతున్న ఆకాంక్షలు, తగ్గుతున్న అవకాశాలు ఎల్‌డీఎఫ్ ప్రభుత్వానికి పెద్ద సవాలుగా నిలిచాయి. దాన్ని అధిగమించలేని పరిస్థితుల్లో పినరయి సర్కార్ ఓటమిని మూటగట్టుకుంది.

కేరళలో లెఫ్ట్ కూటమి ప్రస్థానమిలా..

	గెలిచిన స్థానాలు	ఓటు శాతం
2026	35	28.4
2021	79	34.3%
2016	77	36
2011	60	38.2
2006	81	39.9
2001	32	30.4

యూడీఎఫ్... దూసుకెళ్లిందిలా

ఎల్‌డీఎఫ్ చెప్పే దీర్ఘకాలిక సామాజిక భద్రతకు విభిన్నంగా యూడీఎఫ్ తన మేనిఫెస్టోను రూపొందించింది.

● పింఛన్లను ప్రభుత్వం ఇచ్చే దానధర్మాలుగా కాకుండా చట్టబద్ధమైన హక్కుగా ప్రకటించింది. రాహుల్‌గాంధీ ప్రకటించిన 'ఇందిరా గ్యారెంటీలు' యూడీఎఫ్ విజయానికి బాటలు వేశాయి.

● మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, కళాశాల విద్యార్థులకు నెలవారీ ఉపకార వేతనాలు, రూ.3,000 సామాజిక పింఛను, విస్తృత ఆరోగ్య బీమా కవరేజీ వంటివి కేరళలోని మధ్య తరగతి ప్రజలను బాగా ఆకర్షించాయి.

● ఉద్యోగం కోసం ఎదురుచూస్తున్న యువత కోసం ప్రకటించిన 'యువ పారిశ్రామికవేత్తలకు వడ్డీలేని రుణం' కూడా అక్కడ మంచి ప్రభావం చూపింది. కేరళలో పారిశ్రామికాభివృద్ధి జరగడం లేదన్న తీవ్ర విమర్శలున్నాయి. దానికి విరుగుడుగా యూడీఎఫ్ ప్రచారం చేసిన మిషన్ సముద్ర, విమానయాన రంగ విస్తరణ, కొత్తగా పది వేల సంస్థల ఏర్పాటు వంటి హామీలు సామాన్యులను బాగా ఆకట్టుకున్నాయి.

● వయోవృద్ధుల కోసం ప్రత్యేకశాఖ, గృహ వసతి కోసం 'నవ ఆశ్రయ', పేదలకు ఆహార భద్రత కోసం ఇందిరా క్యాంటీన్లు, ఉద్యోగాలకల్పనను నిరంతరం పరిశీలించేందుకు జాబ్‌టవర్ ఏర్పాటు వంటి హామీలు ప్రజల్లోకి దూసుకెళ్లాయి. ఎల్‌డీఎఫ్‌పై ఏకపక్ష విజయానికి బాటలువేశాయి.

- ఈనాడు ప్రత్యేక విభాగం





దేశ రాజకీయాల్లో దాదాపు 70 ఏళ్లకుపైగా క్రియాశీల పాత్ర పోషించిన కమ్యూనిస్టు పార్టీలు ఇప్పుడు ఒక్కరాష్ట్రంలోనూ అధికారంలో లేకుండా కనుమరుగయ్యాయి. చిట్టచివరి రాష్ట్రం కేరళలోనూ లెఫ్ట్ అధికారాన్ని కోల్పోయింది. వామపక్షాలకు ఇలా జరగడం దేశంలో గత 50 ఏళ్లలో ఇదే మొదటిసారి. సీపీఎం, సీపీఐ, ఫార్వర్డ్ బ్లాక్, ఆర్‌ఎస్పీల సమాహారమైన వామపక్ష కూటమి పశ్చిమబెంగాల్, కేరళ, త్రిపురలో అనేక ఏళ్లు బలమైన శక్తిగా కొనసాగింది. తదనంతర కాలంలో ప్రాభవాన్ని కోల్పోయింది.

1951-52 తొలి సార్వత్రిక ఎన్నికల్లో కమ్యూనిస్టు పార్టీయే విపక్షాలన్నిటికన్నా ఎక్కువసీట్లు సాధించి రెండో అతిపెద్ద పార్టీగా అవతరించింది. ఆ తర్వాత ఐదేళ్లకు 1957లో కేరళలో విజయాన్ని సాధించి.. ప్రపంచంలోనే ప్రజాస్వామ్యయుతంగా ఎన్నికైన మొట్టమొదటి వామపక్ష ప్రభుత్వాన్ని ఈఎంఎస్ నంబూద్రిపాద్ నాయకత్వంలో ఏర్పాటుచేసింది. తదనంతర కాలంలో కమ్యూనిస్టుల్లో చీలిక వచ్చి.. సీపీఐ, సీపీఎంగా వేరుపడ్డాయి. 1977లో పశ్చిమబెంగాల్లో సీపీఎం అధికారంలోకి వచ్చింది. దాదాపు 34ఏళ్ల పాటు నిరంతరాయంగా రాష్ట్రాన్ని పాలించింది. ముఖ్యమంత్రిగా జ్యోతిబసు 23 ఏళ్ల పాటు అధికారంలో ఉన్నారు. జ్యోతిబసుకు 1996లో దేశ ప్రధాని పదవి చేపట్టే అవకాశం కూడా వచ్చింది. దానికి జ్యోతిబసు సుముఖత వ్యక్తంచేసినా... సీపీఎం పొలిట్‌బ్యూరో తిరస్కరించింది. ఇదో చారిత్రక తప్పిదమని ఆ తర్వాత విమర్శలు వచ్చాయి. 2008లో అమెరికాతో అణు ఒప్పందానికి వ్యతిరేకంగా మన్మోహన్‌సింగ్ ప్రభుత్వానికి వామపక్షాలు మద్దతు ఉపసంహరించుకోవడంతో.. ఆ ప్రభుత్వం సభలో బల పరీక్షకు వెళ్లాల్సి వచ్చింది. అప్పటికి లెఫ్ట్ పార్టీలకు 60 మంది లోక్‌సభ సభ్యులున్నారు. బెంగాల్ తర్వాత, కేరళ, త్రిపురల్లో వామపక్ష కూటమి ఎక్కువకాలం అధికారంలో కొనసాగింది.

2011 తర్వాత అసలు పతనం మొదలు

గత 20 ఏళ్లలో వామపక్షాల బలం క్రమంగా తగ్గుతూ వచ్చింది. 1977 తర్వాత ఇప్పుడు మొదటిసారిగా ఒక్కరాష్ట్రంలో కూడా అధికారం లేకుండా పోయింది. 2011లో పశ్చిమబెంగాల్లో వామపక్షాలు ఓడిపోవడంతో వాటి అసలు పతనం ప్రారంభమైంది. నందిగ్రామ్, సింగూర్‌లలో భూసేకరణకు వ్యతిరేకంగా ప్రారంభమైన ఉద్యమం కమ్యూనిస్టుల్ని బాగా దెబ్బతీసింది. మమత బెనర్జీ ఘనవిజయం సాధించారు. ఆ ఎన్నికల్లో వామపక్షాలు 60 సీట్లకు పరిమితం అయ్యాయి. త్రిపురలో లెఫ్ట్‌ఫ్రంట్ 1978లో తొలిసారి అధికారంలోకి వచ్చింది. 1993 నుంచి 2018 వరకు 25 ఏళ్లపాటు నిరంతరాయంగా కొనసాగింది. 2018లో త్రిపుర భాజపా వశమైంది. సీపీఎం 16 సీట్లకు పరిమితమైంది. కేరళలో ఐదేళ్లకోమారు అధికారం మారే సంప్రదాయాన్ని తిరగరాసిన ముఖ్యమంత్రి విజయన్ 2021లో లెఫ్ట్ కూటమిని మళ్లీ విజయపుటంచులకు చేర్చినప్పటికీ.. ఈసారి ఓటమి నుంచి తప్పించుకోలేక పోయారు. ఈ మూడు రాష్ట్రాలు కాకుండా దేశంలోని మిగతా రాష్ట్రాల్లో వామపక్షాల బలం అంతంతమాత్రమే. కేంద్రంలోనూ 2024 లోక్‌సభ ఎన్నికల్లో కేవలం నాలుగు సీట్లకు పరిమితం అయ్యారు.

కాంగ్రెస్ చేజార్చుకున్న చాణక్య!

హిమంత బిశ్వ శర్మ.. అస్సాంలో భాజపాను మూడోసారి అధికారంలోకి తెచ్చిన నేత. రెండు దశాబ్దాలకుపైగా కాంగ్రెస్‌లో ఉంటూ రాజకీయాలను నడిపిన ఆయన తర్వాత భాజపాలోకి చేరి ఈశాన్య భారతంలోనే హస్తం పార్టీకి చిరునామా లేకుండా చేస్తున్న రాజకీయ దురంధరుడు. ఈశాన్య భారతంలో కాషాయ పార్టీ రెపరెపల వెనక సూత్రధారి.



అస్సాంలోని జోర్హాట్‌లో 1969లో జన్మించిన హిమంత బిశ్వ శర్మ రాజకీయ ప్రస్థానం విద్యార్థి దశలోనే ప్రారంభమైంది. ఆరో తరగతి చదువుతున్న సమయంలోనే గువాహటిలో జరిగిన ఓ సభలో ప్రసంగించి.. అటల్ బిహారీ వాజ్‌పేయీ ప్రశంసలు అందుకున్నారు. హిమంత తండ్రి కైలాస్‌నాథ్‌శర్మ (కవి, రచయిత). తల్లి మృణాళినీ దేవి. పాఠశాలలో చదువుతున్న సమయంలోనే అస్సాం ఉద్యమంలో (1979-85) హిమంత దిగారు. తర్వాత కాలంలో ఆల్ అస్సాం స్టూడెంట్స్ యూనియన్ గువాహటి యూనిట్‌కు కార్యదర్శిగా ఎదిగారు. అ సమయంలోనే తన ప్రసంగాలతో యువతను ఉర్రూతలూగిస్తూ 'వండర్ బాయ్'గా గుర్తింపుపొందారు. ఎల్‌ఎల్‌బీ డిగ్రీ చేసిన బిశ్వశర్మ.. హైకోర్టులో ఐదేళ్ల ప్రాక్టీసు చేశారు. తర్వాత మంత్రిగా బాధ్యతలు నిర్వర్తిస్తూనే రాజనీతి శాస్త్రంలో పీహెచ్‌డీ పూర్తి చేశారు.

రాహుల్‌తో విభేదించి..

అస్సాం ఉద్యమంతో అనుబంధం ఉన్న బిశ్వ శర్మ ప్రాంతీయ పార్టీ అస్సాం గణ పరిషత్‌లో చేరతారని భావించారు. కానీ ఆయన జాతీయ పార్టీ కాంగ్రెస్‌వైపు మొగ్గు చూపారు. 1991లో కాంగ్రెస్‌లో అధికారికంగా చేరిన ఆయన 2001లో తొలిసారి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 2002లో తరుణ్ గొగొయ్ మంత్రివర్గంలో సహాయ మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. 2006కు వచ్చేసరికి క్యాబినెట్ హోదాలో వ్యవసాయశాఖ మంత్రి బాధ్యతలు చేపట్టారు. తర్వాతి కాలంలో అనేక శాఖలు నిర్వహించారు. తనదైన ముద్ర వేస్తూ.. పరిపాలనా దక్షుడిగా పేరు తెచ్చుకున్నారు. ముఖ్యమంత్రి తరుణ్ గొగొయ్ తర్వాత పార్టీలో కీలక నేతగా ఎదిగారు. 2011లో కాంగ్రెస్ విజయంలో కీలక భూమిక పోషించారు. ఈ సమయంలో సీఎం తరుణ్ గొగొయ్ తన వారసుడిగా కుమారుడు గౌరవ్ గొగొయ్ పేరును ప్రకటించారు. ఇది హిమంతకు నచ్చలేదు. అసమ్మతి స్వరం వినిపించారు. 2015 జులైలో కాంగ్రెస్‌లోని అంతర్గత సమస్యలను చర్చించడానికి ఆయన రాహుల్ గాంధీని కలిశారు. ఆ సమావేశం.. హిమంత రాజకీయ జీవితాన్ని మలుపు తిప్పింది. అప్పటి నుంచి ఆయన కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా వ్యాఖ్యలు చేయడం ప్రారంభించారు. మరుసటి నెలలోనే భాజపాలో చేరారు. తాను రాహుల్‌ను కలిసి తన సమస్యలను నివేదిస్తున్న సమయంలో ఆయన తన పెంపుడు కుక్కతో ఆడుకోవడం నచ్చలేదని హిమంత ఆరోపించారు.

కాంగ్రెస్ ఓటమే లక్ష్యంగా..!

హిమంత బిశ్వ శర్మను ఈశాన్య భారత రాజకీయ చాణక్యుడు అని కూడా అంటారు. ఎందుకంటే కాంగ్రెస్ కంచుకోటగా ఉన్న ఈ ప్రాంతాన్ని కాషాయ పార్టీ చిరునామాగా మార్చారు. భాజపాలో చేరిన తర్వాత కాంగ్రెస్ ఓటమే లక్ష్యంగా పని చేశారు. 2016 శాసనసభ ఎన్నికల్లో ప్రాంతీయ పార్టీలైన అస్సాం గణపరిషత్, బోడోలాండ్ పీపుల్స్ ఫ్రంట్‌లతో భాజపా పొత్తులు కుదుర్చుకోవడంలో కీలక పాత్ర పోషించారు. ఆ ఎన్నికల్లో కాషాయ పార్టీ తొలిసారి అస్సాంలో అధికారం చేజిక్కించుకుంది. తర్వాత మొత్తం ఈశాన్య భారతాన్ని కాంగ్రెస్ రహితంగా మార్చే బాధ్యతను హిమంతకు భాజపా అప్పగించింది. నార్త్ ఈస్ట్ డెమోక్రటిక్ అలయన్స్ (ఎన్ఈడీఏ) కన్వీనర్‌గా నియమించింది. హిమంత వ్యూహాలతోనే అరుణాచల్ ప్రదేశ్, మణిపుర్, త్రిపుర రాష్ట్రాల్లో భాజపా ప్రభుత్వాలు ఏర్పడ్డాయి. మేఘాలయ నాగాలాండ్‌లలో సంకీర్ణ ప్రభుత్వాలు ఏర్పడటంలోనూ ఆయన కీలక పాత్ర పోషించారు. 2021లో భాజపా వరుసగా రెండోసారి అస్సాంలో అధికారం చేజిక్కించుకున్న తర్వాత.. భాజపా హైకమాండ్ సర్బానంద్ సోనోవాల్ స్థానంలో అస్సాం ముఖ్యమంత్రిగా హిమంతను ఎంపిక చేసింది.

– నేషనల్ డెస్క్


గువహటిలోని భాజపా కార్యాలయం వద్ద బెలూన్లు ఎగరేసి సంబరాలు చేసుకుంటున్న ఆ పార్టీ కార్యకర్తలు

అస్సాంలో వరుసగా మూడోసారి తిరుగులేని విజయం సాధించడానికి భాజపా అనుసరించిన వ్యూహమేంటి.. గత ఎన్నికలను మించి ఫలితాలను సాధించడానికి ఏం చేసింది.. వీటన్నింటికీ సమాధానం ఒక్కటే.. అదే హిమంత ఫార్ములా! పశ్చిమ బెంగాల్, కేరళ, తమిళనాడుపై దృష్టి పెట్టిన అధిష్ఠానం అస్సాంలో పెద్దగా ప్రచారం చేయలేదు. భారాన్నంతా ముఖ్యమంత్రి హిమంతపైనే వేసింది.

అస్సాంలో.. మూడింజన్లతో మూడోసారి...

దీంతో అంతా తానై ప్రచారం చేయడంతోపాటు వ్యూహాత్మకంగా వ్యవహరించి పార్టీని విజయ పథంలో నడిపారాయన! తొలి నుంచీ 100 సీట్ల లక్ష్యంతో పనిచేశారు. ఇందుకోసం 3 ఇంజిన్లను నమ్ముకున్నారు.

1. సంక్షేమం: ఎన్నికల సంఘం షెడ్యూల్‌ను ప్రకటించడానికి సరిగ్గా వారం ముందు ఓరునోడొయ్ నగదు బదిలీ పథకం కింద 40 లక్షల మంది మహిళల ఖాతాల్లో రూ.9,000 చొప్పున వేశారు. ఇది మొత్తంగా రూ.3,600 కోట్లు. మళ్లీ అధికారంలోకి వచ్చాక నెలకు రూ.3,000 ఇస్తామని ప్రకటించారు. ఇది మంచి ఫలితాన్నిచ్చింది. ఈ పథకం ప్రతిపక్ష పార్టీల వారినీ ఆకర్షించిందని ప్రీపోల్ సర్వేల్లో తేలింది. దీంతో పాటు ఏటా బిహు, దుర్గాపూజ సమయాల్లో రెండు గ్యాస్ సిలిండర్లను ఉచితంగా ఇస్తామని హామీ ఇచ్చారు.

2. గుర్తింపు: జాతి-మాటీ-భేటీ (సంఘం-గుర్తింపు, భూమి, మాతృభూమి-మూలాలు) పేరుతో అస్సాం గుర్తింపును కాపాడతామని హిమంత హామీ ఇచ్చారు. ఇది అక్రమ వలసలకు వ్యతిరేకంగా స్థానిక అస్సామీల అస్తిత్వ పోరాటానికి ప్రతీకగా నిలిచింది. బెంగాలీ మాట్లాడే బంగ్లాదేశీ ముస్లింల వలసలకు వ్యతిరేక ఉద్యమంగా ఇది రూపుదాల్చింది.

3. కాంగ్రెస్‌ను విచ్ఛిన్నం చేయడం: ప్రధాన ప్రతిపక్షమైన కాంగ్రెస్‌ను రాష్ట్రంలో వ్యవస్థాగతంగా విధ్వంసం చేయడంలో హిమంత సఫలమయ్యారు. భాజపా పోటీకి నిలిపిన 88 మంది అభ్యర్థుల్లో మూడో వంతు మంది కాంగ్రెస్ నుంచి వచ్చినవారే. ఈ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ రాష్ట్రశాఖ మాజీ అధ్యక్షుడితోపాటు ఓ సిటింగ్ ఎంపీ భాజపాలో చేరారు.

యువతపై దృష్టి

రాష్ట్రంలో 18 నుంచి 29 ఏళ్ల మధ్య వయసున్న యువత 29శాతం మంది ఉన్నారు. ఈ ఎన్నికల్లో నిర్ణయాత్మక శక్తిగా ఉన్న వారిని ఆకర్షించడంలో హిమంత సఫలమయ్యారు. మన ఉద్యోగాలు, భూములు మనకే అంటూ ఆయన ఇచ్చిన హామీ బాగా పని చేసింది. సింగపూర్‌లో అనుమానాస్పదంగా మరణించిన జుబీన్ గర్గ్ మరణంపై దర్యాప్తును వేగంగా పూర్తి చేస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చినా యువత పెద్దగా నమ్మినట్లు కనిపించలేదు. – నేషనల్ డెస్క్

(c) eenadu

పెన్సిల్ పొట్టు ప్రిన్సెస్

మనం హోం వర్క్ చేసేటప్పుడు లేదా బొమ్మలు గీసేటప్పుడు పెన్సిళ్లను చెక్కుతాం కదా! అప్పుడు వచ్చే పొట్టును చెత్త బుట్టలో పడేస్తాం. కానీ, ఆ వృథాగా పడేసే పొట్టుతో చక్కని బొమ్మలు గీయొచ్చని మీకు తెలుసా.. దీనికోసం మనకు తెల్లటి డ్రాయింగ్ షీట్ లేదా పేపర్, పెన్సిల్, షార్పనర్, గమ్, స్కెచ్ పెన్నులు లేదా క్రేయాన్స్ ఉంటే చాలు.

★ మొదట పెన్సిల్‌ను జాగ్రత్తగా షార్ప్ చేయాలి. పొట్టు విరిగిపోకుండా పొడవుగా వచ్చేటట్లు చూసుకోండి.

★ తర్వాత ఆ పొట్టును కాగితంపై అంటించి, కాళ్లు, తల, చేతులను గీయాలి.

★ అంతే, అందమైన బుజ్జి బుజ్జి ప్రిన్సెస్ బొమ్మలు రెడీ. చూడగానే ముద్దొచ్చేలా ఉంటాయి.



సెలవుల్లో సరదాగా!

దీని ద్వారా.. వృథాగా పారేసే వస్తువుల నుంచి కూడా అందమైన ఆర్ట్‌ను ఎలా చేయొచ్చో అర్థమవుతుంది. అలా అని పెన్సిళ్లు మరీ చెక్కేయకండి.. అమ్మ కోప్పడుతుంది!

బోర్ కొట్టకుండా, బుద్ధిగా ఒకచోట కూర్చుని చేసే సరదా పని ఇది. పాత న్యూస్‌పేపర్లతో మనం వేసుకునేలా డ్రెస్‌లు, గ్యాడ్జెట్స్ చేసేద్దాం.



న్యూస్‌పేపర్‌తో..

● దీనికోసం న్యూస్‌పేపర్ తీసుకోండి. దాన్ని విసనకర్రలా మడత పెట్టండి.. అన్నింటినీ ఒక పొడవైన తాడుకి గానీ, పాత బెల్టుకి గానీ అంటించండి. స్కర్ట్ రెడీ అవుతుంది.

● ఒక పెద్ద పేపర్‌ను తీసుకుని, స్లీవ్‌లెస్ టీ షర్టులా కట్ చేసి వేసుకోవచ్చు.

● కిరీటాలు, నెక్లెస్‌లు, కళ్ల జోళ్లు... ఇంకా ఫన్ వచ్చేలా బాహుబలి లాగా కత్తులు కూడా పేపర్‌తో చేసుకోవచ్చు.



● ఫ్రెండ్స్‌తో కూర్చుని చేస్తుంటే ఎంతకీ టైమ్ తెలియదు. అంతా అయ్యాక పేపర్లన్నీ తీసేసి శుభ్రం చేసేయాలి, ఓకేనా!

మళ్లీ 'హర్మూజ్' గరం

- యూఏఈపై ఇరాన్ దాడులు
- ముగ్గురు భారతీయులకు గాయాలు

దుబాయ్: హర్మూజ్ జలసంధి మళ్లీ ఉద్రిక్తంగా మారింది. ఈ జలసంధిలో చిక్కుకుపోయిన వాణిజ్య నౌకలను సురక్షితంగా బయటకు తీసుకొచ్చేందుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన సొంత సామాజిక మాధ్యమం 'ట్రూత్ సోషల్'లో చేసిన ప్రకటనతో వాతావరణం వేడెక్కింది. ఆపరేషన్‌కు 'ప్రాజెక్టు ఫ్రీడమ్' అని ట్రంప్ పేరు పెట్టారు. దీన్ని మానవతా దృక్పథంతో చేపట్టామని, ఇందులో భాగంగా తమ యుద్ధనౌకలు జలసంధిలోకి వెళతాయని తెలిపారు. రెండు వాణిజ్య నౌకలు సురక్షితంగా జలసంధి దాటినట్లు అమెరికా సైన్యం వెల్లడించింది. దీన్ని ఇరాన్ తీవ్రంగా ఖండించింది. ఏ నౌక కూడా జలసంధి దాటలేదని స్పష్టం చేసింది. అమెరికా చేపట్టిన 'ప్రాజెక్టు ఫ్రీడం'ను ఇరాన్ ఖండించింది. తమ అనుమతి లేకుండా ఓ అమెరికా నౌక జలసంధిలోకి రావడానికి ప్రయత్నించిందని.. దానిపై క్షిపణులతో దాడి చేశామని ప్రకటించింది. దీన్ని అమెరికా సైన్యం ఖండించింది. ఒక్క నౌకపైనా దాడి జరగలేదని తెలిపింది. జలసంధిలో తమ కార్యకలాపాలకు అడ్డు తగిలేందుకు ప్రయత్నిస్తే ఏదు ఇరాన్ ... మరోవైపు అమెరికా నౌకలపై దాడి చేసే ఇరాన్‌ను సర్వనాశనం చేస్తామని ట్రంప్ బెదిరించారు. ఈ నేపథ్యంలో యూఏఈపై సోమవారం ఇరాన్ నాలుగు క్షిపణులను ప్రయోగించింది. ఇందులో మూడింటిని అడ్డుకున్నామని.. ఓ క్షిపణి సముద్రంలో పడిందని యూఏఈ పేర్కొంది. ఫుజైరా ఆయిల్ ఇండస్ట్రీ జోన్‌లోని ఓ చమురు శుద్ధి కేంద్రంపైనా ఇరాన్ డ్రోన్ దాడులు నిర్వహించింది. ఈ దాడితో అక్కడ భారీ మంటలు చెలరేగాయి. ఈ ఘటనలో ముగ్గురు భారతీయులు గాయపడ్డారు. వీరికి ప్రాణాపాయం లేదని.. ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని స్థానిక పత్రికలు పేర్కొన్నాయి.

ప్రతీకారం వద్దు... మార్పు కోసం పనిచేద్దాం

బెంగాలిక భయముక్తం

ఎన్నికల విజయానంతరం ప్రధాని మోదీ



దిల్లీ: పశ్చిమ బెంగాల్ శాసనసభ ఎన్నికల్లో భాజపా సాధించిన చరిత్రాత్మక విజయంతో గంగోత్రి నుంచి గంగాసాగర్ వరకు ఇప్పుడు కమలం వికసిస్తోందని ప్రధాని నరేంద్ర మోదీ సోమవారం హర్షం వ్యక్తంజేశారు. పార్టీలన్నీ ప్రతీకారం కోసం కాకుండా మార్పు కోసం పనిచేయాలని పిలుపునిచ్చారు. పశ్చిమ బెంగాల్, అస్సాం, పుదుచ్చేరి శాసనసభ ఎన్నికల విజయానంతరం పార్టీ ప్రధాన కార్యాలయంలో కార్యకర్తలను ఉద్దేశించి మోదీ ప్రసంగించారు. ఉత్తరాఖండ్, ఉత్తర్‌ప్రదేశ్, బిహార్.. ఇప్పుడు పశ్చిమ బెంగాల్.. ఈ గంగా మాత పరివాహక ప్రాంత రాష్ట్రాలన్నింటిలో ఇప్పుడు భాజపా-ఎన్డీయే ప్రభుత్వాలే ఉన్నాయి. బెంగాల్‌లో భయంపై ప్రజాస్వామ్యం విజయం సాధించింది. భాజపా గెలిచింది కాబట్టి అక్కడ ప్రతీకారం గురించి కాకుండా మార్పు గురించి మాట్లాడుకోవాలి. భయం గురించి కాకుండా భవిష్యత్తు గురించి చర్చ జరగాలి. హింసా మార్గాన్ని అన్ని రాజకీయ పార్టీలు విడనాడాలి" అని మోదీ పేర్కొన్నారు.

కార్యకర్తల త్యాగాల ఫలితమిది: అమిత్ షా

పశ్చిమ బెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్ 15 ఏళ్ల పాలనకు ముగింపు పలుకుతూ భాజపా 200కు పైగా సీట్లతో మెజారిటీ సాధించిందని, ఇది మోదీ నాయకత్వానికి ప్రజలు ఇచ్చిన మద్దతని, ప్రతిపక్షాల బుజ్జగింపు రాజకీయాలకు వ్యతిరేక తీర్పు అని భాజపా పేర్కొంది. ■ బెంగాల్ విజయం ఎంతో మంది పార్టీ కార్యకర్తల త్యాగాల ఫలితమని అమిత్ షా అన్నారు. హింసను ఎదుర్కొని, ప్రాణాలను పణంగా పెట్టి పనిచేసిన కార్యకర్తలకు ఈ విజయం అంకితమని అన్నారు. చొరబాటుదారులకు, వారికి మద్దతు ఇచ్చే వారికి బెంగాల్ ప్రజలు గట్టి పాఠం నేర్పారని ఆయన విమర్శించారు. ఈ విజయం బెంగాల్ సంస్కృతిని, కోల్పోయిన గౌరవాన్ని తిరిగి పొందేందుకు వేసిన తొలి అడుగు అని భాజపా జాతీయాధ్యక్షుడు నితిన్ నబీన్ అన్నారు. మహిళా వ్యతిరేక ధోరణి కలిగిన కాంగ్రెస్, టీఎంసీ వంటి పార్టీలకు ప్రజలు తగిన బుద్ధి చెప్పారని కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు విమర్శించారు.

ప్రభుత్వాలే జోక్యం చేసుకోవాలి

ఆధార్ పిటిషన్‌పై సుప్రీం సూచన

దిల్లీ: ఆరేళ్లలోపు చిన్నారులకు మాత్రమే కొత్త ఆధార్ కార్డులు జారీచేయడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల జోక్యం, ప్రస్తుతమున్న చట్టాల్లో సవరణలు అవసరమని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. ఆరేళ్లలోపు వారికి మాత్రమే ఆధార్ కార్డులు జారీ చేయాలని ఉడాయ్‌ను ఆదేశించాలని కోరుతూ దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యంపై సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మల్యా బాగ్చీల ధర్మాసనం విచారణ జరుపుతోంది. ఈ సమస్యలన్నింటినీ రాష్ట్ర ప్రభుత్వం, సంబంధిత వ్యక్తుల దృష్టికి తీసుకువెళ్లడమే పిటిషనర్‌కు సరైన మార్గమని, తద్వారా వాటిని పరిగణించి సరైన చర్యలు తీసుకునేందుకు వారికి వీలవుతుందని పేర్కొంది.

ఎఫ్ఐఆర్ నమోదుకు హైకోర్టులు ఆదేశాలివ్వరాదు

దిల్లీ: చట్ట సమ్మతమైన అన్ని ప్రత్యామ్నాయాలను పిటిషనర్ వినియోగించుకోనంత వరకూ ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని రాష్ట్ర అధికారులను హైకోర్టులు ఆదేశించలేవని సర్వోన్నత న్యాయస్థానం స్పష్టంచేసింది. చర్యలు తీసుకోవడంలో జాప్యం/నిర్లక్ష్యం వహించినట్లు ఆరోపించినంత మాత్రాన హైకోర్టులు రిట్ పిటిషన్లను స్వీకరించాల్సిన అవసరం లేదని జస్టిస్ సంజయ్ కరోల్, జస్టిస్ ఆగస్టీన్ జార్జ్ మసీహ్ ధర్మాసనం పేర్కొంది. "రాజ్యాంగంలోని అధికరణ 226 ప్రకారం.. హైకోర్టుల అధికార పరిధి విస్తృతమైనది. అసాధారణమైనది. విచక్షణతో కూడినది. కొన్ని స్వీయ నియంత్రణలకు లోబడి ఉంటుంది. పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేయలేదని, దర్యాప్తు సరిగా జరగడం లేదనే ఆవేదన ఎవరికైనా ఉంటే అందుబాటులో ఉన్న ప్రత్యామ్నాయ మార్గాలను వినియోగించుకోవాలి. పరిస్థితులు తీవ్రంగా ఉంటే తప్ప వారు నేరుగా హైకోర్టులలో రిట్ పిటిషన్లు దాఖలు చేయకూడదు" అని ధర్మాసనం తెలిపింది.

కీలక నిర్ణయాలకు ఊతం
ఎన్డీయేపై మోదీ, షాల పట్టు...

ఈనాడు, దిల్లీ: అసెంబ్లీల ఎన్నికల ఫలితాలతో నరేంద్ర మోదీ, అమిత్ షాల ద్వయం జాతీయ రాజకీయాల్లో తమకు ఎదురులేదని మరోసారి చాటి చెప్పింది. ఎన్డీయే కూటమికి తిరుగులేని ఆధిపత్యాన్ని చేకూర్చి పెట్టింది. వీరిద్దరు తమ చాణక్య నీతిని అద్భుతంగా అమలుచేసి పశ్చిమ బెంగాల్ కోటపై కాషాయ జెండా ఎగరేయడంతోపాటు, అస్సాంను వరుసగా మూడోసారి చేజిక్కించుకున్నారు. 2016 లోనే తలపెట్టిన పశ్చిమ బెంగాల్ లక్ష్యాన్ని పదేళ్లు ఆలస్యంగానైనా ఛేదించి తాము అనుకున్నది సాధించకుండా వదిలిపెట్టబోమని నిరూపించారు. తమిళనాడులో ఎన్డీయే కూటమిలో ఉన్న అన్నాడీఎంకే ఘోర పరాభవం మూటగట్టుకోకుండా ఆపగలిగారు. ఆ పార్టీకి చెప్పుకోదగ్గ నాయకత్వం లేకపోయినా అధికార డీఎంకేని గద్దె దింపాలన్న లక్ష్యంతో పనిచేసి అనుకున్నది సాధించగలిగారు. మహిళా రిజర్వేషన్ల బిల్లుకు లోక్‌సభలో 2/3 వంతు మెజారిటీ రాకుండా అడ్డుకుని పైచేయి సాధించామన్న ధీమాతో ఉన్న ఇండియా కూటమి స్థైర్యాన్ని ఈ ఫలితాల ద్వారా భాజపా నేతలు దెబ్బ తీశారు. ఇండియా కూటమిలో కాంగ్రెస్ తరువాత పెద్ద పార్టీలుగా ఉన్న తృణమూల్ కాంగ్రెస్, డీఎంకేలు స్వరాష్ట్రాల్లో అధికారం కోల్పోవడంతో జాతీయ స్థాయిలో ఆ కూటమి రెక్కలు విరిగినట్లయింది. మహిళా రిజర్వేషన్ల బిల్లును అడ్డుకున్న పార్టీలను రాబోయే ఎన్నికల్లో మహిళలు క్షమించబోరని ఏప్రిల్ 16న లోక్‌సభలో ప్రధాని మోదీ చేసిన హెచ్చరికను ప్రస్తుత ఫలితాలు నిజం చేసినట్లయింది.

ముున్ముందు బలమైన నిర్ణయాలు

అస్సాం, పశ్చిమ బెంగాల్‌లలో భాజపా విజయంతో ప్రధాని మోదీ మున్ముందు మరింత బలమైన నిర్ణయాలు తీసుకునే అవకాశముంది. ముఖ్యంగా ఆయన మరోమారు మహిళా రిజర్వేషన్ల బిల్లును తెరమీదికి తేవడంతోపాటు, జమిలి ఎన్నికల అంశాన్ని బలంగా ప్రయోగించే అవకాశం ఉంటుంది.

ఇక పంజాబ్‌పై గురి!

పశ్చిమ బెంగాల్‌ను విజయవంతంగా ఛేదించిన భాజపా నాయకత్వం ఇక వచ్చే ఏడాది ఎన్నికలకు వెళ్లే పంజాబ్‌ను లక్ష్యంగా చేసుకుని పావులు కదిపే అవకాశముంది. 2027లో ఉత్తర్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్, గుజరాత్, హిమాచల్ ప్రదేశ్, గోవా, మణిపుర్, పంజాబ్‌లలో ఎన్నికలు జరగనున్నాయి. ఇందులో ఒక్క పంజాబ్, హిమాచల్ ప్రదేశ్ మినహా మిగిలిన 5 రాష్ట్రాల్లో భాజపా వరుసగా గెలుస్తూ వస్తోంది. హిమాచల్ ప్రదేశ్‌లో ఐదేళ్లకోసారి కుర్చీ మారే సంప్రదాయం ఉన్నందున సెంటిమెంట్ ప్రకారం అక్కడ భాజపా పాగా వేయడానికి అవకాశాలున్నాయి. ఇప్పటివరకూ అవకాశం లేనిదల్లా పంజాబ్‌లోనే. అక్కడ ఎన్డీయే కూటమి నుంచి శిరోమణి అకాలీదళ్ వైదొలిగిన తర్వాత భాజపా ఒంటరి పోరాటం చేస్తూ వస్తోంది. కాంగ్రెస్ నుంచి మాజీ ముఖ్యమంత్రి అమరీందర్ సింగ్ వైదొలిగిన తర్వాత బలమైన నాయకుడు లేక ఆ పార్టీ బలహీనం కావడం, ప్రకాశ్‌సింగ్ బాదల్ మరణం తర్వాత శిరోమణి అకాలీదళ్‌కు పెద్ద దిక్కు లేకుండాపోవడం ప్రస్తుతం ఆ రాష్ట్రంలోని రెండు ప్రధాన పార్టీలకు సమస్యగా మారింది. ఆ రెండు పార్టీల బలహీనతలవల్లే 2022లో జరిగిన ఎన్నికల్లో ఆప్ విజయకేతనం ఎగురవేసి తన ప్రాబల్యాన్ని దిల్లీ నుంచి పంజాబ్‌కు విస్తరించింది. అయితే ఇప్పుడు ఆప్ దిల్లీలో ఓడిపోవడం, ఆ పార్టీకి చెందిన రాజ్యసభ సభ్యులు ఏడుగురు భాజపా తీర్థం పుచ్చుకోవడంతో అరవింద్ కేజ్రీవాల్ నాయకత్వంపై అనుమానపు పొగలు మొదలయ్యాయి. ప్రస్తుతం ఆ పార్టీ నైతికంగా బలహీనమైన పరిస్థితిలో చిక్కుకుంది. ఇప్పుడు ఇదే అదనుగా భాజపా పంజాబ్‌కు ప్రత్యేక వ్యూహం రచించే సూచనలున్నాయి.

కూటమిలో పెరగనున్న కాంగ్రెస్ ఆధిపత్యం

తాజా ఫలితాలతో ఇండియా కూటమి దెబ్బతిన్నట్లు కనిపించినా కాంగ్రెస్ పార్టీకే ఒకరకంగా మేలు చేసేలా ఉన్నాయి. కాంగ్రెస్ పార్టీకి కేరళలో దక్కిన విజయమే ఇప్పుడు కూటమికి దక్కిన గొప్ప ఊరట. పదేళ్ల తర్వాత అక్కడ కాంగ్రెస్ అధికారంలోకి రావడం స్థానిక కాంగ్రెస్ శ్రేణుల్లో ఉత్తేజం నింపినా బలమైన ప్రతిపక్ష గొంతు వినిపించే వామపక్షాలు అధికారం కోల్పోవడం ఇండియా కూటమికి జాతీయ స్థాయిలో నష్టం చేకూర్చే అవకాశం ఉంది. అయితే కూటమిలో కాంగ్రెస్ అధిపత్యం పెరిగే అవకాశం ఉంది. బలమైన తృణమూల్, డీఎంకేలు ఓటమిపాలు కావడంతో ఆ రెండు పార్టీలు ఇకమీదట తమ ఎజెండాను ఇండియా కూటమిపై ఏకపక్షంగా రుద్దే అవకాశం ఉండదు. దానివల్ల కాంగ్రెస్ తనకున్న స్వతఃసిద్ధమైన బలం ఆధారంగా ఇండియా కూటమి ఎజెండాను నిర్ణయించే వెసులుబాటు దక్కనుంది. కాంగ్రెస్ తొలి నుంచీ పశ్చిమ బెంగాల్, తమిళనాడులలో బలహీనంగానే ఉంది. ప్రధానంగా కేరళ, అస్సాంలలోనే అధికారం కోసం పోటీ పడింది. అందులో ఒక రాష్ట్రాన్ని చేజిక్కించుకుని జాతీయ రాజకీయ వేదికపై తన ఉనికిని కాపాడుకుంది.

గిరిజనులతో పోలీసుస్టేషన్లు శుభ్రం చేయిస్తారా?: సుప్రీం కోర్టు



దిల్లీ: షెడ్యూల్డు తెగలు, కులాలకు చెందిన నిందితులకు బెయిలు మంజూరు కోసం ఒడిశా కోర్టులు విధిస్తున్న షరతులు అనుచితంగా ఉన్నాయంటూ సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. నెలల తరబడి పోలీసుస్టేషన్ల శుభ్రం వంటి పనులు చేయాలనడం అవమానకరం, గర్హనీయమని ధర్మాసనం పేర్కొంది. ధనికులు, ఉన్నత కులాల నిందితులకు ఇటువంటి షరతులు విధిస్తున్నారా? అంటూ నిలదీసింది. ఒడిశా హైకోర్టు విధించగా, దిగువ కోర్టులు అమలుపరుస్తున్న ఈ తరహా బెయిలు షరతులను రద్దు చేస్తూ ఉత్తర్వులిచ్చింది. ఇటువంటి నిబంధనలను ఏ న్యాయస్థానమూ విధించకూడదని స్పష్టం చేసింది. దేశ వ్యాప్తంగా న్యాయాధికారులందరికీ ఈ ఉత్తర్వులను అందుబాటులో ఉంచాలని ఆదేశించింది. ఒడిశాలో ఓ కార్పొరేట్ సంస్థ భూసేకరణకు వ్యతిరేకంగా నిరసన చేపట్టిన ఆదివాసీలు, దళితులను అరెస్టుచేసిన కేసులో హైకోర్టు, జిల్లా కోర్టులు బెయిలు మంజూరుకు విధించిన షరతులను అత్యున్నత న్యాయస్థానం సుమోటోగా విచారించింది. "ఒడిశా కోర్టుల ఉత్తర్వులు కులరహిత సమాజం అనే రాజ్యాంగ వాగ్దానాన్ని దెబ్బతీయడంతో పాటు కుల ఆధారిత పక్షపాతాన్ని ప్రతిబింబిస్తున్నాయి. స్వాతంత్ర్యం వచ్చిన 76 ఏళ్ల తర్వాత కూడా ఇలాంటివి జరుగుతున్నాయి. ధనవంతులైన నిందితులకు ఇటువంటి షరతులు విధించలేదు" అని ధర్మాసనం పేర్కొంది. పిటిషనర్లు ఈ షరతులను తొలగించుకునేందుకు హైకోర్టును ఆశ్రయించాలని సూచించింది.

వైద్య నిర్లక్ష్యం కేసుల్లో డాక్టర్ వారసులపైనా దావా : చికిత్స చేసిన వైద్యుడు మరణించినప్పటికీ ఆయన వారసులను దావాలో ప్రతివాదులుగా చేర్చవచ్చంటూ వైద్యపరమైన నిర్లక్ష్యం కేసులో సుప్రీంకోర్టు సోమవారం సంచలన తీర్పు వెలువరించింది. మూడు దశాబ్దాలుగా కొనసాగుతున్న న్యాయపరమైన మీమాంసకు జస్టిస్ జె.కె.మహేశ్వరి, జస్టిస్ ఎ.ఎస్.చందూర్కర్ ధర్మాసనం పరిష్కార మార్గం చూపుతూ కీలక వ్యాఖ్యలు చేసింది. దీని కోసం పాత చట్టాల్లోని నిబంధనలను తవ్వి బయటకు తీసింది. భారతీయ వారసత్వ చట్టంలోని సెక్షన్ 306ను ప్రస్తావిస్తూ దీని పరిధిని విస్తరించడంపై చర్చ జరగాలని అభిప్రాయపడింది. బిహార్‌కు చెందిన ఓ మహిళకు కంటి సమస్య రావడంతో డాక్టర్ పి.బి.లాల్ 1990లో చికిత్స చేశారు. సమస్య తీరకపోగా రెండో కన్ను పోయే పరిస్థితి ఏర్పడింది. బాధితురాలి భర్త దీనిపై జాతీయ వినియోగదారుల వివాద పరిష్కార కోర్టును ఆశ్రయించారు. కేసు విచారణ క్రమంలో తొలుత వైద్యుడు, ఆ తర్వాత బాధితురాలు మృతి చెందారు. ఈ కేసు సుప్రీంకోర్టుకు రాగా వైద్యం చేసిన డాక్టర్ మరణించినప్పటికీ అతని/ఆమె వారసులను వ్యాజ్యంలో ప్రతివాదులుగా చేర్చవచ్చని ధర్మాసనం పేర్కొంది.

యాసిడ్ దాడి కేసుల్లో శిక్షలు కఠినతరం చేయండి : దేశంలో యాసిడ్ దాడులు ఆందోళనకర స్థాయిలో పెరుగుతున్నాయని, అటువంటి నేరాలకు శిక్షలను మరింత కఠినతరం చేయాలని కేంద్రానికి సుప్రీంకోర్టు సూచించింది. నిర్దోషిత్వాన్ని నిరూపించుకునే బాధ్యతనూ నిందితుడిపైనే ఉంచాలని పేర్కొంది. బలప్రయోగం కారణంగా యాసిడ్ తాగిన లేదా బాహ్యంగా ఎలాంటి గాయాలు కనిపించకుండా అంతర్గత అవయవాలు దెబ్బతిన్న బాధితులను కూడా 'దివ్యాంగుల హక్కుల చట్టం, 2016' పరిధిలో చేర్చాలని ఆదేశించింది. 2016లో చట్టం అమల్లోకి వచ్చినప్పట్నుంచే ఈ సవరణ చేసినట్లుగా భావించాలని వ్యాఖ్యానించింది. సంక్షేమ పథకాలు వర్తించేలా. . యాసిడ్ దాడికి గురైన వారిని దివ్యాంగులుగా పరిగణించాలని కోరుతూ షాహీన్ మాలిక్ అనే బాధితురాలు దాఖలు చేసిన పిల్‌పై ధర్మాసనం ఈ మేరకు ఉత్తర్వులు జారీచేసింది.

కర్ణాటక ఉప ఎన్నికల్లో.. రెండు చోట్లా కాంగ్రెస్ విజయం

ఈనాడు, బెంగళూరు: కర్ణాటకలోని రెండు అసెంబ్లీ నియోజకవర్గాలకు నిర్వహించిన ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించింది. 2023లో జరిగిన ఎన్నికల్లో బాగల్‌కోటె, దావణగెరె దక్షిణ నియోజకవర్గాలు రెండింటినీ కాంగ్రెస్ గెలుచుకోగా, అక్కడి ఎమ్మెల్యేలు మరణించారు. ఈ స్థానాలకు ఏప్రిల్ 9న ఉపఎన్నికలు జరిగాయి. సోమవారం వెల్లడించిన ఫలితాల్లో బాగల్‌కోటె నుంచి ఉమేశ్ మేటి 22,867 ఓట్లు, దావణగెరె దక్షిణ నుంచి సమర్థ్ మల్లికార్జున సుమారు 5 వేల ఓట్ల ఆధిక్యంతో గెలిచారు. వీరిద్దరూ మరణించిన శాసనసభ్యుల వారసులు కావడం గమనార్హం.

మూడేళ్ల తర్వాత మారిన ఫలితం

చిక్కబళ్లాపుర జిల్లా శృంగేరి నియోజకవర్గంలో 2023లో పోలైన పోస్టల్ బ్యాలెట్ ఓట్లను హైకోర్టు ఆదేశాల మేరకు మళ్లీ లెక్కించగా, తాజా ఫలితాల్లో భాజపా అభ్యర్థి జీవరాజ్ 52 ఓట్ల ఆధిక్యంతో గెలిచారు. గత ఎన్నికల్లో ఈ స్థానం నుంచి కాంగ్రెస్ అభ్యర్థి రాజేగౌడ కేవలం 201 ఓట్లతో గెలవగా, పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపుపై సందేహంతో భాజపా అభ్యర్థి కోర్టులో ఫిర్యాదు చేశారు. మూడేళ్లపాటు విచారణ చేపట్టిన హైకోర్టు ఏప్రిల్‌లో ఇచ్చిన ఆదేశాల మేరకు ఈ నెల 2న మళ్లీ ఓట్లు లెక్కించగా భాజపా అభ్యర్థి విజయం సాధించారు.

తెలంగాణపైనా పశ్చిమబెంగాల్ ఎన్నికల ప్రభావం

కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

ఈనాడు, దిల్లీ: పశ్చిమబెంగాల్‌లో ప్రభుత్వం మారాలని దేశప్రజలంతా కోరుకున్నారని.. వారి ఆకాంక్షను ఆ రాష్ట్ర ప్రజలు నెరవేర్చారని కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. దాని ప్రభావం తెలంగాణపైనా ఉంటుందని అభిప్రాయపడ్డారు. ఎన్నికల ఫలితాల అనంతరం ఆయన సోమవారం ఇక్కడ విలేకరులతో మాట్లాడారు. "ప్రజలు ప్రధాని మోదీని మరోసారి ఆశీర్వదించారు. అందుకే భాజపా తొలిసారి పశ్చిమబెంగాల్‌లో భారీ మెజార్టీతో ప్రభుత్వం ఏర్పాటుచేస్తోంది. తెలంగాణలోనూ ఈ ఎన్నికల ఫలితాల ప్రభావం సానుకూలంగా ఉంటుంది" అని పేర్కొన్నారు.

మోదీ నాయకత్వంపై విశ్వాసానికి ఈ ఫలితాలే నిదర్శనం

• సీఎం చంద్రబాబు

ఈనాడు, అమరావతి: ప్రధాని మోదీ నాయకత్వం, దార్శనికతలపై ప్రజల్లో పెరుగుతున్న విశ్వాసానికి పశ్చిమబెంగాల్, అస్సాం, పుదుచ్చేరి ఎన్నికల ఫలితాలే నిదర్శనమని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్‌షా, భాజపా జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్, కార్యకర్తలకు ఎక్స్ వేదికగా శుభాకాంక్షలు తెలిపారు. "అభివృద్ధి పట్ల ఎన్డీయేకున్న నిబద్ధతకు ప్రజలిస్తున్న మద్దతు మరోసారి స్పష్టమైంది. 'సబ్‌కా సాథ్, సబ్‌కా వికాస్, సబ్‌కా విశ్వాస్' స్ఫూర్తితో నడిచే ఎన్డీయే, ప్రజల ఆకాంక్షల సంగమం. వికసిత్ భారత్ దిశగా మన ప్రయాణ వేగం మరింత పెరిగింది" అని చంద్రబాబు పేర్కొన్నారు.

ఎన్డీయే నేతలకు లోకేశ్ శుభాకాంక్షలు

అభివృద్ధి, రాజకీయ స్థిరత్వం, నిర్ణయాత్మక నాయకత్వంపై ప్రజలకున్న ప్రగాఢ విశ్వాసానికి పశ్చిమబెంగాల్, అస్సాం, పుదుచ్చేరి ఎన్నికల ఫలితాలు నిదర్శనమని మంత్రి నారా లోకేశ్ అన్నారు. ప్రధాని నరేంద్రమోదీ దూరదృష్టి, నిజాయతీ పట్ల ప్రజల్లో ఉన్న నమ్మకాన్ని ఈ గెలుపు మరోసారి రుజువు చేసిందన్నారు. ఎక్స్ వేదికగా ఎన్డీయే నేతలకు శుభాకాంక్షలు తెలిపారు.

విజయ్ అరంగేట్రం ఓ అద్భుతం

తమిళనాడు ఎన్నికల్లో ప్రభంజనం సృష్టించిన టీవీకే అధినేత విజయ్ అరంగేట్రమే ఓ అద్భుతమని లోకేశ్ కొనియాడారు. ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. తమిళ ప్రజల ఆకాంక్షల్ని ఈ ఫలితాలు ప్రతిబింబించాయని చెప్పారు. ప్రజల ఆకాంక్షల్ని ఆయన నెరవేర్చాలని అభిలషించారు.

ప్రజాసేవలోనూ విజయ్ విజయవంతం కావాలి: చంద్రబాబు

తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో అతిపెద్ద పార్టీగా అవతరించిన టీవీకే పార్టీ అధినేత విజయ్‌కు సీఎం చంద్రబాబు శుభాకాంక్షలు తెలిపారు. తమిళనాడు ప్రజలకు సేవ చేయడం, వారి పురోగతి, సంక్షేమానికి కృషి చేయడంలోనూ ఆయన విజయంతం కావాలని 'ఎక్స్' వేదికగా ఆకాంక్షించారు.

ఓటర్లు బలమైన మార్పు కోరుకున్నారు

• ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్

ఈనాడు, అమరావతి: 'నాలుగు రాష్ట్రాలు.. ఒక కేంద్ర పాలిత ప్రాంతం ఎన్నికల ఫలితాల్లో ఓటర్ల చైతన్యం మరోసారి స్పష్టంగా కనిపిస్తోంది. పాలన నచ్చితే మళ్లీ మళ్లీ గెలిపిస్తారు. లేకుంటే నిర్దాక్షిణ్యంగా ఓడిస్తారనడానికి ఈ ఫలితాలే చక్కని ఉదాహరణ. తమిళనాడు, కేరళ, పశ్చిమ బెంగాల్ ప్రజలు ఈసారి మార్పును బలంగా కోరుకున్నారు. అస్సాం, పుదుచ్చేరిల్లో తమ ప్రాభవాన్ని నిలబెట్టుకుని పశ్చిమ బెంగాల్ ప్రజల మనసును గెలుచుకున్న భాజపాకు అభినందనలు. ఆ పార్టీ అగ్రనాయకత్వం అకుంఠిత దీక్ష శ్లాఘనీయం' అని ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 'పశ్చిమ బెంగాల్ ప్రజల నమ్మకాన్ని పొందడానికి ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్‌షా కొన్ని సంవత్సరాలుగా చేసిన కృషి ఇప్పుడు ఫలితాన్ని ఇచ్చింది. వారితోపాటు భాజపా జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్, పశ్చిమబెంగాల్ నేత సువేందు అధికారి, అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వశర్మ, పుదుచ్చేరి ముఖ్యమంత్రి రంగసామికి అభినందనలు' అని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు.

పార్టీని స్థాపించిన కొద్ది కాలంలోనే...

'తమిళనాడులో ప్రముఖ కథానాయకుడు విజయ్.. పార్టీని స్థాపించిన కొద్ది కాలంలోనే చక్కటి విజయాన్ని అందుకున్నారు. సింహభాగం ప్రజలు టీవీకే వైపు మొగ్గు చూపారు. విజయ్‌కు అభినందనలు. అన్నాడీఎంకే, భాజపా బలమైన పోరాటం చేశాయి. కేరళలో కాంగ్రెస్ నాయకత్వంలో ఎన్నికల్లో గెలిచిన యూడీఎఫ్ నాయకులకూ అభినందనలు' అని పవన్‌కల్యాణ్ ఆ ప్రకటనలో వివరించారు.

విజయ్‌కు అభినందనలు.. దీదీకి సానుభూతి: జగన్

ఈనాడు, అమరావతి: 'నా ప్రియ సోదరుడు విజయ్‌కి ప్రత్యేక, హృదయపూర్వక అభినందనలు'అని తమిళనాడు టీవీకే అధినేత విజయ్‌ను ఉద్దేశించి మాజీ ముఖ్యమంత్రి జగన్ సోమవారం 'ఎక్స్'లో పేర్కొన్నారు. 'మీ మొట్టమొదటి ఎన్నికల్లోనే అతిపెద్ద పార్టీగా అవతరించడం అద్భుతం. మీరు చేస్తున్న సేవలో కొత్త చాప్టర్‌ను ప్రారంభించబోతున్న నేపథ్యంలో మీకు అపారమైన బలం, విజయం కలగాలని ఆకాంక్షిస్తున్నా. దేవుడు మీకు తోడుగా ఉంటాడు' అని తెలిపారు. 'దీదీకి నా సానుభూతి, భాజపా, ఇతరులకు అభినందనలు'అని పశ్చిమబెంగాల్ ఎన్నికల ఫలితాలపై జగన్ స్పందించారు.

యానాంలో మల్లాడి విజయకేతనం



విజయోత్సవ ర్యాలీలో మల్లాడి కృష్ణారావు

యానాం, న్యూస్‌టుడే: పుదుచ్చేరి శాసనసభ ఎన్నికల్లో యానాం నియోజకవర్గ ఎన్డీయే అభ్యర్థిగా ఆలిండియా ఎన్నార్ కాంగ్రెస్ నేత మల్లాడి కృష్ణారావు విజయకేతనం ఎగురవేశారు. సిట్టింగ్ ఎమ్మెల్యే, కాంగ్రెస్ అభ్యర్థి గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్‌పై 4,568 ఓట్ల ఆధిక్యంతో విజయం సాధించారు. సోమవారం ఓట్ల లెక్కింపు మూడో రౌండు పూర్తికాగానే యానాం వీధుల్లో మల్లాడి విజయోత్సవ ర్యాలీని ప్రారంభించారు. హుషారెత్తించే పాటల నడుమ వ్యానుపైకి ఎక్కిన మల్లాడి తొడ కొట్టి స్టెప్పులు వేశారు. ఎమ్మెల్యేగా మల్లాడి కృష్ణారావుకు ఇది ఆరో విజయం. పుదుచ్చేరిలోని 30 చిన్న నియోజకవర్గాల్లో తెలుగువారున్న యానాం ఒకటి. ఇటు కాకినాడ, అటు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాల మధ్యలో ఉంటుంది. తమిళనాట ప్రభంజనం సృష్టించిన టీవీకే అభ్యర్థిగా ఇక్కడ పోటీ చేసిన తోట రాజు కేవలం 166 ఓట్లు సాధించి డిపాజిట్ పోగొట్టుకున్నారు. నోటాకు 193 ఓట్లు పడ్డాయి.

శ్రీవారిని దర్శించుకున్న నటి త్రిష



శ్రీవారి ఆలయం ఎదుట త్రిష

తిరుమల, చెన్నై - న్యూస్‌టుడే: తిరుమల శ్రీవారిని సినీ నటి త్రిష సోమవారం దర్శించుకున్నారు. తెల్లవారుజామున సుప్రభాత సేవలో పాల్గొన్నారు. అనంతరం రంగనాయకుల మండపంలో పండితులు వేదాశీర్వచనం ఇవ్వగా తితిదే అధికారులు తీర్థప్రసాదాలు అందజేశారు. తన పుట్టిన రోజు సందర్భంగా శ్రీవారిని దర్శించుకున్నట్లు త్రిష తెలిపారు. తిరుమలేశుని దర్శనం తర్వాత ఆమె నేరుగా చెన్నై చేరుకుని నీలాంకరైలోని టీవీకే అధినేత విజయ్ నివాసానికి వెళ్లారు.



విజయ్ నివాసానికి వెళుతూ అభివాదం...

మమత అరాచకాలే ఓటమికి కారణం

• కేంద్రమంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ

భవానీపురం, న్యూస్‌టుడే: పశ్చిమ బెంగాల్‌లో అభివృద్ధి శూన్యమని, బంగ్లాదేశ్ చొరబాటుదార్ల ఓట్లతోనే ఇన్నాళ్లూ మమతా బెనర్జీ గెలుస్తూ వచ్చారని కేంద్రమంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ అన్నారు. విజయవాడలోని భాజపా రాష్ట్ర కార్యాలయంలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. మమత అరాచకాలు, దేశ వ్యతిరేక పనులే ఆమెను ఓడించాయని విమర్శించారు. శ్యామాప్రసాద్ ముఖర్జీ సొంత రాష్ట్రంలో పార్టీ విజయం సాధించడం సంతోషంగా ఉందని అన్నారు. అస్సాం, పుదుచ్చేరిల్లోనూ స్పష్టమైన మెజారిటీ సాధించామని, తమిళనాడు, కేరళల్లో ఓటింగ్ శాతం పెరిగిందన్నారు. పశ్చిమ బెంగాల్‌లో ఆటవిక పాలనకు ప్రజలు ముగింపు పలికారని రాష్ట్ర మంత్రి సత్యకుమార్ యాదవ్ సంతోషం వ్యక్తం చేశారు. అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పన, సంపద సృష్టి కారణంగానే ప్రధాని మోదీని ప్రజలు ఆశీర్వదిస్తున్నారని తెలిపారు.



విజయవాడలోని భాజపా రాష్ట్ర కార్యాలయంలో డప్పు కొడుతున్న భూపతిరాజు శ్రీనివాసవర్మ

అంబరాన్నంటిన సంబరాలు: భాజపా విజయంతో ఆ పార్టీ రాష్ట్ర కార్యాలయంలో సంబరాలు అంబరాన్నంటాయి. భూపతిరాజు శ్రీనివాసవర్మ, సత్యకుమార్‌లు పార్టీ కార్యాలయంలోనే కూర్చుని ఎన్నికల ఫలితాలను టీవీలో వీక్షించారు. సాయంత్రం కార్యాలయం బయట కార్యకర్తలు, నాయకులు సంబరాలు చేసుకున్నారు.

సురక్షిత భారతావనే భాజపా లక్ష్యం: పీవీఎన్ మాధవ్



శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: సురక్షిత భారతావనే లక్ష్యంగా భాజపా ముందుకెళ్తోందని ఆ పార్టీ రాష్ట్రాధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ తెలిపారు. పశ్చిమ బెంగాల్, అస్సాం, పుదుచ్చేరిల్లో భాజపా విజయాన్ని పురస్కరించుకుని సోమవారం శ్రీకాళహస్తి పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం మాధవ్ విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. బంగ్లాదేశ్ చొరబాటుదారులకు పశ్చిమ బెంగాల్ రాజమార్గంగా మారిందన్నారు. దీన్ని నియంత్రించాల్సిన సీఎం మమతాబెనర్జీ వాటిని పెంచి పోషించారని ఆరోపించారు. హిందువులపై దాడులు చేయిస్తూ రౌడీయిజంతో పాలన సాగించారని మండిపడ్డారు. అక్కడి ప్రజలు ముక్తకంఠంతో దీన్ని ఖండించడంతోపాటు ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్‌షా నేతృత్వంలో భాజపాకు భారీ ఆధిక్యం లభించిందన్నారు.

(c) eenadu

నేడు వరల్డ్ ఆస్థమా డే

ఇన్‌హేలర్లపై అపోహలొద్దు!

'ఆస్థమా (ఉబ్బసం) బాధితులందరికీ ఊపిరితిత్తుల్లో వాపుప్రక్రియను తగ్గించే ఇన్‌హేలర్లు అందుబాటులో ఉంచాలి. ఇది ఇంకా తక్షణావసరమే'- వరల్డ్ ఆస్థమా డే ఇస్తున్న నినాదమిది. అవును ఆస్థమా ఉద్ధృతమైనప్పుడే కాదు, దాన్ని అదుపులో ఉంచటానికీ ఇన్‌హేలర్ మందులు వాడుకోవటం చాలా ముఖ్యం. అయినా కూడా మనదగ్గర ఇన్‌హేలర్ల మీద బోలెడన్ని భయాలు, సందేహాలు, అపోహాలు నెలకొని ఉండటం పెద్ద అడ్డంకిగా నిలుస్తోంది. గోటితో పోయే దాన్ని పెద్ద సమస్యగా పరిణమించేలా చేస్తోంది.



ఉబ్బసం (ఆస్థమా) దీర్ఘకాల సమస్య. దుమ్ము, ధూళి, పుప్పొడి వంటి అలర్జీ కారకాలకు గాలి గొట్టాలు అతిగా స్పందించటం దీనికి మూలం. దీంతో వాపు ప్రక్రియ (ఇన్‌ఫ్లమేషన్) తలెత్తి గాలిగొట్టాల గోడలు ఉబ్బి, లోపలి మార్గం సన్నబడుతుంది. మరోవైపు జిగురుద్రవం ఉత్పత్తి ఎక్కువై, లోపలే చిక్కుకుంటుంది. ఫలితంగా శ్వాస కష్టమైపోతుంది. దగ్గు, ఆయాసం, పిల్లికూతల వంటి లక్షణాలు మొదలవుతాయి. కొందరిలో ఇవి కొద్దిసేపే ఉండొచ్చు. ఒకట్రెండు లక్షణాలే ఉండొచ్చు. కొందరికి ప్రత్యేకించి కొన్ని సమయాల్లోనే తలెత్తొచ్చు. ఎప్పుడెలా మొదలైనా గానీ తీవ్ర అసౌకర్యం కలిగిస్తాయి. అయితే ఇప్పుడు ఆస్థమాకు భయపడాల్సిన పనిలేదు. దీని నియంత్రణకు మంచి చికిత్సలున్నాయి. ముఖ్యంగా నోటి ద్వారా పీల్చుకునే ఇన్‌హేలర్ మందులు ఎంతో మేలు చేస్తాయి. వీటిల్లో రెండు రకాలుంటాయి. 1. బ్రాంకోడైలేటర్ (రిలీవర్). ఇది ఉన్నట్టుండి ఆస్థమా ఉద్ధృతం కాకుండా చూస్తుంది. లక్షణాలు సత్వరం ఉపశమించటానికి తోడ్పడుతుంది. 2. కార్టికోస్టెరాయిడ్ (కంట్రోలర్). ఇది వాపు ప్రక్రియను అదుపులో పెడుతూ ఆస్థమాను దీర్ఘకాలం నియంత్రణలో ఉంచుతుంది. ఈ మందులు నేరుగా ఊపిరితిత్తుల్లోకి వెళ్లి, సమస్య ఉన్న చోటే పనిచేస్తాయి. అందువల్ల తక్కువ మోతాదు మందుతోనే ఎక్కువ ప్రయోజనం లభిస్తుంది. వీటిని వాడుకోవటం ద్వారా రోజువారీ పనులు హాయిగా, ఆనందంగా చేసుకోవచ్చు. అందువల్ల ఇన్‌హేలర్ల మీద అవగాహన పెంచుకొని.. అపోహలు, భయాలను తొలగించుకోవటం చాలా ముఖ్యం.



డా॥ కె.శుభాకర్
ప్రొఫెసర్, హెచ్‌ఓడీ
క్షయ, ఛాతీ వ్యాధుల విభాగం
కామినేని వైద్య విజ్ఞాన సంస్థ
హైదరాబాద్

✦ ఇన్‌హేలర్లు చివరి, తీవ్ర దశలోనే వాడతారనేది కొందరి అపోహ. ఇది నిజం కాదు. జబ్బు నిర్ధారణ అయినప్పటి నుంచే వీటి వాడకం మొదలెట్టాలి. ఆస్థమా ముదరక ముందే వీటిని వాడటం ఆరంభిస్తే మున్ముందు ఊపిరితిత్తులు దెబ్బతినకుండా కాపాడుకోవచ్చు.

✦ అదే పనిగా వాడితే ఇన్‌హేలర్లు అలవాటవుతాయనేది మరొక అపోహ. ఇవి మత్తు పదార్థాలు కావు. మందులను ఊపిరితిత్తుల్లోకి నేరుగా చేరవేసే సాధనాలు మాత్రమే. ఆస్థమా అనేది అధిక రక్తపోటు, మధుమేహం వంటి దీర్ఘకాలిక సమస్య. దీని నియంత్రణ కోసం మందు వాడటమంటే అది అలవడటం కాదు. ఆరోగ్యాన్ని కాపాడుకోవటం.

✦ ఇన్‌హేలర్లతో దుష్ప్రభావాలు ఎక్కువనేది మరికొందరి భయం. నిజానికి మాత్రల కన్నా ఇన్‌హేలర్లే సురక్షితం. మనం వేసుకునే మాత్రలోని మందు రక్తంలో కలిసి శరీరమంతా చేరుతుంది. కానీ ఇన్‌హేలర్ ద్వారా పీల్చుకునే మందు నేరుగా ఊపిరితిత్తుల్లోకే వెళ్తుంది. మాత్రలతో పోలిస్తే వీటిల్లో మందు మోతాదు చాలా తక్కువ. ఇన్‌హేలర్ రూపంలో 200 మైక్రోగ్రాముల మోతాదులోనే మందు తీసుకుంటారు. ఇది ఊపిరితిత్తుల్లోకి వెళ్లి, అక్కడే పనిచేస్తుంది. అక్కడి నుంచే శ్వాస ద్వారా బయటకు వస్తుంది. రక్తంలో కలవదు. కాబట్టి సురక్షితం. ఎలాంటి అనర్థాలూ ఉండవు.

✦ ఎక్కువ ఖర్చవుతుందనేది ఇంకొందరి అభిప్రాయం. ఆస్థమా నియంత్రణలో లేకపోవటం వల్ల ఒకసారి ఆసుపత్రిలో చేరి, చికిత్స తీసుకోవటానికయ్యే ఖర్చుతో పది సంవత్సరాలకు సరిపడా ఇన్‌హేలర్ మందులు కొనుక్కోవచ్చు. వీటికయ్యే ఖర్చును ఆరోగ్యం కోసమేనని భావించాలి.

✦ పిల్లల్లో ఆస్థమా పెద్దయ్యాక అదే తగ్గుతుందని, ఇన్‌హేలర్లు దండగని కొందరు భావిస్తుంటారు. ఇది పెద్ద అపోహ. పరిసరాల్లో అలర్జీ కారకాలు, వీటికి ఎంతవరకు గురవుతున్నామనే దాన్ని బట్టి ఆస్థమా దాడి చేయటం ఆధారపడి ఉంటుంది. కొందరు పిల్లల్లో లక్షణాలు క్రమంగా తగ్గుముఖం పట్టినా నయమైనట్టు కాదు. వయసుతో పాటు ఊపిరితిత్తులు పెరగటం వల్ల జబ్బు తీవ్రత తగ్గుతుండొచ్చు గానీ పూర్తిగా పోయిందనుకోవటం తగదు.

✦ ఇన్‌హేలర్లలో ఉండే స్టెరాయిడ్లు ప్రమాదకరమన్నది మరికొందరి భయం. వీటిల్లో వాడేవి కార్టికోస్టెరాయిడ్లు. అంటే ఇవి మన శరీరంలో సహజంగా ఉత్పత్తయ్యే హార్మోన్ల వంటివన్నమాట. క్రీడాకారులు వాడే అనబాలిక్ స్టెరాయిడ్లకూ వీటికీ అసలు సంబంధమే లేదు. ఊపిరితిత్తుల్లో వాపును తగ్గించటానికివి అత్యంత సురక్షితమైనవి.

✦ స్టెరాయిడ్ మందులతో పిల్లల్లో ఎదుగుదల తగ్గుతుందని కొందరు భయపడుతుంటారు. ఇది తగదు. డాక్టర్లు సూచించిన మోతాదుల్లో వాడితే ఎదుగుదలకు ఎలాంటి ఇబ్బందీ ఉండదు. నిజానికి ఆస్థమా నియంత్రణలో లేకపోతేనే పిల్లలు తరచూ అనారోగ్యానికి గురై ఎదుగుదల కుంటుపడుతుందని గుర్తించాలి.

✦ ఇన్‌హేలర్ల కన్నా నెబ్యులైజర్లు మెరుగైనవని కొందరు భావిస్తుంటారు. కానీ ఇన్‌హేలర్లను సరైన పద్ధతిలో వాడితే నెబ్యులైజర్‌తో సమానంగా పనిచేస్తుంది. ఇన్‌హేలర్ వాడకం తేలిక. దీన్ని వెంట ఎక్కడికైనా తీసుకెళ్లొచ్చు. శ్వాస తీసుకోవటం చాలా కష్టంగా ఉండి, ఇన్‌హేలర్‌ను వాడలేని స్థితిలో ఉంటేనే డాక్టర్లు నెబ్యులైజర్‌ను సూచిస్తారు.

✦ ఆస్థమా గలవారు వ్యాయామం చేయకూడదనేది మరో అపోహ. నిజానికి ఆస్థమా అదుపులో ఉంటే ఆటల పోటీల్లోనూ పాల్గొనొచ్చు. ఎంతోమంది క్రీడాకారులు ఆస్థమా ఉండి కూడా ఇన్‌హేలర్లు వాడుతూ ఒలింపిక్ ఛాంపియన్లుగా అవతరించారు. వ్యాయామంతో ఊపిరితిత్తుల సామర్థ్యం ఇనుమడిస్తుంది. ఒకవేళ ఎవరికైనా వ్యాయామం చేయటం మూలంగా ఆస్థమా వస్తున్నట్టయితే ముందు ఇన్‌హేలర్ వాడుకొని, వ్యాయామం మొదలెట్టాలి.

పాదాల మంటతో ఇబ్బంది పడుతున్నా

సమస్య సలహా

సమస్య: నాకు మూడేళ్ల నుంచీ అరికాళ్ల మంటలు పుడుతున్నాయి. విటమిన్ బి12 లోపం ఉంటే దానికి చికిత్స తీసుకున్నాను. కానీ మంటలు మాత్రం తగ్గలేదు. ఇవి బాగా ఇబ్బంది పెడుతున్నాయి. నేను విద్యార్థిని. పరీక్షలకు సిద్ధమవుతున్నాను. నాకు మధుమేహం, థైరాయిడ్ జబ్బులేవీ లేవు. అరికాళ్ల మంటలు తగ్గటానికి ఏం చెయ్యాలి? – ధూళి బంగారి, రాజమండ్రి

సలహా: సాధారణంగా మధుమేహం, థైరాయిడ్ జబ్బులు, విటమిన్ బి12 లోపం గలవారికి అరికాళ్ల మంటలు వస్తుంటాయి. మీరు అవేవీ లేవంటున్నారు కాబట్టి ఇతరత్రాల కారణాలేవైనా ఉండొచ్చని అనిపిస్తోంది. తొడ నుంచి మడమ గుండా పాదాలకు చేరుకునే టిబియల్ నాడి నొక్కుకుపోవటం లేదా దెబ్బతినటం (టార్సెల్ టన్నెల్ సిండ్రోమ్) వల్ల మంటలు రావొచ్చు.



విటమిన్ బి12 లోపం ఒక్కటే కాదు. థయమిన్ (బి1), పైరిడాక్సిన్ (బి6), ఫోలిక్ యాసిడ్ (బి9) లోపంతోనూ పాదాలు మంట పుట్టొచ్చు. అథ్లెట్స్ ఫుట్ అనే ఫంగల్ ఇన్‌ఫెక్షన్‌లోనూ మంట, సూదులు పొడిచినట్టు అనిపించొచ్చు. మీకు మద్యం అలవాటుందో లేదో తెలియదు. కానీ దీర్ఘకాలంగా మద్యం అలవాటు మూలంగానూ పాదాల మంట పుట్టొచ్చు. రుమటాయిడ్ ఆర్థ్రయిటిస్ వంటి స్వీయ రోగ నిరోధక జబ్బులు.. అరుదుగా ఎరిత్రోమెలాల్జియా, కొన్ని జన్యు సమస్యలూ కారణం కావొచ్చు. మీరు జనరల్ ఫిజిషియన్ లేదా న్యూరాలజిస్టును సంప్రదించండి. మీ పరిస్థితిని క్షుణ్నంగా పరిశీలించి, కారణాన్ని గుర్తిస్తారు. నాడుల పనితీరును తెలిపే నర్వ్ కండక్షన్ పరీక్ష చేస్తారు. కారణాన్ని బట్టి చికిత్స చేస్తారు. ఇదమిత్థంగా కారణం తెలియకపోతే నాడి నుంచి చిన్న ముక్కను తీసి పరీక్షించాల్సి ఉంటుంది. ఇందులో కారణం స్పష్టంగా బయటపడుతుంది.



\- ఎం.వి.రావు, జనరల్ ఫిజిషియన్

మీ ఆరోగ్య సమస్యలను sukhi@eenadu.in కు పంపొచ్చు.

కొట్టుకోవటమే గుండెకు రక్ష!



రొమ్ము, పెద్దపేగు, కాలేయం, కిడ్నీ, ప్రోస్టేట్ క్యాన్సర్ల గురించి వినే ఉంటారు. ఇలా శరీరంలోని ప్రతి భాగంలోనూ కణితులు తలెత్తుతుండటం గమనిస్తూనే ఉంటాం. కానీ గుండె క్యాన్సర్ గురించి విన్నారా? నిజానికిది చాలా చాలా అరుదు. అనుక్షణం లబ్‌డబ్‌మని కొట్టుకుంటూ శరీరమంతటికీ రక్తాన్ని పంప్ చేసే గుండెను క్యాన్సర్ విషయంలో కాపాడుతున్నదేంటి? గుండె కొట్టుకోవటమే దీన్ని రక్షిస్తోందా? ఇదే నిజం కావొచ్చని ఇటలీలోని యూనివర్సిటీ ఆఫ్ ట్రీస్టీ పరిశోధకులు అంటున్నారు. గుండె కొట్టుకోవటం మూలంగానే అక్కడ క్యాన్సర్ వృద్ధి చెందటం లేదని ఎలుకలపై చేసిన అధ్యయనంలో గుర్తించారు. క్షీరదాల్లో గుండె క్యాన్సర్ ఎందుకు అరుదనే సంగతినీ ఇది విశదీకరించ గలదని భావిస్తున్నారు. ఈ అధ్యయనంలో భాగంగా జన్యుపరంగా మార్చిన ఎలుకల మెడ మీద మార్పిడి గుండెను అమర్చారు. ఇది కొట్టుకోదు. కానీ దానికి రక్తసరఫరా అవుతుంది. అనంతరం ఈ మార్పిడి గుండెలోకి, అలాగే సహజ గుండెలోకి క్యాన్సర్ కణాలను జొప్పించారు. మార్పిడి గుండెలో క్యాన్సర్ కణాలు వృద్ధి చెంది, చాలా భాగాన్ని ఆక్రమించాయి. అదే సహజ గుండెలో సుమారు 20% మాత్రమే క్యాన్సర్ తలెత్తటం గమనార్హం. గుండె క్యాన్సర్ ఎందుకు అరుదనే ప్రశ్నకు దీంతో సమాధానం లభించినట్టయ్యింది. గుండె కొట్టుకోవటం మూలంగా దాని మీద పడే భారమే క్యాన్సర్ రాకుండా కాపాడు తుండొచ్చని పరిశోధకులు భావిస్తున్నారు. అందుకే రొమ్ములు, చర్మం వంటి ఇతర భాగాలనూ ఇలాగే ఒత్తిడికి గురిచేస్తే క్యాన్సర్ నివారణకు తోడ్పడుతుందా? అనే దానిపై ఇప్పుడు దృష్టి సారించారు.

బ్యాక్టీరియాతో కిడ్నీరాళ్లు



కిడ్నీరాళ్లు చాలా ఇబ్బంది పెడతాయి. ఇవి మూత్రంలోని ఖనిజ లవణాలు పోగుపడటం వల్ల ఏర్పడుతుంటాయి. చాలావరకూ క్యాల్షియం ఆక్సలేట్ రకం రాళ్లే ఉంటాయి. కొన్నేమో మూత్ర ఇన్‌ఫెక్షన్ అనంతరం ఏర్పడు తుంటాయి. స్ట్రువైట్ రకానికి చెందిన ఇవి మూత్ర ఇన్‌ఫెక్షన్లకు కారణమయ్యే బ్యాక్టీరియాతో ముడిపడి ఉంటాయి. అయితే ఆక్సలేట్ రకం రాళ్లలోనూ బ్యాక్టీరియా ఉంటున్నట్టు తాజాగా బయటపడింది. శస్త్రచికిత్స ద్వారా తొలగించిన రాళ్లను పరిశోధకులు అత్యాధునిక మైక్రోస్కోప్‌తో పరిశీలించారు. మూత్ర ఇన్‌ఫెక్షన్లు గలవారు, లేనివారి నుంచి తీసిన రెండు రకాల రాళ్లలోని బయోఫిల్మ్‌లో బ్యాక్టీరియా వ్యవస్థీకృతమై ఉంటున్నట్టు తేలటం గమనార్హం. బ్యాక్టీరియా సమూహం ఒకదగ్గర అంటుకొని బయోఫిల్మ్‌గా ఏర్పడుతుంటాయి. దీన్నుంచి విడుదలయ్యే రసాయనాలు ఖనిజ లవణాలు ఒకదగ్గర పోగుపడేలా పురికొల్పుతున్నట్టు, రాళ్లుగా ఏర్పడేలా చేస్తున్నట్టు కనిపిస్తోందని పరిశోధకులు చెబుతున్నారు. కిడ్నీరాళ్లకూ బ్యాక్టీరియాకూ మధ్య సంబంధం గురించి మరింత లోతుగా తెలుసుకోవటం మీదా దృష్టి సారించారు. కేవలం రసాయనాలు, భౌతిక ప్రక్రియలతోనే రాళ్లు ఏర్పడతాయని దీర్ఘకాలంగా అనుకుంటున్నారు. తాజా అధ్యయన ఫలితాలు దీన్ని సవాల్ చేస్తున్నాయి. రాళ్ల లోపల బ్యాక్టీరియా గూడు కట్టుకొని ఉంటున్నట్టు, రాళ్లు ఏర్పడటంలో ఇవి కీలక పాత్ర పోషిస్తున్నట్టు చెబుతున్నాయి. అందుకే కిడ్నీరాళ్ల నివారణకు, చికిత్సకు ఈ అధ్యయన ఫలితాలు ఎంతగానో తోడ్పడగలవని భావిస్తున్నారు.

మతిమరుపు గుండెజబ్బు సూచికా?



జ్ఞాపకశక్తి, ఆలోచన, భాషల విషయంలో ఇటీవల మార్పులేవైనా గమనించారా? అంటే తరచూ మరచిపోవటం, ఆలోచనలు సక్రమంగా సాగకపోవటం, తెలిసిన ప్రాంతాల్లో తిరగటానికి ఇబ్బంది పడటం, తికమక వంటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారా? అయితే మున్ముందు గుండెజబ్బులు ముంచుకొచ్చే ప్రమాదం పొంచి ఉండొచ్చని తాజా అధ్యయనం సూచిస్తోంది. గుండెపోటు, పక్షవాతం, గుండె వైఫల్యంతో ఆసుపత్రిలో చేరటానికి చాలా ఏళ్లకు ముందే విషయగ్రహణ సామర్థ్యం క్షీణిస్తున్నట్టు తేలింది మరి. వీటి బారినపడటానికి ముందు వృద్ధుల్లో అతి వేగంగా జ్ఞాపకశక్తి, ఆలోచన, నిర్ణయాత్మక శక్తి తగ్గుతున్నట్టు పరిశోధకులు గుర్తించారు. గుండెజబ్బుల అనంతరం విషయగ్రహణ సామర్థ్యం క్షీణిస్తుందన్న విషయం ఇప్పటికే తెలుసు. కానీ గుండెజబ్బులకు ముందే ఇది మొదలవుతుందో లేదో అనేదే కచ్చితంగా తెలియదు. అందుకే 65 ఏళ్లు, అంతకన్నా ఎక్కువ వయసు గలవారి ఆరోగ్య సమాచారాన్ని పరిశోధకులు పరిశీలించారు. గుండెజబ్బులకు గురవటానికి 3 నుంచి 8 ఏళ్ల ముందు నుంచే మేధాశక్తి తగ్గుతున్నట్టు గుర్తించారు. ముఖ్యంగా జ్ఞాపకశక్తి, భాషా సామర్థ్యం, విషయాలను విడమరచుకోవటం, గలగలా మాట్లాడటం చాలా వేగంగా తగ్గుతుండటం గమనార్హం. విషయగ్రహణ సామర్థ్యం క్షీణించటం.. ముఖ్యంగా విడమరచుకునే వేగం నెమ్మదించటం గుండెజబ్బుకు తొలి సూచిక కావొచ్చని అధ్యయన ఫలితాలు సూచిస్తున్నాయి. దీని ఆధారంగా గుండెపోటు ముప్పు పొంచి ఉన్నవారిని ముందే గుర్తించే అవకాశముందని వివరిస్తున్నాయి.

అతిగా కునుకు తీస్తే అంతే!



మనలో చాలామందికి పగటి పూట కునుకు తీయటం అలవాటే. నూటికి 20 నుంచి 60 మంది ఇలాంటివారే. కొద్దిసేపు నడుం వాల్చటం వల్ల మధ్యాహ్న బడలిక తగ్గుతుంది. కొత్త హుషారు, ఉత్సాహం వస్తాయి. అయితే అతిగా కునుకు తీస్తే మంచి కన్నా చెడే ఎక్కువని రష్ యూనివర్సిటీ అధ్యయనం పేర్కొంటోంది. ఇందులో 55 ఏళ్లు పైబడిన వెయ్యికి పైగా మందిని సగటున 8.3 ఏళ్ల పాటు పరిశీలించారు. చేతికి ధరించిన పరికరంలోని గ్రాహకం ద్వారా కదలికలు, విశ్రాంతి తీరుతెన్నులను గమనించారు. ఇతరత్రా అన్ని అంశాలను సర్దుబాటు చేసి విశ్లేషించగా పగటిపూట ఎక్కువసేపు, అలాగే తరచూ కునుకు తీసేవారికి మరణం ముప్పు పెరుగుతున్నట్టు గుర్తించారు. ప్రతి గంట కునుకుతో మరణం ముప్పు సుమారు 13% పెరుగుతున్నట్టు తేలింది. ఒకటి కన్నా ఎక్కువసార్లు కునుకు తీసేవారిలో ప్రతి అదనపు కునుకుతో 7% ముప్పు ఎక్కువవుతోంది. ఉదయం వేళల్లో కునుకు తీసేవారికైతే మరింత ఎక్కువ ప్రమాదం పొంచి ఉంటుండటం గమనార్హం. ఉదయం, మధ్యాహ్న వేళల్లో తలెత్తే నిస్సత్తువకు తెలియకుండా ఉన్న ఆయా జబ్బులు కారణం కావొచ్చని, ఇదే మరణం ముప్పు పెరిగేలా చేస్తుండొచ్చని పరిశోధకులు చెబుతున్నారు. బడలిక, నీరసం, నిస్సత్తువ ఇటీవల ఎక్కువవుతున్నట్టయితే నిర్లక్ష్యం చేయకుండా డాక్టర్‌ను కలిసి, ఏవైనా సమస్యలు కారణమవుతున్నాయేమో తెలుసుకోవటం మంచిదని అధ్యయన ఫలితాలు సూచిస్తున్నాయి.

గర్భనిరోధక మాత్రలను దీర్ఘకాలం వాడినా ఆరోగ్యవంతులైన మహిళల్లో చాలామందికి పెద్దగా ఇబ్బందులేవీ ఉండవు. కాకపోతే వీటిని డాక్టర్ సలహ మేరకే తీసుకోవాలి. అలాగే అప్పుడప్పుడూ డాక్టర్‌ను సంప్రదించి, పరిస్థితి ఎలా ఉందో సమీక్షించుకోవాలి కూడా.

నోట్లో సూక్ష్మ ప్రపంచం

బాల కృష్ణుడు నోరు తెరచి, చూపిస్తే యశోదమ్మకు విశ్వమంతా కనిపించి, ఆశ్చర్యపోయిందని భాగవత కథ చెబుతోంది. ఒకవేళ సూక్ష్మదర్శినితో ఎవరి నోటినైనా చూస్తే మనమూ ఇలాంటి స్థితిలోనే పడిపోవటం ఖాయం. ఎందుకంటే నోట్లో పళ్లు, చిగుళ్లు, నాలుక, కొండ నాలుక, అంగిలి మాత్రమే కాదు. మన కంటికి కనిపించని మహా సూక్ష్మజీవుల ప్రపంచమూ ఉంది మరి. ఇవి నోట్లోనే కాకుండా శరీరంలోని ఇతర భాగాల్లోనూ జబ్బులకు దారితీస్తుంటాయి. వీటిపై పరిశోధన చేయటం ద్వారా చాలా జబ్బుల నివారణ, చికిత్సకు కొత్త మార్గాలూ దొరుకుతాయి. పరిశోధకులు ఇప్పుడు ఆ పనిలోనే ఉన్నారు.

మన నోరు సూక్ష్మజీవులకు మంచి నిలయం. ఎంత బాగా నోటి శుభ్రతను పాటించినా ఇవి జీవిస్తూనే ఉంటాయి. వృద్ధి చెందుతూనే ఉంటాయి. మన నోట్లో సుమారు 700 రకాల సూక్ష్మక్రిములు ఉంటాయని అంచనా. అయితే అన్నీ చెడు చేసేవేమీ కాదు. కొన్ని జబ్బులకు దారితీస్తే, మరికొన్నేమో జబ్బులకు కారణమయ్యే క్రిముల పని పట్టి మేలు చేస్తుంటాయి. సాధారణంగా పెద్దవారిలో వీటి తీరులో పెద్దగా మార్పులేవీ ఉండవు. ఒకవేళ ఎప్పుడైనా ఇవి మారాయంటే ఏదో సమస్య ఉందనే అర్థం. కాకపోతే ఏయే రకాల క్రిములు జబ్బులకు దారితీస్తాయనేది మాత్రం స్పష్టంగా తెలియదు. జబ్బులు తలెత్తటంలో వీటి తీరు మారటం ఎలాంటి ప్రభావం చూపుతుందో తెలుసుకోవటానికి పరిశోధకులు ప్రయత్నిస్తున్నారు.

ఇతర భాగాల్లోనూ జబ్బులు

నోట్లో సమస్యలకు దారితీసే సూక్ష్మక్రిముల్లో బ్యాక్టీరియా ఒకటి. చక్కెరను ఇష్టపడే బ్యాక్టీరియా దంతాలకు, చిగుళ్లకు హాని చేస్తుందన్న సంగతి తెలిసిందే. ఇవి గారలో నివసిస్తూ హాని కలిగిస్తుంటాయి. అయితే వీటి ప్రభావం ఒక్క నోటికే పరిమితం కావటం లేదు. క్యాన్సర్, గుండెజబ్బు, మధుమేహం, అలర్జీలు, ఆస్థమా, చివరికి అల్జీమర్స్ వంటి జబ్బులకూ వీటితో సంబంధం ఉంటుండటం గమనించదగ్గ విషయం. ఉదాహరణకు- నోటి శుభ్రతను పాటించక పోవటానికీ అల్జీమర్స్ ముప్పు పెరగటానికీ సంబంధం ఉంటున్నట్టు అధ్యయనాలు చెబుతున్నాయి. అంటే పళ్లను సరిగా శుభ్రంగా ఉంచుకోకపోతే నోట్లో హానికారక బ్యాక్టీరియా వృద్ధి చెందటానికి అనువుగా ఉంటుందన్నమాట. నోట్లో నివసించే బ్యాక్టీరియా నుంచి విడుదలయ్యే పదార్థాలు రక్తం ద్వారా మెదడుకు చేరుకొని, అక్కడ జబ్బుకు దారితీసే ప్రమాదముండొచ్చని పరిశోధకులు భావిస్తున్నారు. అల్జీమర్స్‌తో ముడిపడిన పదార్థం నోట్లోనూ ఉంటున్నట్టు యూనివర్సిటీ ఆఫ్ నార్త్ డకోటా పరిశోధకులు ఇటీవల గుర్తించారు. అల్జీమర్స్ జబ్బుకు బీటా-అమీలాయిడ్ ప్రొటీన్ ప్రధాన సూచిక. ఇది మెదడులో ముద్దలు ముద్దలుగా 'గార' మాదిరిగా పోగుపడుతుంది. ఈ ప్రొటీన్ లాలాజలంలోనూ ఉంటున్నట్టు తాజాగా బయటపడింది. ఇది నోట్లో సూక్ష్మక్రిములను ఎలా ప్రభావితం చేస్తుందో తెలుసుకోవటం మీద ఇప్పుడు పరిశోధకులు దృష్టి సారించారు. నోట్లోని బీటా అమీలాయిడ్ మెదడులో అల్జీమర్స్ జబ్బులోనూ పాలు పంచుకుంటుందా అనే దాన్ని పరిశీలిస్తున్నారు.



◆ నోటి సూక్ష్మక్రిములు క్యాన్సర్‌కూ దారితీయగలవు. కొన్నిరకాల సూక్ష్మక్రిములతో ఊపిరితిత్తులు, పెద్ద పేగు, అన్నవాహిక క్యాన్సర్ ముప్పు పెరుగు తున్నట్టు నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హెల్త్ పరిశోధకులు గుర్తించారు. ఆయా సూక్ష్మక్రిములు విడుదల చేసే పదార్థాలు క్యాన్సర్ కారకాలుగా పరిణమించటం దీనికి కారణం కావొచ్చని భావిస్తున్నారు.

◆ నోటి సూక్ష్మక్రిములు రోగనిరోధక వ్యవస్థను ప్రతిస్పందించేలా చేయటంతో వాపు ప్రక్రియ తలెత్తే అవకాశమూ ఉంది. ఈ వాపు ప్రక్రియతో క్యాన్సర్లు, అల్జీమర్స్ వంటి రకరకాల జబ్బులు పుట్టుకొస్తుంటాయి.

◆ ఇవి అలర్జీలకూ దారితీయొచ్చు. పిల్లల్లో వేరుశనగ అలర్జీ దీనికి ఒక ఉదాహరణ. కొన్నిరకాల సూక్ష్మక్రిముల మూలంగా కొద్దిగా వేరుశనగలు తిన్నా రోగనిరోధక ప్రతిస్పందన ప్రేరేపితమవుతున్నట్టు ఒక అధ్యయనం చెబుతోంది.

సంరక్షణకు కొత్త పద్ధతులు

నోట్లో వ్యాధికారక సూక్ష్మక్రిములను నిర్మూలించటం చెప్పినంత తేలిక కాదు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న యాంటీబయాటిక్స్ హాని చేసేవాటినే కాదు, మేలు చేసే క్రిములనూ చంపుతాయి. అన్నీ చనిపోయినప్పుడు హాని చేసేవి త్వరగా వృద్ధి చెందుతాయి. అందుకే పరిశోధకులు కేవలం హాని కారకాల పనిపట్టే కచ్చితమైన విధానాలను రూపొందించటానికి ప్రయత్నిస్తున్నారు. వీటిల్లో ఒకటి బ్యాక్టీరియా మీద దాడి చేసే వైరస్ (బ్యాక్టీరియోఫేజెస్) సాయం తీసుకోవటం. హాని కారక బ్యాక్టీరియాను మాత్రమే నిర్మూలించే బ్యాక్టీరియోఫేజెస్‌తో ఎంతో మేలు కలుగుతుంది.

◆ వ్యాధి కారక బ్యాక్టీరియా మీదే పనిచేసే కొత్తరకం మందుల తయారీ మీదా పరిశోధకులు దృష్టి సారించారు. ఇందుకోసం ప్రొడ్రగ్స్‌ను వాడుకోవాలని చూస్తున్నారు. సాధారణంగా ప్రొడ్రగ్స్ చురుకుగా ఉండవు. కానీ ఆయా బ్యాక్టీరియా సమక్షంలో ఉత్తేజితమై, యాంటీబయాటిక్స్‌గా పనిచేస్తాయి. నిజానికి ఇప్పటికే చిగుళ్ల ఇన్‌ఫెక్షన్‌కు కారణమయ్యే బ్యాక్టీరియాను నిర్మూలించగల ప్రొడ్రగ్‌ను తయారుచేశారు. ఇది ఇతర అవయవాల్లో ఇన్‌ఫెక్షన్ తగ్గటానికీ తోడ్పడగలదని భావిస్తున్నారు.

◆ ఇప్పటికే అందుబాటులో ఉన్న ప్రొబయాటిక్స్, ప్రిబయాటిక్స్ కూడా మంచి సూక్ష్మక్రిములు పెరగటానికి తోడ్పడతాయి.

ఇలా కాపాడుకోవచ్చు

అదృష్టవశాత్తూ నోట్లో మంచి సూక్ష్మక్రిములను కాపాడుకోవటానికి ఇప్పటికే చాలా మార్గాలు అందుబాటులో ఉన్నాయి. ఆరోగ్యకరమైన జీవనశైలిని పాటించటం అన్నింటికన్నా ఉత్తమం.

- దంతాలు, చిగుళ్ల ఆరోగ్యం మీద ప్రత్యేక శ్రద్ధ చూపాలి. రోజూ ఉదయం నిద్ర లేచాక, రాత్రి పడుకునే ముందు బ్రష్‌తో పళ్లు తోముకోవాలి. సన్నటి దారంతో పళ్ల మధ్య కూడా శుభ్రం చేసుకోవాలి (ఫ్లాసింగ్).
- ఆరోగ్యకరమైన ఆహారం తినాలి. ముఖ్యంగా చక్కెర కలిపి చేసే పదార్థాలు, పానీయాలకు దూరంగా ఉండాలి.
- మద్యం జోలికి వెళ్లొద్దు. ఒకవేళ అలవాటుంటే మితం పాటించాలి.
- సిగరెట్లు తాగటం.. గుట్కా, జర్దా నమలటం మానెయ్యాలి. ఇ-సిగరెట్లనూ తాగొద్దు.


పురుషుల్లో ప్రోస్టేట్ సమస్యలు: ఆధునిక చికిత్సలపై అవగాహన అవసరం

RIVEA VASCULAR INSTITUTE



పురుషులలో మూత్రాశయం కింద ప్రోస్టేట్ అనే చిన్న గ్రంథి ఉంటుంది. మూత్ర నాళం (యూరేత్రా) ఈ గ్రంథి గుండా వెళ్లడం వల్ల ఇందులో వచ్చే మార్పులు నేరుగా మూత్ర విసర్జనపై ప్రభావం చూపుతాయి. వయస్సు పెరుగుతున్న కొద్దీ హార్మోన్ల అసమతుల్యం కారణంగా ఈ ప్రోస్టేట్ గ్రంథి ఉబ్బుతుంది. ఈ పరిస్థితిని బినైన్ ప్రోస్టాటిక్ హైపర్‌ప్లాసియా (BPH) అంటారు.

ప్రోస్టేట్ పెరిగినప్పుడు, మూత్ర ప్రవాహానికి అడ్డంకి ఏర్పడి, మూత్రం బలహీనంగా రావడం, మూత్ర విసర్జనలో ఇబ్బంది, రాత్రివేళల్లో తరచుగా లేచి మూత్ర విసర్జనకు వెళ్లాల్సి రావడం, మూత్రాశయం పూర్తిగా ఖాళీ కాలేదనే భావన వంటి లక్షణాలు కనిపిస్తాయి. ఇవి రోజువారీ జీవితంపై గణనీయమైన ప్రభావం చూపుతాయి.



సాంప్రదాయ చికిత్సలు: ప్రయోజనాలు, పరిమితులు

ఇప్పటి వరకు విస్తృతంగా ఉపయోగిస్తున్న ట్రాన్స్ యూరేత్రల్ రిసెక్షన్ ఆఫ్ ప్రోస్టేట్ (TURP) శస్త్ర చికిత్సలో, మూత్రనాళం ద్వారా పరికరాలు చొప్పించి ప్రోస్టేట్‌లో పెరిగిన భాగాన్ని తొలగిస్తారు. ఇది ప్రభావ వంతమైన విధానమే అయినప్పటికీ, కొన్ని ప్రతికూల అంశాలు ఉన్నాయి.ఈ చికిత్సలో రక్తస్రావం, మూత్రనాళ ఇన్‌ఫెక్షన్లు లేదా అడ్డంకులు, తాత్కాలికంగా మూత్రం నియంత్రణ లోపం వంటి సమస్యలు తలెత్తవచ్చు. కోలుకునేందుకు కూడా కొంత సమయం అవసరం. అదనంగా, కొందరిలో వీర్యం బయటకు రాకుండా మూత్రాశయంలోకి వెళ్లే పరిస్థితి (రెట్రో గ్రేడ్ ఎజాక్యులేషన్) కనిపించవచ్చు. అనస్థీషియా అవసరం ఉండటం, రక్తాన్ని పలుచ చేసే మందులను తాత్కాలికంగా నిలిపివేయాల్సి రావడం కూడా గమనించాల్సిన అంశాలు.

రిజమ్ (ఆవిరి చికిత్స) వంటి శస్త్ర చికిత్స అవసరం లేని పద్ధతులు అందుబాటులోకి వచ్చినప్పటికీ, ఇవి కూడా మూత్రనాళం ద్వారానే చేయాల్సి ఉంటుంది. చికిత్స అనంతరం కొన్ని వారాల పాటు కాథెటర్ అవసరం ఉండటం, అసౌకర్యం కొనసాగడం వంటి సమస్యలు ఎదురవుతాయి.

ఆధునిక ప్రత్యామ్నాయం: పిఏఈ

ప్రస్తుతం ప్రోస్టేట్ సమస్యలకు ఒక సురక్షితమైన, తక్కువ ఇబ్బందులు కలిగించే ప్రత్యామ్నాయంగా ప్రోస్టేట్ ఆర్టరీ ఎంబోలైజేషన్ (PAE) ప్రొసీజర్ నిలుస్తోంది. ఈ విధానంలో మూత్ర నాళాన్ని తాకకుండా, రక్తనాళాల ద్వారా లోపలి నుంచే ప్రోస్టేట్ పెరుగుదలను తగ్గిస్తారు.

పిఏఈ ప్రత్యేకతలు:

- మూత్రనాళం ద్వారా పరికరాలు చొప్పించాల్సిన అవసరం లేదు
- గజ్జలు లేదా మణికట్టు వద్ద చిన్న రంధ్రం ద్వారా ప్రొసీజర్ చేయబడుతుంది.
- స్థానిక అనస్థీషియా సరిపోతుంది. సాధారణ లేదా వెన్నెముక అనస్థీషియా అవసరం లేదు.
- డే కేర్ విధానం - అదే రోజు లేదా మరుసటి రోజు డిశ్చార్జ్
- రక్తస్రావం, మూత్రం కారడం వంటి సమస్యలు ఉండవు
- లైంగిక పనితీరుపై ప్రతికూల ప్రభావం తక్కువ
- వీర్యస్రావంలో మార్పులు అరుదు
- త్వరగా కోలుకునే అవకాశం

రిజమ్ వంటి పద్ధతులతో పోలిస్తే, పిఏఈలో చాలా మందికి కాథెటర్ అవసరం ఉండదు. చికిత్స అనంతరం సాధారణ జీవితానికి త్వరగా తిరిగి చేరుకోవచ్చు. ఖర్చు పరంగా కూడా, రిజమ్‌తో పోలిస్తే పిఏఈ మరింత మెరుగైన మరియు తక్కువ ఖర్చుతో ఉండే ఎంపిక.

రివియా: ఆధునిక వైద్య సేవల కేంద్రం

ఆంధ్రప్రదేశ్ మరియు తెలంగాణలో ప్రోస్టేట్ సమస్యలకు పిఏఈ చికిత్సను సమర్థవంతంగా అందిస్తున్న ప్రముఖ కేంద్రం రివియా. అనుభవజ్ఞులైన వైద్య బృందం, ఆధునిక సాంకేతికతతో రోగులకు మెరుగైన ఫలితాలను అందిస్తోంది.

రివియాలో అందుబాటులో ఉన్న ముఖ్య సదుపాయాలు:



హైబ్రిడ్ ఓఆర్ (Hybrid Operating Room) విత్ Allia IGS 7

- ప్రోస్టేట్ సమస్యల ఖచ్చితమైన అంచనాకు కోన్ బీమ్ సీటీ ఇమేజింగ్
- భారతదేశంలో ఎంబోలైజేషన్ కోసం ఆధునిక 3డి నావిగేషన్ టెక్నాలజీ, AI ఆధారిత GE Allia IGS 7 ఇమేజ్ ఆప్టిమైజేషన్ సాంకేతికతను అందుబాటులోకి తీసుకు వచ్చిన మొట్ట మొదటి కేంద్రం రివియా
- రోగులు కోలుకోవడంలో అద్భుత ఫలితాలను క్రమం తప్పకుండా సాధించడంలో ఉన్నత విజయం.

దక్షిణ భారతదేశంలో పిఏఈ చికిత్సను భారీస్థాయిలో నిర్వహిస్తున్న ప్రముఖ కేంద్రాల్లో రివియా ఒకటిగా నిలుస్తోంది. అనుభవం, ఆధునిక సాంకేతికత, నమ్మకంతో రోగులకు విశ్వసనీయ వైద్య సేవలను అందిస్తోంది. భవిష్యత్ ప్రోస్టేట్ సంరక్షణకు ఆధునిక పరిష్కారాలు ఇక్కడే అందుబాటులో ఉన్నాయి.

ప్రోస్టేట్ సమస్యలతో బాధపడుతున్న వారికి సులభమైన, సురక్షితమైన ప్రొసీజర్ పిఏఈ



డా॥ అర్జున్ రెడ్డి
MBBS, MD
Chief of Interventional Radiology & Image-Guided Therapy
Founder & Director of RIVEA Vascular Institute

ADVERTISEMENT

రివియా వాస్క్యులర్ ఇన్‌స్టిట్యూట్ 90912 91912 90634 53800

జయభేరి ఎన్‌క్లేవ్, ప్లాట్‌నెం. 36 & 36A, DLF రోడ్, ఛోటా అంజయ్యనగర్, గచ్చిబౌలి, హైదరాబాద్, తెలంగాణ 500032

(c) eenadu

ఐపీఎల్‌లో ఈనాడు
దిల్లీ × చెన్నై
వేదిక: దిల్లీ, రా॥ 7.30



చాంపియన్

8 మ్యాచ్‌ల్లో 6 ఓడి పాయింట్ల పట్టికలో అట్టడుగున ఉన్న లఖ్‌నవూ సూపర్‌జెయింట్స్ ఒకవైపు.. 9 మ్యాచ్‌ల్లో ఏడు పరాజయాలతో ప్లేఆఫ్స్ రేసుకు దాదాపుగా దూరం అయిన ముంబయి ఇండియన్స్ ఇంకోవైపు.. ఈ సీజన్లో ఘోరమైన ప్రదర్శన చేస్తున్న రెండు జట్ల మధ్య పోరులో ముంబయి పైచేయి సాధించింది. ఎల్‌ఎస్‌జీ భారీ స్కోరే చేసినప్పటికీ వెరవని ముంబయి.. లక్ష్యాన్ని అలవోకగా ఛేదించేసింది. గాయం నుంచి కోలుకుని ఇంపాక్ట్ ప్లేయర్‌గా బరిలోకి దిగిన రోహిత్ శర్మతో పాటు అతడి ఓపెనింగ్ భాగస్వామి రికెల్టన్ కూడా చెలరేగడంతో ముంబయి సునాయాస విజయాన్నందుకుంది.

దెబ్బ తిన్నాక.. దంచి కొట్టింది

- ముంబయికి ఓ విజయం
- చెలరేగిన రోహిత్, రికెల్టన్
- లఖ్‌నవూకు వరుసగా ఆరో ఓటమి

ముంబయి

ప్లేఆఫ్స్ అవకాశాలు దాదాపుగా దూరమైన స్థితిలో ముంబయి ఇండియన్స్ ఓ విజయాన్నందుకుంది. సోమవారం ఆ జట్టు 6 వికెట్ల తేడాతో లఖ్‌నవూను మట్టికరిపించింది. మొదట నికోలస్ పూరన్ (63; 21 బంతుల్లో 1×4, 8×6), మిచెల్ మార్ష్ (44; 25 బంతుల్లో 4×4, 3×6), హిమ్మత్ సింగ్ (40 నాటౌట్; 31 బంతుల్లో 2×4, 2×6) మెరుపులతో మొదట ఎల్‌ఎస్‌జీ 5 వికెట్లకు 228 పరుగులు చేసింది. ముంబయి బౌలర్లలో కార్బిన్ బోష్ (2/20) ఆకట్టుకున్నాడు. అనంతరం రికెల్టన్ (83; 32 బంతుల్లో 6×4, 8×6), రోహిత్ శర్మ (84; 44 బంతుల్లో 6×4, 7×6) రెచ్చిపోవడంతో ముంబయి 18.4 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. లఖ్‌నవూకిది వరుసగా ఆరో ఓటమి. మొత్తంగా ఏడో ఓటమితో ఆ జట్టు ప్లేఆఫ్స్‌కు దాదాపుగా దూరమైంది.

నువ్వానేనా: లక్ష్యం పెద్దదైనప్పటికీ.. ముంబయి ఛేదనలో ఏమాత్రం ఇబ్బంది పడలేదు. ఓపెనర్లు నువ్వా నేనా అన్నట్లు భారీ షాట్లతో చెలరేగడంతో ముంబయి పని తేలికైపోయింది. ఆరంభంలో రికెల్టన్ జోరు సాగినా.. తర్వాత రోహిత్ రెచ్చిపోయాడు. అవేష్ ఖాన్ వేసిన ఆరో ఓవర్లో రోహిత్ వరుసగా 4, 4, 6, 6 బాదేసి వాంఖడేను ఉర్రూతలూగించాడు. మణిమారన్ సిద్ధార్థ్ వేసిన తొమ్మిదో ఓవర్లో రోహిత్ ఓ సిక్స్ బాది అర్ధశతకం (27 బంతుల్లో) పూర్తి చేసుకోగా.. రికెల్టన్ రెండు సిక్సర్లు, ఒక ఫోర్ బాదాడు. 22 బంతుల్లోనే 50 మార్కును అందుకున్న రికెల్టన్.. ఆ తర్వాత మరింత చెలరేగాడు. 10 ఓవర్లకే ముంబయి 127 పరుగులు చేసి విజయానికి బలమైన పునాది వేసుకుంది. శతకం దిశగా సాగుతున్న రికెల్టన్‌ను మోసిన్ ఔట్ చేసినా.. రోహిత్ ధాటిని కొనసాగించడంతో ముంబయి లక్ష్యం వైపు పరుగులు పెట్టింది. రోహిత్ కూడా సెంచరీ ముంగిట ఔటైనా.. తిలక్ (11), సూర్యకుమార్ (12) విఫలమైనా.. ముంబయికి ఇబ్బంది లేకపోయింది. సాధించాల్సిన రన్‌రేట్ అదుపులోనే ఉండడంతో నమన్ ధీర్ (23 నాటౌట్), జాక్స్ (10 నాటౌట్) మిగతా పని పూర్తి చేశారు.

దంచేసిన పూరన్, మార్ష్: వరుసగా అయిదు ఓటముల పాలై ఆత్మవిశ్వాసం సన్నగిల్లిన లఖ్‌నవూ.. ఈ మ్యాచ్‌లో బ్యాటుతో మెరుగైన ప్రదర్శన చేసింది. విదేశీ కోటాలో నలుగురు బ్యాటర్లనే ఎంచుకోగా... అందులో ఇద్దరు (పూరన్, మార్ష్) మెరుపు ఇన్నింగ్స్‌లతో జట్టును తిరుగులేని స్థితిలో నిలబెట్టారు. కానీ ఇన్నింగ్స్ రెండో అర్ధంలో వేగంగా పరుగులు చేయలేక అనుకున్న దాని కంటే ఎల్‌ఎస్‌జీ తక్కువ స్కోరే చేసింది. సీజన్లో తొలి మ్యాచ్ ఆడే అవకాశం అందుకున్న ఇంగ్లిస్



(13) ఎక్కువసేపు నిలవకపోయినా.. మరో ఓపెనర్ మిచెల్ మార్ష్ చెలరేగి ఆడి జట్టుకు బలమైన పునాది వేశాడు. ఈ ఐపీఎల్‌లో ఘోరంగా విఫలమవుతున్నప్పటికీ మరో అవకాశం అందుకున్న నికోలస్ పూరన్.. ఎట్టకేలకు తన మార్కు ఇన్నింగ్స్ ఆడాడు. స్పిన్నర్ విల్ జాక్స్ వేసిన అయిదో ఓవర్లో మూడు సిక్సర్లతో లయ అందుకున్న పూరన్.. తర్వాత ఘజన్‌ఫర్ బౌలింగ్‌లో ఒక ఫోర్, రెండు సిక్సర్లు బాదేశాడు. దీపక్ చాహర్ బౌలింగ్‌లోనూ రెండు సిక్సర్లతో కేవలం 16 బంతుల్లోనే అతను అర్ధశతకాన్నందుకున్నాడు. మరో ఎండ్‌లో మార్ష్ కూడా భారీ షాట్లు ఆడాడు. దీంతో 8 ఓవర్లకే ఎల్‌ఎస్‌జీ 123/1తో తిరుగులేని స్థితికి చేరుకుంది. ఆ జట్టు 300 కొట్టి రికార్డు సృష్టిస్తుందా అనిపించింది ఆ దశలో. అయితే కార్బిన్ బోష్ ఒకే ఓవర్లో పూరన్, మార్ష్‌లను ఔట్ చేసి లఖ్‌నవూ జోరుకు బ్రేకులేశాడు. వైఫల్యాన్ని కొనసాగిస్తూ కెప్టెన్ పంత్ (15) త్వరగా ఔటైపోవడంతో స్కోరు వేగం పడిపోయింది. 12-15 మధ్య 4 ఓవర్లలో ఎల్‌ఎస్‌జీ కేవలం 20 పరుగులే రాబట్టింది. అయితే హిమ్మత్, మార్‌క్రమ్ (31 నాటౌట్; 25 బంతుల్లో 1×4, 1×6) ధాటిగా ఆడడంతో ఘజన్‌ఫర్, రఘు శర్మ వరుస ఓవర్లలో 17, 14 పరుగులు సమర్పించుకున్నారు. 17 ఓవర్లకు స్కోరు 206/5. కానీ చివరి 3 ఓవర్లలో ముంబయి బౌలర్లు కట్టుదిట్టంగా బంతులేయడంతో 22 పరుగులే వచ్చాయి.

లఖ్‌నవూ ఇన్నింగ్స్: మిచెల్ మార్ష్ (సి) నమన్ (బి) బోష్ 44; ఇంగ్లిస్ (సి) సూర్యకుమార్ (బి) ఘజన్‌ఫర్ 13; పూరన్ (సి) రికెల్టన్ (బి) బోష్ 63; పంత్ (సి) రికెల్టన్ (బి) జాక్స్ 15; మార్‌క్రమ్ నాటౌట్ 31; అక్షత్ రఘువంశీ (సి) అండ్ (బి) రఘు శర్మ 11; హిమ్మత్ సింగ్ నాటౌట్ 40; ఎక్స్‌ట్రాలు 11 **మొత్తం:** (20 ఓవర్లలో 5 వికెట్లకు) **228; వికెట్ల పతనం:** 1-29, 2-123, 3-125, 4-148, 5-160; **బౌలింగ్:** దీపక్ చాహర్ 4-0-43-0; బుమ్రా 4-0-45-0; ఘజన్‌ఫర్ 4-0-50-1; విల్ జాక్స్ 2-0-34-1; కార్బిన్ బోష్ 2-0-20-2; రఘు శర్మ 4-0-36-1

ముంబయి ఇన్నింగ్స్: రికెల్టన్ (సి) ఇంగ్లిస్ (బి) మోసిన్ 83; రోహిత్ (సి) షమి (బి) సిద్ధార్థ్ 84; తిలక్ (సి) మార్‌క్రమ్ (బి) సిద్ధార్థ్ 11; సూర్యకుమార్ (సి) పూరన్ (బి) షమి 12; నమన్ నాటౌట్ 23; జాక్స్ నాటౌట్ 10; ఎక్స్‌ట్రాలు 6; **మొత్తం:** (18.4 ఓవర్లలో 4 వికెట్లకు) **229; వికెట్ల పతనం:** 1-143, 2-177, 3-189, 4-213; **బౌలింగ్:** షమి 4-0-53-1; మోసిన్ 4-0-47-1; ప్రిన్స్ యాదవ్ 3-0-24-0; అవేశ్ 3.4-0-56-0; సిద్ధార్థ్ 4-0-47-2



ఆటగాళ్ల వెంట అమ్మాయిలు.. బీసీసీఐ గుర్రు?

ముంబయి: క్రికెటర్లు ప్రేమలో పడడం.. ప్రేయసిని వెంటేసుకుని షికార్లు చేయడం కొత్తేమీ కాదు. కానీ ఈ మధ్య కొందరు అమ్మాయిలు క్రికెటర్లతో పాటు మైదానాల్లోకి, ఆటగాళ్లకు మాత్రమే అనుమతి ఉన్న ప్రదేశాల్లోకి కూడా వచ్చేస్తుండడం చర్చనీయాంశం అవుతోంది. ఐపీఎల్‌లో ఇలాంటి దృశ్యాలు తరచుగా కనిపిస్తున్నాయి. ముఖ్యంగా ముంబయి ఇండియన్స్ సారథి హార్దిక్ పాండ్య.. తన కొత్త ప్రేయసి మహీకాతో కలిసి చేస్తున్న హంగామాపై అభిమానుల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ఈ సీజన్లో యశస్వి జైస్వాల్, ఇషాన్ కిషన్, అర్ష్‌దీప్ సింగ్ సైతం తమ గర్ల్‌ఫ్రెండ్స్‌ను మైదానాల్లోకి, తాము బస చేసే హోటల్‌లకు తీసుకురావడం అందరి దృష్టిలో పడింది. దీనిపై బీసీసీఐ ఇప్పుడు సీరియస్ అవుతున్నట్లు సమాచారం. రాజస్థాన్ రాయల్స్ మేనేజర్ రోమి బిందర్ డగౌట్లో మొబైల్ వాడడం, ఆ జట్టు కెప్టెన్ రియాన్ పరాగ్ డ్రెస్సింగ్ రూంలో ఈ-సిగరెట్ తాగడం లాంటి ఘటనలతో ఇప్పటికే ఐపీఎల్ ప్రతిష్ఠ కొంత దెబ్బ తింది. వారిపై కఠిన చర్యలు చేపట్టనందుకు బీసీసీఐపై విమర్శలు తప్పలేదు. ఇప్పుడు ఆటగాళ్ల వెంట అమ్మాయిలు అనుమతి లేని ప్రదేశాలకు వెళ్తుండడంపై చర్చ జరుగుతోంది. ఐపీఎల్ జట్లకు సంబంధించి అంతర్గత సమాచారాన్ని వీళ్లెవరైనా బయటపెడితే, తెలిసో తెలియకో మ్యాచ్ ఫిక్సర్లకు సహకరిస్తే పరిస్థితి ఏంటనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. క్రికెటర్ల వ్యక్తిగత జీవితాల్లో బీసీసీఐ జోక్యం చేసుకోదు కానీ.. వారి వల్ల ఆటకు ఇబ్బంది తలెత్తినా, భారత క్రికెట్ ప్రతిష్ఠ దెబ్బ తినేలా ఉన్నా ఊరుకోదు. ఈ నేపథ్యంలో క్రికెటర్లకు హెచ్చరికలు జారీ చేయొచ్చని.. గర్ల్‌ఫ్రెండ్స్ విషయంలో కొన్ని షరతులు కూడా విధించొచ్చని తెలుస్తోంది.


హార్దిక్, మహీకా

ఐపీఎల్ నుంచి ధోని ఔట్?


ధోని

దిల్లీ: పిక్క గాయం కారణంగా ధోని ఈ ఐపీఎల్‌లో ఇప్పటివరకు ఒక్క మ్యాచ్ కూడా ఆడలేదు. కానీ చెన్నై జట్టుతో పాటే ఉంటున్నాడు. మంగళవారం దిల్లీ క్యాపిటల్స్‌తో మ్యాచ్ కోసం ధోని జట్టుతో పాటు వెళ్లకపోవడంతో అతడు 2026 ఐపీఎల్‌కు పూర్తిగా దూరమైనట్లేనన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ధోని ప్రస్తుతం తమతో లేడని, గాయం నుంచి కోలుకుంటున్నాడని సీఎస్కే బౌలింగ్ సలహాదారు సిమన్స్ చెప్పాడు. ధోని జట్టుతో పాటు దిల్లీకి రాలేదని తెలిపాడు. ధోనికి ఇదే చివరి ఐపీఎల్ అని భావిస్తున్నారు. సీఎస్కే 2026 ఐపీఎల్‌లో ఇప్పటివరకు నాలుగు మ్యాచ్‌ల్లో నెగ్గి, అయిదు ఓడిపోయింది. పాయింట్ల పట్టికలో ఆరో స్థానంలో ఉంది.

భారత ఆర్చర్లకు కఠిన పరీక్ష

ప్రపంచకప్ స్టేజ్-2 టోర్నీ నేటినుంచే

షాంఘై: ఆసియా క్రీడల సన్నాహాల్లో భాగంగా ప్రపంచకప్ స్టేజ్-2 ఆర్చరీ టోర్నీపై భారత్ గురిపెట్టింది. ఈ ఏడాది సెప్టెంబరు 19 నుంచి అక్టోబరు 4 వరకు జపాన్‌లోని ఐచి- నాగోయాలో ఆసియా క్రీడలు జరగనుండగా.. జట్టు కూర్పే లక్ష్యంగా మంగళవారం ప్రారంభంకానున్న ప్రపంచ టోర్నీలో భారత్ బరిలో దిగుతుంది. అయితే సరైన ప్రణాళిక లేకపోవడం.. విదేశీ కోచ్ అందుబాటులో లేని కారణంగా ఈ పోటీల్లో భారత్‌కు కఠిన పరీక్ష ఎదురుకానుంది. సీజన్ ఆరంభంలో మెక్సికోలో జరిగిన ప్రపంచకప్ స్టేజ్-1లో భారత్‌కు నిరాశ తప్పలేదు. మహిళల కాంపౌండ్ జట్టు నెగ్గిన స్వర్ణం మినహా మిగిలిన విభాగాల్లో జట్టు తేలిపోయింది. అగ్రశ్రేణి జట్టు దక్షిణ కొరియా గైర్హాజరైనా కూడా భారత రికర్వ్ ఆర్చర్లు పతక రౌండ్‌కు అర్హత సాధించడంలో విఫలమయ్యారు. ఆసియా క్రీడలకు మరో నాలుగు నెలలే గడువున్నప్పటికీ.. భారత జట్టుకు చీఫ్ కోచ్ లేకపోవడం ఆందోళన కలిగిస్తోంది. ప్రస్తుత ఆర్చర్లు తమ వ్యక్తిగత కోచ్‌ల పర్యవేక్షణలోనే ఆడుతున్నారు. ఈ నేపథ్యంలో రికర్వ్‌లో భారత ఆర్చర్ల ప్రదర్శన ఎలా ఉంటుందో చూడాలి. ఇక కాంపౌండ్ విభాగంపై భారత్ భారీగా ఆశలు పెట్టుకుంది. నిలకడగా రాణిస్తున్న వెన్నం జ్యోతి సురేఖ ఆధ్వర్యంలో మహిళల జట్టు పతకంపై కన్నేసింది.


జ్యోతి సురేఖ

భారత జట్లు: రికర్వ్: తరుణ్‌దీప్ రాయ్, అతాను దాస్, ధీరజ్ బొమ్మదేవర, యశ్‌దీప్ భోగే, దీపిక కుమారి, అంకిత భకత్, సిమ్రన్‌జీత్ కౌర్, కుంకుమ్ మొహొద్; **కాంపౌండ్:** అభిషేక్ వర్మ, కుశాల్ దలాల్, ఓజాస్, సాహిల్ జాదవ్, జ్యోతి సురేఖ, అదితి స్వామి, ప్రగతి, మధుర ధమాంగోంకర్


ముకేశ్

ముకేశ్‌కు 2 స్వర్ణాలు

జాతీయ షూటింగ్ ఛాంపియన్‌షిప్

గుంటూరు క్రీడలు, న్యూస్‌టుడే: జాతీయ షూటింగ్ ఛాంపియన్‌షిప్‌లో ఆంధ్రప్రదేశ్ ఆటగాడు నేలవల్లి ముకేశ్ రెండు స్వర్ణ పతకాలు సాధించాడు. దిల్లీలో డాక్టర్ కర్ణి సింగ్ షూటింగ్ రేంజ్‌లో జరిగిన పోటీల్లో ముకేశ్ సత్తా చాటాడు. 25 మీటర్ల పిస్టల్ మెన్ ఈవెంట్‌లో సీనియర్, జూనియర్ విభాగాల్లో అతడు విజేతగా నిలిచాడు. ముకేశ్ 584 పాయింట్లు సాధించాడు. మధ్యప్రదేశ్‌కు చెందిన సూరజ్‌శర్మ (581) రెండు విభాగాల్లో రజత పతకాలు గెలుచుకున్నాడు. ముకేశ్ గత నెలలో స్పెయిన్‌లో జరిగిన ప్రపంచకప్‌లో 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ మిక్స్‌డ్ విభాగంలో పంజాబ్‌కు చెందిన పలక్‌తో కలిసి స్వర్ణం నెగ్గిన సంగతి తెలిసిందే.

భారత్, జమైకాల మధ్య వారధి క్రికెట్: జైశంకర్

కింగ్‌స్టన్: భారత్, జమైకాల మధ్య ఉన్న సంబంధం కేవలం దౌత్యపరమైనది మాత్రమే కాదని.. అది పరుగులు, గౌరవం, స్నేహంతో కూడుకున్న అపురూప బంధమని భారత విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి ఎస్.జైశంకర్ అన్నారు. ఇరుదేశాల మధ్య క్రికెట్ ఒక వారధిలా పనిచేస్తుందని తెలిపారు. భారత్ బహుమతిగా ఇచ్చిన డిజిటల్ స్కోర్‌బోర్డును ఆదివారం జమైకాకు జైశంకర్ అంకితం చేశారు. "క్రీడలు దేశాలను ఏకం చేస్తాయి. భాగస్వామ్య అనుభవాలను పంచుతూ.. పరస్పర గౌరవాన్ని పెంపొందిస్తాయి. ముఖ్యంగా భారత్, జమైకా దేశాల మధ్య క్రికెట్‌ది ప్రత్యేక స్థానం. జమైకాలోని ఏకైక టెస్టు వేదిక సబీనా పార్కుకు భారత క్రికెట్ చరిత్రలో విశిష్ట స్థానం ఉంది. దిగ్గజ ఆటగాడు రాహుల్ ద్రవిడ్ సబీనా పార్కులో అద్భుతమైన సెంచరీ సాధించాడు. 2011లో విరాట్ కోహ్లి తన టెస్టు కెరీర్‌ను ఇదే మైదానంలో ప్రారంభించాడు. ఈ చారిత్రక ఘట్టాలు రెండు దేశాల మధ్య ఉన్న దృఢమైన బంధానికి ప్రతీకలు" అని జైశంకర్ పేర్కొన్నారు.

రోహిత్ వచ్చె.. హార్దిక్ వెళ్లె..

ప్లేఆఫ్స్ అవకాశాలు బాగా సన్నగిల్లిన పరిస్థితుల్లో, లఖ్‌నవూతో మ్యాచ్‌కు ముంబయి జట్టులో కీలక మార్పులు జరిగాయి. కెప్టెన్ హార్దిక్ పాండ్య అనూహ్యంగా ఈ మ్యాచ్‌కు దూరం అయ్యాడు. కెప్టెన్‌గా, ఆటగాడిగా ఘోరంగా విఫలమవుతున్న నేపథ్యంలో అతడిపై వేటు పడొచ్చని ప్రచారం జరుగుతున్న సమయంలో ఈ మ్యాచ్ నుంచి వైదొలిగాడు. అయితే హార్దిక్ ఆడకపోవడానికి వెన్ను నొప్పి కారణమని అతడి నుంచి తాత్కాలిక సారథిగా బాధ్యతలు అందుకున్న సూర్యకుమార్ యాదవ్ చెప్పాడు. మరోవైపు పిక్క గాయం కారణంగా అయిదు మ్యాచ్‌లు ఆడలేకపోయిన రోహిత్.. సోమవారమే పునరాగమనం చేశాడు. రోహిత్ తిరిగొచ్చిన సమయంలోనే హార్దిక్ తుది జట్టుకు దూరం కావడం చర్చనీయాంశమైంది. హార్దిక్ నిజంగా గాయంతో తప్పుకొన్నాడా.. లేక తప్పించారా అన్న ప్రశ్న కూడా తలెత్తింది. తర్వాతి మ్యాచ్‌లోనూ హార్దిక్ ఆడకపోతే మాత్రం ఈ విషయంలో సందేహించాల్సిందే.

పాయింట్ల పట్టిక

జట్టు	మ్యా	గె	ఓ	ఫ.తే	పా	నె.రన్‌రేట్
పంజాబ్	9	6	2	1	13	0.855
బెంగళూరు	9	6	3	0	12	1.420
హైదరాబాద్	10	6	4	0	12	0.644
రాజస్థాన్	10	6	4	0	12	0.510
గుజరాత్	10	6	4	0	12	-0.147
చెన్నై	9	4	5	0	8	0.005
దిల్లీ	9	4	5	0	8	-0.895
కోల్‌కతా	9	3	5	1	7	-0.539
ముంబయి	10	3	7	0	6	-0.649
లఖ్‌నవూ	9	2	7	0	4	-1.076

మ్యా: మ్యాచ్‌లు, గె: గెలిచినవి, పా: పాయింట్లు, ఫ.తే: ఫలితం తేలనివి

బ్యాటర్ నుంచి స్పిన్నర్‌గా మారి

ఈనాడు క్రీడావిభాగం

ఈ ఐపీఎల్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ తరఫున ఆకట్టుకుంటున్నాడు లెఫ్ట్ ఆర్మ్ స్పిన్నర్ శివాంగ్ కుమార్. ఈ 23 ఏళ్ల మధ్యప్రదేశ్ ఆటగాడు మొదటి నుంచి స్పిన్నర్ కాదు. టాప్ ఆర్డర్ బ్యాటర్‌గా కెరీర్‌ను ఆరంభించి.. ఆలస్యంగా స్పిన్నర్‌గా మారాడు. శివాంగ్ తండ్రి ప్రవీణ్ కూడా క్రికెటరే. పశ్చిమ బెంగాల్ తరఫున అతడు అండర్-19 క్రికెట్ ఆడాడు. అయితే కుటుంబం కోసం క్రికెట్‌ను వదిలి రైల్వే ఉద్యోగంలో స్థిరపడ్డాడు. క్రికెట్లో ఎదగాలన్న తన కలను తనయుడు శివాంగ్ ద్వారా నెరవేర్చుకున్నాడు ప్రవీణ్. నాన్న బాటలోనే క్రికెటర్ అయ్యాడు శివాంగ్. అయితే రాష్ట్ర జట్టుకు ఎంపిక చేయకపోతుండడంతో క్రికెట్‌ను విడిచి చదువుపై దృష్టి సారించాలనుకున్నాడు. కానీ ఏడాది తర్వాత శివాంగ్ మనసు మార్చుకున్నాడు. తిరిగి క్రికెట్లోకి వచ్చాడు. గ్వాలియర్‌లోని తాన్‌సేన్ అకాడమీలో శివాంగ్ రాటుదేలాడు. టాప్‌ఆర్డర్ బ్యాటర్‌గా ఎదిగాడు. భోపాల్‌లో ఒక అండర్-16 టోర్నీలో ఓపెనింగ్ కూడా చేశాడు. అప్పుడు అతడి భాగస్వామి ప్రియాంశ్ ఆర్య కావడం విశేషం. ఓ మ్యాచ్‌లో ప్రియాంశ్ 180, శివాంగ్ 160 పరుగులు చేశారు. అయితే రాష్ట్ర జట్టులో ఓపెనర్ స్థానానికి పోటీ ఉండడంతో తండ్రి సూచన మేరకు శివాంగ్ మణికట్టు స్పిన్నర్‌గా మారాడు. మధ్యప్రదేశ్ ప్రీమియర్ లీగ్‌లో భోపాల్ లెపార్డ్స్ తరఫున 2025 సీజన్లో శివాంగ్ 5 వికెట్లు తీసి సత్తా చాటాడు. 2025-26 దేశవాళీ సీజన్లో విజయ్‌హజారే ట్రోఫీలో 3 మ్యాచ్‌ల్లో 10 వికెట్లు పడగొట్టిన ఈ కుర్రాడిని సన్‌రైజర్స్ హైదరాబాద్ ఈ ఏడాది మినీ వేలంలో రూ.30 లక్షలు పెట్టి దక్కించుకుంది. పవర్ ప్లేలో బ్యాటర్లకు కళ్లెం వేస్తున్న శివాంగ్.. ఈ సీజన్లో ఇప్పటిదాకా 8 మ్యాచ్‌ల్లో 6 వికెట్లు తీశాడు.


శివాంగ్ కుమార్

ఫ్రెంచ్ ఓపెన్ ప్రైజ్‌మనీపై ప్లేయర్ల అసంతృప్తి

పారిస్: ఫ్రెంచ్ ఓపెన్ ప్రైజ్‌మనీ విషయంలో యానిక్ సినర్, అర్యానా సబలెంకా, కొకో గాఫ్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈనెల 24న ఆరంభమయ్యే ఈ ఎర్రమట్టి టోర్నీ నగదు బహుమతి వివరాలను ఇటీవలే నిర్వాహకులు వెల్లడించారు. ఈసారి టోర్నీకి రూ.686 కోట్లు కేటాయించినట్లు.. గత టోర్నీతో పోలిస్తే ఇది దాదాపు 10 శాతం ఎక్కువని వెల్లడించారు. అయితే రొలాండ్ గారోస్ టోర్నీ ఆదాయంలో ప్లేయర్ల వాటా గతంతో పోలిస్తే తగ్గిపోయింది. 2024లో టోర్నీ ఆదాయంలో క్రీడాకారులకు ఇచ్చే మొత్తం 15.5 శాతం ఉండగా.. ఈసారి 14.9 శాతం మాత్రమే లభించనుంది. దీనిపైనే స్టార్ ప్లేయర్లు నిరసన వ్యక్తం చేశారు. "2025 ఫ్రెంచ్ ఓపెన్ ద్వారా నిర్వాహకులకు దాదాపు 4300 కోట్ల ఆదాయం వచ్చింది. అప్పుడు కూడా ఆదాయంలో ప్లేయర్ల వాటా 15 శాతం మాత్రమే. ఈసారి టోర్నీ ప్రైజ్‌మనీని 5.4 శాతం పెంచిన నిర్వాహకులు.. ప్లేయర్లకు ఇచ్చే షేర్‌ను మాత్రం 14.9కి తగ్గించారు. ఏటీపీ డబ్ల్యూటీఏ 1000 ఈవెంట్లలో దక్కుతున్నట్లే 22 శాతం షేర్ క్రీడాకారులకు లభించాలి" అని ప్లేయర్ల సంఘం డిమాండ్ చేసింది. క్రీడాకారులకు లభించే వాటాను పెంచాలని కొందరు స్టార్ ప్లేయర్లతో కూడిన బృందం గతేడాదే నాలుగు గ్రాండ్‌స్లామ్ టోర్నీ నిర్వాహకులకు ఒక లేఖ పంపింది.

భారత షూటర్లు విఫలం

అల్మాటీ (కజకిస్థాన్): ఐఎస్‌ఎస్‌ఎఫ్ షాట్‌గన్ ప్రపంచకప్‌లో భారత షూటర్ల పేలవ ప్రదర్శన కొనసాగుతోంది. స్కీట్ పోటీల్లో ఒక్కరు కూడా టాప్-8కు అర్హత సాధించలేకపోయారు. గనేమత్ సెఖోన్ (70 పాయింట్లు) తొమ్మిదో స్థానంలో నిలిచాడు. వెటరన్ షూటర్ మైరాజ్ అహ్మద్ ఖాన్ (71) 23వ స్థానంలో ఉన్నాడు. అనంత్‌జీత్ సింగ్ (69), గుర్జోత్‌సింగ్ (70) ఆకట్టుకోలేకపోయారు. మహిళల విభాగంలో రైజా ధిల్లాన్ (69), పారీనాజ్ ధలివాల్ (66) ప్రభావం చూపలేకపోయారు.

(c) eenadu

నిధులొచ్చాయ్.. నీళ్లొస్తాయ్

గుంటూరు వాహిని పనులకు రూ.369.20 కోట్లు
పరిపాలనా అనుమతులిచ్చిన ప్రభుత్వం

ఈనాడు - అమరావతి
న్యూస్‌టుడే - వట్టిచెరుకూరు



గుంటూరు వాహిని ఆధునికీకరణకు ప్రభుత్వం రూ.369.20 కోట్లకు పరిపాలనా అనుమతులు ఇస్తూ సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో దశాబ్దాల రైతన్నల కల నెరవేరనుంది. ఇప్పటికే గుత్తేదారు ఎంపిక పూర్తయి భూసేకరణ పనులు జరుగుతున్నాయి.

గతంలో ఏం జరిగిందంటే....

2015 మే 27న నాటి తెదేపా ప్రభుత్వం ఆధునికీకరణకు రూ.378.25 కోట్లకు పరిపాలనా అనుమతులిచ్చింది. దీనిపై రివర్స్ టెండరింగ్‌లో రూ.318.86 కోట్లకు ఓ గుత్తేదారు సంస్థ పనులు దక్కించుకున్నా.. ఒప్పందం ఖరారు కాలేదు.

కూటమి ప్రభుత్వం వచ్చాక...

పాత పనులను రద్దు చేసి కొత్తగా ప్రతిపాదనలు రూపొందించాలని కూటమి ప్రభుత్వం ఆదేశించింది. జలవనరులశాఖ 2024-25 ఎస్ఎస్ఆర్ ధరల ప్రకారం రూ.625 కోట్లతో గతేడాది జనవరిలో ప్రభుత్వానికి ప్రతిపాదించింది. వాహిని పొడవునా ఇరువైపులా కాంక్రీటు గోడ నిర్మిస్తామని పేర్కొనడంతో ప్రభుత్వం మార్పులు చేసి అవసరమైనచోట మాత్రమే నిర్మించాలని సూచించింది. దీనికి తగ్గట్టుగా అధికారులు అంచనాలను సవరించి రూ.378.25 కోట్లతో ప్రతిపాదనలు పంపించారు. పరిశీలించిన ప్రభుత్వం రూ.369.20 కోట్లకు పరిపాలనా అనుమతులిచ్చింది.

కొన్నేళ్లుగా పోరాటం

నాగార్జునసాగర్, డెల్టా కాలువల కింద సాగు నీరందని ప్రాంతాల కోసం గుంటూరు వాహిని నిర్మించారు. అయితే.. 47 కిలోమీటర్ల వరకే పనులు చేసి ఆపేయడంతో కొన్ని ప్రాంతాలకు ఇప్పటికీ సాగునీరందని పరిస్థితి. దీన్ని పొడిగించాలని ఎన్నో ఏళ్లగా స్థానికులు కోరుతూనే ఉన్నారు. కాలువ పొడిగించాలంటే ప్రస్తుతం ఉన్న నీటి ప్రవాహ సామర్థ్యాన్ని పెంచాలి. అధికారంలోకొస్తే గుంటూరు వాహిని విస్తరణ, ఆధునికీకరణ పూర్తిచేస్తామని 2024 ఎన్నికల ప్రచారంలో కూటమి హామీ ఇచ్చింది. కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, ప్రత్తిపాడు, పొన్నూరు ఎమ్మెల్యేలు బూర్ల రామాంజనేయులు, ధూళిపాళ్ల నరేంద్రకుమార్, మంత్రి నారా లోకేశ్ చొరవ చూపడంతో ఎట్టకేలకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. దశాబ్దాల రైతులు, రైతు సంఘాల పోరాటం ఫలించింది.

పనులు పూర్తయితే...

- కాలువ కింద ఉన్న 27 వేల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణతోపాటు కొత్తగా మరో 48 వేల ఎకరాలకు నీరందుతుంది.
- మంగళగిరి, పొన్నూరు, ప్రత్తిపాడు నియోజకవర్గాల్లోని 41 గ్రామాలతోపాటు గుంటూరు, మంగళగిరి-తాడేపల్లి నగరపాలక సంస్థల్లో ప్రజల తాగునీటి అవసరాలు తీరతాయి.

ఏమేం చేస్తారంటే....

- ప్రకాశం బ్యారేజీ నుంచి మొదలయ్యే గుంటూరు వాహిని వట్టిచెరుకూరు మండలం గారపాడు వరకు 47 కిలోమీటర్లు ప్రయాణిస్తుంది. దీన్ని పూర్తిగా ఆధునికీకరించి.. అవసరమైన చోట కాంక్రీటు నిర్మాణాలు చేపడతారు. అనంతరం మరో 30 కిలోమీటర్లు పొడిగిస్తారు.
- ఆధునికీకరణ వల్ల ప్రవాహ సామర్థ్యం 600 క్యూసెక్కుల నుంచి 750 క్యూసెక్కులకు పెరుగుతుంది. అదనంగా వచ్చే 150 క్యూసెక్కుల ఆధారంగా వాహినిని పొడిగిస్తారు.

రైతుల కష్టాలు తొలగుతాయి

కృష్ణా డెల్టాలో రైతుల జీవనోపాధిని మెరుగుపరచడంలో గుంటూరు వాహిని కీలకంగా మారుతుంది. ఇది పూర్తయితే రైతులకు సాగునీటి కష్టాలు తొలగిపోతాయి. పంటలు సమృద్ధిగా పండుతాయి. - **పెమ్మసాని చంద్రశేఖర్, కేంద్ర సహాయ మంత్రి**

10లోగా బడి బస్సుల ఫిట్‌నెస్ పరీక్షలు


బడి బస్సు తనిఖీ చేస్తున్న రవాణా శాఖ అధికారులు

పట్టాభిపురం, న్యూస్‌టుడే: ఈ నెల 10లోగా బడి బస్సుల్ని తప్పనిసరిగా ఫిట్‌నెస్ చేయించాలని డీటీసీ సీతారామిరెడ్డి సూచించారు. రవాణా శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు గుంటూరులో పలు ప్రైవేటు పాఠశాలలు, కళాశాల బస్సుల్ని రవాణా శాఖ అధికారులు సోమవారం తనిఖీలు చేశారు. బస్సులు రహదారిపై ప్రయాణించేందుకు ఎంత వరకు అనుకూలంగా ఉన్నాయో పరిశీలించారు. లోపాలను గుర్తించారు. ముఖ్యంగా జీపీఎస్ సక్రమంగా ఉండటం లేదు. ఇప్పటి వరకు 106 బస్సుల్ని తనిఖీ చేశామని డీటీసీ తెలిపారు.

మురుగు.. పురుగులు.. మధ్యలో రోగులు

- జీజీహెచ్‌లో దారుణ స్థితి
- అనేకచోట్ల వ్యర్థాలతో పూడిపోయిన డ్రెయినేజీలు

ఈనాడు, అమరావతి



ఈ చిత్రంలోని మురుగు.. పురుగులను చూస్తే ఏమనిపిస్తోంది? ఇదేదో గుంటూరు నగరపాలక సంస్థ డ్రెయిన్ అనుకుంటే పొరబడినట్టే. నిత్యం దాదాపు ఐదు వేలమందికి చికిత్స అందిస్తున్న వైద్యాలయంలోని పరిస్థితి ఇది. జీజీహెచ్‌లోని అనేక బ్లాకుల ఇద్ద ఇలాగే తయారైంది. డ్రెయిన్ల నిర్వహణ వ్యవస్థ సరిగా లేక.. కొన్ని భవనాలకు కనెక్షన్లు ఏర్పాటు చేయకపోవడంతో మురుగు ఇలా నిలిచిపోయి.. రోగులకు కొత్త రోగాలు తెచ్చి పెడుతోంది. పేదలకు పెద్ద దిక్కులాంటి గుంటూరు ప్రభుత్వ సర్వజనాసుపత్రిలో పారిశుద్ధ్యం పడకేసింది. మురుగుకాలువల వ్యవస్థను చూస్తే.. ఇది ఆసుపత్రి ప్రాంగణమేనా? అన్న సందేహం రాకమానదు.

లోపాలెన్నో...

- మురుగునీటి పారుదల వ్యవస్థ నిర్వహణ దారుణంగా ఉంది.
- డ్రెయినేజీ కాలువల మధ్య అనేక చోట్ల అనుసంధానం లేదు.
- ఉన్నచోట నిర్వహణ లేక మురుగు ముందుకు కదలడం లేదు.
- మాతాశిశు సంరక్షణ భవనం (ఎంసీహెచ్) పరిసరాల్లో మరీ దయనీయంగా ఉంది. ఈ భవనం నుంచి వస్తున్న మురుగునీటికి.. ప్రధాన డ్రెయినేజీ కాలువలకు అసలు కనెక్షనే లేవు. ఫలితంగా వ్యర్థాలు కుళ్లిపోతున్నాయి.
- సర్జికల్ బ్లాక్, తల్లీబిడ్డ బ్లాక్ పరిసరాల్లోనూ ఇంతే. ఆ ప్రాంతమంతటా దుర్వాసనే. పురుగులు చేరి.. దోమలకు నిలయంగా మారింది. బాలింతలు, పసిపిల్లలు ఉండే ఈ విభాగం పరిసరాల్లో అపరిశుభ్ర వాతావరణం ఎవరికీ పట్టడం లేదు.

మురుగు వెళ్లే మార్గం లేక..

దాతల సహాయంతో సర్వీస్ బ్లాక్ వద్ద అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. ఇక్కడ డ్రెయినేజీలు వ్యర్థాలతో పూడిపోయాయి. నీరు వెళ్లే మార్గం లేక రోడ్లపైకి చేరుతోంది. అనేకచోట్ల కాలువల్లో పేరుకుపోయిన నిర్మాణ, ఆసుపత్రి వ్యర్థాలను తొలగించడం లేదు.

అసంపూర్తిగా మురుగునీటి శుద్ధి

ఇక్కడి ఎస్టీపీకి కేవలం పొదిల ప్రసాద్ బ్లాక్, నాట్కో క్యాన్సర్ సెంటర్ నుంచి మాత్రమే మురుగునీరు చేరుతోంది. శుద్ధి చేసి బయటకు పంపుతున్నారు మిగతాచోట్ల ఈ పరిస్థితి లేదు.

ఇలా చేయొచ్చు..

- ఎంసీహెచ్ భవనం నుంచి ప్రధాన డ్రెయినుకు తక్షణమే అనుసంధానం చేయాలి.
- తల్లీబిడ్డ బ్లాక్ వద్ద డ్రెయిన్‌తోపాటు మిగిలిన చోట్ల మురుగు, వ్యర్థాలను సెప్టిక్ ట్యాంకు ద్వారా తొలగించాలి.
- భవన నిర్మాణ పనులు జరుగుతున్న సర్వీస్ బ్లాక్, పొదిల ప్రసాద్ బ్లాక్ తదితరచోట్ల తాత్కాలికంగా మురుగు వెళ్లేలా చర్యలు తీసుకోవాలి.
- క్లోజ్డ్ డ్రెయిన్ల వద్ద పేరుకుపోయిన వ్యర్థాలను తొలగింపజేయాలి.

తవ్వుకుపోతున్న తోడేళ్లు

- రాజధానిలో యథేచ్ఛగా మట్టి అక్రమ రవాణా
- చోద్యం చూస్తున్న యంత్రాంగం

తుళ్లూరు, మంగళగిరి గ్రామీణం, న్యూస్‌టుడే


నవులూరులో మట్టి తవ్విన ప్రాంతం

రాజధాని నిర్మాణ పనుల్లో భాగంగా తవ్విన మట్టిని అక్రమార్కులు కాసులుగా మార్చుకుంటున్నారు. ఎలాంటి అనుమతుల్లేకుండా యథేచ్ఛగా భారీ లారీల్లో ఇతర ప్రాంతాలకు తరలించేస్తున్నారు. కొన్ని చోట్ల ఏకంగా రైతుల రిటర్నబుల్ ప్లాట్లలో మట్టిని సైతం లారీల్లో తరలించుకుపోతున్నారు. అక్రమంగా మట్టి తరలిస్తున్న టిప్పర్లపై ఇటీవల తుళ్లూరు పోలీసులు పెద్ద సంఖ్యలో కేసులు నమోదు చేశారు. అయినప్పటికీ అక్రమ రవాణా మాత్రం నిరాటంకంగా కొనసాగుతూనే ఉంది.

నిఘా ఏమైంది.. మట్టి అక్రమ తరలింపు అడ్డూఆపు లేకుండా జరుగుతున్నా పోలీసులు కేసులు నమోదు చేసి సరిపెట్టడంపై విమర్శలు వస్తున్నాయి. పటిష్ఠ నిఘా ఏర్పాటు చేసి అడ్డుకట్ట వేయడంతోపాటు కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. మరోవైపు సీఆర్డీఏ అధికారులు నిరంతర తనిఖీలు చేపడితే కానీ క్షేత్రస్థాయిలో అక్రమ రవాణాకు అడ్డుకట్ట పడదు.

కఠిన చర్యలు తప్పవు..

రాజధాని ప్రాంతంలో మూడు చోట్ల చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి తనిఖీలు చేస్తున్నాం. మట్టి చోరీకి సహకరించే వారిపై, టిప్పర్ల యజమానులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటాం. **-కె.శ్రీనివాసరావు, తుళ్లూరు, సీఐ**

నీరుకొండ రిజర్వాయర్ నుంచి వెంచర్లకు.. నీరుకొండ రిజర్వాయర్ నిర్మాణ పనుల్లో తవ్వి తీసిన మట్టిని అక్కడ పనుల్లో ఉన్న కొంతమంది సిబ్బంది సహకారంతో అక్రమంగా టిప్పర్లలో తరలించేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆ మట్టిని నీరుకొండ నుంచి పెదపరిమి, తాడికొండ, లాం, గుంటూరు, అమరావతి తదితర ప్రాంతాల్లోని వెంచర్లకు అమ్ముకొని సొమ్ము చేసుకుంటున్నారు.

☛ నవులూరు రెవెన్యూ పరిధిలోని జోన్-12లో అక్రమార్కులు రైతులకు కేటాయించిన సుమారు 10 ప్లాట్లలో సుమారు 15 అడుగుల మేర యంత్రాలతో లోతుగా మట్టిని తవ్వి లారీల్లో తరలించుకుపోయారు. ఆదివారం ఉదయం రైతులు గమనించి అడ్డుకున్నారు. తమ ప్లాట్లలో ఎర్రమట్టిని తవ్వుకుపోయి.. గోతులను నల్లమట్టితో పూడ్చివేస్తున్నారని రైతులు చెబుతున్నారు. ఎల్పీఎస్ లేఔట్‌లలో రిటర్నబుల్ ప్లాట్లలో మట్టి తవ్వుకుపోతే భవన నిర్మాణాల పునాదులు వేయటం కష్టంగా మారుతుందని వాపోతున్నారు.

రైతులకు రాయితీపై వ్యవసాయ పరికరాలు

కలెక్టరేట్(గుంటూరు), న్యూస్‌టుడే: సబ్ మిషన్ ఆన్ అగ్రికల్చర్ మెకనైజేషన్(ఎస్ఎంఏఎం) పథకం కింద రాయితీపై వ్యవసాయ యంత్ర పరికరాలు ఇవ్వనున్నట్లు జిల్లా వ్యవసాయ శాఖ సంయుక్త సంచాలకులు ఎం.పద్మావతి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పథకానికి సంబంధించి జిల్లాకు ప్రభుత్వం రూ.3.04 కోట్లు కేటాయించిందని, రైతులకు అవసరమైన పవర్ టిల్లర్లు, రోటావేటర్లు, హార్వెస్టింగ్ యంత్రాలు, పురుగుమందుల పిచికారీకి అవసరమైన స్ప్రేయర్లు రాయితీపై అందించనున్నట్లు తెలిపారు. వీటితోపాటు నూర్పిడి యంత్రాలు, విత్తన గొర్రులు, ట్రాక్టర్‌తో పని చేసే వ్యవసాయ అనుబంధ పరికరాలు తదితరాలు అందించనున్నట్లు తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, చిన్న, సన్నకారు, మహిళా రైతులకు పరికరాల ఖర్చులో 50 శాతం, మిగిలిన రైతులకు 40 శాతం రాయితీని ప్రభుత్వం భరిస్తుందన్నారు. యంత్ర పరికరాలు అవసరమైన రైతుల నుంచి త్వరలోనే దరఖాస్తులు ఆహ్వానించనున్నట్లు వివరించారు.

విద్యుత్తు వినియోగం పైపైకే..

మండుతున్న ఎండలతో పెరిగిన డిమాండ్

ఈనాడు - అమరావతి

మే నెలలో	గరిష్ఠ ఉష్ణోగ్రతలు
1	42
2	40
3	39
4	39

(డిగ్రీలలో..)

ఎండలు మండిపోతున్న నేపథ్యంలో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా విద్యుత్తు వినియోగం పెరుగుతోంది. ఉక్కపోత, ఎండ వేడి నుంచి ఉపశమనం పొందడానికి ప్రజలు శీతల యంత్రాలు, పంఖాలను విరివిగా వినియోగిస్తున్నారు. సోమవారం పగటిపూట గరిష్ఠ ఉష్ణోగ్రత 39 డిగ్రీలుగా నమోదైనా.. విపరీతమైన ఉక్కపోతతో జనం ఉక్కిరిబిక్కిరయ్యారు.

ఉమ్మడి జిల్లాలో సాధారణ పరిస్థితుల్లో రోజుకు 12.2 మిలియన్ యూనిట్ల నుంచి 12.4 మిలియన్ యూనిట్ల వరకు విద్యుత్తు వినియోగం ఉంటుంది. ఇప్పుడిది రోజువారీగా 13.5 మిలియన్ యూనిట్లకు పెరిగింది.

విద్యుత్తు డిమాండ్ సాధారణంగా రోజుకు 850 మెగావాట్ల నుంచి 875 మెగావాట్ల మధ్య ఉండగా ఇప్పుడు సగటున వెయ్యి మెగావాట్ల వరకు ఉంటోంది. ఈ సీజన్‌లో ఇప్పటివరకు గరిష్ఠంగా గత శనివారం 1,007 మెగావాట్లకు డిమాండ్ నమోదయింది. శనివారం మధ్యాహ్నం 3.30 గంటల సమయంలో అత్యధికంగా విద్యుత్తు డిమాండ్ నమోదయింది. ఆదివారం నుంచి కొన్ని ప్రాంతాల్లో వర్షాలు పడటంతో వాతావరణం కొంత చల్లబడటం వల్ల ప్రజలకు ఉపశమనం లభించింది. దీనికి తోడు ఆది, సోమవారాల్లో సాయంత్రం చల్లబడటం వల్ల విద్యుత్తు వినియోగం కొంత తగ్గింది. సగటున 930 మెగావాట్ల డిమాండ్ ఉండొచ్చని అంచనా.

వచ్చే ఐదు రోజులు భగభగలే

కలెక్టరేట్(గుంటూరు), న్యూస్‌టుడే: రానున్న ఐదు రోజులు జిల్లాలో ఎండల తీవ్రత ఎక్కువగా ఉంటుందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ సి.ఎం.సాయికాంత్ వర్మ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ రానున్న ఐదు రోజుల్లో వేసవి తీవ్రత అధికంగా ఉంటుందని ఇప్పటికే సూచనలు చేసిందన్నారు. 41 డిగ్రీలకు మించి ఉష్ణోగ్రతలు ఉండవచ్చని తెలిపారు. అత్యవసర పనులుంటే మినహా.. ప్రజలెవరూ ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు బయటకు రావద్దన్నారు. అత్యవసర పనులకు బయటకు వస్తే తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

మా మాట కూడా వినండి... సహకరిస్తాం

సంప్రదింపుల ఒప్పంద పథకంపై రాజధాని గ్రామాల రైతుల ప్రశ్నలు

ఈనాడు - అమరావతి

రాజధాని అమరావతి నగర ప్రాజెక్టులో భాగంగా ట్రంక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ వర్క్ నిమిత్తం అవసరమైన స్థలాలు, భూములను సీఆర్డీఏ 'సంప్రదింపుల ద్వారా ఒప్పంద పథకం' కింద సేకరిస్తోంది. ట్రంక్ రోడ్ల నిర్మాణంలో రాజధాని గ్రామాల్లో కొందరు ఇళ్లు, స్థలాలు కోల్పోతున్నారు. వీరికి సంప్రదింపుల ఒప్పంద పథకం (ఎన్సెన్సీ) ద్వారా కోల్పోతున్న స్థలానికి అంతే స్థలం ఇవ్వడంతోపాటు ఇళ్లు, చెట్లు, ఆస్తులు కోల్పోతున్నవారికి పరిహారం అందిస్తామని సీఆర్డీఏ ప్రకటించింది. స్థానికులు వీటిని ఇవ్వడానికి సిద్ధంగానే ఉన్నప్పటికీ కొన్ని అభ్యంతరాలు లేవనెత్తుతున్నారు. వాటిని నివృత్తి చేసి రైతులకు భరోసా ఇచ్చి సమస్యలు పరిష్కరించాల్సిన సీఆర్డీఏ సరైన సమాచారం ఇవ్వకుండా భూసేకరణకు వెళ్తామని ప్రకటనలు ఇవ్వడంపై వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయాన్ని ఇప్పటికే సీఆర్డీఏ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. ఒక్క తుళ్లూరులోనే రెండు ట్రంక్ రోడ్లు వెళ్తున్నందున 11.14 ఎకరాలను సేకరించాల్సి ఉంది.

రైతుల అభ్యంతరాలివే...


- ఇళ్లు, స్థలాలను ఆయా రోడ్లకు అవసరమైనంత వరకే తీసుకుంటామని సీఆర్డీఏ ప్రకటించింది. మిగిలిపోయిన కొద్దిపాటి స్థలం ఉపయోగపడదు.
- సీఆర్డీఏ 90 డిగ్రీల కోణంలో స్థలాలు, ఇళ్లు సేకరించడంతో మిగిలిపోతున్న స్థలాలు లేదా ఇళ్లు ట్రయాంగిల్‌గా అరకొరగా మిగిలితే ఎందుకూ పనికిరావు.
- ప్రభుత్వ భూములు ఆక్రమించి 96 గజాలలోపు ఇళ్లు నిర్మించుకున్నవారికి మరోచోట 96 గజాల స్థలాన్ని కేటాయిస్తున్నారు. అదే పట్టాదారు 96 గజాల్లోపు స్థలం లేదా అందులో ఇల్లు చూపిస్తే టీడీఆర్ బాండ్లు ఇస్తున్నారు.
- ఒకవేళ 96 గజాలకుపైగా ఉన్నట్లయితే కోల్పోయిన స్థలానికి అంతే స్థలం ప్లాటుగా ఇవ్వడంపైనా అభ్యంతరాలున్నాయి.
- ఇళ్లు, స్థలాలు కోల్పోతున్నవారికి ప్లాట్లు ఏ ప్రాంతంలో ఎన్ని రోజుల్లో కేటాయిస్తారు?
- ఎన్సెన్సీ విధానంలో ఉన్న అభ్యంతరాలను నివృత్తి చేయకుండా భూసేకరణ చేస్తామని ఎలా ప్రకటిస్తారు?

సగం స్థలం ఎందుకూ ఉపయోగపడదు



తుళ్లూరులో 194 గజాల్లో ఇల్లుంది. ఈ-5 రోడ్డులో కొంత భాగం తీసుకుంటామని చెప్పారు. ఈశాన్యం మూల తక్కువ పోతోంది. నైరుతివైపు రెండో గదిలో కూడా రెండు గజాల వరకు తీసుకుంటున్నారు. 90 డిగ్రీల కోణంలో సేకరించడం వల్ల ముక్కోణంలో ఇల్లు పోతోంది. నివాసానికి వీలుండదు. సరిచేసుకోవాలన్నా కుదరదు. ఇల్లు మొత్తం తీసేసుకుని మరోచోట ఇవ్వాలని కోరుతున్నాం. ఇల్లు సరిచేసుకోవాలంటే 66 గజాలే మిగులుతోంది. మొత్తం తీసేసుకుని అక్కడే స్థలం ఇవ్వాలని అడుగుతున్నా. **- తాళ్లూరి వీరయ్య, తుళ్లూరు**

ముక్కలుగా మిగిలిపోతుంది



ఈ-5 రోడ్డు, ఎన్-13 రోడ్డు కలిసేచోట డైమండ్ సర్కిల్ ఏర్పాటు చేస్తున్నారు. ఇక్కడ నాకున్న 5.50 సెంట్ల స్థలంలో 3 సెంట్లు అవసరమని అధికారులు చెబుతున్నారు. 3 సెంట్లు తీసుకోగా.. మిగిలిన స్థలం త్రికోణంలా మిగిలిపోతుంది. ఇది ఉపయోగపడదు. మొత్తం స్థలం తీసుకుని మరోచోట కేటాయించాలని అధికారులను కోరగా.. అంగీకరించడం లేదు. **- పువ్వాడ వెంకట్రావు, తుళ్లూరు**

వాసిరెడ్డి వెంకటాద్రినాయుడు స్మృతివనం ఏర్పాటుకు చర్యలు

ఈనాడు, అమరావతి: అమరావతిలో వాసిరెడ్డి వెంకటాద్రినాయుడు స్మృతివనం, మ్యూజియం ఏర్పాటుకు నిబంధనల మేరకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సీఆర్డీఏ కమిషనర్‌కు ప్రభుత్వం సూచించింది. అఖిల భారత పంచాయతీ పరిషత్ జాతీయ ఉపాధ్యక్షుడు, అమరావతి అభివృద్ధి కమిటీ ఛైర్మన్ జస్టిస్ వీరాంజనేయులు వాసిరెడ్డి వెంకటాద్రినాయుడు స్మృతివనం, మ్యూజియం ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి 2018లో ఒకసారి, తాజాగా ఏప్రిల్ 23న ప్రతిపాదనలు ఇచ్చారు. గతంలో గుంటూరులో వాసిరెడ్డి వెంకటాద్రినాయుడు వర్ధంతి సభలో అప్పట్లో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఇచ్చిన హామీని కూడా అందులో పొందుపరిచారు. ఈ మేరకు మున్సిపల్ పరిపాలనశాఖ నుంచి సీఆర్డీఏ కమిషనర్‌కు ప్రతిపాదనలు పంపి పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం సోమవారం మెమోలో సూచించింది. స్మృతివనం, మ్యూజియం ద్వారా వాసిరెడ్డి వెంకటాద్రినాయుడు చరిత్ర, సేవలు, సాంస్కృతిక వారసత్వం భవిష్యత్తు తరాలకు అందుబాటులోకి రానుంది.

జలధార పనులు త్వరగా ప్రారంభించండి

జిల్లాపరిషత్తు, న్యూస్‌టుడే: జలధార-జలహారతి పనులను త్వరగా ప్రారంభించాలని సంయుక్త కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ అధికారులను ఆదేశించారు. పీజీఆర్ఎస్, రీసర్వే, ఉపాధి హామీ పథకం పనులపై కలెక్టర్ కార్యాలయం నుంచి మండలాల అధికారులతో సోమవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి మాట్లాడారు. జలధార-జలహారతి పనులు మంజూరు చేసినా ప్రారంభించడంలో జాప్యం చేస్తున్నట్లు ఆన్‌లైన్‌లో కనిపిస్తోందన్నారు. పనులు ప్రారంభించడంతో పాటు ఆన్‌లైన్‌లోనూ వివరాలు నమోదు చేయాలని చెప్పారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అందిన అర్జీలను 48 గంటల్లో పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. పట్టాదారు పాస్ పుస్తకాలను ఈనెల 6వ తేదీకి పంపిణీ చేయాలని ఆదేశించారు. రీసర్వే చేయడానికి ముందుగా ప్రజలకు నోటీసులు జారీ చేసి ఈకేవైసీ చేయాలని స్పష్టం చేశారు. వీసీలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

శ్రీలక్ష్మీనృసింహునికి లక్ష గజాల ప్లాట్లు

భూ సమీకరణకు స్వామివారి భూములు

తాడేపల్లి, మంగళగిరి, న్యూస్‌టుడే: రాజధాని నిర్మాణంలో మంగళగిరి శ్రీలక్ష్మీ నృసింహస్వామి సైతం భాగస్వాములయ్యారు. ఈ మేరకు స్వామివారికి చెందిన గతంలో 88.87 ఎకరాల భూములను భూసమీకరణ కింద అందజేశారు. ఇందుకు ప్రతిఫలంగా లక్ష గజాల అభివృద్ధి చేసిన ప్లాట్లను సీఆర్డీఏ కేటాయించింది. రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తిచేసింది. 88 వేల గజాలు ప్లాట్లు, 16 వేల గజాల కమర్షియల్ ప్లాట్లను స్వామివారికి కేటాయించారు. రాజధాని పరిధిలోని కృష్ణాయపాలెం, మల్కాపురం, నేలపాడు, కురగల్లు, నిడమర్రు, నవులూరు గ్రామాల పరిధిలో ఉన్న నృసింహుని భూములకు ఆయా ప్రాంతాల్లోనే ప్లాట్ల రిజిస్ట్రేషన్ ప్రక్రియను ఇటీవల పూర్తి చేసి సీఆర్డీఏ దేవాలయానికి అందజేసింది.

అభ్యంతరాలు నివృత్తి చేస్తే రాజధానికి భూములిస్తాం

నాడు భూసమీకరణకు దూరంగా ఉన్న రైతుల స్పష్టీకరణ

ఈనాడు, అమరావతి: తామేమీ అభివృద్ధికి అడ్డంకి కాదని.. అభ్యంతరాలను నివృత్తి చేస్తే భూములిచ్చి సహకరిస్తామని రాజధాని ప్రాంతంలో తొలివిడతలో భూసమీకరణ కింద భూములివ్వని రైతులు సీఆర్డీఏ అధికారులకు స్పష్టం చేశారు. వీరితో సోమవారం సీఆర్డీఏ కార్యాలయంలో అధికారులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా అధికారులు తమ అభ్యంతరాలు తెలియజేశారు. రాజధాని నిర్మాణానికి, అభివృద్ధికి భూములివ్వడానికి సిద్ధంగానే ఉన్నామని, సమస్యల పరిష్కారంపై సంప్రదించడానికి ఇప్పటివరకు అధికారులు ప్రయత్నించలేదని చెప్పారు. తొలిసారిగా భూములివ్వని రైతులను పిలిచి చర్చించి సంప్రదింపులు జరపడం శుభపరిణామమన్నారు. రాజధానికి గెజిట్ తీసుకురావాలని కోరామని, ఇప్పుడు వచ్చినందున భూములిస్తామన్నారు. గ్రామకంఠాల సమస్యను రికార్డుల ఆధారంగా పరిష్కరించే అవకాశం ఉన్నా.. ఎందుకు జాప్యం చేస్తున్నారని అడిగారు. రాజధాని రాకముందే తమ భూములకు విలువ ఎక్కువగా ఉన్నందున అందరితో కాకుండా ప్రత్యేకంగా రిటర్నబుల్ ప్లాట్లు, ఇతర ప్రయోజనాలు కల్పించాలని ఉండవల్లి గ్రామ రైతులు కోరారు. సీఆర్డీఏ కమిషనర్ విజయరామరాజు మాట్లాడుతూ.. గ్రామాల వారీగా రైతుల అభిప్రాయాలు తెలుసుకునేందుకు అదనపు కమిషనర్ల ఆధ్వర్యంలో శుక్ర, శనివారాల నుంచి సమావేశాలు నిర్వహిస్తామని చెప్పారు. కలెక్టర్ సాయికాంత్‌వర్మ, అదనపు కమిషనర్లు ఎ.భార్గవతేజ, కొల్లాబత్తుల కార్తీక్, డిప్యూటీ కలెక్టర్లు, తహసీల్దార్లు, రైతులు పాల్గొన్నారు.

6 నుంచి వేసవి క్రికెట్ శిక్షణ శిబిరాలు

గుంటూరు క్రీడలు, న్యూస్‌టుడే: యువ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అరండల్‌పేట పిచుకలగుంటలోని శ్రీమాజేటి గురవయ్య స్కూల్ గ్రౌండ్‌లో వేసవి క్రికెట్ ఉచిత శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నామని త్రిసభ్య కమిటీ సభ్యులు టీవీఎస్ శివరామకృష్ణ, సీహెచ్.వి.నాగరాజు, జీవీఎస్ శరత్‌బాబు తెలియజేశారు. ఈనెల 6 నుంచి జూన్ 6వ తేదీ వరకు అండర్-10, 12, 14, 16 విభాగాల వారీగా శిబిరాలు జరుగుతాయని చెప్పారు.

పానకాల స్వామి కొండపై ప్రత్యామ్నాయ ఘాట్ రోడ్డు

మంత్రి లోకేశ్ చొరవతో ముందుకొచ్చిన దాతలు

మంగళగిరి, న్యూస్‌టుడే


నూతనంగా నిర్మించే ఘాట్ రోడ్డు.. దిగువకు వెళ్లే రహదారిని కలిసే ప్రదేశం

మంగళగిరి శ్రీపానకాలస్వామి కొండపై నుంచి దిగువకు ప్రత్యామ్నాయంగా మరో ఘాట్‌రోడ్డు నిర్మాణానికి మంత్రి నారా లోకేశ్ చొరవతో దాతలు ముందుకొచ్చారు. రోడ్డు నిర్మాణానికి అవసరమైన సర్వేను సోమవారం చేపట్టారు. దిగువ శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయం నుంచి కొండపై ఉన్న పానకాలస్వామి దేవస్థానానికి ఘాట్‌రోడ్డు గతంలో ఏర్పాటు చేశారు. రాష్ట్రం నలుమూలల నుంచి ఆలయానికి వచ్చే భక్తులు సంఖ్య పెరుగుతుండటంతో కింద నుంచి కొండపైకి వెళ్లిన వాహనాలతో పార్కింగ్ నిండిపోతోంది. ఫలితంగా పార్కింగ్‌లో ఉన్న వాహనాలు తిరిగి కిందకి వెళ్లాలంటే అసౌకర్యంగా మారింది. శని, ఆదివారాల్లో భక్తులు భారీగా తరలివస్తున్నారు. కొండపై పార్కింగ్ ఏర్పాటుకు అవసరమైన స్థలం లేకపోవడం వల్ల ప్రత్యామ్నాయంగా పార్కింగ్ ప్రదేశం నుంచి కొండపైకి వచ్చే ఘాట్ రోడ్డు రెండో మలుపు వద్ద కలిసే విధంగా మరో ఘాట్ రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదించారు. రెండు వందల మీటర్ల రహదారి నిర్మాణం చేపట్టాలని సంకల్పించారు. ఇందుకోసం ఇద్దరు దాతలు ముందుకొచ్చారు. రూ.6 కోట్ల వరకు వెచ్చించేందుకు అంగీకరించడంతో పనులు చేపడుతున్నారు.

కొండ చుట్టూ నిర్మించేలా మరో ప్రతిపాదన

ఇందులో తొలి విడతగా ఘాట్ రోడ్డు కొండపై నుంచి దిగువకు ఎక్కడ నుంచి ఎక్కడ వరకు నిర్మించాలనే దాని కోసం సర్వే ప్రారంభించారు. దీని నిర్మాణం పూర్తిచేస్తే పార్కింగ్ ప్రదేశంలో ఉన్న వాహనాలు పాత ఘాట్ రోడ్డులోకి నేరుగా రాకుండా వెనుక నుంచి నూతనంగా నిర్మించే రోడ్డు గుండా బయటకు వెళ్లిపోతాయి. దీనివల్ల కొండపై వాహన రద్దీని నివారించవచ్చని భావిస్తున్నారు. ఇది కాకుండా 'ప్రసాదం' పథకం కింద మరో ఘాట్ రోడ్డు నిర్మాణం ప్రతిపాదనలో ఉంది. ఇది ఎయిమ్స్ మార్గం నుంచి కొండ చుట్టూ వచ్చి పానకాలస్వామి ఆలయం వద్దకు చేరుకుంటుంది. దీనికి డీపీఆర్ రూపకల్పన జరుగుతుంది. ఈ రోడ్ల నిర్మాణం వల్ల భవిష్యత్తులో స్వామిని దర్శించుకునే భక్తులు తమ వాహనాల్లో నేరుగా కొండపైకి చేరుకునే సౌలభ్యం కలుగుతుంది. తొలి విడతగా దాతలు నిర్మించే ప్రత్యామ్నాయ ఘాట్ రోడ్డు పనులు వేగంగా పూర్తి చేయాలని దేవాదాయ శాఖాధికారులు సంకల్పించారు.

ఉపాధి నిధుల విడుదలకు మార్గం సుగమం

జిల్లాపరిషత్తు(గుంటూరు), న్యూస్‌టుడే

జిల్లాలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో చేసిన పనులకు సంబంధించి మెటీరియల్ కాంపోనెంట్ వాటా నిధులు విడుదలకు మార్గం సుగమమైంది. 2026-27 ఆర్థిక సంవత్సరంలో మొదటి విడతగా రాష్ట్రానికి ఏప్రిల్ 30న రూ.1,123.15 కోట్లు కేంద్ర ప్రభుత్వం విడుదల చేసింది. అదే సమయంలో పరిపాలన కాంపోనెంట్ కింద రాష్ట్రానికి రూ.69.01 కోట్లు విడుదల చేసింది. దీంతో రాష్ట్ర ప్రభుత్వం జిల్లాలకు నిధులు విడుదల చేయనుంది.

★ జిల్లాకు మెటీరియల్ కాంపోనెంట్ కింద రూ.32 కోట్లకు ప్రతిపాదనలు యంత్రాంగం ప్రభుత్వానికి పంపింది. ★ జిల్లా నీటి యాజమాన్య సంస్థ కార్యాలయంతో పాటు ఏపీడీలు, మండల పరిషత్తు కార్యాలయాలకు అవసరమైన స్టేషనరీ, క్యాటరిడ్జ్‌లు, ఇతర సామగ్రికి అవసరమైన నిధులు జిల్లాకు రాష్ట్ర ప్రభుత్వం కేటాయించనుంది. చాలా కాలంగా పరిపాలన ఖర్చులకు నిధులు విడుదల కాని పరిస్థితి. స్టేషనరీ కోసం కూడా ఉద్యోగులు ఇబ్బందులు పడ్డారు.

★ ఇప్పటికే వేజ్ కాంపోనెంట్ కింద రాష్ట్రానికి రూ.1,805 కోట్లు విడుదల చేసింది. ఉపాధి పనులు చేసిన శ్రామికులకు బకాయిలు చెల్లించనున్నారు.

★ 2026-27 ఆర్థిక సంవత్సరం ప్రారంభంలోనే కేంద్ర ప్రభుత్వం మొదటి విడత నిధులు విడుదల చేయడంతో జిల్లాలో సివిల్ పనులకు బిల్లులు చెల్లించడంతో పాటు కొత్త పనులు చేసేందుకు అవకాశం ఏర్పడింది. మెటీరియల్ కాంపోనెంట్‌లో రూ.32 కోట్లు జిల్లాకు లభించనున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం నిధులు విడుదల చేసిన తర్వాత బిల్లుల చెల్లిస్తామని డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ వి.శంకర్ 'న్యూస్‌టుడే'కు తెలిపారు. అడ్మినిస్ట్రేటివ్ కాంపోనెంట్‌లోనూ నిధులు విడుదల చేసినందున కార్యాలయాల్లో సామగ్రి కొనుగోళ్లకు ఇబ్బందులు ఉండవని వివరించారు.

Bank of India
Relationship beyond banking
బ్యాంక్ ఆఫ్ ఇండియా, విజయవాడ జోన్, కార్పొరేట్ సర్వీసెస్ డిపార్ట్‌మెంట్,
#31-23-1ఐ, పి.వి.ఆర్. కాంప్లెక్స్, 1వ అంతస్తు, BSNL భవన్ ప్రక్కన, చుట్టుగుంట, విజయవాడ,
ఎ.పి.-520004, ఫోన్: 0866-2467762. e-mail: Vijayawada.csd@bankofindia.bank.in
బ్యాంక్ ఆఫ్ ఇండియా, పొన్నూరు బ్రాంచి కొరకు ప్రత్యామ్నాయ ప్రాంగణము కావలెను
బ్యాంక్ ఆఫ్ ఇండియా లీజు ప్రాతిపదికన ప్రత్యామ్నాయ ప్రాంగణం కోసం ఆఫర్లను ఆహ్వానిస్తున్నది. వివరణాత్మక నోటిఫికేషన్ మా వెబ్‌సైట్ www.bankofindia.bank.inలో అందుబాటులో ఉన్నది. అప్లికేషన్స్ సమర్పించడానికి చివరితేదీ 18.05.2026. ఏదైనా సవరణ / అనుబంధం / నోటిఫికేషన్ ఉంటే, అవి వెబ్‌సైట్‌లో మాత్రమే ప్రచురించబడతాయి.
సం/- జోనల్ మేనేజర్, విజయవాడ జోన్

సందర్భమేదైనా ఈనాడు ను చేసుకోండి వేదిక
మీ బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులకు ఈనాడులో ప్రకటనల ద్వారా తెలియజేయండి


ప్రకటనల కొరకు సంప్రదించండి: 80085 10541

(c) eenadu

గోడు వినండి.. పరిష్కారం చూపండి


ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న జేసీ అశుతోష్ శ్రీవాస్తవ

కలెక్టరేట్ (గుంటూరు), న్యూస్‌టుడే: ప్రజా సమస్యల పరిష్కార వేదికకు అర్జీదారులు తరలివచ్చారు. వివిధ శాఖలకు సంబంధించి 159 అర్జీలు నమోదు కాగా, రెవెన్యూ సమస్యలపై 40 వినతులు అందించారు. జిల్లా సంయుక్త కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, డిప్యూటీ కలెక్టర్ గంగరాజు, జడ్పీ సీఈవో జ్యోతిబసు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. పీజీఆర్ఎస్ అర్జీలను వేగవంతంగా పరిష్కరించాలని జేసీ అధికారులను ఆదేశించారు.

ఇంటికి దారి లేకుండా చేశారు: వట్టిచెరుకూరు మండలం కొర్నెపాడులోని మా ఇంటి స్థలాన్ని కొందరు ఆక్రమించుకున్నారు. అధికారులు సర్వే చేసి ఆ స్థలాన్ని ఇప్పించి ఇంటికి నడకదారి అవకాశం కల్పించాలి. ఆక్రమించిన వారు బెదిరిస్తున్నారు. స్థానికంగా అధికారులకు విన్నవించినా సమస్య పరిష్కరించడంలేదు. **- వంగులూరి నాగరాజు, మల్లేశ్వరరావు**

మైనింగ్ పేరుతో బ్లాస్టింగ్: ఫిరంగిపురం మండలం గొల్లపాలెం గ్రామంలో మైనింగ్ పేరుతో బ్లాస్టింగ్ చేస్తున్నారు. దీంతో దుమ్ము, ధూళి ఇళ్లలోకి వస్తున్నాయి. ఇంటి గోడలకు పగుళ్లు ఏర్పడుతున్నాయి. ఇప్పటికే పలుమార్లు మైనింగ్ శాఖ అధికారులకు విన్నవించినా పట్టించుకోలేదు. కమిటీ ఏర్పాటు చేస్తామని చెప్పి కాలయాపన చేస్తున్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి. **- కె.ప్రకాష్‌రావు**

నిషేధిత జాబితాలో చేరిస్తే ఎలా?: వంగిపురంలో స్వాతంత్ర్య సమరయోధులకు గతంలో ప్రభుత్వం భూములు ఇచ్చింది. తర్వాత వారు రైతులకు అమ్ముకొన్నారు. ప్రస్తుతం ఆ భూములను నిషేధిత జాబితాలో చేర్చారు. రైతులు.. అధికారులు, కోర్టులను ఆశ్రయించి నిషేధిత జాబితా నుంచి తొలగించుకున్నా.. తహసీల్దార్లు మారిన ప్రతీసారి 22ఏ జాబితాలో పెడుతున్నారు. దీంతో ఆ భూమిని రైతులు క్రయవిక్రయాలు చేయలేక, రుణాలు పొందలేని పరిస్థితి. అధికారులు స్పందించి వాటిని నిషేధిత జాబితా నుంచి తొలగించాలి. **- మాజీ సర్పంచి కల్లూరి శ్రీనివాసరావు, సాంబిరెడ్డి తదితరులు**

తాగునీరు లేదు.. ఇళ్ల పట్టాలివ్వరు..: వింజనంపాడు ఎస్టీ కాలనీలో 2004లోనే 46 మంది ఇందిరమ్మ ఇళ్లు నిర్మించుకున్నాం. అప్పటి నుంచి ఇళ్ల పట్టాలు ఇవ్వలేదు. తాగునీటి సమస్యకు పరిష్కారం లభించడం లేదు. ఏటా పన్నుల వసూలు సమయంలో ఇంటి పన్నుతో పాటు నీటి పన్నులు వసూలు చేస్తున్నా తాగునీరు అందడం లేదు. అధికారులు స్పందించి తాగునీటి సమస్యలు పరిష్కరించి ఇంటి పట్టాలు ఇప్పించాలి.



- ఎస్.శ్రీకాంత్, ఎం.ముని, కె.రమేష్

బాలుడితో పని చేయించిన గుత్తేదారుకు షోకాజ్ నోటీసు


క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్న కార్మిక శాఖ ఉపకమిషనర్ గాయత్రీదేవి

నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: గుంటూరులోని నెహ్రూనగర్‌లో బాలుడిని మురుగు కాలువలో దింపి హానికర పనులు చేయించిన గుత్తేదారు వల్లపు సాయికుమార్‌కు కార్మికశాఖ అధికారులు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. గుత్తేదారుపై చట్టపరమైన చర్యలుంటాయని తెలిపారు. ఆదివారం 'ఈనాడు'లో 'మురుగుపాలైన బాల్యం' శీర్షికతో వచ్చిన చిత్ర వార్తకు అధికారులు స్పందించారు. బాలుడితో పని చేయించిన ప్రదేశాన్ని సోమవారం కార్మికశాఖ ఉపకమిషనర్ ఎ.గాయత్రీదేవి, సహాయ కార్మికశాఖ అధికారితో కలిసి పరిశీలించారు.

పదో తరగతి విద్యార్థులకు కోచింగ్

తెనాలి(కొత్తపేట) : ఉమ్మడి గుంటూరు జిల్లాలోని గిరిజన సంక్షేమ గురుకులాల నుంచి సప్లిమెంటరీ పరీక్షలు రాయనున్న పదోతరగతి విద్యార్థులకు పల్నాడు జిల్లాలోని నాగార్జునసాగర్(పీటీజీ-బి) ఏపీటీడబ్ల్యూఆర్ స్కూల్‌లో కోచింగ్ ఇస్తున్నట్లు నిర్వాహకులు సోమవారం తెలిపారు. వినుకొండలోని ఏపీటీడబ్ల్యూఆర్ బాలికల గురుకులంలో బాలికలకు తరగతులు ఉంటాయని పేర్కొన్నారు. మంగళవారం నుంచి కోచింగ్ తరగతులు ప్రారంభమవుతాయన్నారు.

అద్దె కట్టలేదని కట్టుబట్టలతో గెంటేశారు


పెద్ద బాజి, చిన్న బాజీ

గుంటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: ఇంటి అద్దె కట్టలేదని వృద్ధురాలైన తల్లితోపాటు తమను కట్టుబట్టలతో గెంటేశారని పాతగుంటూరుకు చెందిన అక్కాచెల్లెళ్లు పెద్దబాజీ, చిన్న బాజీ వాపోయారు. చిన్న పిల్లలతో కలిసి రెండు వారాలుగా ఓ దర్గాలో తలదాచుకుంటున్నామని, న్యాయం చేయాలని సోమవారం గుంటూరు పోలీసు కార్యాలయంలో డీఎస్పీ బెల్లం శ్రీనివాస్‌కు ఫిర్యాదు చేశారు. స్పందించిన ఆయన విచారణ చేసి తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అనంతరం బాధిత మహిళలు విలేకరులతో మాట్లాడారు. 'పాత గుంటూరులోని ఓ ఇంట్లో నెలకు రూ.4 వేలకు అద్దెకుంటున్నాం. ఆర్థిక పరిస్థితుల కారణంగా రెండు నెలలుగా అద్దె చెల్లించలేదు. కొద్ది రోజులు గడువిస్తే కడతామని చెబుతున్నా యజమాని వినకుండా ఇంటికి తాళం వేసి గెంటేశారు. వృద్ధురాలైన తల్లితోపాటు నలుగురు పిల్లలతో కలిసి పెదకాకానిలోని ఓ దర్గాల తలదాచుకుంటున్నాం. ఒక నెల అడ్వాన్స్‌గా ఇచ్చిన మొత్తం పోగా మరొక నెల అద్దె కట్టాలి. పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. మా దుస్తులు, సామగ్రి ఆ ఇంట్లోనే ఉన్నాయి. కనీసం అవైనా తీసుకెళ్తామని అడుగుతుంటే యజమాని దాడి చేస్తున్నార'ని వివరించారు.

ఇండియన్ బ్యాంక్ Indian Bank — ALLAHABAD

గుంటూరు బ్రాంచి
10-1-1, 1వ లైను, సాంబశివపేట, నాజ్‌సెంటర్, గుంటూరు-522001, ఫోన్ : 0863-2220061, 2220804, ఇ-మెయిల్: guntur@indianbank.co.in

పబ్లికేషన్ డిమాండ్ నోటీసు
సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ 2002 యొక్క సెక్షన్13(2) ప్రకారం నోటీసు.

To, ఋణగ్రహీత & తనఖాదారు: 1) శ్రీ ఉరిమి చంద్రశేఖర్, తండ్రి : హనుమంతరావు, 404, బొమ్మరిల్లు అపార్ట్‌మెంట్స్, 5వ లైను, నెహ్రూనగర్, గుంటూరు-522001, 2) శ్రీ వి.వెంకటేశ్వరరావు, తండ్రి : సత్యనారాయణ, షాప్ నెం.147, వైష్ణవి హోల్‌సేల్ క్లాత్ అండ్ రెడీమేడ్ మర్చంట్స్ సొసైటీ, రహమాన్‌ఖాన్ కాంప్లెక్స్, మంగళగిరి రోడ్డు, గుంటూరు-522001, 3) ది సెక్రటరీ : వైష్ణవి హోల్‌సేల్ క్లాత్ అండ్ రెడీమేడ్ మర్చంట్స్ సొసైటీ, రహమాన్ ఖాన్ కాంప్లెక్స్, మంగళదాస్ నగర్, మంగళగిరి రోడ్, గుంటూరు-522001.

విషయం: శ్రీ ఉరిమి చంద్రశేఖర్, తండ్రి : హనుమంతరావు వారి పేరుతో గల ఇండియన్ బ్యాంక్, గుంటూరు బ్రాంచి వారి టర్మ్ లోన్ అకౌంట్ నెం.: 6219329717 గురించి.

[illegible]

తేదీ : 27-04-2026 సం/- అధీకృత అధికారి,
స్థలం : గుంటూరు ఇండియన్ బ్యాంక్, గుంటూరు.

రోడ్డుపోటు ప్లాట్లకు ప్రత్యామ్నాయం చూపరూ!


రైతుల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న సీఆర్డీఏ అధికారులు

తుళ్లూరు, న్యూస్‌టుడే: రైతులకు కేటాయించిన రిటర్నబుల్ ప్లాట్లలో రోడ్డు పోటు వచ్చిన వాటికి ప్రత్యామ్నాయ ప్లాట్లు కేటాయించేందుకు సీఆర్డీఏ అధికారులు వేగంగా చర్యలు తీసుకోవాలని మందడం గ్రామానికి చెందిన రైతులు సీఆర్డీఏ అధికారులను కోరారు. సోమవారం సీఆర్డీఏ ప్రధాన కార్యాలయంలో జరిగిన గ్రీవెన్స్‌డే కార్యక్రమంలో రాజధాని రైతులు, రైతు కూలీలు, మహిళలు సీఆర్డీఏ కమిషనర్ వి.విజయరామరాజు, అదనపు కమిషనర్ ఏ.భార్గవ తేజ, కొల్లాబత్తుల కార్తీక్‌లకు వివిధ సమస్యలపై అర్జీలు అందజేశారు. రిటర్నబుల్ ప్లాట్ల ప్రత్యామ్నాయ కేటాయింపులు, ల్యాండ్ పూలింగ్, రహదారుల్లో ఇళ్లు, స్థలాలు కోల్పోతున్న వారి సమస్యలు, అసైన్డ్ ప్లాట్ల కేటాయింపులపై ఎక్కువగా అర్జీలు వచ్చాయి. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం వరకు జరిగిన గ్రీవెన్స్ డేకు మొత్తం 53 వినతులు వచ్చాయి. ప్రతి రోజు సీఆర్డీఏ కార్యాలయంలో సిటిజన్స్ గ్రీవెన్స్ సెంటర్‌లో అర్జీలు అందజేయవచ్చని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఆర్డీఏ గ్రీవెన్స్ రిడ్రెస్సల్ మేనేజ్‌మెంట్ నోడల్ అధికారి పి.జయశ్రీ, కమ్యూనికేషన్స్ జాయింట్ డైరెక్టర్ జి.రామరాజు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌లు, వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆరోగ్యంగా ఉండాలి.. క్రమశిక్షణతో ఎదగాలి


క్రీడా సామగ్రి పంపిణీ చేస్తున్న శాప్ ఛైర్మన్ రవి

గుంటూరు క్రీడలు, న్యూస్‌టుడే: యువత ఆరోగ్యంగా ఉండాలని, క్రమశిక్షణతో ఎదగాలని ప్రభుత్వం కృషి చేస్తోందని శాప్ ఛైర్మన్ రవి తెలిపారు. గుంటూరులోని బీఆర్ స్టేడియంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరాలను ఆయన సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విద్యాశాఖ, యువజన సేవల శాఖ, స్పోర్ట్స్ అథారిటీ సంయుక్త ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా తొలిసారిగా భారీ స్థాయిలో వేసవి శిబిరాలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. గతంలో స్పోర్ట్స్ అథారిటీ పరిమిత స్థాయిలో మాత్రమే శిబిరాలు నిర్వహించేదని, ఈసారి మంత్రి లోకేశ్ ప్రోత్సాహంతో విద్య, యువజన సేవల శాఖలు కలిసి పెద్ద ఎత్తున ఈ కార్యక్రమాన్ని చేపట్టాయన్నారు. ఆటల ద్వారా చిన్నారుల్లో ప్రతిభ వెలికితీయాలనే లక్ష్యంతో శిబిరాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగాల్లో క్రీడాకారులకు ప్రత్యేక అవకాశాలు కల్పిస్తున్నామని, ప్రతిభావంతులను గుర్తించి ఉన్నత స్థాయికి తీసుకెళ్లేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. క్రీడా యాప్‌ను ప్రతి ఒక్కరూ డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. క్రీడల సమాచారం, ధ్రువపత్రాలు, రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించే పోటీలు, ప్రభుత్వ కార్యక్రమాల వివరాలు అన్నీ యాప్‌లో అందుబాటులో ఉంటాయని తెలిపారు. గుంటూరులోని ప్రజాప్రతినిధులు, దాతలు, వ్యాపారవేత్తలు ముందుకొచ్చి పిల్లలకు పాలు, అల్పాహారం, స్నాక్స్ వంటి సహాయం అందించాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వంతో పాటు సమాజం కూడా భాగస్వాములైతేనే క్రీడారంగం మరింత అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. అనంతరం క్రీడాకారులకు క్రీడా సామగ్రిని పంపిణీ చేసి, టెన్నిస్, బ్యాడ్మింటన్, జిమ్నాస్టిక్స్ తదితర క్రీడాంశాలకు ఏర్పాటు చేసిన శిబిరాలను సందర్శించి పర్యవేక్షించారు. కార్యక్రమంలో శాప్ బోర్డ్ డైరెక్టర్ సంతోష్ కుమార్, మాజీ కార్పొరేటర్ మీరావల్లి, జిల్లా క్రీడా అభివృద్ధి అధికారి అఫ్రోజ్‌ఖాన్, ఆంధ్రప్రదేశ్ ఉషు అసోసియేషన్ కార్యదర్శి బి.నరసింహారావు, కోచులు, క్రీడాకారులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మిర్చి యార్డు సమాచారం (నిన్నటి ధరలు)

వచ్చిన బస్తాలు:	1,16,970
అమ్మకాలు:	1,12,846
నిల్వలు:	26,778

నాన్ ఏసీ కామన్ వెరైటీ (క్వింటా రూ.ల్లో)

334	13,500-22,800
నంబర్ 5	13,500-22,000
341	14,000-21,500
4884	13,500-19,500
సూపర్ 10	14,000-22,000

నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ

తేజ	13,500-20,500
బాడిగ	14,500-22,500
దేవనూరు డీలక్స్	15,000-22,000
ఆర్మూర్	13,000-19,200
తాలు	7,500-11,000

- న్యూస్‌టుడే, మిర్చియార్డు

91.9 FM Vijayawada ఈ FM 91.9 Mee FM
ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ. 5 - ఉ. 7
ఈ-మార్నింగ్స్	ఉ. 7 - ఉ. 11
నువ్వా నేనా	ఉ. 11 - మ. 2
సత్యభామ	మ. 2 - సా. 5
లైట్ తీస్కో	సా. 5 - రా. 9
సరదాగా కాసేపు	రా. 9 - రా. 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా. 12 - తె. 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact 80080 03297

ACHARYA NAGARJUNA UNIVERSITY
NAGARJUNA NAGAR-522510., Guntur District, A.P.
No. ANU/Engg.Sec./Various works/2026-27. Date: 04.05.2026
'e-procurement' Tender Notice
The Registrar, ANU is inviting sealed tenders through www.apeprocurement.gov.in from the eligible contractors/firms for the works of (1) Providing Security Services in Acharya Nagarjuna University. (2) Providing LMV Drivers and Bus Cleaners in Acharya Nagarjuna University. (3) Providing Pump Operators in Acharya Nagarjuna University.
Place: Nagarjuna Nagar Sd/- REGISTRAR

పవర్‌లిఫ్టింగ్ పోటీల్లో సత్తా


పతకాలు సాధించిన క్రీడాకారులతో సంఘ ప్రతినిధులు

మంగళగిరి: ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేటలో ఈనెల ఒకటి నుంచి మూడో తేదీ వరకు ఏపీ పవర్‌లిఫ్టింగ్ అసోసియేషన్ ఆధ్వర్యాన జరిగిన సబ్ జూనియర్, జూనియర్, మాస్టర్స్ (మెన్ అండ్ ఉమెన్) ఎక్యూప్డ్ పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో గుంటూరు జిల్లా పవర్ లిఫ్టర్లు 17 పతకాలు సాధించినట్లు జిల్లా అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు విజయభాస్కర్‌రావు, షేక్ సందాని సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. 11 బంగారు, రెండు రజత, నాలుగు కాంస్య పతకాలు ఉన్నాయని తెలిపారు. సబ్ జూనియర్ బాలుర బృందం, జూనియర్ మెన్ టీమ్ ప్రథమ, బాలికల సబ్‌జూనియర్, జూనియర్ ఉమెన్స్ టీమ్ మూడోస్థానం, జూనియర్ ఉమెన్స్ టీమ్ ప్రథమ స్థానంలో నిలిచాయన్నారు. బెస్ట్ లిఫ్టర్ సబ్‌జూనియర్ బాలికల్లో లిఖిత తృతీయ, జూనియర్ ఉమెన్స్‌లో షబీనా ప్రథమ, జూనియర్ మెన్స్‌లో కౌషిక్ తృతీయ, మాస్టర్స్ ఉమెన్‌లో జ్యోతివర్మ ప్రథమ స్థానంలో నిలిచారన్నారు. పతకాలు సాధించిన క్రీడాకారులకు సౌత్‌జోన్ కార్యదర్శి సకల కోటేశ్వరరావు, రాష్ట్ర అసోసియేషన్ అధ్యక్షుడు గంటా వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి సూర్యనారాయణ, వంశీకృష్ణ తదితరులు అభినందనలు తెలిపారు.

20న గుంటూరులో బహిరంగ సభ


పోస్టర్లు ఆవిష్కరిస్తున్న బ్రహ్మయ్య మాదిగ తదితరులు

గోరంట్ల, న్యూస్‌టుడే: దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించే వరకు నిరంతరం పోరాటాలు చేస్తామని, ఈ క్రమంలోనే గుంటూరులో ఈనెల 20న బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఉసురుపాటి బ్రహ్మయ్య మాదిగ పేర్కొన్నారు. బ్రాడీపేటలోని ఓ సమావేశ మందిరంలో బహిరంగ సభ పోస్టర్లు సోమవారం ఆవిష్కరించారు. బ్రహ్మయ్య మాదిగ మాట్లాడుతూ వ్యక్తి మతం మారినంత మాత్రాన అతను ఎదుర్కొనే వివక్ష మారదన్నారు. మనువాద ధోరణులే దళితులపై వివక్షకు కారణమని, తాము చేస్తున్న పోరాటం ఏ కులానికీ వ్యతిరేకం కాదని తెలిపారు. దళిత క్రైస్తవులు, ముస్లింలకు ఎస్సీ హోదా లభించే వరకు పోరాటం చేస్తామన్నారు. 20న జరిగే బహిరంగ సభకు ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీలు, అంబేడ్కర్ వాదులంతా తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జేఏసీ కన్వీనర్ నుదురుపాటి చంద్రమోహన్, బత్తుల అనిల్‌కుమార్, జిల్లా అధ్యక్షుడు ఏటుకూరి విజయ్‌కుమార్, నల్లపు నీలాంబరం, పాస్టర్ పురుషోత్తమ చౌదరి, మద్దు ప్రేమజ్యోతిబాబు తదితరులు పాల్గొన్నారు.

పీజీ పరీక్షలు వాయిదా

ఏఎన్‌యూ, న్యూస్‌టుడే : ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని పీజీ ఆర్ట్స్, సైన్స్, బీపీఈడీ, డీపీఈడీ, ఎంపీఈడీ పరీక్షలను వాయిదా వేస్తున్నట్లు సీఈ ఆలపాటి శివప్రసాద్ సోమవారం తెలిపారు. ఈ నెల 5 నుంచి జరగాల్సిన పరీక్షలను ఈ నెల 14వ తేదీ నుంచి నిర్వహిస్తామని చెప్పారు. ఒన్‌టైమ్ జరగాల్సిన అన్ని సెమిస్టర్‌లను ఈ నెల 14 నుంచి నిర్వహిస్తున్నామని వివరించారు. మరిన్ని వివరాలను విశ్వవిద్యాలయం వెబ్‌సైట్‌లో ఉంచామన్నారు.

EENADU Classifieds

BUSINESS SERVICES

బంగారం బ్యాంకులలో/ ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈరోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph.81422 92071.

REAL ESTATE

HOUSE FOR SALE

GENERAL

గుంటూరునిటి పొన్నూరురోడ్ కరెంటు ఆఫీసు ఎదురు వనమాస్ బొమ్మరిల్లు అపార్టుమెంట్ ప్రక్కన 109గ. పాత 2BHK గ్రౌండ్, ఫస్ట్ ఫ్లోర్ ఇల్లు అమ్మకం. 9704049199

PLOT FOR SALE

GENERAL

గుంటూరునిటీకి అతిసమీపంలో NRI కాలేజ్ ప్రక్కన విశదల ORR కి లోపల 60% బ్యాంక్‌లోన్ సదుపాయంతో APCRDA ప్లాట్లు కలవు. సంప్ర|| 9959127008.

JOBS

Wanted ShopKeepers, Sal.10K, Shift wise Duties& Logistics Person Full Time Sal.15K, Raithanna Milk Dairy, GNT ✆ 8008101323.

చేబ్రోలులోని ప్రముఖ ఇంగ్లీష్ మీడియం స్కూలు నందు నర్సరీ - 5th వరకు మ్యాథ్స్, ఇంగ్లీష్, తెలుగు సబ్జక్టుకు లేడీ టీచర్స్ 5th క్లాస్ - 10th మ్యాథ్స్, ఇంగ్లీష్ టీచర్స్ కావలెను. సెల్: 9966422909.

ప్రముఖ దాల్‌మిల్‌లో పని చేయుటకు సూపర్‌వైజర్ cum అకౌంటెంట్ 5సం.రాలు అనుభవం కలిగివున్నవారు కావలెను. గుంటూరు. సంప్ర|| 9030206999.

ప్రముఖ రియల్‌ఎస్టేట్ గుంటూరు నందు పని చేయుటకు మార్కెటింగ్ ఎంప్లాయిస్ (టెలికాలర్స్) కావలెను. అర్హత: 7th-10th, జీతం: పార్ట్‌టైమ్ 6000, ఫుల్‌టైమ్ 12000- ఇన్సెంటివ్స్. ✆ 96446 69999, 99086 86363.

గుంటూరు మాస్టర్‌మైండ్స్ కాలేజి నందు క్లాస్ ఇన్‌ఛార్జ్ మరియు క్యాంపస్ ఇన్‌ఛార్జ్‌గా పనిచేయుటకు పురుషులు కావలెను. జీతము : 14000/- నుండి 23000/- వరకు ఇవ్వబడును. అర్హతలు : ఇంటర్ నుండి పి.జి వరకు, వయస్సు :22 సంవత్సరాలు నుండి 45 సంవత్సరాలు వరకు ఉండవలెను. గుంటూరు లోకల్ వ్యక్తి అయ్యిఉండాలి. వివరములకు 8978480429

గుంటూరు & పల్నాడు జిల్లాలో బ్యాంకింగ్ అనుబంధ సంస్థలో కలెక్షన్‌కు ఫీల్డ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. అనుభవం + ఫ్రెషర్స్. టూవీలర్. 99499 72701, 89775 75555

మంగళగిరిలోని BPCL పెట్రోల్ బంక్‌లో పని చేయుటకు పంపు బాయ్స్ & గర్ల్స్ కావలెను. భోజనం, వసతి సదుపాయం కలదు. Ph.9849582369.

తక్కువ బడ్జెట్‌లో మీ అవసరాలు తీర్చే ఏకైక మార్గం.. ఈనాడులో ప్రకటన ఇవ్వటం. పూర్తి వివరాలకు సంప్రదించండి: 8008510541

గుంటూరు మాస్టర్‌మైండ్స్ కాలేజి నందు వార్డెన్స్‌గా పనిచేయుటకు పురుషులు కావలెను. జీతము : 13000/- ఇవ్వబడును. (ఉచిత భోజనము వసతి కల్పించబడును) విద్యార్హతలు : 10th మరియు ఇంటర్, వయస్సు 22 సంవత్సరములపైన ఉండవలెను. వివరములకు 91546 93478.

గుంటూరు మాస్టర్ మైండ్స్ కాలేజినందు మెటీరియల్ డిజైనర్స్‌గా పనిచేయుటకు 40 wpm టైపింగ్ స్పీడ్, మెథమెటిక్స్ ఫార్ములాస్, తెలుగు టైపింగ్, M.S Wordలో మంచి నైపుణ్యం కలిగిన గుంటూరు లోకల్ పురుషులు కావలెను. జీతము: 16000/- వరకు ఇవ్వబడును. విద్యాఅర్హతలు : ఇంటర్ మరియు డిగ్రీ, వయస్సు: 22 సంవత్సరముల పైన ఉండవలెను. 8978480429

గుంటూరు, మాస్టర్‌మైండ్స్ కాలేజి నందు వార్డెన్స్, హాస్టల్ ఇన్‌ఛార్జ్‌గా పని చేయుటకు స్త్రీలు కావలెను. జీతము : 11000/- నుండి 14000/-| వరకు ఇవ్వబడును. (ఉచిత భోజనము వసతి కల్పించబడును) విద్యా అర్హతలు : ఇంటర్ మరియు డిగ్రీ, వయస్సు : 20 సంవత్సరముల పైన ఉండవలెను. వివరములకు సంప్రదించగలరు. 9100024059

రామాడ్రెస్సెస్ నందు పనిచేయుటకు అనుభవం గల సేల్స్‌గరల్స్ & సేల్స్‌బాయ్స్ & ఇన్నర్ వేర్, నైట్స్‌వేర్‌కి కూడా కావలెను. రమ మాన్షన్ 5/1 బ్రాడీపేట. 9347790038.

SHO సంస్థకు MLT / DMLT / BSc MLT / ANM / GNM చేసినవారు కావలెను. శాలరీ 10 వేలు. 8గంటల డ్యూటీ, సంప్ర|| SHO, 2/1 బ్రాడీపేట, గుంటూరు. సెల్ 9848391212

గుంటూరు మాస్టర్‌మైండ్స్ కాలేజి నందు Construction Site Inchargesగా పనిచేయుటకు పురుషులు కావలెను. విద్యా అర్హతలు: Civil Diploma మరియు Civil Engineering, వయస్సు : 30 నుండి 50 సంవత్సరముల మధ్య ఉండవలెను. జీతము : 20000/-, 25000/-, 30000/-, 35000/-లలో విద్యా అర్హత , Job Experience ఆధారంగా జీతము నిర్ణయించబడును. వివరములకు 8978480430.

DRIVERS

అనుభవంగల కారు డ్రైవర్లు కావలెను. వయస్సు: 40 లోపు. మంచి జీతం & స్థిరమైన ఉద్యోగం. గుంటూరు పరిసర ప్రాంతాల వారికి ప్రాధాన్యత. ✆ 8919258784.

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

ట్రాన్స్‌జెండర్ల సమస్యల పరిష్కారానికి కృషి


మంత్రి లోకేశ్‌తో డాక్టర్ రాయపాటి శైలజ, ట్రాన్స్‌జెండర్లు తదితరులు

పట్టాభిపురం, న్యూస్‌టుడే: ట్రాన్స్‌జెండర్లు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని ఆంధ్రప్రదేశ్ మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ డాక్టర్ రాయపాటి శైలజ తెలిపారు. కొన్ని నెలలుగా ట్రాన్స్‌జెండర్ల సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి, వారి అవసరాలు, అభ్యర్థనలను సమగ్రంగా అధ్యయనం చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఏప్రిల్ 7న విజయవాడలో నిర్వహించిన ట్రాన్స్‌జెండర్స్ స్వాభిమాన సభలో వారి సమస్యలను నేరుగా తెలుసుకున్నామని, వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని అప్పట్లో హామీ ఇచ్చినట్లు గుర్తుచేశారు. మంగళగిరిలోని మహిళా కమిషన్ కార్యాలయంలో ట్రాన్స్‌జెండర్ల ప్రతినిధులతో సోమవారం సమావేశమై, వారి సమస్యలను ప్రభుత్వానికి సమగ్రంగా నివేదించే విధానంపై చర్చించినట్లు తెలిపారు. వారి సంక్షేమం కోసం అవసరమైన చర్యలు తీసుకునేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చిన నేపథ్యంలో వారి ప్రతినిధులను మంత్రి లోకేశ్ వద్దకు తీసుకెళ్లి, వారి సమస్యలు, అవసరాలను ప్రత్యక్షంగా వివరించే అవకాశం కల్పించినట్లు వెల్లడించారు. ప్రతినిధుల ఆవేదనలు విని, సమస్యల పరిష్కారానికి సానుకూలంగా స్పందించిన మంత్రి లోకేశ్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

లైబ్రేరియన్ల కేసులో టీజీపీఎస్సీకి సుప్రీంకోర్టు నోటీసులు

ఈనాడు, దిల్లీ: ఆచార్య నాగార్జున యూనివర్సిటీ (గుంటూరు) స్టడీసెంటర్ల ద్వారా దూరవిద్యలో ఎంఎల్ఐసీ చేసిన అభ్యర్థులు తెలంగాణలో భర్తీ చేస్తున్న లైబ్రేరియన్ పోస్టులకు అర్హులు కాదంటూ ఆ రాష్ట్ర హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌లో టీజీపీఎస్సీకి సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది. నియామకాలు తుది ఉత్తర్వులకు లోబడి ఉంటాయని జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్ర, జస్టిస్ ఎన్వీ అంజారియాలతో కూడిన ధర్మాసనం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రంలో 71 లైబ్రేరియన్ పోస్టుల భర్తీకి టీజీపీఎస్సీ 2022 డిసెంబరు 31న నోటిఫికేషన్ ఇచ్చింది. అభ్యర్థులు బ్యాచిలర్ డిగ్రీతోపాటు 50% మార్కులకు తగ్గకుండా ఎంఎల్ఐసీ పాసై ఉండాలని షరతు విధించింది. ఒకవేళ ఎవరైనా దూరవిద్య ద్వారా ఆ కోర్సు చేసి ఉంటే... దానికి యూజీసీ గుర్తింపు ఉండాలంది. ఆ నోటిఫికేషన్ ప్రకారం 2023 మే 17న కొందరు అభ్యర్థులు పరీక్ష రాసి తాత్కాలిక ఎంపిక జాబితాలో పేరు దక్కించుకున్నారు. టీజీపీఎస్సీ సర్టిఫికెట్ల పరిశీలన సమయంలో వారు నాగార్జున వర్సిటీ నుంచి దూరవిద్యలో ఎంఎల్ఐసీ చేసినట్లు తెలుసుకుని ధ్రువపత్రాలను తిరస్కరించింది. బాధిత అభ్యర్థులు హైకోర్టు ఏకసభ్య ధర్మాసనాన్ని ఆశ్రయించగా వారికి అనుకూలంగా తీర్పు వచ్చింది. 2017లో ఇదే వర్సిటీ నుంచి దూరవిద్యలో ఎంఎల్ఐసీ కోర్సు చేసిన వారిని నియమించడంతోపాటు ప్రమోషన్లూ ఇచ్చినట్లు గుర్తుచేసింది. ఈ తీర్పుపై టీజీపీఎస్సీ హైకోర్టు డివిజన్ బెంచ్‌ను ఆశ్రయించగా... ఆ బెంచ్ ఏకసభ్య ధర్మాసనం తీర్పును ఏప్రిల్ 2న కొట్టివేసింది. దాంతో పలువురు అభ్యర్థులు సుప్రీంకోర్టుకు వెళ్లగా... టీజీపీఎస్సీకి కోర్టు నోటీసులు జారీ చేస్తూ జులై 29లోపు సమాధానం చెప్పాలని ఆదేశించింది.

అక్రమ వసూళ్లకు అడ్డుకట్ట

మిర్చియార్డు, న్యూస్‌టుడే: గుంటూరు మిర్చియార్డులో అక్రమ వసూళ్లను నిరోధించేలా ఎట్టకేలకు అధికార యంత్రాంగం చర్యలు చేపట్టింది. 'ఈనాడు'లో 'అడగరని...ఆపరని..' శీర్షికన సోమవారం కథనం ప్రచురితమైంది. బిల్ టూ బిల్‌తో లైసెన్స్ లేకుండానే మిర్చి కొనుగోళ్లు చేపడుతూ అక్రమ వసూళ్లకు అధికార యంత్రాంగం అనుమతిస్తుందని కథనం రావడంతో అధికారుల్లో కదలిక వచ్చింది. సూపర్‌వైజర్లు, వేమెన్లతో అధికారులు సమావేశం నిర్వహించారు. బిల్ టూ బిల్, జీరో, కటింగ్ వ్యాపారాలకు ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతి ఇవ్వొద్దని తేల్చి చెప్పారు. ఎవరైనా వాటిని ప్రోత్సహిస్తే కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. దీంతో క్రయవిక్రయాలు సోమవారం రాత్రి వరకు కొనసాగాయి. మిర్చి బస్తాలు లోడ్ అయిన వాహనాలు బారులు తీరాయి. చివరకు రాత్రి 9 గంటల సమయంలో వాహనాలను మిర్చియార్డులో నుంచి వెలుపలకు వెళ్లేందుకు అనుమతించారు.

బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)
వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 123, రిటైల్ ధర - 150, చికెన్ విత్‌స్కిన్ - 233, చికెన్ స్కిన్‌లెస్ - 263.
కృష్ణా జిల్లాలో: వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -123 రిటైల్ ధర 150 చికెన్ విత్ స్కిన్ - 233 చికెన్ స్కిన్‌లెస్ - 263.
అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & బ్రీడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 140, 149, 160 చికెన్ విత్ స్కిన్ - 270 చికెన్ స్కిన్‌లెస్ - 280..

ఇండియన్ బ్యాంక్ Indian Bank — ALLAHABAD

గుంటూరు బ్రాంచి
10-1-1, 1వ లైను, సాంబశివపేట, నాజ్‌సెంటర్, గుంటూరు-522001, ఫోన్ : 0863-2220061, 2220804, ఇ-మెయిల్: guntur@indianbank.co.in

పబ్లికేషన్ డిమాండ్ నోటీసు
సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ 2002 యొక్క సెక్షన్13(2) ప్రకారం నోటీసు.

[illegible]

తేదీ : 27-04-2026 సం/- అధీకృత అధికారి,
స్థలం : గుంటూరు ఇండియన్ బ్యాంక్, గుంటూరు.

తెనాలి

•తెనాలి •పొన్నూరు

సేంద్రియ ఎరువులు పొలానికి బలం

చేబ్రోలు: రసాయన ఎరువుల వినియోగంతో నేల ఆరోగ్యం, సారవంతం, ఉత్పాదక తగ్గిపోతున్నాయని కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త గంగాదేవి అన్నారు. కేవీకే, ఆత్మ సహకారంతో చేబ్రోలు మండలంలోని వడ్లమూడిలో సోమవారం ధాత్రి మాత జీవామృత కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్మి కంపోస్టు, గ్రీన్ మాన్యూర్, సేంద్రియ ఎరువులపై రైతులు మక్కువ చూపాలని కోరారు. డీఆర్సీ ఏవో రాజశేఖర్, స్థానిక ఏవో ప్రియదర్శిని, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా గంధ మహోత్సవం

పొన్నూరు, న్యూస్‌టుడే: పట్టణ పరిధి 5వ వార్డు ఐవీపేటలో బాజా బందానవాజ్ గంధ మహోత్సవాన్ని సోమవారం నిర్వహించారు. పుర వీధుల్లో గంధాన్ని ఊరేగించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం జరిగిన అన్నసంతర్పణలో పాల్గొన్నారు.

6 నుంచి బ్రహ్మోత్సవాల ప్రారంభం

తెనాలి(కొత్తపేట): పట్టణంలోని వైకుంఠపురంలో కొలువైన శ్రీలక్ష్మీ పద్మావతి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ఈనెల 6వ తేదీ నుంచి 12వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో అనుపమ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్వామి వారిని పెండ్లి కుమారుడిగా అలంకరించిన తర్వాత ఉత్సవాలు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. 9న కల్యాణం, మరుసటి రోజు రథోత్సవం ఉంటాయని తెలిపారు.

తెనాలి మార్కెట్ యార్డులో..

నిమ్మకాయల ధరలు రూ.. (క్వింటా)



అత్యధికం: 6,400
అత్యల్పం: 3,500
సగటు: 5,500

– న్యూస్‌టుడే, తెనాలి టౌన్

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

తెనాలి : 80085 73125 పొన్నూరు : 80085 73144

స్పందన: ● తెనాలి మండలం కొలకలూరులో తరచూ విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలుగుతుందన్న ఫిర్యాదుతో విద్యుత్తు అధికారులు సరఫరా విద్యుత్తు నియంత్రికలను పరిశీలించి సమస్యలు ఉంటే వాటిని సరి చేశారు. ఈ మార్గంలో కొత్త ఫీడర్ పనులు జరుగుతున్నట్లు తెలిపారు. ● తెనాలి మారీసుపేటలో వీధి దీపాలు వెలగడం లేదన్న ఫిర్యాదుతో మున్సిపల్ ఇంజినీరింగ్ విభాగ సిబ్బంది మరమ్మతు పూర్తి చేశారు. **- న్యూస్‌టుడే, తెనాలి టౌన్**

● 'మేమున్నాం...మీకు తోడుగా' శీర్షిక 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. పొన్నూరు పట్టణ పరిధి 11వ వార్డులో మురుగు కాలువలో పేరుకున్న వ్యర్థాలను తీయించారు. **- న్యూస్‌టుడే, పొన్నూరు**

? తెనాలి కొత్తపేట పెమ్మసాని వెంకట్రావు నాయుడు వీధిలో, గాంధీ చౌక్‌లోని అర్బన్ హెల్త్ కేంద్రం వద్ద మురుగు కాలువలు పూడికతో నిండిపోయాయి. తెనాలి ఈలంగోపాల్‌నగర్ వంగర వెంకటయ్య వీధి నుంచి ప్రతి రోజూ చెత్త తరలించడం లేదు. సిబ్బంది రావడం లేదు. చెత్త పేరుకుపోతుంది. **- లక్ష్మీ రాజా, సత్యనారాయణ, స్థానికులు** ✔ మురుగు కాలువల్లో పూడికలు తొలగిస్తాం. ప్రతి రోజూ చెత్త తరలించేలా చర్యలు తీసుకుంటాం. **- పై ప్రశ్నలకు మున్సిపల్ కమిషనర్ రామఅప్పలనాయుడు సమాధానాలు ఇచ్చారు. - న్యూస్‌టుడే, తెనాలి టౌన్**

? పొన్నూరు పరిధిలోని కొండమూడి రోడ్డులో నాలుగు రోజుల నుంచి వీధి దీపం వెలగడం లేదు. **- పి.బాలస్వామి** ✔ వీధి దీపాన్ని బాగు చేయించే విధంగా చర్యలు తీసుకుంటాం. **- షేక్ హసీనా, సహాయ ఇంజినీర్** ? పొన్నూరు పరిధిలోని శాంతినగర్‌లో రెండు రోజుల నుంచి చెత్తను తొలగించ లేదు. **- డేవిడ్** ✔ చెత్తను తొలగించే విధంగా చర్యలు తీసుకుంటాం. **- పోతు రాజు, ప్రజారోగ్యశాఖాధికారి - న్యూస్‌టుడే, పొన్నూరు**

'ప్రభుత్వానికి వ్యతిరేకంగా వ్యాఖ్యలు తగదు'

పొన్నూరు, న్యూస్‌టుడే : పొన్నూరు మాజీ ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య ప్రెస్‌మీట్‌లో అనుకూలంగా వ్యవహరిస్తున్నారని సాగునీటి సంఘం వెల్లలూరు టీసీ అధ్యక్షుడు గరికిపాటి రామకృష్ణ ఆరోపించారు. స్థానిక తెదేపా కార్యాలయంలో ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా వ్యాఖ్యలు చేయడం తగదని హితవు పలికారు.

ఇతర భాషల్లో తర్ఫీదు అవసరం

తెనాలి(కొత్తపేట): బహు భాషలు మాట్లాడడం, రాయడం నేర్చుకోవడం అవసరమని హిందీ, ఆంగ్ల బోధకులు పేర్కొన్నారు. సోమవారం కొత్తపేట మహిళా బాలల గ్రంథాలయంలో కొనసాగుతున్న వేసవి శిక్షణ తరగతుల్లో వారు పాల్గొని స్పోకెన్ హిందీ, ఇంగ్లిష్ అంశాలను బోధించారు. హిందీ భాష నేర్చుకోవడం చాలా సులభమని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులకు కొన్ని అంశాలు ఇచ్చి చేయించారు. కార్యక్రమాన్ని గ్రంథాలయ అధికారిణి కడియాల సుజాత పర్యవేక్షించారు.

కృష్ణమ్మ చెంత.. తాగునీటికి వ్యధ

అడుగంటిన భూగర్భ జలాలు ● ప్రమాదకర స్థాయిలో నది పరివాహక గ్రామాలు

కొల్లిపర, న్యూస్‌టుడే

నది పరివాహక ప్రాంతంలో భూగర్భజలాలు అడుగంటుతున్నాయి. సాగు, తాగునీటి కోసం ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వంద అడుగులు వేసినా బోర్లు.. చేతి పంపులు ఎండి పోతున్నాయి. గుంటూరు జిల్లాలోని తాడేపల్లి, దుగ్గిరాల, కొల్లిపర మండలాల్లో పరిస్థితి దారుణంగా తయారైంది. గడచిన రెండేళ్లలో కృష్ణమ్మ వరద ముంపు ముంచెత్తినా భూగర్భ జలాలు ప్రమాదకర స్థాయికి పడిపోయాయి. కృష్ణమ్మ పరవళ్లు తొక్కిన ప్రాంతంలో గుక్కెడు నీటికోసం ఎదురు చూస్తున్నామని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు.

నది పరివాహక మండలాల్లో భూగర్భజలాల వివరాలు..

మండలం	గ్రామం	వాటర్ లెవల్ దిగువన (మీటర్లలో)
తాడేపల్లి	చిర్రావూరు	10.63
దుగ్గిరాల	పెదకొండూరు	10.77
కొల్లిపర	కొల్లిపర	7.97
కొల్లిపర	పిడపర్తిపాలెం	9.24
కొల్లిపర	వల్లభాపురం	8.37

● చేబ్రోలు మండలం శేకూరు 11.37, అంకిరెడ్డిపాలెం 8.90 మీటర్ల దిగువకు భూగర్భ జలాలు ప్రమాదకర స్థాయికి చేరుకున్నాయి.

అక్రమ ఇసుక తవ్వకాల వల్లే: భూగర్భ జలాలు తగ్గడానికి కారణం గత వైకాపా ప్రభుత్వ హయాంలో పరిమితి లేని ఇసుక తవ్వకాలే కారణమని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. అక్రమార్కులు వేల టన్నుల ఇసుక తరలించుకుపోయారు, గుట్టలుగా పోసి విక్రయిస్తున్నా అప్పటి ప్రభుత్వం పట్టించుకోలేదు. పర్యావరణం పరిరక్షణ, భూగర్భ జలాల అంశాలను నాటి ప్రభుత్వం పరిగణలోకి తీసుకోలేదని మండిపడుతున్నారు.

జల ధార ద్వారా మేలు

భూగర్భ జలాలు పెంపొందించేందుకు ప్రభుత్వం జల ధార కార్యక్రమాన్ని చేపట్టింది. జిల్లాలో రూ.5 కోట్ల నిధులతో 10 చెరువుల పూడికతీత, చెరువు గట్ల అభివృద్ధి పనులు ప్రారంభించాం. కొల్లిపర పరివాహక ప్రాంతంలో రూ.70 లక్షలతో కాలువల పూడికతీత పనులు చేపడుతున్నాం. మరో ఆరు చెరువుల అనుమతికి పరిశీలిస్తున్నాం. **- వి.శంకర్, డ్వామా పీడీ**

పోషకాహారం తీసుకోవాలి

తెనాలి(కొత్తపేట), న్యూస్‌టుడే: క్షయ గాలి ద్వారా సోకుతుందని అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వ ఆసుపత్రి టీబీ కేంద్రం సూపర్‌వైజర్ పల్లి కొండ రవికుమార్ పేర్కొన్నారు. సోమవారం వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రాంగణంలోని అన్న క్యాంటీన్‌కు వచ్చిన పేదలను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. క్రమం తప్పకుండా మందులు వాడితే పూర్తిగా తగ్గిపోతుందని తెలిపారు.

జిల్లా ఆర్యవైశ్య యువజన సంఘ అధ్యక్షుడిగా హరికిశోర్

తెనాలి(కొత్తపేట), న్యూస్‌టుడే: జిల్లా ఆర్య వైశ్య యువజన సంఘం అధ్యక్షుడిగా తెనాలికి చెందిన కొప్పురావూరి హరి కిషోర్‌ను నియమించినట్లు ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య యువజన సంఘం నూతన పాలక కమిటీ(2026-67) సభ్యులు తెలిపారు. సోమవారం తెనాలిలో ఈ వివరాలు కమిటీ సభ్యులు వెల్లడించారు. ఈ సందర్భంగా కిషోర్ మాట్లాడుతూ.. ఇందుకు సహకరించిన రాష్ట్ర ఆర్య వైశ్య మహాసభ గౌరవ ఛైర్మన్ టి.జి.వెంకటేష్, అధ్యక్షుడు ఇల్లూరి లక్ష్మయ్య, గౌరవాధ్యక్షుడు చిన్ని రామ సత్యనారాయణ, ఇంకా పెనుగొండ సుబ్బారాయుడు, కాళ్లకూరి నాగబాబు, మాటూరి రంగనాథ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

కొసరాజు సేవలు కళారంగానికి అంకితం

తెనాలి(కొత్తపేట), న్యూస్‌టుడే: నాటక రచయిత, దర్శకుడు, అభ్యుదయ కళాసమితి ప్రధాన కార్యదర్శి కొసరాజు మల్లికార్జునరావు కళారంగానికి విస్తృత సేవలు చేశారని పలువురు వక్తలు పేర్కొన్నారు. అభ్యుదయ కళాసమితి తెనాలి శాఖ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక బొల్లిముంత ఫౌండేషన్ హాలులో నిర్వహించిన ఆయన వర్ధంతి సభలో వారు పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటం వద్ద నివాళులర్పించారు. బొల్లిముంత కృష్ణ, చందు సుబ్బారావు, శ్రీదేవి, అలపర్తి వెంకటేశ్వరరావు, ఎం.ఎస్.చార్లీ, గంగాధర్, చిరంజీవులు, కొమలశ్రీ రామశ్రీ బాలాజీ, బాలస్వామి పాల్గొన్నారు.

ఉర్దూ భాష అభివృద్ధికి కృషి

పొన్నూరు: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఉర్దూ భాష అభివృద్ధికి ఎంతో గానో కృషి చేస్తుందని పొన్నూరు వ్యవసాయ మార్కెట్ యార్డు ఛైర్‌పర్సన్ పఠాన్ రిజ్వాన అన్నారు. సోమవారం 29వ వార్డులోని ఉర్దూ అకాడమీ కేంద్రంలో ఉచిత శిక్షణ తరగతులకు హాజరైన విద్యార్థులకు ఆమె ఉచితంగా పుస్తకాలను అందజేశారు. షేక్ బాజీ, పఠాన్ ఫిరోజ్ ఖాన్, మాగ్బుల్, సయ్యద్ జాఫర్ పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి సహాయ నిధి అందజేత

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: పట్టణానికి చెందిన ఇద్దరికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ.3.3 లక్షల విలువైన సహాయం మంజూరైన పత్రాలను లబ్ధిదారుల కుటుంబ సభ్యులకు తెదేపా నాయకులు అందించారు. తెనాలి తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ఖుద్దూస్, మహేష్, అశోక్‌వర్ధన్, విజయ్, యోగేష్, షావుల్, పూర్ణ, జాఫర్ పాల్గొన్నారు.



లబ్ధిదారు కుటుంబ సభ్యుడికి మంజూరు పత్రం అందిస్తున్న తెదేపా నాయకులు

6 నుంచి రాష్ట్ర స్థాయి ఆహ్వాన నాటిక పోటీలు

పొన్నూరు, న్యూస్‌టుడే : పొన్నూరు కళాపరిషత్ ఆధ్వర్యంలో ఈ నెల 6 నుంచి 11వ తేదీ వరకు నిడుబ్రోలు జడ్పీ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో ఉభయ తెలుగు రాష్ట్రాల స్థాయి ఆహ్వాన నాటిక పోటీలు నిర్వహిస్తున్నట్లు పొన్నూరు కళాపరిషత్ అధ్యక్షుడు సూరినేని ఆంజనేయులు నాయుడు తెలిపారు. ఈ మేరకు సోమవారం నిడుబ్రోలు హైస్కూల్ ఆవరణలో ఇందుకు సంబంధించిన కరపత్రాలను సహచర సభ్యులతో కలిసి ఆయన విడుదల చేశారు. ఆకుల సాంబశివరావు, శివకుమార్, నన్నపనేని రఘునాథ్, షేక్ యాసీన్‌బాబా తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న పొన్నూరు కళాపరిషత్ సభ్యులు

పీజీఆర్ఎస్‌కు వేసవి సెగ

తెనాలి(కొత్తపేట), న్యూస్‌టుడే: పట్టణ మున్సిపల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌కు వేసవి సెగ తాకింది. సమస్యలపై ప్రజల నుంచి వచ్చే అర్జీలు తగ్గాయి. కొందరు మాత్రమే కార్యాలయానికి వచ్చి అర్జీలు అందజేశారు. ● పురపాలక కార్యాలయంలో నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో అర్జీలు స్వీకరించారు.



అర్జీ పరిశీలిస్తున్న కమిషనర్ రామ అప్పలనాయుడు

సమస్యలు పరిష్కరించండి

తెనాలి టౌన్: తెనాలి సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదులు, పరిష్కారాల వేదిక కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు 9 అర్జీలు అందించారు. పలు అంశాలపై అర్జీలతో వచ్చిన వారి నుంచి సీనియర్ అసిస్టెంట్ పద్మశేష అర్జీలు తీసుకున్నారు. తెనాలి తహసీల్దార్ కార్యాలయంలో సర్వే, పలు అంశాలపై వచ్చిన నాలుగు అర్జీలను ఎంపీడీవో ఏ.దీప్తి స్వీకరించారు.

దివ్యాంగులకు చరవాణుల పంపిణీ

జిల్లాపరిషత్తు(గుంటూరు), న్యూస్‌టుడే: జిల్లాకు చెందిన దివ్యాంగులు ఉన్నత విద్యను అభ్యసించడానికి వీలుగా ప్రభుత్వం ఫోన్లు పంపిణీ చేస్తుందని జిల్లా సంయుక్త కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ తెలిపారు. కలెక్టర్ కార్యాలయంలోని ఎస్.ఆర్.శంకరన్ సమావేశ మందిరంలో నలుగురు దివ్యాంగులకు సోమవారం ఫోన్లు అందజేసి మాట్లాడుతూ.. ఉపకరణాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు.

గుంటూరు ఛానల్ అభివృద్ధికి నిధులు మంజూరు

చేబ్రోలు, న్యూస్‌టుడే : గుంటూరు ఛానల్ అభివృద్ధి పనులకు రాష్ట్ర ప్రభుత్వం నీటి వనరుల శాఖ ద్వారా పరిపాలనా అనుమతి లభించడం శుభ పరిణామం అని పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ అన్నారు. దీంతో రైతుల కల నెరవేరిందని ఆయన సంతోషం వ్యక్తం చేశారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే నరేంద్ర కుమార్

నంబూరులో కార్డెన్ సెర్చ్

పెదకాకాని, న్యూస్‌టుడే : జిల్లాలో నిత్యం ఏదో ఒక గ్రామంలో నిర్బంధ తనిఖీలు చేస్తూనే ఉన్నామని ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. మండల పరిధి నంబూరులోని ఆలీ రఫత్ కాలనీలో సోమవారం తెల్లవారుజామున కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గంజాయిపై జిల్లాలో ఉక్కుపాదం మోపామని, గంజాయి తాగుతున్నా, విక్రయాలు నిర్వహిస్తున్నా 112, 1972 నంబర్లకు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని కోరారు. తనిఖీల్లో సీఐ నారాయణ స్వామి, స్థానిక సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



పోలీసులు స్వాధీనం చేసుకున్న ద్విచక్ర వాహనాలు

జలహారతిలో కూలీలు భాగస్వాములు కావాలి

పొన్నూరు, న్యూస్‌టుడే : జలధార- జలహారతిలో ఉపాధి హామీ కూలీలు భాగస్వాములు కావాలని గుంటూరు పార్లమెంట్ రైతు విభాగ ప్రధాన కార్యదర్శి బొర్రు రామారావు తెలిపారు. సోమవారం మండల పరిధిలోని జూపూడి, మునిపల్లె గ్రామాల్లో చెరువు పూడికతీత పనులను కూటమి నాయకులు ప్రారంభించారు. మాదాల వెంకటేశ్వరరావు, బండ్లమూడి బాబురావు, సీతా రామయ్య, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో కూటమి నాయకులు

కల్వర్టు గుంత పూడ్చరూ..

పట్టణంలోని బొంతారామయ్య కాలనీ శివారులోని జంపని కాలువ కల్వర్టు పొడవునా స్థానికులు పెద్ద గుంత తవ్వారు. ఇప్పటి వరకు ఆ మార్గంలో రాకపోకలు సాగిస్తున్న వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు, వాహన చోదకులు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, తెనాలి(కొత్తపేట)**



తాగునీరు వృథా

పట్టణ పరిధిలోని బుర్రిపాలెం రోడ్డులో భూగర్భంలో తాగునీటి పైపులు తరచూ లీకై మంచినీరు వృథాగా పోతున్నాయని స్థానికులు వాపోతున్నారు. వేసవిలో నీరు దొరకడమే కష్టంగా ఉన్న నేపథ్యంలో అధికారులు చర్యలు తీసుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మరో వైపు అదే ప్రాంతంలో చికెన్ సెంటర్ వద్ద పైపు పదిహేను రోజుల కిందట లీకై నీరంతా వృథా అవుతున్నాయని. . మరమ్మతులు చేసి అరికట్టాలని స్థానికులు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, తెనాలి(కొత్తపేట)**



పాడైన చేతి పంపు

పట్టణంలోని చినరావూరు అంగన్‌వాడీ కేంద్రం రెండో సెంటర్ వద్ద మున్సిపల్ చేతి పంపు మొరాయించి ఇబ్బందులు పడుతున్నట్లు స్థానికులు వాపోతున్నారు. దీని కింద సిమెంట్ దిమ్మె కూడా ధ్వంసమైందని చెబుతున్నారు. వేసవిలో ఆసరాగా ఉంటుందని.. మరమ్మతులు చేయించి వినియోగంలోకి తేవాలని స్థానికులు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, తెనాలి(కొత్తపేట)**



భాజపా నాయకుల సంబరాలు

భాజపా జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ సారథ్యంలో పశ్చిమ బెంగాల్‌లో విజయం సాధించడం, ఇతర రాష్ట్రాల్లోనూ పార్టీ సుస్థిర స్థానం సంపాదించడం పార్టీ కార్యకర్తల కృషి ఉందని భాజపా నాయకులు పేర్కొన్నారు. ఈ మేరకు తెనాలి, కొల్లిపరలో సోమవారం భరతమాత చిత్రపటానికి పూల మాలలు వేశారు. ప్రజలకు మిఠాయిలు పంచారు. కార్యక్రమాల్లో కఠారి వాసుదేవనాయుడు, తమిరిశ అనంతాచార్యులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు. ● చేబ్రోలు సెంటర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు శ్రీరామచంద్ర మూర్తి, నాయకులు శ్రీనివాసరావు, శివశంకర్ పాల్గొన్నారు. **- న్యూస్‌టుడే బృందం**



తెనాలిలో..



చేబ్రోలు సెంటర్‌లో..

ఆందోళన వద్దు.. అండగా ఉంటాం..

పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు | **అవగాహన కల్పిస్తున్న అధికారులు**

తెనాలి టౌన్, న్యూస్‌టుడే

ఇటీవల విడుదలైన పదో తరగతి ఫలితాల్లో ఉత్తీర్ణులు కాలేకపోయిన విద్యార్థులు ఆందోళన చెందవద్దని.. ఈ నెల 25వ తేదీ నుంచి నిర్వహించనున్న సప్లిమెంటరీ పరీక్షల ద్వారా తోటి విద్యార్థుల మాదిరిగానే ఈ విద్యా సంవత్సరంలోనే ఇంటర్, ఇతర అనుబంధ విభాగాల్లో ప్రవేశాలు పొందవచ్చని విద్యా శాఖ అధికారులు చెబుతున్నారు. ఈ మేరకు విద్యార్థులు, తల్లిదండ్రులకు అవగాహన కలిగిస్తున్నారు. అంతే కాకుండా వీరి కోసం ప్రత్యేక తరగతుల ఏర్పాటు, సంబంధిత సబ్జెక్టుల్లో సందేహాలకు సమాధానాలు పొందేలా ఏర్పాట్లు చేస్తున్నారు.

● తెనాలి పట్టణ, మండల పరిధిలో 6 పురపాలక, 8 జిల్లా పరిషత్తు, 2 సాంఘిక సంక్షేమ గురుకులాలు ఉన్నాయి. ఈ ఏడాది 648 మంది బాలురు, 532 మంది బాలికలు పరీక్షలు రాశారు. వారిలో 349 మంది బాలురు, 481 మంది బాలికలు ఉత్తీర్ణులు అయ్యారు. మిగిలిన 350 మంది విద్యార్థులు ఫెయిల్ అయ్యారు.

అవగాహన కల్పిస్తూ..: తెనాలి పట్టణ పరిధిలో చెంచుపేటలోని కోగంటి శివయ్య పురపాలక ఉన్నత పాఠశాల, కొత్తపేటలోని బాలురోన్నత పాఠశాల, మండల పరిధిలో సంగం జాగర్లమూడి జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల కేంద్రాలుగా ప్రతి రోజూ ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఈ తరగతులు జరగనున్నాయి. ఫెయిల్ అయిన విద్యార్థులు విద్యా సంవత్సరం నష్టపోకుండా ప్రస్తుతం అందుబాటులో ఉన్న సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలని అవగాహన కల్పిస్తున్నామని, వీలైనంత ఎక్కువ మందికి మేలు జరిగేలా ప్రయత్నం చేస్తున్నామని తెనాలి మండల విద్యాశాఖాధికారులు లక్ష్మీనారాయణ, జయంతిబాబు వివరించారు.

పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

పెదకాకాని, న్యూస్‌టుడే : గృహాలు లేని పేదలకు ఇళ్ల స్థలాలు అందజేయాలని, ప్రభుత్వ భూముల్లో నివాసం ఉంటున్న వారికి పట్టాలు ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం ముందు సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పలు కాలనీల్లో రోడ్డుకు ఇరువైపులా నివాసం ఉంటున్న వారికి పట్టాలు ఇవ్వాలని కోరారు. నాయకులు సాంబయ్య, చిన్న, రాఘవయ్య, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పాశం రామారావు

సమ్మర్ రీసెర్చ్ క్యాంప్‌నకు విద్యార్థుల ఎంపిక

ఏఎన్‌యూ, న్యూస్‌టుడే : ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని సైన్స్ కళాశాలలో చదువుతున్న సంజన, కృప సమ్మర్ రీసెర్చ్ ఫెలోషిప్‌నకు ఎంపికయ్యారని నానో టెక్నాలజీ విభాగాధిపతి ఆచార్య లింగరాజు తెలిపారు. ఆర్యభట్ట రీసెర్చ్ సెంటర్‌కు సంజన, ఐఐఎస్‌సీ బెంగళూరుకు కృప ఎంపికయ్యారని...వీరికి నెలకు రూ.10 వేలు ఉపకారం వేతనం ఇస్తారని ఆయన చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఇన్‌ఛార్జి వీసీ ఆచార్య గంగాధర్, ఓఎస్‌డీ ఆచార్య రవికుమార్ సోమవారం అభినందించారు. ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త ఆచార్య దివ్యతేజోమూర్తి, అధ్యాపకులు శ్యామ్‌కుమార్, గిరిధర్ తదితరులు పాల్గొన్నారు.

పవర్ లిఫ్టింగ్‌లో పతకాలు

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: ఇటీవల జగ్గయ్యపేటలో నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్ షిప్ పోటీల్లో తెనాలికి చెందిన షేక్ షబీనా సత్తా చాటారు. 84 కిలోల జూనియర్ విభాగంలో మొత్తం 510 కిలోల బరువులు ఎత్తి బంగారు పతకంతో పాటు స్ట్రాంగ్ ఉమెన్ టైటిల్‌ను కైవసం చేసుకున్నారు. గురువు ఎం.అశోక్‌కుమార్ మార్గదర్శకత్వం విజయంలో కీలక భూమిక పోషించిందని, రానున్న పోటీలకు సిద్ధం అవుతున్నట్లు షబీనా సోమవారం వివరించారు.



పతకం, ధ్రువపత్రంతో షబీనా

రచయితలకు బహుమతులు

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: కొలంకపురి నాటక కళాపరిషత్, సాయి ఆర్ట్స్ సంయుక్త ఆధ్వర్యంలో రాష్ట్ర సృజనాత్మకత, సంస్కృతి సమితి సహకారంతో తెనాలి మండలం కొలకలూరులో జరుగుతున్న ఉభయ తెలుగు రాష్ట్రాల ఆహ్వాన నాటికల పోటీలు సోమవారం మూడో రోజుకు చేరుకున్నాయి. నాటక రచనల పోటీల్లో విజేతలుగా నిలిచిన రచయితలను సత్కరించి వారికి బహుమతులు అందించారు. ఈ సందర్భంగా ప్రదర్శించిన నాటికలు ఆకట్టుకున్నాయి. పెద్ద సంఖ్యలో కళాభిమానులు పాల్గొన్నారు.



రచయితను సత్కరిస్తున్న నిర్వాహకులు, అతిథులు


106 మద్యం సీసాలు స్వాధీనం

కొల్లిపర, న్యూస్‌టుడే: మండల పరిధిలోని అత్తోట గ్రామంలో మద్యం అనధికారంగా విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో దాడులు చేశామని కొల్లిపర ఎస్సై ఎన్.సి. ప్రసాద్ సోమవారం తెలిపారు. గ్రామంలోని పుష్పా బిర్యానీ పాయింట్‌లో దైవాల సాయి సుబ్రహ్మణ్యం అనుమతులు లేకుండా మద్యం విక్రయిస్తున్నట్లు గుర్తించామని పేర్కొన్నారు. నిందితుడి నుంచి 19 సీసాల బీర్లు, 5 మద్యం ఫుల్ బాటిల్స్, క్వార్టర్ బాటిల్స్ 82 సీజ్ చేశామని తెలిపారు. నిందితుడిని కోర్టులో హాజరు పరచగా.. న్యాయమూర్తి 14 రోజులు రిమాండ్ విధించారన్నారు.

అమ్మకు తప్పని కోతలు..

సాధారణ ప్రసవాలు తక్కువే..

తెనాలి(కొత్తపేట), న్యూస్‌టుడే: పట్టణ పరిధిలోని ప్రైవేటు ఆసుపత్రుల్లో గత ఆర్థిక సంవత్సరంలో నిర్వహించిన కాన్పుల్లో సాధారణ ప్రసవాలు అరకొరగా ఉన్నాయి. ప్రతి వెయ్యి ప్రసవాల్లో పది శాతం కూడా ఉండట్లేదు. వీటిని పెంచేందుకు ప్రభుత్వం చేస్తోన్న ప్రయత్నానికి సహకారం అంతంతమాత్రంగానే ఉంది. ప్రైవేటులో కోతలకు ఎక్కువ రుసుం వసూలు చేస్తున్నట్లు తెలిసింది. ప్రభుత్వం శిశు మరణాలను అరికట్టేందుకు ఇంటి వద్ద ప్రసవాల కన్నా ఆసుపత్రుల్లో ప్రసవాలు ప్రోత్సహిస్తోంది. సిజేరియన్లు తగ్గించాలని పిలుపునిచ్చింది. ● పట్టణ పరిధిలో కాన్పులు చేస్తోన్న ప్రైవేటు ఆసుపత్రులు 27. వీటిలో నెలకు అత్యధికంగా 157 కాగా అత్యల్పంగా 103 ప్రసవాలు జరిగాయి. గత ఆర్థిక సంవత్సరంలో అన్ని ఆసుపత్రుల్లో కాన్పులు మొత్తం 1,503. వీటిలో సిజేరియన్లు 1,340 కాగా, నార్మల్ 163 కావడం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. కొత్తపేట, చెంచుపేట, నందులపేట, ప్రకాశం రోడ్డు, నెహ్రూ రోడ్డు ఆసుపత్రుల్లో సిజేరియన్లు ఎక్కువ ఉండడం గమనార్హం. ● మండల కేంద్రాల్లో ఒకట్రెండు పీహెచ్‌సీలు, గ్రామాల్లో ఉప ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పట్టణాల్లో పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఆయుర్వేద, హోమియో ఆసుపత్రులున్నాయి. వీటిలోని సిబ్బంది ఇతర ప్రభుత్వ విభాగాల సమన్వయంతో సిజేరియన్లు తగ్గించడానికి విస్తృత ప్రచారం చేయాలి. కానీ పట్టించుకోవడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. ● దీనిపై తెనాలి డివిజన్ డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ ఈరుగుల అన్నపూర్ణను సంప్రదించగా.. సిజేరియన్ల కంటే సాధారణ ప్రసవాలు పెంచాలని ఆసుపత్రుల వైద్యాధికారులకు ఇప్పటికే నోటీసులు ఇచ్చాం. మరోసారి పరిశీలిస్తామని చెప్పారు.



5వ వర్ధంతి

వైద్యవిజ్ఞానంతో సుదీర్ఘకాలం సేవలందించి, మండల కేంద్రమైన చెరుకుపల్లిని వైద్యకేంద్రంగా తీర్చిదిద్ది, ఈ ప్రాంత సామాజిక, విద్యాభివృద్ధికి తోడ్పాటును అందించి స్ఫూర్తిదాతగా నిలిచిన

'స్వర్గీయ డాక్టర్ కొడాలి పాపారావు గారు'

మరణించి అయిదు సంవత్సరాలు గడిచినను ప్రాణదాతను మరువలేం.

మీ పవిత్రాత్మకు శాంతి కలగాలని వేడుకుంటున్నాం.

కీ॥శే॥ డాక్టర్ కొడాలి పాపారావు గారు
K.N.హరి మెమోరియల్ నర్సింగ్ హోమ్, చెరుకుపల్లి
DOB: 29-04-1925 DOD: 05-05-2021

కుమారుడు - కోడలు:
డా॥ కొడాలి వెంకటకృష్ణకుమార్ - డా॥ కె.వి.లక్ష్మి
డా॥ దీప్తి - డా॥ సాయిప్రమోద్‌కృష్ణ ఆళ్ళ, అమెరికా
డా॥ శృతి కొడాలి
డా॥ ఆచంట శ్రీనాథ్ - డా॥ ఎ.శ్రీదేవి

కుమార్తెలు - అల్లుళ్ళు:
జి.వి.లక్ష్మి - డా॥ గోగినేని రవీంద్రకుమార్
సుభాషిణి - డా॥ ఆచంట రాజేంద్రప్రసాద్
రమాదేవి - డా॥ సొంటెల్లి బాలసుబ్రహ్మణ్యప్రసాద్
మనుమలు, మనుమరాండ్రు, మునిమనుమలు, మునిమనుమరాండ్రు

(c) eenadu

పూల ఫ్రేములు

మన తోటలో రాలిపడిన పువ్వులు, ఎండు పుల్లలతో ఒక అందమైన ఫ్లవర్ ఫ్రేమ్ తయారు చేద్దామా? ఇది మీ గదిలో పెట్టుకోవచ్చు లేదా మీ ఫ్రెండ్స్‌కి గిఫ్ట్‌గానూ ఇవ్వొచ్చు.

దీని కోసం కావాల్సినవి..

★ సమాన పొడవున్న నాలుగు ఎండు పుల్లలు
★ పారదర్శకమైన ప్లాస్టిక్ షీట్ లేదా టేప్
★ రంగురంగుల పువ్వులు, ఆకులు

ఎలా చేయాలంటే..

✤ మీ దగ్గరున్న నాలుగు ఎండు పుల్లలను నచ్చిన ఆకారంలో పెట్టి, మూలల్లో దారంతో కట్టాలి లేదా గ్లూతో అతికించాలి.

✤ ఇప్పుడు ఆ పుల్లల వెనుక ప్లాస్టిక్ షీట్‌ను అతికించాలి. ఒకవేళ పెద్ద టేప్ ఉంటే, దాన్ని ఒక చివర నుంచి మరో చివరకు అడ్డంగా, నిలువుగా అతికించి ఒక పొరలా చేయొచ్చు.



✤ ఇప్పుడు మీ సృజనాత్మకతకు పని చెప్పాలి. తోటలో సేకరించిన రకరకాల పువ్వులు, ఆకులను మీకు నచ్చిన రీతిలో ఆ షీట్‌పై పేర్చాలి. ✤ అన్ని పూలనూ చక్కగా అమర్చిన తరువాత, వాటిపై మరో పొర టేప్ లేదా షీట్ వేస్తే అవి చెదరకుండా ఉంటాయి.

అంతే, మీ 'నేచర్ ఫ్లవర్ ఫ్రేమ్' రెడీ.

సెలవుల్లో సరదాగా!



వాటికీ మాటలొస్తే!



మన ఇంట్లో చాలా వస్తువులు ఉంటాయి కదా.. అవి మనతో మాట్లాడితే ఎలా ఉంటుందో ఎప్పుడైనా ఊహించారా ఫ్రెండ్స్? ఓ మూలన పడి ఉన్న గొడుగు, పాత చెప్పులు, స్కూలు బ్యాగు.. ఇవన్నీ మనతో మాట్లాడి, వాటి బాధలు చెప్పుకొంటే ఎలా ఉంటుందో చూద్దామా?

గొడుగు: వర్షం పడినప్పుడే నన్ను బయటకు తీస్తారు. వాన తగ్గగానే మళ్లీ మూలన పడేస్తారు. నాకూ మీ అందరితో కలిసి ఆడుకోవాలని ఉంటుంది కదా!

స్కూలు బ్యాగు: ఏడాదంతా నాతో బండెడు పుస్తకాలు మోయిస్తారు. సెలవుల్లో మాత్రం నన్ను పక్కన పడేసి మీరొక్కరే హ్యాపీగా ఆడుకుంటున్నారు. నన్నూ మీతో చేర్చుకోకూడదూ! ఏదైనా ఊరికి తీసుకెళ్లకూడదూ..

ఇలా ఊహిస్తుంటే భలే సరదాగా ఉంది కదా! మీరు కూడా ఇంట్లో ఉన్న ఏదో ఒక వస్తువును తీసుకుని అది మాట్లాడితే ఎలా ఉంటుందో అమ్మానాన్నలకో, మీ ఫ్రెండ్స్‌కో చెప్పండి. ఏం మాట్లాడుతుందో చెబుతూ మీ ఊహాశక్తికి పదును పెట్టండి.

---

9 జిల్లాలు, 44,962 చ.కి.మీ.ల్లో
అమరావతి ఎకనమిక్ రీజియన్

సమగ్ర ఆర్థిక, అభివృద్ధి ప్రణాళిక రూపకల్పనకు కసరత్తు

● టెండర్లు పిలిచిన సీఆర్‌డీఏ



ఈనాడు, అమరావతి: రాష్ట్రంలోని తొమ్మిది జిల్లాల పరిధిలో ఏర్పాటు చేయనున్న అమరావతి ఎకనమిక్ రీజియన్ (ఏఈఆర్) అభివృద్ధికి సమగ్ర ప్రణాళిక రూపకల్పనకు కన్సల్టెన్సీ సంస్థ (స్ట్రాటజిక్ సపోర్ట్ ఏజెన్సీ- ఎస్ఎస్ఏ) నియామకానికి ఏపీసీఆర్‌డీఏ టెండర్లు పిలిచింది. పశ్చిమ గోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, పల్నాడు, బాపట్ల, ప్రకాశం, మార్కాపురం జిల్లాల పరిధిలో 44,962 చ.కి.మీ. ప్రాంతానికి ఎకనమిక్ రీజియన్ ప్లాన్ (ఏఈఆర్‌పీ) సిద్ధం చేయనున్నారు. రాష్ట్ర ప్రభుత్వ స్వర్ణాంధ్ర విజన్-2047, కేంద్ర ప్రభుత్వ సిటీ ఎకనమిక్ రీజియన్ ఫ్రేమ్‌వర్క్‌కు అనుగుణంగా ఏఈఆర్‌పీని రూపొందిస్తున్నట్లు సీఆర్‌డీఏ పేర్కొంది. ఏఈఆర్‌కి సంబంధించి ఆర్థిక, భూ వినియోగ ప్రణాళికలు, ఆర్థికాభివృద్ధి, పెట్టుబడుల ఆకర్షణ, నాణ్యమైన, అత్యంత అనుకూలమైన జీవన విధానం, సుస్థిరాభివృద్ధి మూలస్తంభాలుగా పేర్కొంది. టెండర్లలో ఎంపికైన సంస్థ వాటి ఆధారంగా యాంకర్ ప్రాజెక్టుల రూపకల్పన, మొత్తం రీజియన్‌ను ఒక యూనిట్‌గా పరిగణిస్తూ పట్టణాలు, వాటి చుట్టుపక్కల ప్రాంతాల అభివృద్ధి, వివిధ ప్రభుత్వ శాఖల మధ్య విస్తృత సమన్వయంతో సమగ్రాభివృద్ధి ప్రధాన లక్ష్యాలుగా ఏఈఆర్‌పీని సిద్ధం చేయాలని పేర్కొంది. ఈ ప్రణాళిక రూపకల్పనకు ఆసియా అభివృద్ధి బ్యాంకు (ఏడీబీ) నుంచి ఆర్థిక, సాంకేతిక సహకారం తీసుకుంటున్నామని, సింగపూర్ ప్రభుత్వం కూడా తోడ్పాటు అందిస్తోందని తెలిపింది. ఎంపికైన కన్సల్టెన్సీ సంస్థ ఏడీబీ, సింగపూర్ ప్రభుత్వాలతో సమన్వయం చేసుకోవాలని స్పష్టం చేసింది.

ఏడాది నుంచి

▼ ఏఈఆర్‌పీ అమలుకు స్వల్ప దీర్ఘకాలిక లక్ష్యాలను రూపొందించాలి. 0-12 నెలలు, 1-3 సంవత్సరాలు, 3-7 సంవత్సరాలు, 7-22 సంవత్సరాలకు ఈ ప్రణాళికలు ఉండాలి. 2030, 2035, 2047 సంవత్సరాలకు సాధించాల్సిన లక్ష్యాలను ఏఈఆర్‌పీలో నిర్దిష్టంగా పేర్కొనాలి.

▼ ఏఈఆర్‌పీ సిద్ధమయ్యాక ప్రభుత్వ విభాగాల వారీగా ఆచరణాత్మకమైన రోడ్‌మ్యాప్‌లు రూపొందించి.. బాధ్యతలు, లక్ష్యాలు, వాటిని సాధించాల్సిన గడువు స్పష్టంగా నిర్దేశించాలి.

▼ సింగపూర్, గ్రేటర్ టోక్యో, సియోల్ కేపిటల్ ఏరియా, గ్రేటర్ బే ఏరియా, రోటర్‌డామ్- యాంట్‌వెర్ప్, బార్సిలోనా మెట్రోపాలిటన్ రీజియన్, గ్రేటర్ మాంచెస్టర్ వంటి అంతర్జాతీయ ఎకనమిక్ రీజియన్లు, మన దేశంలోని బీసీపీఈఆర్, ఎంఎంఆర్, ఎన్‌సీఆర్, హైదరాబాద్ ఎంఆర్, చెన్నై ఎంఆర్ వంటి రీజియన్లకు దీటుగా సిద్ధం చేసేలా ప్రణాళిక ఉండాలి.

▼ వివిధ బ్యాంకులు, ఆర్థిక సంస్థల నుంచి నిధులు సమీకరించగల 100కి పైగా ప్రాజెక్టులు, 8-12 యాంకర్ ప్రాజెక్టుల్ని సిద్ధం చేయాలి.

▼ ప్రాజెక్టుల పర్యవేక్షణ, సంస్కరణల అమలు, ఆర్థిక వనరుల నిర్వహణకు డిజిటల్ పీఎంఓ డ్యాష్‌బోర్డు ఏర్పాటు చేయాలి.

▼ తొమ్మిది నెలల్లో ప్రణాళిక రూపొందించాలి. తర్వాత ఆరు నెలలపాటు ప్రాజెక్టు అమల్లో సహకరించేందుకు ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్ యూనిట్‌ను ముగ్గురు సభ్యులతో నిర్వహించాలి.

పారిశ్రామిక జంట నగరాలుగా విజయవాడ- గుంటూరు

■ 2047కి ఏఈఆర్‌ని 250 బిలియన్ డాలర్ల ప్రాంతీయ ఆర్థిక వ్యవస్థగా రూపొందించేలా ప్రణాళిక ఉండాలి.

■ అమరావతి యాంకర్ కేపిటల్ సిటీగా విజయవాడ- గుంటూరును పారిశ్రామిక సేవలందించే జంట నగరాలుగా, ఏలూరు, బాపట్లలను వ్యవసాయ పారిశ్రామిక హబ్‌లుగా, ఒంగోలు, మార్కాపురం ప్రాంతాల్ని ఖనిజాలు, తయారీ రంగ కారిడార్‌గా అభివృద్ధి చేయాలి.

■ పోర్టు ఆధారిత తయారీ యూనిట్లు, విలువ ఆధారిత వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతులు, డ్రోన్లు, డిఫెన్స్, ఏరోస్పేస్ క్లస్టర్లు, ఎలక్ట్రానిక్స్, ఔషధాల తయారీ కేంద్రాలు, జీసీసీలు, హైఎండ్ సర్వీసులు అందించే ప్రాంతంగా, ప్రధాన ఎగుమతి కేంద్రంగా తీర్చిదిద్దాలి.

■ సర్క్యులర్ ఎకానమీ విధానాల అమలు, ఎలాంటి వాతావరణ పరిస్థితులనైనా తట్టుకుని నిలబడే మౌలిక వసతులు, ప్రపంచస్థాయి పట్టణ సేవలు, అత్యున్నత నైపుణ్యమున్న మానవ వనరులతో దీన్ని సుస్థిర, అత్యంత నివాసయోగ్యమైన ప్రాంతంగా అభివృద్ధి చేయాలి.

■ ఈ లక్ష్యాన్ని చేరుకునేందుకు ఏఈఆర్‌పీలో 10 నుంచి 12 గ్రోత్ డ్రైవర్స్‌ను, కొన్ని ఉత్ప్రేరక ప్రాజెక్టులను రూపొందించాలి. పెట్టుబడుల్ని ఆకర్షించాలి.

విశ్వవిద్యాలయాల్లో.. 1,500 పోస్టుల భర్తీ

15న నోటిఫికేషన్ ఇచ్చేందుకు ఉన్నత విద్యాశాఖ సన్నద్ధం

ఈనాడు, అమరావతి: విశ్వవిద్యాలయాల్లో అధ్యాపక పోస్టుల నియామక ప్రకటన విడుదలకు ఉన్నత విద్యాశాఖ కసరత్తు చేస్తోంది. జాబ్ కేలండర్‌లో ప్రకటించినట్లు ఈనెల 15న 1,500 పోస్టులకు ప్రకటన విడుదల కానుంది. విశ్వవిద్యాలయాలకు మంజూరు చేసిన పోస్టుల్లో బ్యాక్‌లాగ్‌లు మినహాయించి మిగతా వాటిల్లో 43% ఖాళీలు భర్తీ చేసేలా ప్రణాళిక రూపొందించారు. వీటికి రిజర్వేషన్ రోస్టర్‌ను ఖరారు చేసే ప్రక్రియను విశ్వవిద్యాలయాలు చేపట్టాయి. వర్సిటీల్లో 3,220 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. 2017-18లో తెదేపా ప్రభుత్వం 1,109 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇచ్చింది. దీనికి సంబంధించిన కేసు సుప్రీంకోర్టులో పెండింగ్‌లో ఉంది. దీనివల్ల ఆ 1,109 పోస్టులను పక్కన పెట్టి... మొదటి విడతగా 1,500 భర్తీ చేయనున్నారు. అన్ని విశ్వవిద్యాలయాల్లో కలిపి బ్యాక్‌లాగ్ పోస్టులు 279 ఉన్నాయి. వీటితో కలిపి ప్రకటన విడుదల చేయనున్నారు.

■ అత్యధికంగా ఆంధ్ర విశ్వవిద్యాలయంలో బ్యాక్‌లాగ్ పోస్టులు సహా 246 ఖాళీలను భర్తీ చేయనున్నారు. ఆ తర్వాత రాజీవ్ గాంధీ విజ్ఞాన విశ్వవిద్యాలయం(ఆర్జీయూకేటీ)లో 207 పోస్టులు భర్తీ అయ్యే అవకాశం ఉంది. ■ శ్రీవేంకటేశ్వరలో 125, ఆర్జీయూకేటీ 104, శ్రీకృష్ణదేవరాయలో 103 పోస్టుల భర్తీకి చర్యలు చేపట్టారు. ■ ఆంధ్రకేసరి వర్సిటీలో 13, ద్రవిడలో 18, డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ విశ్వవిద్యాలయంలో 32 పోస్టులు భర్తీ చేసే అవకాశం ఉంది. ■ బ్యాక్‌లాగ్ పోస్టులు ఆర్జీయూకేటీలో అత్యధికంగా 103.. యోగివేమనలో 43 ఉన్నాయి. అత్యల్పంగా ఆచార్య నాగార్జునలో ఒకటి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌లో 4, ద్రవిడలో 5 పోస్టులు ఉన్నాయి. ■ పోస్టుల సర్దుబాటు ముగిసింది. రిజర్వేషన్ రోస్టర్ పూర్తి చేశాక తుది జాబితా తయారవుతుంది. ■ చాలా విశ్వవిద్యాలయాల్లో కొన్ని విభాగాల్లో విద్యార్థుల ప్రవేశాలు లేవు. అక్కడ పని చేస్తున్న వారూ లేరు. ఇలాంటి పోస్టుల భర్తీని వాయిదా వేశారు.

గోదావరి పుష్కరాలకు కేంద్ర సాయం!

ప్రధానికి విజ్ఞప్తి చేయనున్న సీఎం చంద్రబాబు: మంత్రి నారాయణ



గోదావరి పుష్కరాల ఏర్పాట్లపై నిర్వహించిన సమీక్షలో మంత్రులు నారాయణ, దుర్గేష్, ఎమ్మెల్యేలు బుచ్చయ్య చౌదరి, వేగుళ్ల జోగేశ్వరరావు

ఈనాడు, అమరావతి: గోదావరి పుష్కరాలకు కేంద్ర ప్రభుత్వ సాయం కోరాలని యోచిస్తున్నట్లు పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణ చెప్పారు. ప్రధాని మోదీని ముఖ్యమంత్రి చంద్రబాబు త్వరలో కలిసి నిధులివ్వాలని విజ్ఞప్తి చేయనున్నారని ఆయన వివరించారు. పుష్కరాలకు ఏర్పాట్లపై పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేష్‌తో కలిసి కొవ్వూరు, రాజమహేంద్రవరం గ్రామీణ, మండపేట, రాజానగరం నియోజకవర్గాల ఎమ్మెల్యేలు ముప్పిడి వెంకటేశ్వరరావు, గోరంట్ల బుచ్చయ్యచౌదరి, వేగుళ్ల జోగేశ్వరరావు, బత్తుల బలరామకృష్ణలతో మంత్రి నారాయణ సచివాలయంలో సోమవారం సమావేశమయ్యారు. పుష్కరాలకు భారీ సంఖ్యలో హాజరయ్యే భక్తులకు పుర, నగరపాలక సంస్థల్లో మౌలిక సదుపాయాల కల్పనపై ప్రధానంగా చర్చించారు. ఎమ్మెల్యేల సూచనలు, అభిప్రాయాలు మంత్రులు తెలుసుకున్నారు. మౌలిక సదుపాయాల ఏర్పాటుకు అవసరమైన ప్రణాళికలు వెంటనే సిద్ధం చేయాలని పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ అధికారులను ఆదేశించారు. సమావేశానంతరం మంత్రి నారాయణ విలేకర్లతో మాట్లాడారు. 'పుష్కరాల కోసం ప్రధానంగా మున్సిపాల్టీల్లో రోడ్లు, డ్రెయిన్లు, తాగునీటి సౌకర్యం, పార్కింగ్ ఏర్పాట్లపై సమావేశంలో చర్చించాం. పుష్కరాలు మొదలయ్యాక ఘాట్ల నిర్వహణ, షెల్టర్ల ఏర్పాటు, ఆహారం, తాగునీటి సౌకర్యం తదితర విషయాలపైనా ఎమ్మెల్యేల అభిప్రాయాలు తెలుసుకున్నాం. పుష్కరాలు జరిగే నాలుగు మున్సిపాల్టీల్లో ప్రాథమిక వసతులు పెద్ద ఎత్తున చేపట్టాలని నిర్ణయించాం. సీఎంతో చర్చించాక నిధులు కేటాయించి వెంటనే పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటాం' అని వివరించారు.

గ్రామీణ పేదలకు లక్ష ఇళ్లు!

(మొదటి పేజీ తరువాయి)


కట్టుకుంటామన్న వారికీ ఇవ్వలేదు. దీంతో గ్రామీణ ప్రాంతాల్లో ఇళ్ల నిర్మాణానికి భారీగా డిమాండ్ ఉంది. కూటమి ప్రభుత్వం వచ్చాక సొంతింటి కోసం దాదాపుగా 10 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారు. కేంద్ర, రాష్ట్ర నిబంధనలకు అనుగుణంగా వీటిని తనిఖీ చేయిస్తే 6 నుంచి 7 లక్షల మంది అర్హులున్నారని గుర్తించారు. వీరికి ఇళ్లు మంజూరు చేయాల్సి ఉంది. వైకాపా పాలనలో కేంద్రం దాదాపు 16 లక్షల ఇళ్లు మంజూరు చేసినా సకాలంలో పూర్తి చేయలేదు. దీంతో అప్పట్లోనే కేంద్రం ఇళ్ల నిర్మాణ పురోగతికి అనుగుణంగా కొత్తవి మంజూరు చేయాలని నిర్ణయం తీసుకుంది.

నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోకే నగదు

పీఎంఏవై గ్రామీణ-2.0 పథకం కింద ఇళ్ల నిర్మాణానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమ వాటా నిధుల్ని విడుదల చేస్తాయి. ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ.2.39 లక్షలు అందించనున్నాయి. ఇందులో కేంద్ర ప్రభుత్వ వాటా రూ.72 వేలు ఉపాధి హామీ పథకం, మరుగుదొడ్ల నిర్మాణ పథకం కింద రూ.39 వేలు అందనుండగా.. మిగతాది రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వనుంది. ఈ నిధులు లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో స్పర్శ్ విధానంలో జమ కానున్నాయి. మార్చి 31 ముందు వరకు కేంద్రం తన వాటా నిధుల్ని రాష్ట్ర సింగిల్ నోడల్ ఖాతాకు బదిలీ చేస్తే ప్రభుత్వం దాన్ని 21 రోజుల్లో గృహనిర్మాణ సంస్థకు విడుదల చేసేది. కానీ కొత్త విధానంలో లబ్ధిదారుల ఇళ్ల నిర్మాణానికి అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం తన వాటా నిధుల్ని విడుదల చేసిన తర్వాత కేంద్రం ఆ మేరకు నిధులు అందిస్తుంది. తర్వాత ఆర్‌బీఐ నుంచి లబ్ధిదారుల ఖాతాల్లోకి నగదు జమవుతుంది.

నీటి సరఫరాకు జిల్లాకు రూ.కోటి

సీఎస్‌కు ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశం



ఈనాడు, అమరావతి: నీటి సరఫరా కోసం జిల్లా కలెక్టర్లకు రూ.కోటి చొప్పున నిధులు మంజూరు చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని సీఎం చంద్రబాబు ఆదేశించారు. నీటి కొరత ఉన్నచోట ట్యాంకర్ల ద్వారా అందించాలని, బోర్లకు మరమ్మతులు చేపట్టాలని సూచించారు. సచివాలయంలోని ఆర్టీజీఎస్ కేంద్రం నుంచి వివిధ శాఖల పనితీరుపై సీఎం చంద్రబాబు సోమవారం సమీక్షించారు. 'ప్రభుత్వం అందించే పౌర సేవల్లో కృత్రిమ మేధ వినియోగం మరింత పెంచాలి. దీన్ని సమర్థంగా వినియోగించేందుకు వీలుగా నిపుణులతో సలహా మండలిని ఏర్పాటు చేయాలి. రాష్ట్రంలో డ్రోన్ల వాడకం పెంచేలా వర్క్‌షాప్ నిర్వహించాలి. మధ్యప్రదేశ్‌లో మైనింగ్ కార్యకలాపాలను డ్రోన్ల ద్వారా పర్యవేక్షిస్తున్న తీరును అధ్యయనం చేసి, మన రాష్ట్రంలోనూ అమలుచేసే అంశాన్ని పరిశీలించాలి' అని సీఎం సూచించారు. రాష్ట్రంలో వాహనాల రిజిస్ట్రేషన్ ప్రక్రియ మరింత సులభతరం చేసేలా వాహన డీలర్లను అదనపు రిజిస్ట్రేషన్ అథారిటీగా గుర్తించే విధానానికి సీఎం ఆమోదం తెలిపారు.

మార్కెట్‌ను విశ్లేషిస్తూ, రైతులకు మార్గదర్శనం

ప్రజలకు మెరుగైన పౌరసేవలు అందించేందుకు నిరంతరం వినూత్న ఆలోచనలు చేయాలని సీఎం చంద్రబాబు అధికారులకు సూచించారు. 'పంటలకు ధర విషయంలో రైతులకు ఇబ్బందుల్లేకుండా ఎప్పటికప్పుడు మార్కెట్‌ను విశ్లేషించి తగిన చర్యలు చేపట్టాలి. ప్రభుత్వ కార్యక్రమాలు, సంక్షేమ పథకాల అమలు తీరును పర్యవేక్షించేలా సీనియర్ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించాలి. కార్యదర్శి స్థాయి అధికారులు నెలలో 3 రోజులు, హెచ్‌వోడీలు 6, కలెక్టర్లు 8 రోజుల పాటు పర్యటించి ప్రజలతో మమేకం కావాలి. అత్యవసర సేవలు మినహా ప్రభుత్వ విభాగాలు అందించే మిగిలిన సేవలన్నీ ఆన్‌లైన్‌లోనే సాగాలి' అని సీఎం సూచించారు. సముద్రంలో వేట నిషేధ కాలం ముగిశాక అవేర్ డేటా ఆధారంగా చేపలు సమృద్ధిగా దొరికే ప్రాంతాలపై మత్స్యకారులకు సమాచారం అందించాలని నిర్దేశించారు. ఈ సమీక్షలో మంత్రి పార్థసారథి, సీఎస్ సాయిప్రసాద్ పాల్గొన్నారు.

రాష్ట్ర ఉత్పత్తులకు ప్రపంచ బ్రాండింగ్

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో తయారయ్యే ఉత్పత్తులు ప్రపంచ బ్రాండ్లుగా ఎదిగేలా చర్యలు చేపట్టాలని సీఎం చంద్రబాబు అధికారులకు నిర్దేశించారు. రాష్ట్రంలోని పారిశ్రామిక క్లస్టర్లకు రోడ్డు, రైల్, పోర్టు కనెక్టివిటీ ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సచివాలయంలోని ఆర్టీజీఎస్ కేంద్రంలో ప్రొడక్ట్ పర్ఫెక్షన్ క్లస్టర్లపై సోమవారం చంద్రబాబు సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ.. 'విశాఖ, అమరావతి, తిరుపతి ఎకనమిక్ రీజియన్లలో అభివృద్ధి చేయనున్న పారిశ్రామిక క్లస్టర్లపై దృష్టి పెట్టాలి. కేంద్ర ప్రభుత్వ భారత్ ఔద్యోగిక్ వికాస్ యోజన పథకం (భవ్య పథకం) కింద పారిశ్రామిక, కెమికల్ పార్కుల ఏర్పాటుకు అనుమతులు సాధించాలి. 2026-27లో ఏర్పాటు కానున్న రేర్ ఎర్త్ మినరల్ పార్కు, ఈస్ట్ కోస్ట్ పారిశ్రామిక కారిడార్, కంటెయినర్ తయారీ క్లస్టర్ సహా 175 ఎంఎస్ఎంఈ పార్కులను క్లస్టర్ల వారీగా అభివృద్ధి చేయాలి. పారిశ్రామిక పార్కుల్లో ప్రొడక్టు పర్ఫెక్షన్‌తో పాటు లాజిస్టిక్స్‌నూ అనుసంధానించాలి' అని చెప్పారు.

ఎంఎస్ఎంఈల స్థాపనలో అగ్రస్థానమే లక్ష్యం

'ఉత్పత్తులు స్థానిక, ప్రాంతీయ, దేశ, విదేశీ మార్కెట్లకు చేరేలా చూడాలి. పారిశ్రామిక క్లస్టర్లలో ఫార్మర్ ప్రొడ్యూసర్స్ ఆర్గనైజేషన్లను ఏర్పాటు చేయడం ద్వారా రైతులకు ప్రయోజనం కల్పించాలి. ప్రతి జిల్లాలోనూ మెగా ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటు ద్వారా ఉపాధి అవకాశాలు కల్పించాలి. ఒక కుటుంబం.. ఒక పారిశ్రామిక వేత్త కార్యక్రమం ద్వారా రాష్ట్రం ఎంఎస్ఎంఈల స్థాపనలో అగ్రస్థానంలో ఉండాలి' అని పేర్కొన్నారు. మంత్రి టీజీ భరత్, సీఎస్ సాయిప్రసాద్ పాల్గొన్నారు.

నెల్లూరు ఇఫ్కో భూముల్లో మహానాడు

ఖరారు చేసిన తెదేపా ● బుధవారం భూమి పూజ

ఈనాడు, నెల్లూరు: తెలుగుదేశం పార్టీ 'మహానాడు' నిర్వహణకు వేదిక ఖరారైంది. శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కోవూరు నియోజకవర్గం కొడవలూరు మండలం రాచర్లపాడు సమీపంలోని ఇఫ్కో కిసాన్ సెజ్ భూముల్లో ఈ కార్యక్రమం నిర్వహించాలని నిర్ణయించారు. మే 27, 28, 29 తేదీల్లో జరగనున్న పసుపు పండగకు సంబంధించి ప్రాథమిక పనులు ఇప్పటికే మొదలయ్యాయి. సభా వేదిక, గ్యాలరీలు, స్టాల్స్, భోజన, వసతి, పార్కింగ్ తదితరాల కోసం ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నెల 6న (బుధవారం) ఉదయం 10 గంటలకు భూమి పూజ నిర్వహణకు ముహూర్తం ఖరారు చేశారు. ఈ కార్యక్రమంతో వేదిక నిర్మాణ పనులు అధికారికంగా వేగవంతం కానున్నాయి. మంత్రి పొంగూరు నారాయణ, సీఎం కార్యక్రమాల సమన్వయకర్త మంతెన సత్యనారాయణరాజు, ఏపీ వక్ఫ్‌బోర్డు ఛైర్మన్ అబ్దుల్ అజీజ్, ఇన్లాండ్ వాటర్‌వేస్ ఛైర్మన్ జడ్.శివప్రసాద్, పార్టీ నేతలు చేజర్ల వెంకటేశ్వర్లు, కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, రూప్‌కుమార్ యాదవ్ తదితరులు కార్యక్రమ నిర్వహణ ప్రదేశాన్ని సోమవారం పరిశీలించారు.

నిద్రలోనే నూరేళ్లు నిండాయా కన్నా..!

మంచినీటి ట్యాంకు పడి బాలుడి మృతి



దేవాన్ష్ మృతదేహం

పెనమలూరు, న్యూస్‌టుడే: అప్పటిదాకా తల్లి దగ్గర ఆడిపాడిన ఆ బాలుడు..అంతలోనే మంచినీటి ట్యాంకు పడి నిద్రలోనే కన్నుమూశాడు. కృష్ణాజిల్లా కానూరులోని తులసీనగర్‌లో చోటు చేసుకున్న ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గుంటూరు జిల్లా తాడేపల్లికి చెందిన తట్టికోట ధనలక్ష్మి..ఏడునెలల గర్భిణి. తన మూడేళ్ల కుమారుడు దేవాన్ష్‌తో కలసి కొద్దిరోజుల కిందట కానూరు తులసీనగర్‌లోని పుట్టింటికి వచ్చింది. ఆదివారం మధ్యాహ్నం బాలుడిని నిద్రపుచ్చి ఇంటి పనుల్లో నిమగ్నమైంది. వాళ్లు ఉండే ఇల్లు రేకులషెడ్డు కావడంతో పైన ఇనుప రాడ్లను ఆసరాగా చేసి మంచినీటి ట్యాంకును ఏర్పాటు చేశారు. అందులో ఓ రాడ్డు విరిగిపోవడంతో.. 500 లీటర్లకు పైగా సామర్థ్యం ఉన్న ఆ ట్యాంకు రేకులను పగలకొట్టుకుంటూ.. నిద్రిస్తున్న దేవాన్ష్‌పై పడింది. బాలుడి తలకు తీవ్రగాయాలయ్యాయి. వెంటనే ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. కళ్ల ముందే కుమారుడు ప్రాణాలు కోల్పోవడంతో నిద్రలోనే నూరేళ్లు నిండాయా కన్నా అని తల్లి విలపించిన తీరు చూపరులను కంటతడి పెట్టించింది. బాధితులు పెనమలూరు పోలీసులకు ఫిర్యాదు ఇవ్వగా సోమవారం కేసు నమోదు చేశారు.

176 రకాల మందులే కొంటున్నారు

ఈనాడు, అమరావతి: రోగులకు అవసరమైన 176 రకాల మందులను వికేంద్రీకరణ విధానంలో స్థానికంగా ఆసుపత్రుల యాజమాన్యాలు కొనుగోలు చేస్తున్నాయని వైద్యారోగ్య శాఖ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొంది. 'ఉన్న మందులే రాయండి' శీర్షికతో 'ఈనాడు'లో ప్రచురితమైన కథనంపై స్పందించింది. 712 రకాల మందుల్లో ప్రస్తుతం సెంట్రల్ డ్రగ్ స్టోర్లలో 516 రకాల మందులు అందుబాటులో ఉన్నాయని, 56 రకాలకు ఆసుపత్రి స్థాయిలో కొనుగోలుకు అనుమతి ఉందని వెల్లడించింది. ఏపీఎంఎస్ఐడీసీ ద్వారా ప్రతి ఆసుపత్రిలో కనీసం మూడు నెలలకు మందుల నిల్వలు ఉండేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపింది.

ఆ వినతిపై 4 వారాల్లో నిర్ణయం వెల్లడించండి

గ్రామవార్డు సచివాలయాల కమిషనర్‌కు హైకోర్టు ఆదేశం

ఈనాడు, అమరావతి: ఏపీ గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులకు ఇంక్రిమెంట్, పదోన్నతి ఛానల్ మంజూరు చేయాలని ఉద్యోగుల సంఘం సమర్పించిన వినతిపై 4 వారాల్లో నిర్ణయం తీసుకొని తగిన ఉత్తర్వులివ్వాలని గ్రామ, వార్డు సచివాలయాల కమిషనర్‌ను హైకోర్టు ఆదేశించింది. న్యాయమూర్తి జస్టిస్ వి.సుజాత ఈమేరకు సోమవారం ఉత్తర్వులిచ్చారు. ఐదేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగులకు ఇంక్రిమెంట్, పదోన్నతి కల్పించేలా ఆదేశాలు ఇవ్వాలంటూ గ్రామ, వార్డు సచివాలయ ఎస్సీఎస్టీ ఎంప్లాయీస్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు వలమల శ్రీనివాసరావు హైకోర్టులో వ్యాజ్యం వేశారు. వినతిని సమర్పించినా అధికారుల చర్యలు లేవన్నారు. సోమవారం జరిగిన విచారణలో పిటిషనర్ తరఫున కోట కృష్ణదీప్తి వాదనలు వినిపించారు.

నేనూ, పవన్ ఉన్నట్లే.. శ్రేణులూ సఖ్యంగా ఉండాలి

● తూర్పుగోదావరి జిల్లా ప్రజాప్రతినిధుల సమావేశంలో సీఎం చంద్రబాబు

ఈనాడు, అమరావతి: కూటమి పార్టీలు, నాయకుల మధ్య విస్తృత సమన్వయం ఉండాలని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. 'నేను, పవన్ కల్యాణ్ ఎంత సఖ్యతతో ఉంటున్నామో, క్షేత్రస్థాయిలో కూటమి పార్టీల కేడర్ మధ్య కూడా అంతే సఖ్యత ఉండాలి. కూటమి పార్టీల కార్యకర్తల్ని ఎట్టి పరిస్థితుల్లోనూ నిర్లక్ష్యం చేయొద్దు. బాగా పనిచేసే కార్యకర్తలను ప్రోత్సహించాలి' అని దిశా నిర్దేశం చేశారు. తూర్పుగోదావరి జిల్లా ప్రజాప్రతినిధులతో తన క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో చంద్రబాబు మాట్లాడారు. 'సంక్షేమం చేస్తున్నాం, అభివృద్ధి చేస్తున్నాం అని మితిమీరిన విశ్వాసంతో ఏ ఒక్కరూ వ్యవహరించొద్దు. ప్రభుత్వ పనితీరే కాదు, నేతల వ్యక్తిగత ప్రవర్తనను కూడా ప్రజలు లెక్కిస్తారు. మీ వ్యక్తిగత అభిప్రాయాలు, ఇష్టాయిష్టాలకంటే ప్రజల ఆలోచనలకే ఎక్కువ ప్రాధాన్యమివ్వాలి' అని స్పష్టం చేశారు.

బెంగాల్‌లో భాజపా గెలుపు ప్రజా తిరుగుబాటుకు నిదర్శనం

పశ్చిమ బెంగాల్‌లో భాజపా గెలుపు ప్రజా తిరుగుబాటుకు నిదర్శనమని చంద్రబాబు వ్యాఖ్యానించారు. జాతీయ ప్రయోజనాల దృష్ట్యా బెంగాల్ ప్రజలు మంచి తీర్పిచ్చారన్నారు. తమిళనాడు ప్రజలు కొత్తదనాన్ని కోరుకుంటున్నట్లుగా కనిపిస్తోందని, అస్సాంలో చక్కటి పాలన అందించినందుకే భాజపాను మళ్లీ గెలిపించారని అభిప్రాయపడ్డారు. దేశంలో మరే రాష్ట్రంలోనూ లేని విధంగా ప్రతిపక్షహోదా దక్కించుకోలేని పార్టీగా వైకాపా, నేతగా జగన్ చరిత్రలో నిలిచిపోతారని మంత్రి నిమ్మల రామానాయుడు పేర్కొన్నారు. ప్రజా వ్యతిరేక విధానాలతో పనిచేసే నేతలకు అలాంటి ఫలితాలే వస్తాయని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు.

స్థానిక ఎన్నికలకు సిద్ధమవండి

స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని సీఎం సూచించారు. 'పుష్కలంగా నీరు ఉండే ప్రాంతాల్లో కూడా తలసరి ఆదాయం తక్కువగా ఉంటోంది. మరోవైపు ఉద్యాన, వాణిజ్య పంటల వల్ల మెట్ట ప్రాంతాల్లో తలసరి ఆదాయం పెరుగుతోంది. రైతులకు దీనిపై అవగాహన కల్పించాలి. గ్రామాల్లో మనం కులానికో సామాజిక భవనం కడుతున్నాం. అది కులాల మధ్య అంతరాలు పెంచుతోంది. సామాజిక భవనాల్ని అన్ని వర్గాలూ ఉపయోగించుకునే పరిస్థితి తీసుకురావాలి' అని సీఎం చెప్పారు. ఇళ్ల స్థలాల పంపిణీ ప్రక్రియను ఏడాదిలోగా పూర్తి చేయాలని కలెక్టర్‌కు సూచించారు. ధాన్యం కొనుగోళ్లలో ప్రాంతాలవారీగా రైతులకు రైస్ మిల్లులు కేటాయించే విధానం వల్ల సమస్యలు తలెత్తుతున్నాయని, ఏ రైస్ మిల్లులోనైనా ధాన్యం విక్రయించుకునే అవకాశం రైతులకు కల్పించాలని ప్రజాప్రతినిధులు కోరారు. దానిపై సమగ్ర వివరాలతో రావాలని అధికారులను సీఎం ఆదేశించారు. సమావేశంలో మంత్రి కందుల దుర్గేష్, ఎమ్మెల్యేలు గోరంట్ల బుచ్చయ్య చౌదరి, ఆదిరెడ్డి వాసు, వేగుళ్ల జోగేశ్వరరావు, మద్దిపాటి వెంకట్రాజు, ముప్పిడి వెంకటేశ్వరరావు, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, బత్తుల బలరామకృష్ణ, జ్యోతుల నెహ్రూ పాల్గొన్నారు.

రాయితీపై సాగు పరికరాలకు పచ్చజెండా

28 జిల్లాలకు రూ.112.50 కోట్ల కేటాయింపు

● లబ్ధిదారుల అర్హతకు మార్గదర్శకాల విడుదల

ఈనాడు, అమరావతి: ట్రాక్టర్లు, గొర్రులు, కోత, నూర్పిడి యంత్రాలు, పవర్ టిల్లర్లు, స్ప్రేయర్లు వంటి వ్యవసాయ యంత్ర పరికరాలను రైతులకు రాయితీపై అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఖరీఫ్, రబీ సాగు ఆధారంగా 2025-26 సంవత్సరానికి 28 జిల్లాలకు రూ.112.50 కోట్లు కేటాయించింది. ఈ పథకం అమలుకు సంబంధించి మార్గదర్శకాలు విడుదల చేసింది.

ఇవీ నిబంధనలు

● ఎస్సీ, ఎస్టీ, చిన్న, సన్నకారు రైతులు, మహిళలకు యంత్రాల యూనిట్ ధరలో 50% చొప్పున, ఇతర రైతులకు 40% చొప్పున రాయితీ వర్తిస్తుంది. ● 40 హెచ్‌పీ వరకు సామర్థ్యం గల ట్రాక్టర్లు, మినీ ట్రాక్టర్లు, అనుబంధ పరికరాలు, విత్తే, నాటే, తవ్వే యంత్రాలు, స్ప్రేయర్లు, స్వీయచోదక పరికరాలు, పవర్ టిల్లర్లు, కోత, నూర్పిడి యంత్రాలు, పంట కోత తర్వాత విలువ జోడింపు యంత్రాలు, ఎండుగడ్డి, మేత సామగ్రిని అందిస్తారు. ● లబ్ధిదారులను జిల్లా సంయుక్త కలెక్టర్ సమక్షంలో లాటరీ ద్వారా ఎంపిక చేస్తారు. జిల్లాల్లో మండలాలు, సామాజికవర్గాల వారీగా ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తారు. జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి ఆమోదం తర్వాత లబ్ధిదారుల జాబితా విడుదలవుతుంది. ఎంపికైన వారి మొబైల్ ఫోన్లకు మెసేజ్‌లు పంపిస్తారు. ● ప్రొసీడింగ్స్ ఇచ్చిన 15 రోజుల్లో రైతులు పరికరానికి సంబంధించి తమ వాటా మొత్తాన్ని డీలర్లకు చెల్లించాలి. ఆర్డర్ అందాక 15 రోజుల్లో రైతులకు యంత్రాన్ని అందిస్తారు.


దరఖాస్తు ఇలా..

రాయితీపై యంత్ర పరికరాలకు రైతు సేవా కేంద్రాలతో పాటు ఆన్‌లైన్‌లోనూ దరఖాస్తు చేసుకోవచ్చు. నచ్చిన డీలర్ వద్ద పరికరాన్ని కొనుక్కోవచ్చు. ● మే 5 నుంచి 19 వరకు దరఖాస్తు చేసుకోవాలి. ● 23 నుంచి 25 వరకు లాటరీ ప్రక్రియ ఉంటుంది. ఎంపికైన వారికి మంజూరు పత్రం ఇస్తారు. ● లబ్ధిదారు మే 26 నుంచి జూన్ 9లోగా తన వాటా సొమ్ము డీలర్‌కు చెల్లించాలి. ● మే 26 నుంచి జూన్ 26 వరకు యంత్రాలు సరఫరా చేస్తారు. ● జూన్ 30 నుంచి డీలర్ ఖాతాలోకి రాయితీ సొమ్ము విడుదల ప్రక్రియ మొదలవుతుంది. ఆన్‌లైన్‌లో దరఖాస్తుకు వెబ్‌సైట్: https://eseed.ap.gov.in/FM/

కౌలు రైతులూ అర్హులే

● సొంత భూమి కలిగిన రైతులతో పాటు గత మూడేళ్లలో కనీసం మూడు సీజన్లలో ఈ-పంటలో నమోదైన 'కౌలు రైతు కార్డులు' పొందిన వారు దరఖాస్తు చేసుకోవచ్చు. అటవీ హక్కుల పత్రాలున్న(ఆర్ఓఎఫ్ఆర్) రైతులూ అర్హులే. ● 2024-25 సంవత్సరంలో రాయితీ పొందినవారు అర్హులు కాదు. ● కుటుంబంలో ఒక సభ్యుడే దరఖాస్తు చేసుకోవాలి. ● భూమి రికార్డులు, అటవీ హక్కుల పత్రాలు, ఈ-పంట తదితర సమాచారం ఆధారంగా అర్హుల్ని ఎంపిక చేస్తారు.

ప్రశాంతతే మన నైజం



ప్రశాంతంగా, నిశ్చలంగా ఉండటమే మన నైజం. ఆ రకంగానే మనం జీవితాన్ని సాగించాలి. ఉద్వేగానికి లోనవ్వడం, ఒత్తిడికి గురవ్వడం తాత్కాలికం. కొన్ని సందర్భాలకే పరిమితం. క్లిష్టపరిస్థితుల్లోనూ ప్రశాంతంగా ఉండగలిగే స్థితప్రజ్ఞత సాధించాలి.

– బీఎస్ గుప్తా, యోగా శిక్షకుడు

(c) eenadu

వసుంధర

vasundhara@eenadu.in

పది ప్రభుత్వ ఉద్యోగాలు సాధించి..!

ఒక్క ప్రభుత్వ ఉద్యోగం సాధించేందుకు ఎంత కష్టపడాలో చెప్పనక్కర్లేదు. అయినా లక్ష్యాన్ని చేరుకుంటామన్న గ్యారంటీ లేదు. అలాంటిది 22ఏళ్ల వయసులోనే... గంటె సుజితశ్రీ పది ప్రభుత్వోద్యోగాల్ని సాధించారు. ఇదెలా సాధ్యమైందో ఆమె మాటల్లోనే...

మాది విజయవాడ. నాన్న మోహనరావు ప్రైవేట్ ఉద్యోగి. అమ్మ కృష్ణవేణి. మేం ఇద్దరం. అన్నయ్య జస్వంత్ విదేశాల్లో ఎంఎస్ చేస్తున్నాడు. నేను ప్రభుత్వ ఉద్యోగంలో స్థిరపడాలన్నది నాన్న కల. ఎప్పుడూ అదే చెబుతుండేవారు. మేం ఉన్నత స్థానాల్లో ఉండాలని ఆయన చాలా కష్టపడ్డారు. ఇప్పటికీ శ్రమిస్తూనే ఉన్నారు. అందుకే ఆయన కలని నిజం చేయాలని నిర్ణయించుకున్నా. పీవీపీ సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ పూర్తిచేశా. క్యాంపస్ ఇంటర్వ్యూల్లో ఉద్యోగం కూడా వచ్చింది. కానీ ప్రభుత్వ ఉద్యోగం సాధించాలని దాన్ని వదులుకున్నా. 2024 నుంచి పరీక్షలకు సన్నద్ధం అవ్వడం మొదలుపెట్టా. స్థానికంగానే ఓ ఇన్‌స్టిట్యూట్‌లో శిక్షణకి చేరా. అక్కడ నాలాంటి కోరిక ఉన్న ఉద్యోగార్థులు చాలామందే ఉన్నారు. మొదట్లో లక్ష్యాన్ని చేరుకోగలనా లేదా అని భయమేసింది. కానీ ప్రయత్నించకుండా ఓడిపోకూడదనే ఉద్దేశంతో కోచింగ్‌కి హాజరయ్యాను. ఇన్‌స్టిట్యూట్‌లో 3గం. నేర్చుకుని, ఇంటికి వచ్చాక 4గం సాధన చేసేదాన్ని. అంకగణితం, రీజనింగ్, జనరల్‌నాలెడ్జ్ అంశాల్లో అధ్యాపకులు కొమ్మూరి శ్రీధర్ వద్ద పట్టు సంపాదించా. ప్రతి ప్రశ్నకు షార్ట్‌కట్‌లో జవాబులు రాయడం, టైమ్ మేనేజ్‌మెంట్, వదిలేయాల్సిన ప్రశ్నలు, తప్పకుండా రాయాల్సిన ప్రశ్నలు ఇలా కొన్ని మెలకువల్ని తెలుసుకుని అనుసరించా. వీటన్నింటి ఫలితమే... ఒక్కసారిగా పది ఉద్యోగాలు సాధించగలిగా. ఇండియన్ బ్యాంక్, ఐడీబీఐ, ఆప్కాబ్, ఎస్‌బీఐ తదితర బ్యాంకుల్లో జూనియర్ అసిస్టెంట్, అప్రెంటిస్... వంటి స్థానాలకు ఎంపికయ్యాను. ఎల్ఐసీలో గెజిటెడ్ హోదా ఉన్న ఏఏవో ఉద్యోగానికీ దరఖాస్తు చేసుకున్నా. దానికీ ఎంపికయ్యా. ఏఏవోగా విధులు నిర్వర్తించడానికి సిద్ధం అవుతున్నా. ప్రభుత్వ ఉద్యోగం కోసం ప్రయత్నించేవాళ్లకి ఒకటే సలహా... దేన్నైనా ఇష్టపడి నేర్చుకుంటే విజయ తీరాల్ని తప్పకుండా చేరుకుంటాం.




ఉద్యోగం సాధించే విషయంలో కాస్త ఆలస్యమైనా సాధన మాత్రం వదలొద్దు. రోజూ ప్రాక్టీస్ చేస్తూనే ఉండాలి. అప్పుడే ఫలితాన్ని పొందగలం.

– మురాల అనిల్‌కుమార్, కానూరు



అనుష్క చెప్పిన టూర్!

వేసవి సెలవులొస్తే చాలామంది ఎక్కడికి టూరేద్దాం? పిల్లలకి కొత్తగా ఏం చూపిద్దామనే ఆలోచిస్తుంటారు. అలాంటివాళ్లకి బాలీవుడ్ హీరోయిన్ అనుష్క శర్మ ఓ సలహా ఇచ్చారు. అదేమిటంటే... 'మీ పిల్లల్ని అందమైన ప్రదేశానికి తీసుకెళ్లండి. అక్కడ ఏ అడ్వర్టైజ్‌మెంట్లూ కనిపించకూడదు. సందుసందుకీ హోర్డింగ్‌లు ఉండొద్దు. ముఖ్యంగా మీతో ఎవరూ ఏమీ కొనిపించని ప్రదేశమై ఉండాలి. ఏమేం యాక్టివిటీలు ఉన్నాయని అడగకండి. రోజంతా వాటితో నిండిపోయే ప్రాంతాన్నీ ఎంచుకోవద్దు. మనుషులు నిర్మించిన వాటితో కాదు... ప్రకృతితో మమేకమయ్యేలా చూడండి. నెట్‌వర్క్ బాగుంటుందా అని వెతుక్కోవద్దు. అది లేనివాటిని ఎంచుకోండి. బోరు కొడుతుందన్న భయమే వద్దు. నిజానికి ఆ సమయంలోనే మనసు మాట్లాడటం మొదలుపెడుతుంది. కాబట్టి, బోర్ కొట్టనీయండి. అప్పుడే కదా చుట్టూ పక్షుల శబ్దాలు, పిల్లల నవ్వులు వినిపిస్తాయి. వాటితోపాటు మీ చిరునవ్వూ అనుసరిస్తుంది. కాబట్టి, ఈ వేసవి సెలవులకి మీ చిన్నారుల్ని అలాంటి ప్రాంతానికి తీసుకెళ్లండి. సమాజం సూచించే ఎజెండాలు ఉండవు కదా! మీకు, మీ కుటుంబానికి అవసరమైన కొత్తవేవో బయటపడతాయి' అన్నది దీని సారాంశం. దీన్ని అనుష్క తన ఇన్‌స్టా స్టోరీలో పోస్ట్ చేయగా నెటిజన్లను ఆకర్షించడమే కాదు... కితాబులూ అందుతున్నాయి. ఏంటి మరి... అలాంటి ప్రాంతమేదో వెతుక్కుని మీరూ టూర్ వేస్తారా మరి?



మన ఆత్మరక్షణ... మన చేతుల్లోనే..!

సందేహాలు... నిపుణుల సలహాలు

ఈనాడు-వసుంధర ఉచిత వెబినార్!

ఈనాడు వసుంధర

విద్య, ఉద్యోగం, వృత్తి, వ్యాపారాల్లో రాణించాలంటే ఆడపిల్లలు, మహిళలు ఒంటరిగా ప్రయాణించాల్సిన సందర్భాలెన్నో. అలాంటి సమయాల్లో వాళ్లమీద జరుగుతోన్న దాడులూ, దారుణాలూ మరెన్నో. వాటిని తప్పించుకుని సురక్షితంగా జీవించాలంటే ప్రతి ఒక్కరికీ ఆత్మరక్షణ విద్యలు తప్పక వచ్చి ఉండాలి. అంటే కరాటే, తైక్వాండో... ఇలా ఏదో ఒక యుద్ధవిద్యను నేర్చుకోవాలి. అంతే చురుకుగా ఆలోచించగలగాలి. ఆత్మవిశ్వాసంతో మెలగాలి. చుట్టూ ఉన్న పరిస్థితిని, దాడి చేసే వ్యక్తి బలాన్నీ అంచనా వేయగలగాలి. ఏ పరిస్థితిలో తప్పించుకోవాలి, ఎప్పుడు దాడికి దిగాలి, ఎవరిని సంప్రదించాలి... వంటి అనేక విషయాల గురించి అవగాహన కలిగించేందుకు ఈనాడు- వసుంధర **మే 7వ తేదీ మధ్యాహ్నం 3 గంటల నుంచి 4.30 వరకూ** ఉచిత వెబినార్ నిర్వహిస్తోంది. అందులో సీనియర్ పోలీస్ అధికారి, ప్రముఖ సైకాలజిస్ట్, మార్షల్ ఆర్ట్స్ నిపుణుల సలహాలు, సూచనలతోపాటు మీ సందేహాలకు సమాధానాలూ లభిస్తాయి! ఇంకెందుకు ఆలస్యం... రండి... ఈ లింక్‌లో జాయిన్ అవ్వండి!

07.05.2026
(గురువారం) నాడు...
క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా
https://hov.to/a30561f4
వెబ్ లింకు ఓపెన్ చేయండి.
జూమ్ ఐడీ:
932 2611 3959
పాస్‌కోడ్: 359201 తోనూ హాజరు కావొచ్చు.

ఈ వెబినార్ యూట్యూబ్ లైవ్ కోసం స్కాన్ చేయండి. లేదా
https://hov.to/6b6a0ff7
వెబ్ లింకు ఓపెన్ చేయండి.



వాళ్లకి ఆరోగ్యమే ప్రాధాన్యం..!

అలసిపోయిన ముఖాలు, రోజంతా పనిచేసి నిస్సత్తువ ఆవరించిన శరీరం, నడుము నొప్పి, అధిక పనిభారం, ఇంటికి వెళ్లినా విశ్రాంతి లేకుండా పనిచేసే తరంగా మిలీనియల్స్‌ను చెబుతుంటే... స్మార్ట్ వర్క్, వేళకు నీళ్లు తాగుతూ, నిద్రను ట్రాక్ చేస్తూ, థెరపీల గురించి బహిర్గతంగా మాట్లాడుతూ, జీర్ణవ్యవస్థ, కార్టిసాల్ హెచ్చుతగ్గులు గురించి మాట్లాడే తరంగా జెన్ జీ అమ్మాయిల్ని అభివర్ణిస్తున్నారు నిపుణులు. దీనిబట్టే అర్థమవుతుంది కదా... మిలీనియల్స్ కంటే జెన్ జీలకే ఆరోగ్య స్పృహ ఎక్కువని. ఇటీవల ఓ నివేదికలోనూ ఇది నిరూపితమైంది. బాధ ఉన్నా, కష్టమైనా... మొహమాటం, భయం, బాధ్యత వంటి భావాలను లోపలే దాచుకుని బయటికి మామూలుగానే మిలీనియల్స్ ప్రవర్తిస్తుంటే... పని వల్ల తమకు ఎదురవుతున్న ఇబ్బందులు నేరుగా సంబంధిత వ్యక్తులకే వివరించి, అవసరమైతే జాబ్‌కి రాజీనామా ఇచ్చే డైనమిక్ తరంగా జెన్ జీలు ఉన్నారని నివేదికలో పేర్కొన్నారు. దీనివల్లే మానసిక, శారీరక ఒత్తిళ్లకు ఈతరం దూరంగా ఉందంటున్నారు నిపుణులు. పైగా, శారీరక ఆరోగ్యానికి సంబంధించిన ప్రశ్నలు వచ్చినప్పుడు... పాత తరం వాళ్లు సమస్య వచ్చినప్పుడే పరిష్కారం కోసం వెతుకుతున్నాం, ఫిటెనెస్ అంశాల్ని దినచర్యలో భాగం చేసుకుంటున్నాం అని చెబితే.. 'టీనేజీ నుంచే ఆరోగ్యంపై దృష్టి పెడుతున్నాం. ఫిటెనెస్‌కే మా డైలీలో ప్రధాన స్థానం. యోగా, ధ్యానం, శారీరక వ్యాయామాలు చేయడంతోనే రోజు మొదలవుతుంది' అని జెన్ జీలు జవాబిచ్చారట.



బంగారం - వెండి

4న ముగింపు

	బంగారం (24క్యా)	ఆర్నమెంట్ (22క్యా)	వెండి (కిలో)
హైదరాబాద్	1,53,160	1,37,750	2,50,194
విజయవాడ	1,49,225	1,38,350	2,56,700
ప్రొద్దుటూరు	1,51,500	1,39,380	2,48,000
రాజమహేంద్రవరం	1,49,620	1,37,150	2,70,000
విశాఖపట్నం	1,49,000	1,37,150	2,50,000
తమిళనాడు	-----	1,40,000	2,70,000

కాళ్లతోనే పరీక్ష రాసి..!





పదిహేనేళ్ల వయసు పిల్లలంటే... ఆడుతూ పాడుతూ అల్లరి చేస్తూ బాల్యాన్ని సంతోషంగా గడుపుతుంటారు అనుకుంటాం కదా! కానీ లక్ష్మీ ఖేముడు జీవితం వీటన్నింటికీ విరుద్ధం. ఆమె వైకల్యమే దీనికి కారణం. చదువే తన జీవితాన్ని మార్చగలదన్న అమ్మానాన్న, ఉపాధ్యాయుల మాటల్ని నమ్మింది. పది పరీక్షలు పాసవ్వాలని మొక్కవోని దీక్షతో ప్రయత్నించింది. సఫలీకృతమైంది కూడా...

ఒడిశాలోని మల్కాన్‌గిరి లక్ష్మీది. నాన్న నారాయణ్, అమ్మ సుభద్ర రోజు కూలీలు. లక్ష్మికి పుట్టుకతోనే శరీరంలో చాలా భాగాలు లేవు. నిలబడలేదు, కూర్చోలేదు. తన పనులు చేసుకోవడానికీ ఎవరో ఒకరి మీద ఆధారపడాల్సిందే. 'ఇలాంటి బిడ్డను పెంచడం అవసరమా ఎక్కడైనా వదిలేయండి. మీకే పూట గడవడం కష్టం. ఈమెను ఎక్కడ సాకుతారు' అని చాలామంది సలహాలు ఇచ్చారట. ఎవరేమన్నా, ఆర్థిక కష్టాలు వెంటాడుతున్నా.. . బిడ్డను పెంచి పెద్ద చేయాలని నిర్ణయించుకున్నారు ఈమె తల్లిదండ్రులు. తోటిపిల్లలు, చెల్లి, తమ్ముడు ఆడుకుంటుంటే వీల్ ఛైర్‌లోనే ఉండేదట లక్ష్మి. 'నేనెందుకు అందరిలా లేను. నేనూ ఆడుకుంటా' అని ఏడ్చేదట. 'వయసు పెరుగుతున్న కొద్దీ దివ్యాంగురాలినన్న విషయం పాపకు అర్థమైంది. 'అందరూ నన్ను జాలిగా, నిస్సహాయురాలిగా చూడకూడదంటే ఏం చేయాలి' అని అడిగేది. చదువుకుని నీ కాళ్ల మీద నువ్వు నిలబడితే ఏ సమస్యా ఉండదని చెప్పేవాళ్లం' అంటారు లక్ష్మీ తల్లి. ఈ మాటలు ఆ పసి హృదయాన్ని ఎంతగా ప్రభావితం చేశాయంటే... చేతులు లేకపోయినా చదువు విషయంలో వెనకడుగు వేయలేదు. చిన్నప్పట్నుంచీ కాళ్లతో రాయడం నేర్చుకుంది. చదువుకోవాలన్న తన కోరిక, కుతూహలం చూసి ఉపాధ్యాయులు మరింత ప్రత్యేక శ్రద్ధ చూపించేవారట. 'లక్ష్మీ చాలా చురుకైన విద్యార్థిని, ఏకసంథాగ్రాహి. ఏదైనా పని పట్టుకుందంటే అది పూర్తయ్యే వరకూ వదలదు' అని చెబుతారు ఆమె టీచర్లు. ఆ పట్టుదలతోనే ఇటీవల పది పరీక్షలకూ హాజరైంది. ఉత్తీర్ణత కూడా సాధించింది. 'నేను విజయం సాధించడానికి కారణం అమ్మానాన్నలు, ఉపాధ్యాయులు నా మీద పెట్టుకున్న నమ్మకమే. ఇంకా చదువుకోవాలి. టీచర్ కావాలన్నదే నా లక్ష్యం. ఉపాధ్యాయురాలినై నాలాంటి మరింత మందికి విద్యను చేరువ చేయాలన్నదే నా ఆశ' అనే లక్ష్మీ కల నెరవేరాలని కోరుకుందామా!

ఈటీవీ భారత్

ఆహ్వానం

వసుంధర పేజీపై మీ అభిప్రాయాలు, సలహాలు, నిపుణులకు ప్రశ్నలు... ఇలా మాతో ఏది పంచుకోవాలన్నా 9154091911కు వాట్సాప్ ద్వారా పంపవచ్చు.



మనసు దోచేస్తున్న బుగాడి...

అమ్మాయిల అందాన్ని రెట్టింపు చేసే వాటిలో చెవి అలంకరణది ప్రత్యేక స్థానం. మహారాష్ట్ర, కర్ణాటక, తెలంగాణ ప్రాంతాల సంస్కృతిలో భాగమైన 'బుగాడి' నేడు గ్లోబల్ ఫ్యాషన్ వేదికలపై 'ఇయర్ కఫ్' అవతారమెత్తి మెరిసిపోతోంది. కాలం మారుతున్నా తన ప్రాభవాన్ని కోల్పోకుండా, ఆధునిక హంగులతో యువతను మంత్రముగ్ధులను చేస్తోంది. ఒకప్పుడు కేవలం సంప్రదాయ వేడుకలకే పరిమితమైన ఈ బుగాడి, ఇప్పుడు ఇయర్ కఫ్స్ డిజైన్‌తో సందడి చేస్తోంది. బుగాడి ప్రత్యేకత ఏమిటంటే, దీన్ని చెవి పైభాగంలో ధరిస్తారు. పూర్వం దీనికోసం ప్రత్యేకంగా రంధ్రం చేయించుకోవాల్సి వచ్చేది. కానీ నేటి 'క్లిప్-ఆన్' డిజైన్లు ఎటువంటి నొప్పి లేకుండా సులభంగా పెట్టుకునే వీలును కల్పిస్తూ యువతను మెప్పిస్తున్నాయి. ముఖ్యంగా ముత్యాలు పొదిగిన బుగాడీలు రాజసానికి ప్రతీకగా నిలిస్తే, మెరిసే డైమండ్స్, మినిమలిస్ట్ మెటాలిక్ కఫ్స్ ఆధునిక ఫ్యాషన్ ప్రియులను మంత్రముగ్ధులను చేస్తున్నాయి. పట్టుచీరలు, లెహంగాల మీదకు గోల్డ్ బుగాడీలు రాజసాన్ని ఇస్తే, కుర్తీలు, వెస్టర్న్ దుస్తులపైకి స్టైలిష్ ఇయర్ కఫ్స్ ఎంతో ట్రెండీగా కనిపిస్తాయి. సంప్రదాయ మూలాలను వీడకుండానే ఫ్యూచరిస్టిక్ ఫ్యాషన్‌ను అందిపుచ్చుకోవాలనుకునే ప్రతి అమ్మాయికి ఇది చక్కని ఎంపిక. చూస్తే కాదనగలరా చెప్పండి!

నగా నట్రా

ఆస్తిలో చిల్లిగవ్వ ఇవ్వడట!

విభేదాల వల్ల నా భర్తని విడాకులు అడిగా. ఆయనకది ఇష్టం లేదు. దీంతో పిల్లలు తనతోనే ఉంటారనీ, ఆస్తిలో చిల్లిగవ్వ ఇవ్వననీ బెదిరిస్తున్నాడు. పెళ్లి సమయంలో మా నాన్న ఇచ్చిన స్థలం మావారి పేరిట రిజిస్ట్రేషన్ అయ్యింది. ఇప్పుడు నేను దాన్ని తిరిగి పొందగలనా? నాకెలాంటి రక్షణ లభిస్తుంది? – ఓ సోదరి

డియర్ వసుంధర



జి. వరలక్ష్మి
న్యాయవాది

మీ వారికి విడాకులు ఇవ్వడం ఇష్టం లేనప్పుడు మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కారం జరగలేదా? పిల్లల వయసెంత? వాళ్లను పోషించే బాధ్యత ఇద్దరి మీదా ఉంటుంది. మీ ఆర్థిక స్తోమత ఏంటి? వాళ్లపై మీవారికీ సమాన హక్కు ఉంటుంది. తల్లీ తండ్రీ ఇద్దరు పిల్లలకి నేచురల్ గార్డియన్స్. కస్టడీ ఎవరి దగ్గర ఉండాలనేది కేసు పూర్వాపరాలను ఆలోచించాక కోర్టు నిర్ణయిస్తుంది. హిందూ మైనారిటీ అండ్ గార్డియన్‌షిప్ యాక్ట్ ఐదేళ్లలోపు పిల్లలు తల్లి దగ్గరే ఉండాలని చెబుతోంది. ఒకవేళ హిందూ మతం నుంచి మారినా, పిల్లల క్షేమం దృష్ట్యా తల్లిగానీ తండ్రిగానీ కస్టడీకి అర్హులు కారని కోర్టు నిర్ణయించినప్పుడు ఇద్దరిలో మరొకరికి గార్డియన్‌గా సంపూర్ణ హక్కులు లభిస్తాయి. ముందు మీరు కోర్టులో మీ భర్త గార్డియన్‌గా ఎందుకు ఉండకూడదో చెబుతూ అతడి అలవాట్లు అంటే తాగుడు, పరాయి స్త్రీలతో సంబంధాలు, మానసిక సమస్యలు లాంటివి కోర్టుకి నిరూపించగలగాలి. అలా చేయలేకపోతే ఆయనకు విజిటింగ్ రైట్స్ ఇస్తారు. అంటే వారానికో నెలకో ఓసారి పిల్లలను తీసుకెళ్లే హక్కులు ఇస్తారు. అదే సమయంలో మీ ఆర్థిక స్తోమత కూడా నిరూపించగలగాలి. లేదా పిల్లల సంరక్షణ కోసం గృహహింస చట్టం కానీ హిందూ అడాప్షన్ అండ్ మెయింటెనెన్స్ యాక్ట్‌లోని సెక్షన్-20 ప్రకారం వాళ్లకు మైనార్టీ తీరేదాకా ఆడపిల్ల తనని తాను పోషించుకోలేని స్థితిలో ఉంటే పెళ్లయ్యేదాకా పోషణ ఖర్చులు తండ్రి నుంచి పొందవచ్చు. మీ భర్త పేరుమీద మీ తండ్రి చేసిన రిజిస్ట్రేషన్ నిరూపించగలిగితే క్యాన్సిలేషన్ కోసం దావా వేయవచ్చు. ఆస్తి నుంచి మీకు, మీ పిల్లలకు జీవన భత్యం కూడా పొందవచ్చు. కోర్టులో ఇంజక్షన్ దావా వేసి ఆస్తిని అమ్మనీయకుండా చేయండి.



ఇవి తినొద్దు!

అబ్బా... ఎండ ఎంత ఉక్కిరిబిక్కిరి చేస్తోంది! అందుకే చల్లదనం కోసం ఎన్నెన్ని ప్రయత్నాలు చేస్తుంటామో! అలాగని కూలర్లు, ఏసీల ముందు కూర్చుంటే సరిపోదు. తినే ఆహారాన్నీ గమనించుకోవాలి. ఎందుకంటే కొన్ని పదార్థాలు శరీరంలో ఉష్ణోగ్రతల్ని పెంచేస్తాయి మరి.

- సెలవులు, పైగా వేడికి అడుగు బయట పెట్టాలనిపించదు. ఇంకేం మనసు స్నాక్స్ మీదకి మళ్లడం ఖాయం. అలాగని ఫ్రైడ్ చికెన్, సమోసా, పకోడి, ఫ్రెంచ్ ఫ్రైస్ వంటివి తినకండి. ఇవి పొట్టను బరువెక్కించేస్తాయి. త్వరగా అరగవు కూడా. ఇంకా శరీరంలో ఉష్ణోగ్రతల్నీ పెంచేస్తాయి. అందుకే తేలికపాటి ఆహారాలకే ప్రాధాన్యమివ్వండి.
- ఈకాలం పచ్చళ్లు, కారప్పొడులంటూ పట్టేస్తుంటాం. వాటిని చూస్తేనేమో నోరూరుతుంది. అలాగని కారాలు, మసాలా వంటకాలనీ తినకూడదు. ఇవి చెమట ఎక్కువ పోసేలా చేయడమే కాదు, శరీరాన్ని డీహైడ్రేట్ చేస్తాయి. ఎసిడిటీ, అజీర్తి అదనం. కాబట్టి, కారం, మసాలాలకూ దూరంగా ఉండాల్సిందే. అలాగే ఎక్కువ నూనెలు, క్రీములు వేసి చేసే కూరలకీ దూరంగా ఉండాలి.
- టీ, కాఫీ... ఏ కాలమైనా కొందరికి ఇవి లేనిదే రోజు గడవదు. కానీ పరిమితంగా తీసుకోండి. ఎందుకంటే ఇవీ శరీరాన్ని డీహైడ్రేట్ చేసేవే. కొబ్బరినీళ్లు, నిమ్మకాయ నీళ్లు, తాజా పండ్ల రసాలు, మజ్జిగ వంటివాటిని ప్రత్యామ్నాయాలుగా తీసుకుంటే ఇంకా మంచిది.
- వేసవిలో మామూలుగానే అలసటగా అనిపిస్తుంది. తక్షణ శక్తికోసం తీపి పదార్థాలపైనా ఆధారపడుతుంటాం. కానీ అదీ మంచిది కాదు. అప్పటికప్పుడు శక్తినిచ్చినా డీహైడ్రేషన్‌కి గురిచేసి తిరిగి త్వరగా అలసిపోయేలా చేయగలవు. ఒంట్లో వేడినీ పెంచగలవు. అంతగా తినాలనిపిస్తే నారింజ, పుచ్చ వంటి పండ్లను తినడం మేలు.

అసహనం వద్దు...

భార్యాభర్తల మధ్య అనుబంధం అనేది రెండు విభిన్న మనస్తత్వాల కలయిక. ఇద్దరి మధ్య ప్రేమే కాదు... చిన్నపాటి విభేదాలు ఉంటుంటాయి. ఎన్నున్నా... అవతలి వ్యక్తి ఆలోచనలను, అభిప్రాయాలను తక్కువ చేసి చూడటం మొదలుపెడితే మాత్రం మీ బంధంలో చీలికలు రావొచ్చు. అలాకాకూడదంటే...

- 'నేను నీకంటే ఎక్కువ సంపాదిస్తున్నాను', 'నాకు లోకజ్ఞానం ఎక్కువ'... అనే భావనతో భాగస్వామిని చిన్నచూపు చూస్తుంటారు కొందరు. ఇలాంటప్పుడు ఎదుటివారు చెప్పేది ఎంత ముఖ్యమైనదైనా, అది వినడానికి మనసు అంగీకరించదు. ఒక బంధం బలంగా ఉండాలంటే, ఆధిపత్యం చూపించడం కాదు... అనురాగం ముఖ్యం. ఒకరి విషయాల్లో మరొకరు అనవసరంగా జోక్యం చేసుకోకూడదు అనే ఉద్దేశంతోనో, ఎదుటివారికి అవగాహన లేదన్న భ్రమతోనో 'నీకేం తెలియదు' అంటుంటారు కొందరు. అయితే, ఇది తరచూ సాగుతుంటే... భాగస్వామి ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తుంది.
- ఒక సమస్య వచ్చినప్పుడు లేదా ఏదైనా నిర్ణయం తీసుకోవాల్సి వచ్చినప్పుడు... నేను చూసుకుంటాను అని చెప్పడం కంటే, దీని గురించి నీ అభిప్రాయం ఏంటి? అని అడగడం ఎంతో మేలు. దీనివల్ల భాగస్వామికి తాము కూడా ఈ బంధంలో ఒక ముఖ్యమైన భాగమనే నమ్మకం కలుగుతుంది. ఒకవేళ వారికి ఆ విషయంపై అవగాహన లేకపోతే, విసుక్కోకుండా సున్నితంగా వివరించాలి.
- అనుబంధం అంటే కేవలం అవసరాలు తీర్చుకోవడం కాదు, ఒకరి భావాలను మరొకరు పంచుకోవడం. ఒక వ్యక్తికి తెలిసిన విద్య మరొకరికి తెలియకపోవచ్చు. అంతమాత్రాన వారిని తక్కువ అంచనా వేయకూడదు. ఇంట్లో పనులైనా, ఆర్థిక నిర్ణయాలైనా ఇద్దరూ కలిసి చర్చించుకున్నప్పుడే ఆ ఇల్లు స్వర్గంలా మారుతుంది.
- భాగస్వామి ఏదైనా తప్పు చేసినప్పుడు అందరి ముందూ లేదా కఠినంగా విమర్శించకండి. బదులుగా వారు చేసే చిన్న పనులను కూడా అభినందించడం వల్ల వారిలో ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. ప్రతి విషయంలోనూ మీదే పైచేయి కావాలని అనుకోకండి. ఒక్కోసారి వెనక్కి తగ్గడం వల్ల బంధం మరింత బలపడుతుంది. ఏ బంధమైనా నిలబడాలంటే ఒకరిపై ఒకరికి నమ్మకం, గౌరవం ఉండాలి... అప్పుడే వైవాహిక జీవితం సంతోషంగా సాగుతుంది.



ప్లకార్డులతో సంతోషం

ఓ చిన్న చిరునవ్వుతో అవతలి వారి 'డే'ను మెరుగ్గా మార్చవచ్చు తెలుసా! అందుకే ఎప్పుడూ నవ్వుతూ ఉండాలని చెబుతుంటారు పెద్దలు. ఆ నవ్వులు విరబూసేలా, మన చుట్టూ సంతోషాన్ని వెదజల్లుదామా? దీనికి ప్లకార్డుల సాయం తీసుకుందాం.

ఇందుకోసం పాత కార్డ్ బోర్డు ముక్కలు లేదా డ్రాయింగ్ షీట్స్, కలర్ పెన్సిల్స్, స్కెచ్ పెన్నులు, చిన్న కర్రలు, గమ్ తీసుకోండి.

★ కార్డ్ బోర్డ్, డ్రాయింగ్ కాగితాలపై.. 'సంతోషంగా ఉండండి, నీటిని ఆదా చేయండి, ఎప్పుడూ నవ్వడం మర్చిపోవద్దు, చెట్లను కాపాడుదాం, శుభ్రత పాటించండి, మూగజీవాలకు సాయం చేద్దాం, దయతో మెలగండి..' ఇలాంటి మంచి మాటలను మరిన్ని ఆలోచించి రాయండి.



తర్వాత ఆ షీట్స్‌ను కర్రలకు అంటించి ప్లకార్డుల్లా తయారు చేయండి. వాటిని మీ అపార్ట్‌మెంట్, వీధి, రోడ్డు, ఇంటి బయట. . ఇలా అందరికీ కనిపించేలా పెట్టండి. ఆ మంచి మాటలు చూసిన వారిలో స్ఫూర్తి నింపడమే కాదు, చిరనవ్వునూ తెప్పిస్తాయి!



లెక్కపెట్టగలరా..

నేనొక అంకెను. నన్ను 2తో గుణించి, 5 కలిపితే 15 వస్తుంది. నేనెవరిని?

ఒక బస్సు హైదరాబాద్ నుంచి వరంగల్‌కు ఉదయం 10:30 గంటలకు బయలుదేరి, మధ్యాహ్నం 1:45 గంటలకు చేరుకుంది. ప్రయాణానికి పట్టిన సమయమెంత?

పొడుపు కథలు

1. పొట్టలో వేలు.. నెత్తి మీద రాయి ఏమిటో చెప్పగలరా?
2. తెలిసేటట్టు పూస్తుంది, తెలియకుండా కాస్తుంది.. డబ్బాలో నిధి. ఏమిటది?
3. ముగ్గురు అన్నదమ్ములకు ఒకటే టోపీ.. అదేంటి?





ఒప్పంద పత్రాలతో మంత్రి లోకేశ్, శ్రీసత్యసాయి సెంట్రల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్.జె.రత్నాకర్

మరో మూడేళ్లు విద్యార్థులకు రాగిజావ

శ్రీసత్యసాయి సేవా ట్రస్టుతో విద్యాశాఖ ఒప్పందం

ఈనాడు, అమరావతి: ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో శ్రీసత్యసాయి సేవా ట్రస్టు సహకారంతో ప్రస్తుతం అందిస్తున్న రాగిజావ పంపిణీని మరో మూడేళ్లు కొనసాగించేందుకు విద్యాశాఖ ఒప్పందం కుదుర్చుకుంది. సోమవారం ఉండవల్లి క్యాంపు కార్యాలయంలో మంత్రి లోకేశ్ సమక్షంలో ట్రస్టుతో 2026-29 కాలానికి ఈ ఒప్పందం కుదిరింది. ప్రస్తుతం జోనల్ వారీగా మధ్యాహ్న భోజనం మెనూలను అమలు చేస్తుండగా.. రాగిజావను వారానికి మూడు రోజులు అందిస్తున్నారు. ఒప్పందం ప్రకారం.. ఈ జావకు కావాల్సిన రాగిపిండి, బెల్లంపొడిని శ్రీసత్యసాయి ట్రస్టు ఉచితంగా అందిస్తుంది. ఇందుకు మూడేళ్లలో రూ.80 కోట్ల వరకు వెచ్చించనున్నారు. కార్యక్రమంలో శ్రీసత్యసాయి సెంట్రల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్.జె.రత్నాకర్, ట్రస్టు అడ్మిన్ కోఆర్డినేటర్ ఎస్.జి.చలం, శ్రీసత్యసాయి సేవా సంస్థ ఏపీ విభాగం అధ్యక్షులు ఆర్.లక్ష్మణరావు, మధ్యాహ్న భోజన పథకం డైరెక్టర్ బి.శ్రీనివాసరావు, అదనపు డైరెక్టర్ గంగా భవాని పాల్గొన్నారు.



శీతలీకరించిన బ్లూబెర్రీలతో మరిన్ని ప్రయోజనాలు

బ్లూ బెర్రీలు పోషకాల గనులు. వీటిని శీతలీకరిస్తే వాటిలోని యాంటీ ఆక్సిడెంట్లు, పాలీఫెనాల్స్ మన శరీరానికి బాగా అందుతాయి. శీతలీకరణ వల్ల మొక్కల, వాటి ఉత్పత్తుల కణజాల నిర్మాణం విచ్ఛిన్నం అవుతుంది. ఈ ప్రక్రియ కారణంగా బ్లూబెర్రీల్లోని యాంటీ ఆక్సిడెంట్లను మన శరీరం సులభంగా శోషించుకుంటుంది.

– లోరీ షెమెక్, ఆరోగ్య నిపుణురాలు

ఒక్కరోజు కస్టడీకి వైకాపా ఎమ్మెల్సీ అనంతబాబు

- హత్య కేసు సాక్షుల బెదిరింపు కేసులో విచారణకు కోర్టు అనుమతి

ఈనాడు, కాకినాడ: దళిత యువకుడు వీధి సుబ్రహ్మణ్యం హత్య కేసు సాక్షులను బెదిరించిన కేసులో రిమాండ్‌లో ఉన్న వైకాపా ఎమ్మెల్సీ అనంతబాబును విచారించేందుకు కోర్టు అనుమతించింది. మూడు రోజుల కస్టడీ కోరుతూ కాకినాడ ప్రత్యేక మొబైల్ కోర్టులో పోలీసులు శుక్రవారం పిటిషన్ వేయగా మేజిస్ట్రేట్ శనివారం ఇరువర్గాల వాదనలు విన్నారు. ఎమ్మెల్సీని ఒక్కరోజు కస్టడీకి అనుమతిస్తున్నట్లు సోమవారం ప్రకటించారు. మంగళవారం మధ్యాహ్నం 12 నుంచి బుధవారం మధ్యాహ్నం 12 గంటల వరకు విచారించి, అనంతరం కోర్టులో హాజరుపరచాలని ఆదేశించారు. దీంతో అనంతబాబును మంగళవారం రాజమహేంద్రవరం కేంద్ర కారాగారం నుంచి కాకినాడలోని సర్పవరం పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చి విచారించనున్నారు.

తొలుత ఏ4ను అరెస్టు చేసి..

డ్రైవర్ హత్య కేసులో కీలక సాక్షులను అనంతబాబు అనుచరులు గత నెల 20న కాకినాడలోని ఓ అపార్ట్‌మెంట్‌కు తీసుకువెళ్లి బెదిరించి తలో రూ.లక్ష చొప్పున నగదు ఇచ్చి, అనుకూలంగా సాక్ష్యం చెప్పాలని ప్రలోభపెట్టారు. పోలీసులు దీనిపై విచారణ చేపట్టి తొలుత ఏ4 మాగంటి రాంబాబును అరెస్టు చేశారు. అతణ్ని విచారించాక ఏ1గా ఎమ్మెల్సీ అనంతబాబు, ఏ2, ఏ3, ఏ5గా కడియాల చిన్నబాబు, సతీశ్‌కుమార్, అడ్వకేట్ చెక్కపల్లి శ్రీనివాస్‌లను చేర్చారు. అనంతబాబును అరెస్టు చేయడానికి ప్రయత్నించగా పరారయ్యారు. గత నెల 24న రాజమహేంద్రవరం కోర్టుకు వచ్చినప్పుడు ఆయన్ను అదుపులోకి తీసుకుని విచారించారు. అయితే ఏ ప్రశ్నకూ ఆయన సరైన సమాధానాలివ్వలేదు. 25న కాకినాడ కోర్టులో హాజరుపర్చగా 14 రోజుల రిమాండ్ విధించారు. కస్టడీ కోసం నాలుగుసార్లు పిటిషన్ వేయగా చివరికి ఒక్కరోజు కస్టడీకి అనుమతించారు.

నలుగురికి ఎర వేసి..

హత్య కేసులో 48 మంది సాక్షులున్నారు. అనంతబాబు, ఆయన మనుషులు తొలుత వీరిలో నలుగురికి రూ.లక్ష చొప్పున డబ్బు ఎరవేశారు. తర్వాత క్రమంలో మిగతావారిని దారికి తెచ్చుకోవాలనుకున్నారు. కొందరు సాక్షులను వీడియోకాల్‌లో బెదిరించారు. వీటన్నింటిపై అనంతబాబును విచారించడానికి మూడు రోజులు సమయం కోరగా ఒక్కరోజే అనుమతి వచ్చింది. విచారణలో సహకరించకపోతే మరోసారి పిటిషన్ వేస్తామని పోలీసులంటున్నారు. సాక్షుల భద్రతపైనా నిఘా పెట్టారు. సుబ్రహ్మణ్యం తల్లిదండ్రుల ఇంటి వద్ద సీసీ కెమెరాలు పెట్టి ఎవరెవరు ఆ ప్రాంతానికి వెళ్తున్నదీ గమనిస్తున్నారు.

ఆగిన లారీని ఢీకొట్టిన అంబులెన్స్

- రోగి సహా నలుగురి మృతి
- మరో ఇద్దరి పరిస్థితి విషమం
- బెంగాల్ నుంచి బెంగళూరు వస్తుండగా తిరుపతి జిల్లాలో ప్రమాదం



ఘటనాస్థలంలో లారీ, అంబులెన్స్‌ను పరిశీలిస్తున్న పోలీసులు

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి సమీపంలో రేణిగుంట-నాయుడుపేట జాతీయ రహదారిపై ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. చికిత్స నిమిత్తం రోగి, అతని బంధువులతో వెళ్తున్న అంబులెన్స్ సోమవారం వేకువజామున 3.45 గంటల సమయంలో ఊరందూరు సమీపంలో రోడ్డు పక్కన ఆగి ఉన్న లారీని ఢీ కొట్టడంతో నలుగురు మృతిచెందారు. మృతుల్లో ముగ్గురు ఒకే కుటుంబానికి చెందినవారు కాగా, మరొకరు అంబులెన్స్ డ్రైవర్. శ్రీకాళహస్తి గ్రామీణ పోలీసుల కథనం మేరకు.. పశ్చిమ బెంగాల్‌లోని హుగ్లీ పట్టణానికి చెందిన బజ్రా డొలై (48) ఆస్తమాతో బాధపడుతున్నాడు. బెంగళూరులోని ఓ ఆస్పత్రిలో చౌకగా చికిత్స లభిస్తుందని తెలుసుకుని, ఈ నెల 2న అంబులెన్స్‌లో అక్కడి నుంచి బయల్దేరారు. బజ్రాతో పాటు అతని భార్య రాకూరీ డోలై (39), సోదరుడు జతిన్ డోలై (63), బంధువు గీతా చక్రవర్తి అలియాస్ తగోడి అంబులెన్స్‌లో ఉన్నారు. రోజుల తరబడి ప్రయాణం కావడంతో అంబులెన్స్ డ్రైవర్ రితేశ్ పండిట్(24) సహాయ డ్రైవర్‌గా తన సోదరుడు రాకేశ్ పండిట్ (29)ను వెంట రమ్మన్నాడు. ప్రమాద సమయంలో అంబులెన్స్ నడుపుతున్న రాకేశ్.. నిద్రమత్తులో ఆగి ఉన్న లారీని గమనించకపోవడం వల్ల వెనుక నుంచి ఢీకొన్నట్లు పోలీసులు అంచనా వేశారు. ఈ దుర్ఘటనలో బజ్రా డోలై, రాకూరీ, జతిన్, రితేశ్ అక్కడికక్కడే మృతిచెందారు. రాకేశ్, గీతా చక్రవర్తిలకు తీవ్ర గాయాలయ్యాయి. వీరిని చికిత్స నిమిత్తం శ్రీకాళహస్తిలోని ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. డీఎస్పీ నరసింహమూర్తి ఘటనా స్థలికి వచ్చి పరిశీలించారు. మృతదేహాలను శ్రీకాళహస్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అమరావతిలో యోగా దినోత్సవ కార్యక్రమం

ఏర్పాట్లపై మంత్రి సత్యకుమార్ సమీక్ష

ఈనాడు, అమరావతి: గతేడాది నిర్వహించిన కార్యక్రమాలకు కొనసాగింపుగా ఈ ఏడాది యోగా దినోత్సవ కార్యక్రమాలు ఉండాలని వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ సూచించారు. అమరావతిలో సీఎం చంద్రబాబు అధ్యక్షతన రాష్ట్రస్థాయిలో యోగా దినోత్సవ కార్యక్రమం నిర్వహణకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ఏర్పాట్లపై మంత్రి విజయవాడలోని ఆయుష్ ప్రధాన కార్యాలయంలో సోమవారం సమీక్ష నిర్వహించారు. 'యోగాసనాల ప్రాధాన్యాన్ని ప్రజలకు వివరించేందుకు కార్యక్రమాల్లో విద్యార్థులు, ఉద్యోగులు, రోటరీ, లయన్స్ క్లబ్‌లు, ఇతర సేవా సంస్థలను భాగస్వాములను చేయాలి. జిల్లా కేంద్రాల్లో కలెక్టర్ల ఆధ్వర్యంలో, మండల స్థాయిలో అధికారుల పర్యవేక్షణలో కార్యక్రమాలు నిర్వహించాలి. రాష్ట్రంలోని యోగా శిక్షకులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి సూచనలు తీసుకోవాలి' అని మంత్రి తెలిపారు. ప్రభుత్వ ప్రకృతి వైద్య సలహాదారు మంతెన సత్యనారాయణ రాజు మాట్లాడుతూ.. యోగాసనాలు, అవగాహన కార్యక్రమాలతో ప్రజల్లో చైతన్యం తేవాలని సూచించారు.



హైదరాబాద్ హజ్ క్యాంప్ వద్ద యాత్రికుల వాహనాలను జెండా ఊపి ప్రారంభిస్తున్న మంత్రి ఎన్ఎండీ ఫరూక్, ప్రభుత్వ సలహాదారు ఎం.ఎ. షరీఫ్ తదితరులు

హజ్‌కు 185 మంది యాత్రికులు

- హైదరాబాద్ నుంచి ప్రయాణం

ఈనాడు, అమరావతి: రాష్ట్రానికి చెందిన 185 మంది యాత్రికులు హైదరాబాద్‌లోని శంషాబాద్ విమానాశ్రయం నుంచి సోమవారం హజ్‌కు బయలుదేరి వెళ్లారు. హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన విడిది కేంద్రంలో రాష్ట్ర మైనారిటీ సంక్షేమశాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్, మైనారిటీ వ్యవహారాల సలహాదారు షరీఫ్, హజ్ కమిటీ ఛైర్మన్ హసన్‌బాష, మైనారిటీ సంక్షేమశాఖ కార్యదర్శి శ్రీధర్.. ఆదివారం రాత్రి జెండా ఊపి యాత్రను ప్రారంభించారు. రాష్ట్రానికి చెందిన 1,202 మంది శంషాబాద్ ఎంబార్కేషన్ పాయింట్ నుంచి ఈ నెల 21 వరకు దశల వారీగా హజ్‌కు వెళ్లనున్నారు. విడిది కేంద్రంలో కూటమి ప్రభుత్వం అన్ని ఏర్పాట్లనూ చేసినట్లు మంత్రి కార్యాలయం ఓ ప్రకటనలో తెలిపింది.



ప్రజాప్రతినిధుల సిఫారసు లేఖలు చూపుతున్న భక్తులు

తిరుమలలో సిఫారసు కష్టాలు

- ప్రజాప్రతినిధుల లేఖలు తీసుకోని తితిదే
- భక్తుల ఆందోళనతో రూ.300 టికెట్ల జారీ

తిరుమల, న్యూస్‌టుడే: రద్దీ నేపథ్యంలో.. ప్రజాప్రతినిధుల సిఫారసు లేఖలు స్వీకరించబోమని తితిదే అదనపు ఈవో కార్యాలయం ప్రకటించడంతో భక్తులు ఆందోళనకు దిగిన ఘటన సోమవారం చోటుచేసుకుంది. ఐఏఎస్, ఐపీఎస్ అధికారుల లేఖలను మే 1 నుంచే తీసుకోవడం లేదు. ప్రజాప్రతినిధుల సిఫారసు లేఖలను మాత్రం 3వ తేదీ వరకూ స్వీకరించారు. సోమవారం వచ్చిన భక్తుల నుంచి సిఫారసు లేఖలను తీసుకోలేదు. ముందస్తు సమాచారం ఇవ్వకుండా ఇలా చేయడం భావ్యంకాదని, ఇంతదూరం వచ్చాక దర్శనాలను నిరాకరించడం తగదంటూ పలువురు భక్తులు వాపోయారు. సమాచారం అందుకున్న తితిదే ఉన్నతాధికారులు దిద్దుబాటు చర్యలు చేపట్టారు. వీఐపీ బ్రేక్ స్థానంలో ప్రజాప్రతినిధుల సిఫారసు లేఖలపై రూ.300 దర్శనాలు కల్పించడంతో పరిస్థితి సద్దుమణిగింది.

తితిదేకు అజ్ఞాత భక్తుడి రూ.కోటి విరాళం

తిరుపతి (తితిదే), న్యూస్‌టుడే: శ్రీవారి సేవలో భాగంగా ఎస్వీ అన్నప్రసాదం ట్రస్టుకు హైదరాబాద్‌కు చెందిన ఓ అజ్ఞాత భక్తుడు రూ.1,00,10,116 విరాళం సమర్పించారు. సోమవారం తిరుపతిలోని తితిదే పరిపాలనా భవనంలో ఈవో ఎం.రవిచంద్రను కలిసి విరాళం డీడీని సమర్పించారు. భక్తుడి దాతృత్వాన్ని ఈవో అభినందించారు.

డెడికేటెడ్ కమిషన్‌కు వినతుల సమర్పణ గడువు పొడిగింపు

ఈనాడు, అమరావతి: స్థానిక సంస్థల్లో బీసీల రిజర్వేషన్ శాతాన్ని అధ్యయనం చేయడానికి ఉద్దేశించిన డెడికేటెడ్ కమిషన్‌కు వినతుల సమర్పణ గడువును మే 15 వరకు పొడిగించినట్లు కమిషన్ కార్యదర్శి చంద్రశేఖర్‌రాజు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. బీసీ సంఘాలు, ప్రజాప్రతినిధులు, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వినతుల్ని apbcdedicatedcommission2026@gmail.com మెయిల్ ద్వారా గానీ, విజయవాడలోని గిరిజన సంక్షేమ డైరెక్టరేట్‌లోని డెడికేటెడ్ కమిషన్ కార్యాలయంలో నేరుగా లేదా పోస్టు ద్వారా సమర్పించొచ్చని తెలిపారు.

పాలిసెట్ ఫలితాలు నేడు

ఈనాడు, అమరావతి: పాలిటెక్నిక్‌లో ప్రవేశాల కోసం నిర్వహించిన పాలిసెట్-2026 ఫలితాలు మంగళవారం విడుదల కానున్నాయి. ఉదయం 10 గంటలకు మంత్రి లోకేశ్ ఎక్స్ వేదికగా ఫలితాలు విడుదల చేస్తారు. పాలిసెట్‌కు మొత్తం 1,77,581 మంది దరఖాస్తు చేయగా.. 1,63,008 మంది పరీక్ష రాశారు. ఫలితాలను www.eenadu.net , polycetap.ap.gov.in, మన మిత్ర వాట్సప్ నంబరు 95523 00009 ద్వారా పొందొచ్చు.

కృష్ణపట్నం పోర్టు నుంచి.. పెట్రోలియం దిగుమతులకు గడువు పెంపు

ఈనాడు, దిల్లీ: అదానీ కృష్ణపట్నం పోర్టు నుంచి పెట్రోలియం దిగుమతులకు గడువును పెంచుతూ కేంద్ర పోర్టులు, నౌకాయాన శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఏడాది మార్చి 1తో ఆ గడువు ముగియగా.. ఇప్పుడు పెట్రోలియం ఎక్స్‌ప్లోజివ్స్ సేఫ్టీ ఆర్గనైజేషన్ (పీఈఎస్ఓ) నుంచి అనుమతులు ఉన్నంత వరకు దిగుమతులు చేసుకోవచ్చని పేర్కొంది.



Authorised Dealers: Vijayawada: Mahavir Auto: 83675 30004; **Vizag:** Mahavir Auto: 83676 30004; **Tirupati:** (Renigunta Road): PPS Motors: 79934 64666; (Thookivakam Village): PPS Motors: 79959 09992; **Hyderabad:** (L. B. Nagar): Mody India Cars: 77992 50000 / 95818 24365; (Attapur): Mody India Cars: 98859 15217; (Uppal): Mody India Cars: 77992 50000 / 95818 24365; (Raidurg): Mody India Cars: 95812 83456; (Jubilee Hills): Mahavir Auto: 83672 30004; (Somajiguda): Mahavir Auto: 83673 30004; (Bowenpally): Mahavir Auto: 95815 50004; (Sanath Nagar) Mahavir Auto: 96426 40005; (Kondapur): PPS Motors Pvt. Ltd.: 79934 64666; (Gachibowli): PPS Motors Pvt. Ltd.: 79934 64666; (Hyder Nagar): PPS Motors: 79934 64666; (AS Rao Nagar): PPS Motors Pvt. Ltd.: 79934 64666; (Bachupally): PPS Motors: 96424 33334; **Secunderabad:** (Bowenpally): Mahavir Auto: 83674 30004; (Brigadier Sayeed Road): Mahavir Auto: 83674 30004; **Nizamabad:** PPS Motors: 79934 64666 / 79939 69888; **Warangal:** Mahavir Auto: 90105 75959; **Karimnagar:** Mody India Cars: 77992 50000 / 98859 18412; **Nellore:** Mahavir Auto: 83670 30004; **Kurnool:** PPS Motors: 79934 64666; **Ananthpur:** PPS Motors: 79934 64666; **Rajmundhry:** Mahavir Auto: 79979 60437; **Guntur:** Mahavir Auto: 90109 70004

T&C Apply. #Ex-showroom price. The price listed is based on current prevailing rates and is subject to change without any prior notice. The Škoda Super Care programme is applicable to all new Škoda vehicles purchased on or after 1st January 2026. Each Škoda vehicle is covered by warranty for a period of 4 years or 100,000 km, whichever occurs earlier. The 4 free services scheduled at 1,000 km, 7,500 km, 15,000 km and 30,000 km are limited to free labour charges only; all costs pertaining to parts, consumables and lubricants shall be borne by the customer. Roadside Assistance is subject to Škoda Assist's standard coverage areas and service terms. Škoda reserves the right to alter the details of specifications and service offerings without any prior notice. Sub-4 metre ICE vehicles, as per the BNCAP Rating. Total benefits are applicable on select variants and models for a limited period and in limited quantities, and they differ from variant to variant. Scrappage benefit can be availed on select variants only against Certificate of Deposit. Check with your nearest dealership for more information. Selected variants available, stock subject to availability on CSD and GeM. Please refer to www.skoda-auto.co.in for more information. Images are for representation purposes only. Actual colour, features and specifications may vary. Above car picture is created with the help of computer graphics solely for the purpose of advertising. All disputes are subject to Mumbai court's jurisdiction only.

EENADU Vol: 31, Issue: 29 | Printed and Published by M Nageswara Rao on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Pvt. Ltd. Printed at Eenadu Press, Survey No. 393/1, Door No. 108-6, Potturu Village, Guntur Rural Mandal, Guntur District - 522 005, Andhra Pradesh and M/s. Kalajyothi Process Private Limited, Survey No. 94 B, C & D, Nidumukkala Village, Tadikonda Mandal, Guntur District - 522 016, Andhra Pradesh and Published at Eenadu Press, Survey No. 393/1, Door No. 108-6, Potturu Village, Guntur Rural Mandal, Guntur District - 522 005, Andhra Pradesh. Editor: M Nageswara Rao. RNI No. 63819/1996. Regd. No. GTR/21/2024-26, Phones: 0863-2512142. Mobile No. 9959021812. Air Surcharge. Mumbai, Kolkata, Goa. Re. 1.00, Portblair Rs. 10.00. | Founder Ramoji Rao

(c) eenadu

ఈనాడు సినిమా


రామ్‌చరణ్

‘ఆర్‌సీ 17’ సెట్స్‌పైకి అప్పుడే!

కథానాయకుడు రామ్‌చరణ్ ‘పెద్ది’ సినిమాని ఇప్పటికే పూర్తి చేశారు. ఇది జూన్ 4న ప్రేక్షకుల ముందుకు రానుంది. దీంతో ఇప్పుడు అందరి చూపు ఆయన తదుపరి చిత్రంపై పడింది. ‘ఆర్‌సీ17’ వర్కింగ్ టైటిల్‌తో సెట్స్‌పైకి వెళ్లనున్న ఆ సినిమాకి సుకుమార్ దర్శకత్వం వహించనున్న సంగతి తెలిసిందే. మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ నిర్మిస్తోంది. ఇప్పటికే ఈ చిత్ర స్క్రిప్ట్ పనులు ఓ కొలిక్కి వచ్చాయని.. సుకుమార్ దీనికి తుది మెరుగులు దిద్దడంలో తలమునకలై ఉన్నారని తెలిసింది. ఈ నేపథ్యంలోనే తాజాగా ఈ సినిమా చిత్రీకరణకు సంబంధించి ఓ ఆసక్తికర కబురు బయటకొచ్చింది. ఈ కొత్త చిత్రాన్ని జులైలో పట్టాలెక్కించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు మైత్రీకి చెందిన నిర్మాతల్లో ఒకరైన చెర్రీ వెల్లడించారు. ‘రంగస్థలం’ విజయం తర్వాత చరణ్ - సుక్కు కలయికలో రానున్న రెండో చిత్రం కావడంతో ఇప్పటికే ఈ ప్రాజెక్ట్‌పై ప్రేక్షకుల్లో భారీ అంచనాలేర్పడ్డాయి. దీనికి తగ్గట్లుగానే ఈసారి సుకుమార్ తనదైన శైలిలో మరో శక్తిమంతమైన మాస్ యాక్షన్ కథను సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది.

సినిమాని తలపించే విజయం

● విజయ్‌కు తెలుగు సినీతారల శుభాకాంక్షలు


విజయ్

తొలిసారి ఎన్నికల బరిలో దిగిన టీవీకే పార్టీ తమిళనాట ప్రభంజనం సృష్టించింది. అత్యధిక స్థానాల్ని కైవసం చేసుకున్న పార్టీగా అవతరించింది. దీంతో ఈ అసాధారణ విజయం పట్ల ఆ పార్టీ అధినేత, కథానాయకుడు విజయ్‌కు సామాజిక మాధ్యమాల వేదికగా శుభాకాంక్షలు తెలియజేశారు తెలుగు సినీ తారలు. దీనిపై కథానాయకుడు చిరంజీవి ఎక్స్ వేదికగా స్పందిస్తూ.. “ప్రియమైన విజయ్.. తొలి ఎన్నికల్లోనే ఇంతటి అద్భుతమైన విజయాన్ని అందుకున్నందుకు మీకు హృదయపూర్వక అభినందనలు” అని పోస్ట్ చేశారు. ప్రజలు విజయ్‌పై ఉంచిన విశ్వాసాన్ని ఈ ఎన్నికల ఫలితాలు ప్రతిబింబించాయని.. ఈ విజయం తమిళనాడుకు అర్థవంతమైన ప్రగతిగా పరిణమిస్తుందని తాను దృఢంగా విశ్వసిస్తున్నట్లు మహేశ్‌బాబు తెలిపారు. కేవీఎన్ ప్రొడక్షన్ అధినేత, విజయ్ చివరి చిత్రం ‘జన నాయగన్’ నిర్మాత వెంకట్ కే నారాయణ ట్విటర్ వేదికగా స్పందిస్తూ.. “దళపతి విజయ్ అన్ని అడ్డంకుల్ని దాటుకుని చారిత్రక విజయం సాధించార”ని సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ‘జన నాయగన్’ పోస్టర్‌ని పంచుకున్నారు. “బలహీనవర్గం నుంచి వచ్చినవాళ్లు విజయం సాధించడమనేది ఎప్పుడూ నిజమైన సినిమా లాంటిదే. బహుశా ఇదేనేమో రాజకీయమంటే. తమ నిర్ణయాన్ని స్పష్టంగా చాటిచెప్పిన తమిళనాడు ప్రజలకు భవిష్యత్తులో గొప్ప శుభాలు కలగాలని ఆశిస్తున్నా” అని హీరో నాని ఎక్స్‌లో పేర్కొన్నారు. అలాగే కథానాయకులు వెంకటేశ్, రవితేజ, రామ్‌చరణ్, విజయ్ దేవరకొండ, రష్మిక తదితర తారలు సామాజిక మాధ్యమాల ద్వారా విజయ్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

ఎంజీఆర్ - ఎన్టీఆర్ ప్రభంజనాన్ని విజయ్ స్ఫురణకి తెచ్చారు: బాలకృష్ణ

నటుడు తలచుకుంటే చరిత్రను తిరగరాయగలడని తమిళనాట ఎంజీఆర్, తెలుగునాట నందమూరి తారక రామారావు నిరూపించారని.. మళ్లీ ఆ ప్రభంజనాన్ని సోదరుడు విజయ్ స్ఫురణకి తెచ్చారని కథానాయకుడు నందమూరి బాలకృష్ణ అన్నారు. తమిళనాడు ఎన్నికల్లో ఆయన సాధించిన విజయం పట్ల అభినందనలు తెలుపుతూ.. బాలయ్య సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ పెట్టారు. అలాగే పశ్చిమ బెంగాల్, అస్సాం, పుదుచ్చేరిల్లో విజయం సాధించిన బీజేపీ, ఎన్డీయే కూటమి పార్టీలకు శుభాకాంక్షలు తెలిపారు. మోదీ, అమిత్ షాల సారథ్యంలోనే నూతన భారత నిర్మాణం సాధ్యమని పేర్కొన్నారు.


త్రిష

దీపాల వెలుగుల్లో.. అవని మెరుపులు

కథానాయకుడు చిరంజీవి.. దర్శకుడు వశిష్ఠ కలయికలో రూపొందిన చిత్రం ‘విశ్వంభర’. యూవీ క్రియేషన్స్ పతాకంపై విక్రమ్, వంశీ, ప్రమోద్ నిర్మించారు. త్రిష కథానాయిక. సోమవారం ఆమె పుట్టినరోజు సందర్భంగా ఈ సినిమా నుంచి తన లుక్‌ను విడుదల చేశారు. అందులో త్రిష దీపాలతో నిండిన పళ్లెం పట్టుకుని చిరునవ్వులు చిందిస్తూ కనిపించింది. ఈ చిత్రంలో ఆమె అవని అనే పాత్రలో కనిపించనున్నట్లు చిత్ర వర్గాలు తెలిపాయి. ఆధ్యాత్మిక అంశాలతో ముడిపడిన ఈ సోషియో ఫాంటసీ చిత్రం ప్రస్తుతం ముగింపు దశలో ఉంది. నిర్మాణానంతర పనులు తుది దశకు చేరుకున్నాయి. త్వరలోనే విడుదల తేదీపై స్పష్టత ఇవ్వనున్నారు. ఇందులో ఆషికా రంగనాథ్ మరో నాయికగా నటించగా.. మౌని రాయ్ ప్రత్యేక గీతంలో ఆడిపాడారు. కునాల్ కపూర్ కీలక పాత్ర పోషించారు. ఈ సినిమా పాన్ ఇండియా స్థాయిలో ఒకేసారి ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ చిత్రానికి ఎంఎం కీరవాణి సంగీతమందించగా.. భీమ్స్ ప్రత్యేక గీతానికి స్వరాలు సమకూర్చారు.

నాల్గో ఇడియట్ దొరికేశాడా?


విక్కీ కౌశల్

ప్రేక్షకుల్ని నవ్వుల్లో ముంచెత్తిన ‘3 ఇడియట్స్’కి సీక్వెల్‌గా ‘4 ఇడియట్స్’ రాబోతున్నట్లు కొన్ని రోజులుగా వార్తలు వస్తోన్న సంగతి తెలిసిందే. రాజ్ కుమార్ హిరాణీ దీన్ని తెరకెక్కిస్తున్నారు. బాలీవుడ్ అగ్రహీరో ఆమిర్ ఖాన్, ఆర్.మాధవన్, శర్మన్ జోషీ ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. ఇప్పుడీ కొనసాగింపు చిత్రంలో నాల్గో ఇడియట్ పాత్ర కోసం హీరో విక్కీ కౌశల్‌ను ఎంపిక చేసిందట చిత్రబృందం. “ఆమిర్ ఖాన్‌తో కలిసి తెరను పంచుకోవడానికి, సినీప్రియుల్లో మంచి అంచనాలున్న ఈ ఫ్రాంఛైజీలో భాగం కావడానికి విక్కీ ఆసక్తిగా ఉన్నారు. గతంలో ‘సంజు’, ‘డంకీ’ లాంటి చిత్రాలకు హిరాణీతో కలిసి పనిచేసిన ఆయనకు ఈ స్క్రిప్ట్ బాగా నచ్చింది. ఇప్పటికే పలుసార్లు ఈ విషయంపై చర్చలు జరిగాయి. ఇందులో నటించడానికి విక్కీ గ్రీన్ సిగ్నల్ ఇచ్చేశారు. ప్రస్తుతం స్క్రిప్ట్ దశలో ఉన్న ఈ సినిమా వచ్చే ఏడాది ద్వితీయార్ధంలో పట్టాలెక్కనుంద”ని బాలీవుడ్ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

తెలుగు ప్రేక్షకులే అతి పెద్ద సంపద

\- ప్రముఖ దర్శకుడు ఆర్.బాల్కీ


జయసుధ, జయప్రద, ఆర్.బాల్కీ, మోహన్‌బాబు

దర్శకుడు అనే పదానికి అర్థం చెప్పిన గొప్ప వ్యక్తి దాసరి నారాయణరావు అనీ... సినిమానే ఊపిరిగా జీవించిన ఆయన జయంతి సందర్భంగా జాతీయ స్థాయిలో డైరెక్టర్స్ డేని నిర్వహిస్తుండడం అభినందనీయం అన్నారు ప్రముఖ నటుడు మోహన్‌బాబు. తెలుగు సినీ దర్శకుల సంఘం ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో సోమవారం రాత్రి డైరెక్టర్స్ డే - 2026 జరిగింది. ఈ వేదికపై దాసరి జాతీయ పురస్కారాల్ని ప్రముఖ హిందీ దర్శకుడు ఆర్.బాల్కీ, యువ దర్శకుడు రామ్ జగదీశ్‌కు ప్రదానం చేశారు. ఈ వేడుకకి అతిథిగా హాజరైన మోహన్‌బాబు మాట్లాడుతూ “ఎక్కడో ఉండే నన్ను మోహన్‌బాబుగా పేరు మార్చి, సంభాషణలు ఎలా చెప్పాలో నేర్పించారు దాసరి. జాతీయ స్థాయిలో ఈ వేడుకని నిర్వహిస్తున్న తెలుగు చలన చిత్ర దర్శకుల సంఘానికి నా అభినందనలు. నా తరఫున సంఘానికి రూ.15 లక్షలు ఆర్థిక సహాయం అందిస్తా” అన్నారు. దర్శకుడు ఆర్.బాల్కీ మాట్లాడుతూ “గొప్ప సినిమాలతో తెలుగు చిత్ర పరిశ్రమ ప్రధాన ఆకర్షణగా నిలుస్తోంది. ఇక్కడి ప్రేక్షకులే తెలుగు చిత్ర పరిశ్రమకు అతి పెద్ద సంపద. నాణ్యమైన దర్శకులు, ప్రేక్షకుల ప్రేమ కారణంగా తెలుగు సినిమా భవిష్యత్ భారతీయ సినిమాగా అవతరిస్తుంది. తెలుగులో గొప్ప దర్శకులు ఉన్నారు. వ్యక్తిగతంగా నేను సింగీతం శ్రీనివాసరావుకు పెద్ద అభిమానిని. హిందీలో దర్శకుల సంఘం లేదు. ఆ విషయంలో ఇక్కడి నుంచి చాలా పాఠాల్ని నేర్చుకోవాలి” అన్నారు. ఈ కార్యక్రమంలో జయప్రద, జయసుధ, ఎస్వీ కృష్ణా రెడ్డి, ఆర్.నారాయణమూర్తి, విజయేంద్రప్రసాద్, చదలవాడ శ్రీనివాసరావు, వై.రవిశంకర్, బాబు మోహన్, తమ్మారెడ్డి భరద్వాజ, కలైకా ఫౌండేషన్ నారాయణ, తెలుగు, కన్నడ, తమిళ దర్శకుల సంఘాల అధ్యక్ష కార్యదర్శులతోపాటు ఇతర సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

చిత్ర నిర్మాణమంటే ఎన్నో సవాళ్లు


అభినవ్

బలమైన భావోద్వేగాలతోపాటు హాస్యం, నాటకీయతని మేళవించి రూపొందించిన సినిమానే మా ‘గోదారి గట్టుపైన’ అనీ, ఈ వేసవిలో థియేటర్లకు వెళ్లిన ప్రేక్షకులకు హాయైన వినోదాన్ని పంచుతుందన్నారు అభినవ్. ఆయన నిర్మాణంలో... సుమంత్ ప్రభాస్ కథానాయకుడిగా తెరకెక్కిన సినిమానే ‘గోదారి గట్టుపైన’. నిధి ప్రదీప్ కథానాయిక. సుభాష్ చంద్ర దర్శకత్వం వహించారు. ఈ చిత్రం ఈ నెల 8న ప్రేక్షకుల ముందుకొస్తున్న సందర్భంగా నిర్మాత అభినవ్ సోమవారం హైదరాబాద్‌లో విలేకర్లతో మాట్లాడుతూ... “పల్లెటూరి నేపథ్యంలో సాగే ఓ మంచి ప్రేమకథతో రూపొందిన చిత్రమిది. కుటుంబం నేపథ్యంలో సాగే డ్రామా ఈ సినిమా బలం. నటులు సవాళ్లతో కూడిన పాత్రలు చేసినప్పుడే వాళ్ల ప్రతిభ పూర్తిగా బయటికొస్తుంది. కథానాయకుడు సుమంత్ ప్రభాస్ ఈ కథని విన్నాక ఓ సవాల్‌గా స్వీకరించి నటించాడు. లైలా, రాజీవ్ కనకాల తదితర సీనియర్ నటుల పాత్రలు ఈ సినిమాకి మరింత ప్రత్యేకతని జోడించాయి. ఎంతో నాణ్యతతో తీసిన ఈ సినిమాని ఈ నెల 7వ తేదీ సాయంత్రం ప్రత్యేక ప్రదర్శనలతో ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నాం. సినిమా నిర్మాణం సులభమేమీ కాదు, ఎన్నో సవాళ్లుంటాయి. అన్నిటినీ అధిగమించి పని పూర్తి చేసినప్పుడే తృప్తి. ఈ సినిమాతో నాకు ఆ తృప్తి దొరికింది. ఈ చిత్ర దర్శకుడు సుభాష్‌తో మరో సినిమా కూడా మా ప్రణాళికల్లో ఉంది” అన్నారు.

ఏది సరైనది.. ఏది తప్పు అనేది తెలుసుకోవడం వేరు.. వ్యక్తిగతంగా నిర్ణయాలు తీసుకోవడం వేరని అంటోంది బాలీవుడ్ కథానాయిక కాజోల్. 90ల కాలంలో ఎన్నో ప్రేమకథలతో ప్రేక్షకుల్ని అలరించిన నాయిక ఈమె. గతేడాది ‘మా’, ‘సర్జమీన్’ లాంటి చిత్రాలతో తెరపై సందడి చేసిన ఈ తార.. ఈ మధ్య ఓటీటీ వేదికగానూ అలరిస్తోంది. అవసరమైనప్పుడు పలు సందర్భాల్లో సినిమాలే కాకుండా తన వ్యక్తిగత జీవితం గురించి కూడా మాట్లాడే కాజోల్.. ఇటీవలే ఓ ఇంటర్వ్యూలో పాల్గొని జెన్ జీకి సంబంధించి కొన్ని ఆసక్తికర విశేషాల్ని పంచుకుంది.

అలాంటి అమ్మాయిలు ఈ కాలంలో ఉండరేమో!


కాజోల్

“జెన్ జీ పిల్లల పెంపకం విషయంలో చాలా జాగ్రత్తగా ఉండాలి. ఈతరానికి చెందిన నా కుమార్తె నైసాను పెంచడంలో నేను ఇబ్బందులు ఎదుర్కొన్నాను. ఆమెకు అప్పుడు 12ఏళ్లు ఉంటాయి. మేమిద్దరం పోట్లాడుకునేవాళ్లం.. లాజిక్ లేకుండా వాదించుకునేవాళ్లం. దాదాపు మూడేళ్ల పాటు మేము ఇలాగే ఉన్నాం. మా మధ్య కేవలం పోట్లాటలే ఉండేవి. పిల్లలతో గొడవ పడటం వల్ల సమస్య పరిష్కారం కాదని తెలుసుకున్నా. పెద్దదానిగా, తల్లిగా నేనే ఒక అడుగు వెనక్కి వేసి ఆమెతో పోట్లాడకూడదని నిర్ణయించుకున్నా. ఆమెతో మాట్లాడటం కంటే తను చెప్పేది వినడం మొదలు పెట్టాను. పిల్లలకు మనం ఇచ్చే అతి పెద్ద బహుమతి స్పేస్. ఆమెకు మాట్లాడే అవకాశం ఇచ్చి.. నేను ఓపికగా వినడం వల్ల మా మధ్య దూరం తగ్గింది. అదే అతి పెద్ద మార్పు తీసుకొచ్చింది. తల్లిగా నేను నేర్చుకున్న పాఠం ఇదే”.

వాళ్ల ప్రపంచమే వేరు

“ప్రస్తుతం యువత తమకు ఏం కావాలో నిర్ణయించుకోవడంలో ఇబ్బంది పడుతున్నారు. ఎక్కువ సమాచారం అందుబాటులో ఉండటం వల్ల వారికి నిజంగా ఏమి కావాలో తెలుసుకోవడం కష్టం ఉంది. మా తరం వారు తక్కువ సాంకేతికత మధ్య పెరిగారు. సొంతంగానే నిర్ణయాలు తీసుకునేవాళ్లం. అంటే ఇప్పుడు ఆన్‌లైన్‌లోనూ, ఇతర మార్గాల ద్వారా అన్ని విషయాల్ని తెలుసుకుంటున్నారు. నాకేమనిపిస్తుందంటే.. ఈరోజుల్లో జెన్‌జీ వాళ్ల దగ్గర ఎంత సమాచారం ఉందంటే వాళ్లు అందులో ఈదుతున్నట్లుగా ఉంది. క్షణాల్లోనే అన్ని విషయాల్ని తెలుసుకునే ప్రపంచంలో పెరుగుతున్నారు. వాళ్ల లోకమే వేరు.. కానీ వ్యక్తిగతంగా ఏది ముఖ్యమో గ్రహించలేకపోతున్నారు”.

జీవితమంతటికీ అదే ముఖ్యం

“నేను నటించిన ‘దిల్ వాలే దుల్హనియా లే జాయేంగే’ సినిమా నాటికి, నేటి ప్రపంచానికి చాలా తేడా ఉంది. అందులో నేను పోషించిన సిమ్రాన్ లాంటి అమ్మాయిలు ఈ కాలంలో ఉండకపోవచ్చు. ఆమె కుటుంబానికి ఎక్కువ విలువనిస్తుంది. ప్రస్తుతం యువత జీవితానికి సంబంధించిన నిర్ణయాలను తీసుకోవడానికి తమ తల్లిదండ్రుల అనుమతి కోరే ఆలోచన కాలక్రమేణా మారిపోయింది. 18, 19ఏళ్లు ఉన్నవాళ్లెవరూ తమ నాన్న దగ్గరికి వెళ్లి ‘ప్లీజ్ నాన్న ఈ ట్రిప్‌కు తీసుకెళ్లొచ్చు కదా’ అని అడుగుతారని నేను అనుకోను. దానికి బదులుగా ‘నాన్న నేను ఈ స్కూల్ ట్రిప్‌కు తప్పకుండా వెళ్లాలి. దీని ఖర్చు నువ్వే భరించాలి’ అని అనే వాళ్లే ఎక్కువ. జీవితం నుంచి మనం ఏం పొందినా.. చివరికి బంధాలు, కుటుంబమే ముఖ్యమనే విషయాన్ని యువ ప్రేక్షకులు, జెన్‌జీ వాళ్లు గ్రహించాలని కోరుకుంటున్నా. మీ కుటుంబం... మీ కుటుంబమే. వారు మిమ్మల్ని ప్రేమిస్తారు. అసలు జీవితమంతటికీ అదే ముఖ్యం”.

నిద్రలో నడిచే హీరో.. హత్య చేస్తే!


రాజ్‌తరుణ్, అమృత

రాజ్‌తరుణ్ - అమృత చౌదరి జంటగా రిత్విక్ కుమార్ తెరకెక్కిస్తున్న చిత్రం ‘టార్టాయిస్’. విజయ్ చౌదరి, శశిధర్ నల్ల, రామిశెట్టి రాంబాబు, మధుపాల సురేశ్ నిర్మిస్తున్నారు. ఈ సినిమా తాజాగా చిత్రీకరణ పూర్తి చేసుకున్నట్లు చిత్ర బృందం ప్రకటించింది. ఈ సందర్భంగా దర్శక నిర్మాతలు మాట్లాడుతూ.. “ఈ కథ విభిన్నంగా ఉంటుంది. ఇందులో హీరోకి నిద్రలో నడిచే అలవాటుంది. ఈక్రమంలోనే తనొక అమ్మాయిని చంపేస్తాడు. ఆ తర్వాత ఏమైందన్నదే ఈ చిత్ర ఇతి వృత్తం” అన్నారు.

అది నాకు రాసి పెట్టి ఉంది!


ప్రీతి జింటా

హిందీ ప్రేక్షకుల్ని విశేషంగా ఆకట్టుకున్న చిత్రాల్లో ‘కల్ హో నా హో’ ముందు వరుసలో ఉంటుంది. బాలీవుడ్ అగ్రహీరో షారుక్ ఖాన్, సైఫ్ అలీఖాన్, ప్రీతి జింటా తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఈ రొమాంటిక్ డ్రామాలో నైనా పాత్రలో కనిపించి కుర్రకారుని అలరించింది ప్రీతి. కానీ ఈ పాత్రను మొదట్లో కరీనా కపూర్‌కు ఆఫర్ చేశారట. కొన్ని కారణాల వల్ల ఆమె దీంట్లో భాగం కాకపోవడంతో.. ఆ పాత్రలో ప్రీతిని తీసుకుందట చిత్రబృందం. దీనిపై అప్పట్లోనే ఓ కార్యక్రమంలో పాల్గొన్న ప్రీతి స్పందిస్తూ.. “మీరు ఓ షాప్‌కి వెళ్లి ఒక జీన్స్ ప్యాంట్‌ను వేసుకొని చూస్తారు. అది మీకు సరిగ్గా సరిపోతుంది. కానీ దాన్ని మీరు కొనకపోతే.. అది మీ జీన్స్ కాదని అర్థం. ఆ తర్వాత వచ్చే వ్యక్తి వాటిని వేసుకొని చూసి, కొనుగోలు చేసుకుంటే అవి ఆ వ్యక్తికే చెందినవి అవుతాయి. ఇది కూడా అంతే.. కరీనా మొదటి ఎంపికే అయినా.. అది నాకు రాసి పెట్టి ఉంది కాబట్టి ‘కల్ హో నా హో’లో నటించాను” అని చెప్పుకొచ్చింది. ప్రస్తుతం దీనికి సంబంధించిన వీడియో నెట్టింట్లో చక్కర్లు కొడుతోంది.

నా రాణింపునకు కారణం మా అమ్మే


యామీ గౌతమ్

‘హక్’తో గతేడాది ప్రేక్షకుల్ని అలరించింది బాలీవుడ్ కథానాయిక యామీ గౌతమ్. ఈ మధ్య కాలంలో శక్తిమంతమైన పాత్రలతో ప్రయాణిస్తున్న నాయిక ఈమె. ఓవైపు నటన.. మరో వైపు తల్లిగా తన బాధ్యతల్ని నిర్వర్తిస్తున్న ఈ తార.. ఇటీవలే ఓ ఇంటర్వ్యూలో పాల్గొని కొన్ని ఆసక్తికర విషయాల్ని పంచుకుంది. “ప్రస్తుతం నేను.. మా కుమారుణ్ని చూసుకుంటేనే షూటింగ్స్‌కు వెళ్తున్నా. కుటుంబ పరంగా నాకున్న మద్దతు వల్లే ఇది సాధ్యమైంది. లేకపోతే చాలా కష్టమయ్యేది. నేను మా అమ్మకు చాలా కృతజ్ఞురాలిని. ఎందుకంటే ఆమె వల్లే నేను నా వృత్తిలో సులభంగా రాణించగలుగుతూ... ఈ పనులన్నీ చేయగలుగుతున్నా. వృత్తిపరమైన బాధ్యతలను నిర్వహిస్తూనే మా కుమారుణ్ని చూసుకోవడంలో మా ఇరు కుటుంబాలూ కీలక పాత్ర పోషిస్తున్నాయి. కానీ జీవితంలో ఎప్పటికీ మీ బిడ్డ, మీ తల్లిదండ్రులు, మీ కుటుంబమే ముఖ్యమని గుర్తుంచుకోవాల”ని చెప్పుకొచ్చింది యామి.

కిల్లర్ ఎవరో కనిపెట్టలేరు


మోహన్, జో శర్మ

చివరి 15 నిమిషాలకు ముందు కూడా ఈ సినిమాలో కిల్లర్ ఎవరో కనిపెట్టలేరని, ఇప్పటివరకూ వచ్చిన సీరియల్ కిల్లర్ సినిమాలతో పోలిస్తే ఇది ఎంతో విభిన్నంగా ఉంటుందన్నారు మోహన్ వడ్లపట్ల. ఆయన స్వీయ నిర్మాణంలో తెరకెక్కించిన చిత్రం ‘ఎమ్ 4 ఎమ్’. జో శర్మ ప్రధాన పాత్రధారిగా నటించారు. ఈ నెల 8న పీవీఆర్ ఐనాక్స్ పిక్చర్స్ నుంచి విడుదలవుతున్న సందర్భంగా సోమవారం హైదరాబాద్‌లో విడుదలకు ముందస్తు వేడుకని నిర్వహించారు. తెలుగు సినీ దర్శకుల సంఘం అధ్యక్షుడు వి.ఎన్.ఆదిత్య, ఉపాధ్యక్షుడు వి.సముద్ర, కార్యదర్శి పెండ్యాల రామారావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.

(c) eenadu

30 రంగాలకు చమురు పోటు

ధరలు పెరుగుతూ.. గిరాకీ తగ్గుతూ

పలు ఉత్పత్తుల తయారీలో ముడి సరకుగా వాడటం వల్లే

ప్రపంచంలోనే అతిపెద్ద ఇంధన సంక్షోభానికి కారణమైన పశ్చిమాసియా యుద్ధం ప్రారంభమై రెండు నెలలు మించింది. సంప్రదింపులు కొనసాగుతున్నా.. ఉద్రిక్తతల తగ్గుముఖంపై అనిశ్చితి వీడటం లేదు. హర్మూజ్ జలసంధి మీదుగా సరకు రవాణాకు అంతరాయాలు కొనసాగుతున్నాయి. ఫలితంగా రవాణా, బీమా వ్యయాలు.. సరఫరా సమయాలు పెరుగుతున్నాయి. ముడిచమురు కొరత వల్ల సిరామిక్స్ దగ్గర నుంచి ఎఫ్ఎంసీజీ వరకు దాదాపు 30 రంగాలపై ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా ప్రభావం పడుతోంది. ఎరువుల ఉత్పత్తి క్షీణిస్తోంది. విమానయాన సంస్థల ఆదాయాలు-మార్జిన్లు పడిపోతున్నాయి.



మనదేశ ముడి చమురు దిగుమతుల్లో 35-50% హర్మూజ్ జలసంధి మీదుగానే వస్తుంటాయి. గల్ఫ్ దేశాల నుంచి ఇవి దిగుమతి అయ్యేవి. యుద్ధం ప్రారంభమయ్యాక రష్యా నుంచి ముడి చమురు సరఫరా మళ్లీ పెంచుకున్నా, రవాణాకు అధిక సమయం, వ్యయాలు అవుతున్నాయి. హర్మూజ్ జలసంధి మీదుగా నౌకల రాకపోకలు ఏప్రిల్ మధ్యలో మెరుగుపడినా, యుద్ధానికి ముందు స్థాయుల్లో 14 శాతమే కావడం ఆందోళన కలిగించే అంశం. ఇంధన వనరుగానే కాకుండా... 6,000కి పైగా తయారీ ఉత్పత్తులకు కీలక ముడి పదార్థంగా ముడి చమురు ఉపయోగపడుతోంది. ఆరోగ్య సంరక్షణ (వైద్య ఉత్పత్తుల పాలీమర్లు), వ్యవసాయం (నైట్రోజన్ ఆధారిత ఎరువులు), సాంకేతికత (సర్క్యూట్ బోర్డు రెసిన్‌లు) వంటి పలు రంగాలు పెట్రోలియం ఉత్పత్తులపై ఆధారపడి ఉన్నాయి. ఇంధన సంక్షోభం దీర్ఘకాలం కొనసాగితే, చాలా రంగాల ఆదాయాలు ప్రమాదంలో పడొచ్చు. సరఫరా అంతరాయాలతో వ్యయాలు పెరిగితే.. ద్రవ్యోల్బణం అధికమై, గిరాకీపై ప్రతికూల ప్రభావం పడొచ్చు. ఆర్థిక వృద్ధి నెమ్మదించేందుకూ ఇది దారి తీయొచ్చు. - ఈనాడు వాణిజ్య విభాగం

- సహజవాయువు కొరత కారణంగా దేశీయంగా మార్చిలో ఎరువుల ఉత్పత్తి 2025 ఇదే నెలతో పోలిస్తే 24.6% క్షీణించిందని క్రిసిల్ విశ్లేషించింది. ఈ రంగాన్ని ఆదుకునేందుకు ప్రభుత్వ జోక్యం అవసరమని సూచించింది.
- కొన్ని దేశాల గగనతల ఆంక్షలు, విమాన ఇంధన ధరల పెరుగుదల, రూపాయి విలువ క్షీణత వల్ల విమానయాన సంస్థల నిర్వహణ మార్జిన్‌లు మూడింట ఒక వంతు కంటే ఎక్కువగా తగ్గే అవకాశం ఉంది.
- ఎల్ఎన్‌జీ, ప్రొపేన్‌పై అధికంగా ఆధారపడిన సిరామిక్స్ రంగంపై తీవ్రమైన ప్రతికూల ప్రభావం పడుతోంది. ఈ రంగ ఆదాయాల్లో 35%, నిర్వహణ మార్జిన్‌లో 50% క్షీణత ఉండొచ్చన్నది అంచనా.
- ఇంధన, ముడి సరకు ఖర్చులు పెరగడం వల్ల సిమెంట్, పాలీవినైల్ క్లోరైడ్ పైపులు, సిటీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ సంస్థలు లాభాల మార్జిన్లలో ఒత్తిడి ఎదుర్కొంటున్నాయి. సిమెంటు తయారీ కంపెనీల వ్యయాల్లో 15% వాటా ఇంధనానిదే. బొగ్గు వైపునకు మారడం, బలమైన బ్యాలెన్స్ షీట్లను సద్వినియోగం చేసుకోవడం ద్వారా ఈ ప్రభావాన్ని సిమెంటు కంపెనీలు కొంత తగ్గించుకోవచ్చు.
- ద్రవ్యోల్బణం అధికమై, వినియోగదారు సెంటిమెంటు బలహీనపడితే ఎఫ్ఎమ్‌సీజీ, ద్విచక్ర వాహనాలు, కార్ల అమ్మకాలపై ప్రతికూల ప్రభావం ఉండొచ్చు.
- తగ్గిన డిమాండు, పెరుగుతున్న ఖర్చులకు తగ్గట్లుగా స్థిరాస్తి, ఆతిథ్య రంగాలు సిద్ధమవుతున్నాయి. రంగులు, రహదారులు, వంతెనలు, టైర్ల పరిశ్రమల ఆదాయాలూ నెమ్మదించొచ్చు. ఈ పరిశ్రమల్లో తారు, సింథటిక్ రబ్బరు వంటి ముడి చమురుతో ముడిపడిన ముడి పదార్థాలు వాడుతుండటం, రిఫ్రిజరెంట్ వాయువుల ధర పెరగడం ఇందుకు కారణం.

భారత్‌కు సవాలే...

ప్రత్యామ్నాయ విపణుల నుంచి ఇంధన సరఫరా పెంచుకునేందుకు భారత ప్రభుత్వం ప్రయత్నిస్తున్నా.. చమురు ధర అధికంగా ఉండటం, సరకు రవాణా సమయం - వ్యయాలు- బీమా ఛార్జీలు పెరగడం, ఆయిల్ ట్యాంకర్ల కొరత, షిప్పింగ్, ట్రాన్సిట్ వ్యయాలు అధికం కావడం ఇబ్బంది పెడుతున్నాయి. ఇప్పటివరకు పెట్రోల్, డీజిల్ రిటెయిల్ ధరలను ప్రభుత్వం పెంచనందున.. ప్రభుత్వ రంగ చమురు విక్రయ సంస్థలే నష్టపోతున్నాయి. ఇకపై కొంత భారాన్ని ప్రజలకు మళ్లించే అవకాశాలు కనిపిస్తున్నాయి. పెట్రో ధరల పెంపును కొట్టేయలేమని కేంద్రప్రభుత్వం సంకేతాలు ఇవ్వడం ఇందుకు నిదర్శనం. పెట్రో ధరలు పెరిగితే, ఆ ప్రభావం సేవలు - ఉత్పత్తుల ధరల రూపేణ వినియోగదార్లకు అదనపు భారం అవుతుంది.



ఈనాడు బిజినెస్

నికర ప్రత్యక్ష పన్ను వసూళ్లు రూ.23.40 లక్షల కోట్లు

దిల్లీ: గత ఆర్థిక సంవత్సరంలో నికర ప్రత్యక్ష పన్ను వసూళ్లు 5.12% వృద్ధితో రూ.23.40 లక్షల కోట్లుగా నమోదయ్యాయి. ప్రభుత్వం సవరించిన అంచనా అయిన రూ.24.21 లక్షల కోట్ల కంటే ఈ మొత్తం తక్కువే. 2024-25లో ఇవి రూ.22.26 లక్షల కోట్లుగా ఉన్నాయి. కేంద్ర ప్రత్యక్ష పన్నుల బోర్డు (సీబీడీటీ) గణాంకాల ప్రకారం.. నికర కార్పొరేట్ పన్ను వసూళ్లు రూ.10.99 లక్షల కోట్లుగా ఉన్నాయి. వ్యక్తిగత ఆదాయపు పన్ను (ఎస్‌టీటీతో కలిపి) రూ.12.41 లక్షల కోట్లు వసూలయ్యాయి. 2025-26లో స్థూల ప్రత్యక్ష పన్ను వసూళ్లు 4.03% పెరిగి రూ.28.12 లక్షల కోట్లకు చేరాయి. పన్ను రిఫండ్‌ల జారీ 1.09% తగ్గి రూ.4.71 లక్షల కోట్లకు పరిమితమైంది.

ప్రీమియర్ ఎనర్జీస్ డివిడెండ్ 75%

హైదరాబాద్ కేంద్రంగా కార్యకలాపాలు సాగించే ప్రీమియర్ ఎనర్జీస్, గత ఆర్థిక సంవత్సరానికి రెండో మధ్యంతర డివిడెండ్‌ను ప్రకటించింది. రూ.1 ముఖ విలువ కలిగిన ప్రతి షేరుకు 75% (రూ.0.75) చొప్పున చెల్లించాలని బోర్డు నిర్ణయించింది. ఇందుకు రికార్డు తేదీగా ఈనెల 9ని ప్రకటించింది. జూన్ 2 లోగా డివిడెండ్ చెల్లిస్తామని తెలిపింది. గతంలో మధ్యంతర డివిడెండ్‌గా 25% (రూ.0.25)ను చెల్లించిన సంగతి విదితమే.

హెగ్జా ఎనర్జీలో 26% వాటా: పునరుత్పాదక ఇంధన ఉత్పత్తి, పంపిణీ సంస్థ హెగ్జా ఎనర్జీ బీహెచ్ ఫైవ్ ప్రైవేట్ లిమిటెడ్‌లో కనీసం 26% వాటా కొనుగోలు చేసేందుకు తమ పూర్తిస్థాయి అనుబంధ సంస్థ ప్రీమియర్ ఎనర్జీస్ గ్లోబల్ ఎన్విరాన్‌మెంట్ ప్రైవేట్ లిమిటెడ్ ఒప్పందం చేసుకున్నట్లు ప్రీమియర్ ఎనర్జీస్ సోమవారం వెల్లడించింది. ఇందుకు రూ.68.70 కోట్లు పెట్టుబడి పెట్టనుంది. 16 నెలల్లో ఈ లావాదేవీ పూర్తికానుంది.

మేఘా ఇంజినీరింగ్ నుంచి జీఈ వెర్నోవాకు ఆర్డరు



దిల్లీ: ఆంధ్రప్రదేశ్‌లోని ఎగువ సీలేరు జలవిద్యుత్ కేంద్రం కోసం 9 పంప్డ్ స్టోరేజ్ యూనిట్లను సరఫరా చేసేందుకు మేఘా ఇంజినీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్ (ఎంఈఐఎల్) నుంచి ఆర్డరు పొందినట్లు అమెరికా సంస్థ జీఈ వెర్నోవా ప్రకటించింది. ఆర్డరులో భాగంగా 150 మెగావాట్ల సామర్థ్యం కలిగిన 9 పంప్డ్ స్టోరేజ్ యూనిట్లను జీఈ వెర్నోవా సరఫరా చేయనుంది. 1.35 గిగావాట్ల సామర్థ్యంతో దేశంలోని అతిపెద్ద పంప్డ్ స్టోరేజ్ జలవిద్యుత్ ప్రాజెక్టుల్లో ఎగువ సీలేరు ఒకటిగా నిలవనుంది. ఈ ప్రాజెక్టు 2030కి పూర్తికావొచ్చని అంచనా. ఈ యూనిట్ల డిజైన్ ఇంజినీరింగ్, తయారీ, టెస్టింగ్, సరఫరా, రవాణా, నియంత్రణ, నిర్వహణ బాధ్యతలను వెర్నోవా చేపట్టనుంది. ప్రస్తుతం ఎంఈఐఎల్‌కు చెందిన కుందా జల విద్యుత్ కేంద్రం కోసం కూడా జీఈ వెర్నోవా నాలుగు 125 మెగావాట్ల యూనిట్లను సరఫరా చేస్తోంది. ఈ పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టులు గ్రిడ్ స్థిరీకరణకు, పునరుత్పాదక ఇంధన వనరుల సమతుల్యతను కాపాడటానికి కీలకమని కంపెనీ పేర్కొంది.

కోడి గుడ్లు

5న ఫారం వద్ద రైతు అమ్మకం ధరలు (నెక్) (100కు రూపాయలలో)

హైదరాబాద్	525
వరంగల్	527
విజయవాడ	525
తూ/ప గోదావరి	515
విశాఖపట్నం	515
చిత్తూరు	593

ఎన్ఎస్ఈలో ఎలక్ట్రానిక్ గోల్డ్ రిసీట్స్



దిల్లీ: పసిడి ధరను మరింత సమర్థంగా, పారదర్శకంగా నిర్ధారించేందుకు ఎలక్ట్రానిక్ గోల్డ్ రిసీట్స్ (ఈజీఆర్) పేరుతో కొత్త విభాగాన్ని నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజీ (ఎన్ఎస్ఈ) ప్రారంభించింది. పసిడిలో ట్రేడింగ్‌కు నియంత్రిత, సురక్షిత, సాంకేతికంగా అభివృద్ధి చేసిన ఓ వేదికను అందుబాటులోకి తేవడం ద్వారా భౌతిక బంగారం, ఆర్థిక మార్కెట్ల మధ్య ఎన్నో ఏళ్లుగా ఉన్న అంతరాన్ని పూడ్చగలుగుతామని భావిస్తున్నట్లు ఎన్ఎస్ఈ తెలిపింది. లోహ రూపంలో బంగారానికి హక్కుదారుగా డీమెటీరియలైజ్ సెక్యూరిటీస్ రూపంలో సూచించేవే ఈజీఆర్‌లు. లోహ రూపంలో బంగారాన్ని సెబీ గుర్తింపు ఉన్న వాల్ట్‌ల్లో సురక్షితంగా భద్రపరుస్తారు. ఎలక్ట్రానిక్ రూపంలో డిపాజిటరీల వద్ద ఉంచుతారు. తద్వారా భౌతిక పసిడిని ట్రేడింగ్‌కు వీలుండే ఎలక్ట్రానిక్ సెక్యూరిటీస్‌గా మారుస్తారు.

మరిన్ని రంగాల్లోకి శ్రేయాస్ గ్రూప్



స్పోర్ట్స్, ఈవెంట్స్, స్థిరాస్తి, మీడియా రంగాల్లో మరింతగా విస్తరిస్తున్నట్లు శ్రేయాస్ గ్రూప్ ప్రకటించింది. దేశంలో గత 15 ఏళ్లలో 5,000కు పైగా ఈవెంట్లు, 2,500 సినిమా ప్రమోషన్ కార్యక్రమాలు నిర్వహించిన అనుభవం తమకుందని శ్రేయాస్ గ్రూప్ వ్యవస్థాపకులు జి.శ్రీనివాసరావు తెలిపారు. కార్పొరేట్ ఎంగేజ్‌మెంట్, వారాంతపు వ్యవసాయ అనుభవం, గ్రామ పర్యటనలు, సామాజిక వేడుకల వంటివీ నిర్వహిస్తామని.. ఇందుకోసం గ్రామాలు, పట్టణాల్లో ఔత్సాహిక వాణిజ్యవేత్తలను భాగస్వాములుగా చేసుకుంటామని వివరించారు.

2.5 రెట్లు పెరిగిన భెల్ లాభం

ప్రభుత్వ రంగ భెల్, మార్చి త్రైమాసికంలో రూ.1290.47 కోట్ల నికరలాభాన్ని ఆర్జించింది. 2024-25 ఇదే కాల లాభం రూ.504.45 కోట్ల కంటే ఇది 2.5 రెట్లు అధికం. ఇదే సమయంలో ఆదాయం రూ.9,142.64 కోట్ల నుంచి రూ.12,553.50 కోట్లకు పెరిగింది. ఇందులో విద్యుత్తు విభాగ ఆదాయం రూ.6,192.41 కోట్ల నుంచి రూ.9,509.85 కోట్లకు చేరింది. 2025-26 పూర్తి ఆర్థిక సంవత్సరానికి రూ.1,600.26 కోట్ల లాభాన్ని ప్రకటించింది. 2024-25 లాభం రూ.533.90 కోట్లే. ఆదాయం రూ.28,804.79 కోట్ల నుంచి రూ.34,589.83 కోట్లకు పెరిగింది. రూ.2 ముఖ విలువ కలిగిన షేరుకు రూ.1.40 డివిడెండ్ ఇవ్వాలని బోర్డు ప్రతిపాదించింది.

గెలాక్సీఐ దృష్టి ప్రయోగం విజయవంతం

ప్రకటించిన అనంత్ టెక్నాలజీస్

గెలాక్సీఐకి చెందిన శాటిలైట్ దృష్టి ప్రయోగం విజయవంతమైనట్లు అనంత్ టెక్నాలజీస్ ప్రకటించింది. దీనికి అసెంబ్లీ, ఇంటిగ్రేషన్, టెస్టింగ్(ఏఐటీ)ను తాము నిర్వహించినట్లు తెలిపింది. ఉపగ్రహం నిర్దేశిత కక్ష్యలో విజయవంతంగా ప్రవేశించిందని పేర్కొంది. కంపెనీతో పాటు వేగంగా వృద్ధి చెందుతున్న భారత ప్రైవేటు అంతరిక్ష రంగానికి ఇది గొప్ప విజయమని అనంత్ టెక్నాలజీస్ ఛైర్మన్ సుబ్బారావు పావులూరి పేర్కొన్నారు. ఎండ్ టు ఎండ్ ఏఐటీ, సోలార్ ప్యానెల్స్, క్రిటికల్ ఏవియానిక్స్ మాడ్యూళ్ల తయారీ ద్వారా తమ విస్తృత స్థాయి సామర్థ్యాలు నిరూపితం అయినట్లు వివరించారు.

అదానీ చేతికే జైప్రకాశ్ అసోసియేట్స్

దిల్లీ: దివాలా ప్రక్రియలో ఉన్న స్థిరాస్తి సంస్థ జైప్రకాశ్ అసోసియేట్స్ లిమిటెడ్ (జేఏఎల్) కొనుగోలుకు గౌతమ్ అదానీ గ్రూప్ సమర్పించిన బిడ్‌ను ఆమోదించడాన్ని సవాలు చేస్తూ, అనిల్ అగర్వాల్ సంస్థ వేదాంతా దాఖలు చేసిన పిటిషన్‌ను నేషనల్ కంపెనీ లా అప్పిలేట్ ట్రైబ్యునల్ (ఎన్‌సీఎల్ఏటీ) సోమవారం తిరస్కరించింది. జైప్రకాశ్ అసోసియేట్స్ కోసం అదానీ గ్రూప్ సమర్పించిన రూ.14,535 కోట్ల బిడ్‌ను రుణదాతల కమిటీ ఎంపిక చేయడం సరైనదేనని జస్టిస్ అశోక్ భూషణ్ నేతృత్వంలోని బెంచ్ స్పష్టం చేసింది. వేదాంతా తన సవరించిన బిడ్ విలువ, అదానీ బిడ్ కంటే రూ.3,400 కోట్లు ఎక్కువగా ఉందని వాదించినప్పటికీ, కేవలం బిడ్ విలువ మాత్రమే కాకుండా రుణదాతల వాణిజ్య నిర్ణయాధికారం ముఖ్యమని ట్రైబ్యునల్ పేర్కొంది. దివాలా ప్రక్రియలో ఎటువంటి అక్రమాలు జరగలేదని, ఎన్‌సీఎల్‌టీ ఇచ్చిన గత ఉత్తర్వుల్లో జోక్యం చేసుకోవాల్సిన అవసరం లేదని ఎన్‌సీఎల్ఏటీ తీర్పులో వెల్లడించింది.

- ✦ రూ.57,000 కోట్లకు పైగా బ్యాంకు రుణాలను చెల్లించకపోవడంతో 2024 జూన్‌లో జైప్రకాశ్ అసోసియేట్స్‌పై దివాలా ప్రక్రియ ప్రారంభమైంది. ఈ సంస్థకు దేశంలోని ఏకైక ఫార్ములా వన్ సర్క్యూట్, నోయిడాలో భారీ స్థిరాస్తి ప్రాజెక్టులు, సిమెంట్ ప్లాంట్‌లు, 5 లగ్జరీ హోటళ్లు ఉన్నాయి. దివాలా ప్రక్రియలో వేదాంతా, దాల్మియా భారత్ వంటి సంస్థలను వెనక్కి నెట్టి అదానీ ఎంటర్‌ప్రైజెస్ 89% రుణదాతల ఓట్లను సాధించింది. తాజా తీర్పుతో జైప్రకాశ్ అసోసియేట్స్‌ను కొనుగోలు చేసేందుకు అదానీ గ్రూప్‌నకు ఉన్న అడ్డంకులు తొలగిపోయాయి.

ఇంధన - ఆహార రంగాలపై అప్రమత్తత

ఈఏసీ ఛైర్మన్ మహేంద్ర దేవ్



పశ్చిమాసియా తరహా ఉద్రిక్తతల వల్ల ఏర్పడే ప్రతికూల ప్రభావాన్ని తగ్గించుకునేందుకు ఇంధనం, ఆహారం, ఎరువులు, లోహాలు, కీలక ఖనిజాలు వంటి రంగాలపై అప్రమత్తంగా ఉండాలని.. ఆయా రంగాల్లోని బలహీనతలను పరిష్కరించాలని ప్రధాన మంత్రికి ఆర్థిక సలహాదారు కమిటీ ఛైర్మన్ (ఈఏసీ- పీఎం) ఎస్.మహేంద్ర దేవ్ తెలిపారు. సరఫరా అంతరాయాలు, ధరల ఒడుదొడుకుల సమస్యలను వేగంగా పరిష్కరించుకోగలగాలని సూచించారు. నష్ట నియంత్రణకు దూరదృష్టితో కూడిన విధానం అవసరమనే విషయాన్ని పశ్చిమాసియా ఉదంతం తెలియజేస్తోందని తెలిపారు. విదేశీ మారకపు నిల్వలు, ఆహార ధాన్యాల నిల్వలే కాకుండా.. వ్యూహాత్మక పెట్రోలియం నిల్వలు, నిత్యావసర వస్తువుల నిల్వల వ్యవస్థలను బలోపేతం చేసుకోవాలని సూచించారు. దిగుమతులపై అధికంగా ఆధారపడటాన్ని తగ్గించుకోవడం అత్యంత ముఖ్యమని ఆయన అన్నారు. ప్రత్యామ్నాయ సరఫరా వ్యవస్థలు, వాణిజ్య మార్గాలను ఏర్పరచుకోవడం, స్వేచ్ఛాయుత వాణిజ్య ఒప్పందాలను మరింత సమర్థంగా ఉపయోగించుకోవడం ద్వారా ఇలాంటి సవాళ్లను అధిగమించే వీలుంటుందని దేవ్ చెప్పారు. సంప్రదాయ ఇంధనాలపై ఆధారపడటాన్ని తగ్గించుకోవడమే అత్యంత సుస్థిర పరిష్కారమని తెలిపారు. భవిష్యత్‌లోనూ అంతర్జాతీయంగా అనిశ్చితులు, కుదుపులు ఎదురవుతూనే ఉంటాయనే విషయాన్ని గుర్తుంచుకోవాలని వివరించారు. గత కొన్నేళ్లలో భారత కార్పొరేట్ రంగం గణనీయ లాభాలను ఆర్జించిందని తెలిపారు. ప్రైవేట్ పెట్టుబడులను పెంచడం ద్వారా భారత వృద్ధిలో కార్పొరేట్ సంస్థలు కీలక పాత్ర పోషించాలని ఆకాంక్షించారు.

ఎయిరిండియా సీఈఓ రేసులో నలుగురు

ఎయిరిండియా సీఈఓ రేసులో నలుగురు మిగిలారని సమాచారం. వారిలో సంస్థ ముఖ్య వాణిజ్య అధికారి నిపున్ అగర్వాల్‌తో పాటు గతంలో విస్తారా సీఈఓ, ప్రస్తుతం సింగపూర్ ఎయిర్‌లైన్స్ (ఎస్ఐఏ) సీనియర్ వైస్ ప్రెసిడెంట్‌గా ఉన్న వినోద్ కన్నన్, మరో ఇద్దరు ప్రవాసులు ఉన్నారు. ఎయిరిండియా నుంచి బయటకు వెళుతున్న ప్రస్తుత సీఈఓ క్యాంప్‌బెల్ విల్సన్ స్థానంలో, కొత్త సీఈఓను గురువారం (మే 7న) జరగబోయే బోర్డు సమావేశంలో నిర్ణయించనున్నారు.

స్టాక్ బ్రోకింగ్ రంగంలోకి డ్రీమ్ స్పోర్ట్స్

డ్రీమ్ 11 మాతృ సంస్థ అయిన డ్రీమ్ స్పోర్ట్స్, క్రీడా వినోదానికి మించి తమ వ్యాపారాన్ని విస్తరించుకోవడానికి, దేశంలో పెరుగుతున్న రిటెయిల్ మదుపర్లను ఆకర్షించడానికి డ్రీమ్‌స్ట్రీట్‌ను ప్రారంభించి స్టాక్‌బ్రోకింగ్ రంగంలోకి ప్రవేశించింది.

అడోబ్ గ్లోబల్ డెలివరీ సెంటర్ వైస్ ప్రెసిడెంట్‌గా మనోజ్

అడోబ్ గ్లోబల్ డెలివరీ సెంటర్, షేర్డ్ సర్వీసెస్ వైస్ ప్రెసిడెంట్‌గా మనోజ్ నాగాల్స్‌ను నియమించినట్లు కంపెనీ ప్రకటించింది. ఈ నియామకం తక్షణమే అమల్లోకి వస్తుంది. బెంగళూరు కేంద్రంగా పని చేసే ఆయన కార్యకలాపాలను విస్తరించడం, ఆవిష్కరణలను ప్రోత్సహించడం, ప్రపంచ వ్యాప్త వ్యాపార విస్తరణను సాధించడానికి అత్యుత్తమ పని తీరు కనబరిచే బృందాలను అభివృద్ధి చేయడం వంటి కార్యక్రమాలకు నాయకత్వం వహిస్తారని కంపెనీ తెలిపింది.

స్పైస్‌జెట్ పిటిషన్ కొట్టివేత.. జరిమానా విధింపు

మీడియా దిగ్గజం కళానిధి మారన్, కల్ ఎయిర్‌వేస్‌తో ఉన్న న్యాయపరమైన వివాదానికి సంబంధించి రూ.144 కోట్లు డిపాజిట్ చేయాలన్న గత ఉత్తర్వును సమీక్షించాలని కోరుతూ స్పైస్‌జెట్, దాని ప్రమోటర్ అజయ్ సింగ్ దాఖలు చేసిన పిటిషన్‌ను దిల్లీ హైకోర్టు సోమవారం కొట్టివేసింది. విమానయాన సంస్థ, అజయ్ సింగ్‌పై రూ.50,000 జరిమానాను జస్టిస్ సుబ్రమోనియం ప్రసాద్ విధించారు.

టాటా సన్స్‌లో టాటా ట్రస్ట్స్ ప్రాతినిధ్యంపై సమీక్ష!



టాటా గ్రూప్ హోల్డింగ్ సంస్థ టాటా సన్స్‌లో 66% వాటా కలిగిన టాటా ట్రస్ట్స్, బోర్డు సమావేశం (మే 8)లో కొన్ని అంశాలపై దృష్టి సారించే అవకాశం ఉంది. టాటా సన్స్ బోర్డులో తమ ప్రాతినిధ్యాన్ని సమీక్షించనుందని సమాచారం. ప్రస్తుతం బోర్డులో టాటా ట్రస్ట్స్‌కు ఇద్దరు నామినీ డైరెక్టర్లు ఉన్నారు. టాటా ట్రస్ట్స్ ఛైర్మన్ నోయల్ టాటా ఒకరు కాగా, మరొకరు వైస్ ఛైర్మన్ వేణు శ్రీనివాసన్. ఇంకో వైస్ ఛైర్మన్ విజయ్ సింగ్ 2025 సెప్టెంబరు వరకు మూడో నామినీ డైరెక్టర్‌గా ఉండేవారు. టాటా ట్రస్ట్స్‌లో రెండు కోటరీల మధ్య విభేదాల కారణంగా ఆయన వైదొలగారు. ఒక వేళ సమీక్షలో శ్రీనివాసన్‌ను బయటకు పంపాలని భావిస్తే, ఇక ఏకైక ట్రస్టీ నామినీగా నోయల్ టాటా మిగులుతారు. టాటా సన్స్ లిస్టింగ్‌పై శ్రీనివాసన్, సింగ్ ఇటీవల చేసిన బహిరంగ వ్యాఖ్యలు ఇందుకు నేపథ్యం. నోయల్ కుమారుడు నెవిల్ టాటా, దొరాబ్జీ టాటా ట్రస్ట్‌లో ట్రస్టీగా ఉన్నారు కానీ, టాటా సన్స్ బోర్డులో లేరు.

టాటా సన్స్ లిస్టింగ్‌కు కృషి చేయాలి

ప్రజా వాటాదార్ల ప్రయోజనాలను పరిరక్షించడం కోసం టాటా సన్స్ లిస్టింగ్‌కు కృషి చేయాల్సిందిగా టాటా గ్రూప్‌నకు చెందిన 7 లిస్టింగ్ కంపెనీల డైరెక్టర్లను కార్పొరేట్ పాలనా సలహా సేవల సంస్థ ఇన్‌గవర్న్ కోరింది. ఆ మేరకు ఆయా సంస్థల స్వతంత్ర డైరెక్టర్లు, బోర్డు సభ్యులకు లేఖ రాసింది. టాటా సన్స్‌లో టాటా మోటార్స్, టాటా స్టీల్, టాటా కెమికల్స్, టాటా పవర్, ఇండియన్ హోటల్స్ కంపెనీ, టాటా కన్జ్యూమర్ ప్రోడక్ట్స్, టాటా ఇన్వెస్ట్‌మెంట్ కార్పొరేషన్‌లకు 12% వాటా ఉంది. టాటా సన్స్ ఒక ప్రైవేట్ కంపెనీగా కొనసాగితే ఆర్‌బీఐ జారీ చేసిన తాజా నిబంధనల వల్ల నష్టభయాలు ఎదురుకావొచ్చని ఇన్‌గవర్న్ రీసెర్చ్ సర్వీసెస్ ఎండీ శ్రీరామ్ సుబ్రమణియన్ పేర్కొన్నారు.

స్వల్పంగా పెరిగిన తయారీ రంగ వృద్ధి



దిల్లీ: భారత తయారీ రంగ వృద్ధి ఏప్రిల్‌లో స్వల్పంగా పెరిగింది. కొత్త ఆర్డర్ల రాక ఇందుకు తోడ్పడింది. తయారీ రంగ పనితీరును అంచనా వేసే హెచ్ఎస్‌బీసీ ఇండియా తయారీ పర్చేజింగ్ మేనేజర్స్ సూచీ (పీఎంఐ) మార్చిలో 53.9 పాయింట్ల వద్ద ఉండగా.. ఏప్రిల్‌లో 54.7 పాయింట్లకు పెరిగింది. గత నాలుగేళ్లలోనే తయారీ రంగ వృద్ధిలో ఇది రెండో కనిష్ఠ పెరుగుదల కావడం గమనార్హం. పీఎంఐ పరిభాష ప్రకారం.. సూచీ 50 పాయింట్ల ఎగువన ఉంటే ఆ రంగంలో వృద్ధి ఉన్నట్లు, 50 పాయింట్ల దిగువన ఉంటే క్షీణతగాను పరిగణిస్తారు. 'అమ్మకాలు, ఉత్పత్తికి ప్రకటనలు, గిరాకీలో స్థిరత్వం తోడ్పడ్డాయి. అయితే పోటీ పరిస్థితులు, పశ్చిమాసియా యుద్ధం, కొటేషన్లను ఆమోదించడానికి క్లయింట్లు విముఖత చూపడం లాంటివి తయారీ రంగ వృద్ధికి అవరోధంగా నిలిచాయ'ని సర్వే తెలిపింది. ముఖ్యంగా పశ్చిమాసియా ఉద్రిక్తతల ప్రతికూలతలు ద్రవ్యోల్బణం రూపంలో ప్రభావం చూపాయని హెచ్ఎస్‌బీసీ ఇండియా ముఖ్య ఆర్థికవేత్త ప్రంజుల్ భండారి తెలిపారు.

ఏప్రిల్‌లో యూపీఐ ద్వారా 2,235 కోట్ల లావాదేవీలు: డీఎఫ్ఎస్

దిల్లీ: యునిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) ద్వారా ఏప్రిల్‌లో సుమారు 2,235 కోట్ల లావాదేవీలు జరిగినట్లు ఆర్థిక సేవల విభాగం (డీఎఫ్ఎస్) తెలిపింది. 2025 ఏప్రిల్‌లో నమోదైన 1,779 కోట్ల లావాదేవీలతో పోలిస్తే ఈ సంఖ్య 25% ఎక్కువ. ఈ ఏడాది మార్చిలో రికార్డు స్థాయిలో 2,264 కోట్ల యూపీఐ లావాదేవీలు జరిగాయి. ఫిబ్రవరిలో ఈ సంఖ్య 2,039 కోట్లుగా ఉంది. ప్రస్తుతం దేశంలో జరుగుతున్న మొత్తం డిజిటల్ లావాదేవీల్లో యూపీఐ లావాదేవీల వాటానే సుమారు 85%గా ఉంటోంది. దేశీయంగానే కాకుండా అంతర్జాతీయంగానూ యూపీఐ లావాదేవీల ప్రభావం కనిపిస్తోంది. ఇప్పటికే ఎనిమిది దేశాల్లో - యూఏఈ, సింగపూర్, భూటాన్, నేపాల్, శ్రీలంక, ఫ్రాన్స్, మారిషస్, ఖతార్‌లో యూపీఐ లావాదేవీల సదుపాయం అందుబాటులో ఉంది.

ఎన్నికల ఫలితాలు మెప్పించాయ్

డాలర్ @ రూ.95.23

ఎఫ్ఐఐ విక్రయాలు: రూ.2,835.62 కోట్లు
డీఐఐ కొనుగోళ్లు: రూ.4,764.16 కోట్లు

సెన్సెక్స్ ▲356 77269 | నిఫ్టీ ▲122 24119



దేశంలోని 5 రాష్ట్రాలకు జరిగిన ఎన్నికల్లో మూడింటిని కేంద్రంలోని ఎన్‌డీఏ పార్టీలు గెలుచుకోవడంతో మదుపర్ల సెంటిమెంట్ బలపడింది. బ్లూచిప్ షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించడమూ కలిసొచ్చింది. అయితే డాలరుతో పోలిస్తే రూపాయి మారకపు విలువ 39 పైసలు తగ్గి జీవనకాల కనిష్ఠమైన 95.23 వద్ద ముగియడంతో, సూచీల లాభాలు పరిమితమయ్యాయి. బ్యారెల్ బ్రెంట్ ముడి చమురు ధర 5.05% పెరిగి, 113.60 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. ఆసియా మార్కెట్లలో దక్షిణ కొరియా, హాంకాంగ్ సూచీలు లాభపడ్డాయి. జపాన్ మార్కెట్ పని చేయలేదు. ఐరోపా మార్కెట్లు ప్రతికూలంగా కదలాడాయి.

- ✦ బీఎస్ఈలోని నమోదిత కంపెనీల మార్కెట్ విలువ రూ.3.95 లక్షల కోట్లు పెరిగి, రూ.467.24 లక్షల కోట్లకు చేరింది.
- ✦ సెన్సెక్స్ ఉదయం 77,257.27 పాయింట్ల (క్రితం ముగింపు 76,913.50) వద్ద సానుకూలంగా ప్రారంభమైంది. ఒక దశలో 77,910.75 పాయింట్ల గరిష్ఠ స్థాయికి చేరినా, 76,939.54 పాయింట్ల వద్ద కనిష్ఠాన్ని తాకినా.. చివరకు 355.90 పాయింట్ల లాభంతో 77,269.40 పాయింట్ల వద్ద స్థిరపడింది. నిఫ్టీ 50 సైతం 121.75 పాయింట్లు పెరిగి 24,119.30 పాయింట్ల వద్ద ముగిసింది. ఇంట్రాడేలో ఈ సూచీ 24,290.20-24,004.75 పాయింట్ల మధ్య కదలాడింది.
- ✦ సెన్సెక్స్ 30 షేర్లలో 22 లాభపడ్డాయి. అదానీ పోర్ట్స్ 5.30%, హెచ్‌యూఎల్ 2.60%, రిలయన్స్ ఇండస్ట్రీస్ 2.24%, ఎల్ అండ్ టీ 2.18%, ఎటర్నల్ 2.09% పెరిగాయి. భారతీ ఎయిర్‌టెల్ 3.14%, కోటక్ మహీంద్రా బ్యాంక్ 2.82%, టీసీఎస్ 1.73%, ఐటీసీ 1.25%, ఇన్ఫోసిస్ 1.11% చొప్పున నష్టపోయాయి.
- ✦ రంగాల వారీ సూచీలకొస్తే స్థిరాస్తి, సేవలు, భారీ యంత్ర పరికరాలు, పారిశ్రామిక, ఆరోగ్య సంరక్షణ, యుటిలిటీస్ సూచీలు రాణించాయి. ఐటీ, పీఎస్‌యూ బ్యాంక్ సూచీలు డీలా పడ్డాయి. బీఎస్ఈలో 2,607 షేర్లు సానుకూలంగా, 1,735 షేర్లు ప్రతికూలంగా ముగిశాయి. 216 షేర్లలో ఎలాంటి మార్పు లేదు.

అంబుజా సిమెంట్స్ లాభం రూ.1857 కోట్లు

దిల్లీ: అదానీ గ్రూప్ సంస్థ అంబుజా సిమెంట్స్, మార్చి త్రైమాసికంలో రూ.1,857.43 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. 2024-25 ఇదే కాల లాభం రూ.1,351.46 కోట్లతో పోలిస్తే ఇది 37.43% ఎక్కువ. మొత్తం కార్యకలాపాల ఆదాయం రూ.9,894.41 కోట్ల నుంచి 10% వృద్ధితో రూ.10,891.68 కోట్లకు చేరింది. మొత్తం వ్యయాలు 19.3% పెరిగి రూ.10,525.09 కోట్లకు చేరాయి. సిమెంట్ ఆదాయం 8.6% పెరిగి రూ.10,417.69 కోట్లుగా నమోదైంది. రెడీమిక్స్ కాంక్రీట్ ఆదాయం 36.54% అధికమై రూ.581.95 కోట్లకు చేరింది. సిమెంట్ విక్రయాలు 9.34% వృద్ధితో 19.9 మి.టన్నులకు చేరాయి. 2025-26 ఆర్థిక సంవత్సరానికి రూ.2 ముఖ విలువ కలిగిన ఒక్కో షేరుపై రూ.2 డివిడెండ్‌ను బోర్డు సిఫారసు చేసింది.

✦ అనుబంధ సంస్థలు ఏసీసీ, ఓరియెంట్ సిమెంట్‌లను విలీనం చేసుకుని 'వన్ సిమెంట్ ప్లాట్‌ఫామ్' ఏర్పాటు చేయడంతో పాటు దేశీయ సిమెంట్ దిగ్గజంగా ఎదగాలని అంబుజా లక్ష్యంగా పెట్టుకుంది. 2025-26లో అంబుజా మొత్తం సిమెంట్ ఉత్పత్తి సామర్థ్యం ఏడాదికి 109 మిలియన్ టన్నులకు చేరింది. తక్కువ వర్షపాతం, పశ్చిమాసియా యుద్ధం కారణంగా 2026-27లో సిమెంట్‌కు డిమాండ్ 5% మందగించొచ్చని కంపెనీ అంచనా వేస్తోంది.

బెంగళూరులో రెయిన్‌బో హాస్పిటల్స్ విస్తరణ

బెంగళూరులో రూ.52 కోట్ల పెట్టుబడితో తమ సేవలు విస్తరించినట్లు రెయిన్‌బో చిల్డ్రన్స్ మెడికేర్ (రెయిన్‌బో హాస్పిటల్స్) ప్రకటించింది. హెచ్ఆర్‌బీఆర్ లేఅవుట్‌లో 60 పడకల స్పోక్ హాస్పిటల్‌ను, మహదేవపురలో కొత్తగా బర్త్ రైట్ ఫెర్టిలిటీ ఐవీఎఫ్ కేంద్రాన్ని ప్రారంభించామని వెల్లడించింది. వీటితో కలిపి తమ మొత్తం పడకల సామర్థ్యం 2,435కు చేరిందని, దేశంలో తమ ఐవీఎఫ్ కేంద్రాల సంఖ్య 15కు చేరినట్లు వివరించింది.

సంక్షిప్తంగా

- ✦ త్రైమాసిక ఫలితాల నేపథ్యంలో గోద్రేజ్ ప్రోపర్టీస్ షేరు బీఎస్ఈలో 3.54% పెరిగి రూ.1,899.90 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో 6.28% పెరిగి రూ.1,950.05 స్థాయిని కూడా తాకింది.
- ✦ ఏప్రిల్‌లో రికార్డు స్థాయిలో విక్రయాలు నమోదు చేయడంతో మారుతీ సుజుకీ షేరు బీఎస్ఈలో 2.02% పెరిగి రూ.13,581.85 వద్ద ముగిసింది.
- ✦ వేదాంతా కంపెనీ విభజన (డీమెర్జర్) నేపథ్యంలో, షేరు బీఎస్ఈలో 8.54% పెరిగి రూ.294.80 వద్ద ముగిసింది.
- ✦ తమ అనుబంధ సంస్థ అపిటోరియా ఫార్మా ప్రైవేటు లిమిటెడ్ సీఈఓ పదవికి సంజయ్ చతుర్వేది రాజీనామా చేశారని, ఇది మే 4 నుంచి అమల్లోకి వచ్చిందని అరబిందో ఫార్మా వెల్లడించింది.

జనవరి - మార్చి త్రైమాసిక ఫలితాలు (రూ.కోట్లలో)

కంపెనీ	నికర లాభం/(నష్టం)		మొత్తం ఆదాయం	
	2025-26	2024-25	2025-26	2024-25
మణప్పురం ఫైనాన్స్[1]	405	(203)	2,614	2,361
టాటా టెక్నాలజీస్[2]	204.17	188.87	1,572.22	1,285.65
జిందాల్ స్టెయిన్‌లెస్	834.21	589.96	11,427.91	10,292.27
గోద్రేజ్ ప్రాపర్టీస్[3]	649.88	381.99	3,806.65	2,681.06
ఆదిత్య బిర్లా క్యాపిటల్	1,129	865	5,516	4,481
వోఖార్డ్	164	(45)	965	743
ఎపిగ్రాల్	82	87	736	631
ఏథర్ ఎనర్జీ	(100.23)	(234.36)	1,174.66	676.8
ఎక్సైడ్ ఇండస్ట్రీస్	216.73	187.91	4,735.13	4,335.42
సీఎస్‌బీ బ్యాంక్	202	190	1,507	1,362.36
శోభా	91.83	40.85	2,029.92	1,270.73
జ్యోతి ల్యాబ్స్	67.5	77	717.41	666
జైప్రకాశ్ పవర్ వెంచర్స్	(13.37)	155.67	1,470.79	1,366.67
టాటా కెమికల్స్	(2,116)	(49)	3,438	3,509

1) డివిడెండ్ రూ.0.50 2) డివిడెండ్ రూ.8.35 3) డివిడెండ్ రూ.10

(c) eenadu

ఈనాడు ప్రతిభ
మంగళవారం, మే 5, 2026
19
◆ https://pratibha.eenadu.net ◆ https://eenadupratibha.net
విద్య, ఉద్యోగ పరీక్షల ప్రత్యేకం!

కరెంట్ అఫైర్స్

★ టీ-20 ప్రపంచకప్-2026 విజేతగా భారత్ నిలిచింది. అహ్మదాబాద్‌లో జరిగిన ఫైనల్లో టీమిండియా ఎన్ని పరుగుల తేడాతో న్యూజిలాండ్‌ను ఓడించి వరసగా రెండోసారి టీ-20 ప్రపంచకప్ విజేతగా నిలిచింది?


సంజు శాంసన్

జ: 96 పరుగులు (భారత్ 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 255 పరుగులు చేయగా, న్యూజిలాండ్ 19 ఓవర్లలో 159 పరుగులకు ఆలౌట్ అయింది. 'ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్ అవార్డు'ను సంజు శాంసన్ గెలుచుకున్నారు.)

మాదిరి ప్రశ్నలు

★ 2026, మార్చి 28 నుంచి ఏ దేశంలో 16 ఏళ్ల లోపు పిల్లలపై సోషల్ మీడియా నిషేధం అమల్లోకి వచ్చింది? (కొత్త నిబంధనల ప్రకారం యూట్యూబ్, టిక్‌టాక్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, థ్రెడ్స్, ఎక్స్, రోబ్లాక్స్ లాంటి ప్లాట్‌ఫామ్‌లు పదహారేళ్ల కంటే తక్కువ వయసున్న వినియోగదారుల ఖాతాలను అనుమతించవు.)

జ: ఇండోనేసియా

★ 'నేషనల్ క్లైమేట్ స్టాక్ ఇన్నోవేషన్ ఛాలెంజ్'ను ఇటీవల ఏ భారత సంస్థ ప్రారంభించింది?

జ: నాబార్డు

(గేట్స్ ఫౌండేషన్, డాల్బర్గ్ అడ్వైజర్స్ సహకారంతో ప్రారంభించిన ఈ క్లైమేట్ ఇన్నోవేషన్ ఛాలెంజ్ భారత్ అంతటా వాతావరణ సంబంధిత డేటాను సమీకరించి, విశ్లేషించడానికి ఒక డిజిటల్ ఫ్రేమ్‌వర్క్‌గా పనిచేసే 'నేషనల్ క్లైమేట్ స్టాక్'ను అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పెట్టుకుంది.)

మరింత సమాచారం


దరఖాస్తు చేశారా?

☛ ఐఐటీ మద్రాస్‌లో సాఫ్ట్‌వేర్ డెవలపర్ ఉద్యోగాలు
చివరి తేదీ: 05-05-2026

☛ సీసీఎంబీలో టెక్నికల్ ఆఫీసర్ ఖాళీలు
చివరి తేదీ: 26-05-2026

Carbon And Its Compounds

Carbon compounds are substances formed by Carbon combining with other elements like Hydrogen, Oxygen, Nitrogen etc., Carbon is unique because it can form a large number of compounds due to its special properties.



Most Carbon compounds are covalent in nature.

Properties of Carbon

Tetravalency: Carbon has valency 4, so it can form four covalent bonds.

Catenation: Ability of Carbon to form long chains, branches, and rings.

Carbon forms single, double, and triple bonds.

Types of Carbon compounds

1. Saturated Compounds (Alkanes)

• Contain only single bonds

Example: Methane (CH_4), Ethane (C_2H_6)

2. Unsaturated compounds

a) Alkenes (double bond)

Example: Ethene (C_2H_4)

b) Alkynes (triple bond)

Example: Ethyne (C_2H_2)

10th Class Bridge Course Physical Science

Homologous Series

A series of compounds with similar chemical properties and same functional group.

Successive members differ by $-CH_2$ group

Example: Methane, Ethane, Propane,…

Functional groups

Functional groups determine the chemical properties of compounds.

Functional Group	Name	Example
–OH	Alcohol	Ethanol
–COOH	Carboxylic Acid	Ethanoic acid
–CHO	Aldehyde	Ethanal
–CO–	Ketone	Propanone

Chemical properties of Carbon compounds

1. Combustion reaction

Carbon compounds burn in Oxygen to form CO_2 and H_2O with heat and light


Example: $CH_4 + 2O_2 \longrightarrow CO_2 + 2H_2O$ + Heat

2. Oxidation reaction

Addition of Oxygen or removal of Hydrogen

Example: Ethanol ⟶ Ethanoic acid (using oxidizing agent)

For more Concepts



Writer: D.V. Subba Naidu

అరుదైన రుగ్మతలకు అనేక చికిత్సలు!

జనరల్ స్టడీస్ బయాలజీ

కణవిభజనలో జరిగే లోపాలతో మానవులు జీవితాంతం ఎదుర్కొంటున్న అసాధారణ రుగ్మతలే క్రోమోజోమ్ సంబంధిత వ్యాధులు. సహజంగా కణంలో ఇరవై మూడు జతలుగా ఉండాల్సిన క్రోమోజోములు అదుపుతప్పి, వాటి సంఖ్య పెరిగినా, తగ్గినా ఈ వ్యాధులకు గురవుతారు. పుట్టుకతోనే శారీరక వైకల్యం, మానసిక వికాసంలో జాప్యం, ఇతర తీవ్రమైన అనారోగ్య సమస్యలకు దారితీసే ఇలాంటి వ్యాధుల గురించి పోటీ పరీక్షార్థులకు అవగాహన ఉండాలి. ఒక్కో వ్యాధిలో క్రోమోజోముల పరంగా ఉండే అసమతౌల్యత, దాని ప్రభావాన్ని అర్థం చేసుకోవాలి. జీవితకాలం వెంటాడే ఈ సమస్యలకు అందాల్సిన ఆరోగ్య సంరక్షణ, చికిత్సలు, ఈ దిశగా కేంద్ర ప్రభుత్వం చూపుతున్న చొరవ, వ్యాధిగ్రస్థులు మెరుగైన జీవితం గడపడానికి ఉన్న అవకాశాలనూ తెలుసుకోవాలి.



క్రోమోజోమ్ సంబంధిత వ్యాధులు

ఆరోగ్యవంతమైన మానవుడి కణాల్లో 23 జతలు లేదా 46 క్రోమోజోములు ఉంటాయి. వీటి నిర్మాణంలో, సంఖ్యలో తేడా రావడం వల్ల వ్యాధులు కలుగుతాయి. ఇవి పుట్టినప్పటి నుంచి జీవితాంతం ఉంటాయి. ఈ వ్యాధులు తర్వాత తరానికి సంక్రమించవు. ఆధునిక ఆరోగ్య సాంకేతికత ద్వారా వీటి ద్వారా కలిగే ఇబ్బందులను కొంతవరకు తగ్గించవచ్చు. క్రోమోజోమ్ సంబంధిత వ్యాధులను 1) నిర్మాణ సంబంధ మార్పులు 2) సంఖ్యా సంబంధ మార్పులు అని రెండు రకాలుగా విభజించవచ్చు.

నిర్మాణ సంబంధ మార్పుల వల్ల కలిగే వ్యాధులు

ఇవి క్రోమోజోముల్లో కొంత భాగం కోల్పోవడం లేదా కొంత భాగం ఎక్కువగా ఉండటం వల్ల కలుగుతాయి. **ఉదా:** క్రైడ్యుక్యాట్ సిండ్రోమ్, క్యాట్ ఐ సిండ్రోమ్.

క్రైడ్యు క్యాట్ సిండ్రోమ్: ఇది మానవుడి 5వ క్రోమోజోమ్‌లో ఉండే p-భాగంలో కొంత లోపం వల్ల కలుగుతుంది. ఈ వ్యాధితో పుట్టిన పిల్లలు పిల్లిలాగా ఏడుస్తారు. ఈ వ్యాధినే 5p లేదా 'క్రైడ్యు క్యాట్ సిండ్రోమ్' అంటారు.



క్యాట్ ఐ సిండ్రోమ్: ఈ వ్యాధి మానవుడిలోని 22వ క్రోమోజోమ్‌లోని q-భాగం కొంత తిరిగి ఉండటం లేదా ద్విగుణీకరణం వల్ల కలుగుతుంది. ఈ వ్యాధిగ్రస్థుల కళ్ల నిర్మాణం పిల్లి కళ్ల మాదిరి ఉంటుంది.

నేషనల్ పాలసీ ఫర్ రేర్ డిసీజెస్: దీనిని కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ 2021లో ప్రారంభించింది. దీనిలో భాగంగా జన్యుసంబంధిత, అరుదుగా సంభవించే వ్యాధుల నియంత్రణ, నివారణ, గుర్తింపు చికిత్సలను అందిస్తున్నారు.



ముఖ్యాంశాలు: ➺ ఈ విధానంలో ఇప్పటివరకు 63 రకాల అరుదుగా వచ్చే వ్యాధులను చేర్చారు. ➺ వీటి చికిత్సకు రూ.50 లక్షల ఆర్థిక సాయం అందిస్తున్నారు. ➺ రోగులకు చికిత్స అందించడానికి దేశవ్యాప్తంగా 12 సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్‌లను గుర్తించింది. వీటిలో ఒకటి సెంటర్ ఫర్ DNA ఫింగర్ ప్రింటింగ్ అండ్ డయాగ్నోస్టిక్స్ (CDFD), నిజాం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (NIMS) ➺ ఈ పాలసీలో భాగంగా అరుదైన వ్యాధులను చికిత్స, ఖర్చు ఆధారంగా 3 తరగతులుగా విభజించారు. ➺ ఈ వ్యాధుల చికిత్సకు ఉపయోగపడే ఔషధాలకు జీఎస్టీ, కస్టమ్స్ పన్నును తొలగిస్తారు. ➺ వీటి నివారణకు కౌన్సిలింగ్, వ్యాధిబారిన పడిన వారిని త్వరగా గుర్తించడం లాంటివి చేస్తారు. ➺ ఇలాంటి వ్యాధులపై పరిశోధన కోసం నేషనల్ కన్సార్టియం ఫర్ రిసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆన్ థెరాప్యూటిక్స్ ఫర్ రేర్ డిసీజెస్ (NCRDTRD) ను ఏర్పాటు చేస్తారు. ➺ చికిత్సలో వాడే ఔషధాలను దేశీయంగా ఉత్పత్తి చేస్తారు.



వ్యాధుల నివారణ, నిర్మూలన: అందరికీ ఆరోగ్యాన్ని అందించడంలో భాగంగా ప్రభుత్వం వ్యాధుల నివారణ, నిర్మూలనకు వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తోంది. వీటిలో పుట్టుకతో వచ్చే జన్యువ్యాధులకు ప్రత్యేక విధానాలను తీసుకొచ్చింది. కొన్ని జన్యువ్యాధులకు చికిత్సతో పాటు ఇవి తర్వాత తరానికి సంక్రమించకుండా అనేక కార్యక్రమాలను ప్రారంభించింది.

క్రోమోజోమ్ సంఖ్యలో మార్పు వల్ల కలిగే వ్యాధులు

ఆరోగ్యవంతుడైన వ్యక్తిలో 23 జతల (46) క్రోమోజోములు ఉంటాయి. క్రోమోజోమ్ సంఖ్యలో ఒకటి ఎక్కువగా లేదా తక్కువగా ఉండటం వల్ల అనేక రకాల వ్యాధులు కలుగుతాయి. ఈ రకమైన వ్యాధిగ్రస్థుల్లో క్రోమోజోమ్‌ల సంఖ్య 45 లేదా 47 ఉండవచ్చు. ఈ వ్యాధులను తిరిగి రెండు రకాలుగా విభజించారు. అవి.. 1) ఆటోజోమ్‌ల సంఖ్యలో మార్పు వల్ల కలిగే వ్యాధులు 2) అల్లోజోమ్‌ల సంఖ్యలో మార్పు వల్ల కలిగే వ్యాధులు.

ఆటోజోమల్ వ్యాధులు: ఆటోజోమ్‌లనే 'శారీరక క్రోమోజోమ్‌లు' అంటారు. వీటి సంఖ్య 22 జతలు లేదా 44 క్రోమోజోమ్‌లు. ఇవి స్త్రీ, పురుషుల్లో ఒకే రకంగా ఉంటాయి. ఆటోజోమల్ వ్యాధులు స్త్రీ, పురుషుల్లో ఇద్దరిలో కనిపిస్తాయి. వీటికి ఉదాహరణ.-




డౌన్ సిండ్రోమ్: ఈ వ్యాధిలో 21వ క్రోమోజోమ్ జతకు ఒకటి ఎక్కువగా ఉంటుంది. అంటే 21వ క్రోమోజోమ్‌లు మూడు ఉంటాయి. వీరిలో మొత్తం 47 క్రోమోజోమ్‌లు ఉంటాయి.

ఎడ్వర్డ్ సిండ్రోమ్: ఇలాంటి వ్యాధిగ్రస్థుల్లో 18వ క్రోమోజోమ్ జతకు ఒక క్రోమోజోమ్ అదనంగా ఉంటుంది. అంటే వీరికి 18వ క్రోమోజోమ్‌లు 3 ఉంటాయి. ఈ సిండ్రోమ్ వ్యక్తుల్లో మొత్తం క్రోమోజోమ్‌లు 47.

పాటవ్ సిండ్రోమ్: ఈ వ్యాధితో బాధపడే వారి క్రోమోజోమ్‌ల సంఖ్యలో 13వ క్రోమోజోమ్ జతకు ఒక క్రోమోజోమ్ ఎక్కువగా ఉంటుంది. వీరిలో 13వ క్రోమోజోమ్‌లు 3 ఉంటాయి. ఈ వ్యాధిలో మొత్తం క్రోమోజోమ్‌లు 47..


అల్లోజోమల్ వ్యాధులు: అల్లోజోమ్‌లనే 'లైంగిక క్రోమోజోమ్‌లు' అంటారు. వీటి సంఖ్య 2 లేదా ఒక జత. ఇవి స్త్రీలలో xxగా, పురుషుల్లో xyగా ఉంటాయి. వీటి సంఖ్యలో తేడా రావడం వల్ల అంటే ఎక్కువ లేదా తక్కువ కావడం వల్ల కలిగే వ్యాధులను 'అల్లోజోమల్ వ్యాధులు' అంటారు. వీటికి ఉదాహరణ..

44 xyy సిండ్రోమ్: మగవారిలో ఒక y క్రోమోజోమ్ అధికంగా ఉండటం వల్ల ఈ వ్యాధి కలుగుతుంది. అంటే వీరిలో 2y క్రోమోజోమ్‌లు ఉంటాయి. ఈ వ్యాధిగ్రస్థుల్లో ఉండే మొత్తం క్రోమోజోమ్‌లు 47 (44 + xyy)



క్లినిఫెల్టర్ సిండ్రోమ్: ఇది మగవారిలో ఒక x క్రోమోజోమ్ అధికంగా ఉండటం వల్ల కలుగుతుంది. సాధారణంగా ఆరోగ్యవంతుడైన పురుషుడిలో xy అల్లోజోమ్‌లు ఉంటాయి. ఈ వ్యాధిగ్రస్థుల్లో వీటితోపాటు అదనంగా ఒక x క్రోమోజోమ్ ఉంటుంది. (44 + xxy) అంటే వీరిలో మొత్తం క్రోమోజోమ్‌లు 47.

టర్నర్ సిండ్రోమ్: ఇది స్త్రీలలో ఒక x క్రోమోజోమ్ లోపించడం వల్ల కలుగుతుంది. సాధారణంగా స్త్రీలల్లో అల్లోజోమ్‌లు xxగా ఉంటాయి. టర్నర్ సిండ్రోమ్ బాధిత స్త్రీలల్లో ఈ క్రోమోజోముల్లో ఒక x ఉండదు. (44 + x) వీరిలో ఉండే మొత్తం క్రోమోజోమ్‌లు 45 మాత్రమే.



44 xxx సిండ్రోమ్: దీన్ని 'ట్రిపుల్ ఎక్స్ సిండ్రోమ్' అని కూడా అంటారు. ఇది స్త్రీలలో అదనంగా ఒక x క్రోమోజోమ్ ఉండటం వల్ల కలుగుతుంది. వీరిలో మొత్తం క్రోమోజోమ్‌లు 47 (44+xxx).



రచయిత: డాక్టర్ బి.నరేష్

'దేవుడు ఒక్కడే.. అందరూ ఆయన సంతానమే'

జనరల్ స్టడీస్ - భారతదేశ చరిత్ర



మధ్యయుగంలో భారతదేశంలో మతమౌఢ్యం విస్తరించి కఠిన ఆచారాలు, దురాచారాలు పుట్టుకొచ్చాయి. హిందూ సమాజంలో కులవివక్ష, అంతరానితనం పెచ్చుమీరాయి. ఆధ్యాత్మిక జ్ఞానానికి మహిళలు, నిమ్నజాతుల వారు అనర్హులనే భావన స్థిరపడింది. ఇలాంటి పరిస్థితుల్లో ప్రజల్లో పెరిగిపోయిన అశాంతిని తొలగిస్తూ వచ్చిన సామాజిక, సాంస్కృతిక సంస్కరణే భక్తి ఉద్యమం. భారతీయ సమాజాన్ని సంస్కరించి అందరూ అనుసరించదగిన భక్తిమార్గాన్ని నిర్దేశించింది. ప్రజల్లో ఆత్మవిశ్వాసాన్ని, మత సామరస్యాన్ని, మహిళలకు ప్రాధాన్యాన్ని పెంచిన ఈ ఆధ్యాత్మిక విప్లవ క్రమాన్ని పోటీ పరీక్షార్థులు తెలుసుకోవాలి. సమతను, సోదరభావాన్ని వృద్ధి చేసిన నాటి భక్తి ఉద్యమకారులు, వారి సిద్ధాంతాలు, బోధనలు, చేసిన రచనలు తదితరాలను గుర్తుంచుకోవాలి.

భక్తి ఉద్యమం

1. కింది వాక్యాలను పరిశీలించి, సరైనవి గుర్తించండి?
   1) ద్వైతం - జీవుడు వేరు, దేవుడు వేరు.
   2) విశిష్టాద్వైతం - జీవుడు దేవుడిలోని అంశ.
   3) అద్వైతం - జీవుడే దేవుడు.
   4) పైవన్నీ

2. కింది వాటిలో భిన్నమైంది గుర్తించండి?
   1) మధ్వాచార్యులు 2) శంకరాచార్య
   3) విష్ణుమూర్తి 4) రామానుజాచార్య

3. కింది వాక్యాలను పరిశీలించి, సరైన సమాధానం గుర్తించండి?



   ఎ) ప్రపంచం అనేది భ్రమ కాదు, వాస్తవం. బ్రహ్మ ఆత్మ, పదార్థాలనేవి ప్రకృతిలో ప్రత్యేకమైనవి - మధ్వాచార్య
   బి) భగవాన్ శ్రీకృష్ణుడి మీద అపారమైన భక్తి ఉంది - వల్లభాచార్య
   సి) శ్రీ భాష్యం పేరుతో బ్రహ్మసూత్రాలు - రామానుజాచార్యులు
   డి) మానవులంతా సమానమే. కులం లేదు ఉపకులం లేదు - బసవేశ్వరుడు
   1) ఎ, బి, సి 2) ఎ, బి, సి, డి
   3) బి, సి, డి 4) ఎ, బి, డి

4. కింది వాటిలో చైతన్య మహాప్రభునకు సంబంధించింది?
   ఎ) ఇతడిని 'శ్రీగౌరంగ' అంటారు.
   బి) భారతదేశంలో అనేక ప్రాంతాలు సందర్శించారు.
   సి) 'దేవుడు ఒక్కడే - ఆయన హరి'
   డి) హరేకృష్ణ మంత్రం ప్రచారం చేశారు.
   1) ఎ, బి, సి, డి 2) బి, సి, డి
   3) సి, డి 4) ఎ, డి

5. కింది వాటిలో 'సూఫీయిజం' లక్షణం కానిది?
   1) దేవుడు ఒక్కడే.. అందరూ దేవుడి సంతానమే.
   2) సాటి మానవుడిని ప్రేమించడం అంటే భగవంతుడిని ప్రేమించడం.
   3) వహదాత్-ఉల్-అజాద్ అంటే బహుదేవతారాధన.
   4) సంగీతం ద్వారా దేవుడి సన్నిధికి చేరవచ్చు.

6. 'నామ్‌ఘర్'లను ప్రారంభించినవారు?
   1) శంకర దేవుడు 2) నామ్‌దేవుడు
   3) జ్ఞానేశ్వర్ 4) ఎవరూకాదు

7. కింది వాటిలో భిన్నమైంది గుర్తించండి?
   1) ఖ్వాజా మొయినుద్దీన్ చిస్తీ
   2) ఫరీదుద్దీన్-గంజ్-ఇ-షకర్
   3) అల్లావుద్దీన్ ఖిల్జీ 4) షేక్ నిజ్మతుల్లా

8. భక్తి ఉద్యమ ప్రధాన లక్షణాలు..
   ఎ) భగవంతుడు ఒక్కడే.
   బి) తనకు తాను దేవుడికి సమర్పించుకోవడం.
   సి) భక్తి ఉద్యమకారులు భక్తిని స్థానిక భాషల్లో బోధించారు.
   డి) మోక్షాన్ని భక్తి ద్వారా సాధించాలి.
   1) ఎ, బి, సి, డి 2) ఎ, బి, సి
   3) ఎ, డి 4) ఎ, సి, డి

9. కింది సిద్ధాంతాలు, వాటిని ప్రచారం చేసిన వారితో జత చేయండి.
   1) శంకరాచార్య ఎ) విశిష్టాద్వైతం
   2) రామానుజాచార్య బి) ద్వైతం
   3) మధ్వాచార్యులు సి) అద్వైతం
   4) వల్లభాచార్య డి) శుద్ధ అద్వైతం
   1) 1-ఎ, 2-బి, 3-సి, 4-డి 2) 1-బి, 2-ఎ, 3-డి, 4-సి
   3) 1-సి, 2-ఎ, 3-బి, 4-డి 4) 1-డి, 2-సి, 3-బి, 4-ఎ

10. బసవేశ్వరుడికి సంబంధించి సరైనవి గుర్తించండి?
   ఎ) ఇతడు కర్ణాటక రాష్ట్రానికి చెందినవాడు.
   బి) వీరశైవ సంప్రదాయాన్ని ప్రచారం చేశాడు.
   సి) ఇతడి రచనలను 'వచనములు' అంటారు.
   డి) 'మానవులంతా సమానమే కులం లేదు ఉపకులం లేదు' అన్నాడు.
   1) ఎ, సి, డి 2) ఎ, బి, సి, డి
   3) ఎ, బి, సి 4) ఎ, డి

11. కింది వాటిని గుర్తించండి?



   ఎ) కబీర్ - దేవుడి ఎదుట అందరూ సమానమే
   బి) సంత్ రవిదాస్ - హరిలో అందరూ అందరిలోనూ హరి
   1) ఎ, బి సరైనవి. 2) ఎ, బి సరికావు.
   3) ఎ సరికాదు, బి సరైంది.
   4) ఎ సరైంది, బి సరికాదు.

12. 'శ్రీగౌరంగ' అంటే ఎవరు?
   1) శంకరదేవుడు 2) గురునానక్
   3) చైతన్య మహాప్రభు 4) మీరాబాయి

13. కింది వాటిలో సూఫీయిజం లక్షణం కానిది?
   1) వహదాత్-ఉల్-ఉజాద్ 2) దేవుడు ఒక్కడే
   3) సాటి మానవులను ప్రేమించడం
   4) విగ్రహారాధన చేయరాదు

14. కింది వాటిలో భిన్నమైనవారు?
   1) నిజాముద్దీన్ ఔలియా
   2) ఖ్వాజాపీర్ మహమ్మద్
   3) ఖలీఫా వాలిద్ 4) షేక్ నిజ్మతుల్లా

15. కింది వాటిని పరిశీలించండి?



   ఎ) నామ్‌దేవుడు - పండరీపురానికి చెందిన విఠోబా భక్తుడు
   బి) జ్ఞానేశ్వరుడు - భగవత్ దీపిక అనే వ్యాఖ్యానం రాశారు
   సి) శంకరదేవుడు - నామ్‌ఘర్‌లను స్థాపించారు.
   1) ఎ, బి, సి, సరైనవి.
   2) ఎ, బి, సరైనవి; సి సరికాదు.
   3) ఎ సరైంది; బి, సి సరికావు.
   4) ఏదీకాదు.

16. కింది వాటిని జతచేయండి.
   1) శంకరాచార్య ఎ) కేరళ
   2) రామానుజాచార్య బి) తమిళనాడు
   3) మధ్వాచార్య సి) కర్ణాటక
   4) రామానందుడు డి) ప్రయాగ
   1) 1-ఎ, 2-బి, 3-సి, 4-డి 2) 1-డి, 2-సి, 3-బి, 4-ఎ
   3) 1-ఎ, 2-సి, 3-డి, 4-బి 4) 1-డి, 2-సి, 3-ఎ, 4-బి

17. కింది వాటిలో చైతన్యమహాప్రభు సందర్శించిన ప్రాంతం కానిది?
   1) పండరీపురం 2) సోమనాథ్
   3) మధుర 4) కేదర్‌నాథ్

18. కింది వాటిని జతపరచండి.
   1) తుకారాం ఎ) విఠోబా భక్తుడు
   2) చైతన్యుడు బి) వైష్ణవ భక్తి ఉద్యమకారుడు
   3) జయదేవుడు సి) గీతాగోవిందం
   4) మీరాబాయి డి) భోజరాజు భార్య
   1) 1-ఎ, 2-బి, 3-సి, 4-డి 2) 1-డి, 2-సి, 3-బి, 4-ఎ
   3) 1-ఎ, 2-బి, 3-డి, 4-సి 4) 1-ఎ, 2-సి, 3-డి, 4-బి

19. శంకరాచార్యుడి గురించి పరిగణించండి.




   ఎ) ఇతడు భక్తి ఉద్యమానికి మూలకారకుడు.
   బి) మోక్ష సాధన కోసం జ్ఞానమార్గం ప్రబోధించారు.
   సి) హిందూ మత రక్షకుడిగా పేర్కొంటారు.
   డి) మైసూర్, ద్వారక, పూరి, బదిరి వద్ద మఠాలు ఏర్పాటు చేశారు.
   1) ఎ, బి, డి 2) ఎ, బి, సి, డి
   3) ఎ, బి, సి 4) ఎ, సి

20. కింది వాటిలో రామానుజాచార్యకు సంబంధించి సరికానిది?
   1) భక్తి ఉద్యమానికి 2వ గొప్ప ప్రతినిధి.
   2) 1017లో జన్మించారు.
   3) భక్తి ఉద్యమంలో విశిష్టాద్వైతాన్ని ప్రబోధించారు.
   4) ఇతడు ప్రముఖ శివ భక్తుడు.

21. రాధా మాధవ భక్తిని ప్రచారం చేసినవారు?
   1) నింబార్కుడు 2) రామానందుడు
   3) మధ్వాచార్యుడు 4) రవిదాసు

22. కింది వాటిలో నింబార్కుడు గురించి సరైనవి గుర్తించండి?
   ఎ) ద్వైతాద్వైతాన్ని ప్రబోధించారు.
   బి) వేదాంత సౌరభ అనే పేరుతో బ్రహ్మసూత్రాలపై వ్యాఖ్యానం రాశారు.
   సి) మధుర సమీపంలో బ్రజా వద్ద స్థిరపడ్డారు.
   డి) ఇతడు శంకరాచార్యులకు సమకాలీనుడు.
   1) బి, డి 2) ఎ, బి, డి
   3) ఎ, బి, సి 4) ఎ, సి, డి

23. 'ఆనంద భాష్యం'ను ఎవరు రచించారు?



   1) నింబార్కుడు
   2) రామానందుడు
   3) రవిదాస్
   4) కబీర్

24. రామానందుడి గురించి సరైనవి గుర్తించండి?
   ఎ) 14వ శతాబ్దానికి చెందినవారు - దక్షిణ భారత దేశం
   బి) భక్తి ప్రచారంలో హిందీ భాషను ఎంచుకున్నారు.
   సి) అన్ని కులాల వారిని శిష్యులుగా స్వీకరించారు.
   డి) మహిళలు వైష్ణవ మతంలో చేరడానికి ద్వారాలు తెరిచారు.
   1) ఎ, బి, డి 2) ఎ, బి, సి
   3) ఎ, బి, సి, డి 4) ఎ, డి

25. కింది వారిలో భిన్నమైనవారు?
   1) కబీర్ 2) వల్లభాచార్య
   3) త్యాగరాజు 4) రామానుజాచార్య

26. 'జత్‌పాత్ పూచేన కోయీ హరికో భజేహర కోయీ' ఎవరి బోధన?
   1) మధ్వాచార్య 2) రామానందుడు
   3) రవిదాసు 4) కబీర్

27. కింది వాటిని జతపరచండి.
   1) సూర్‌దాస్ ఎ) మూల్‌మంతర్
   2) గురునానక్ బి) గీతాప్రస్థాన్
   3) మధ్వాచార్యుడు సి) వినయపత్రిక
   4) తులసీదాస్ డి) సూర్‌సరావళి
   1) 1-డి; 2-ఎ; 3-బి; 4-సి 2) 1-ఎ; 2-బి; 3-సి; 4-డి
   3) 1-డి; 2-సి; 3-బి; 4-ఎ 4) 1-డి; 2-ఎ; 3-సి; 4-బి

28. కింది వాటిని జతపరచండి.
   1) చిస్తీ ఎ) షేక్ నజీరుద్దీన్
   2) సుహ్రావర్ది బి) బహాఉద్దీన్ ఆరిఫ్
   3) నక్షాబందీ సి) ఖ్వాజా-బాక్వీ-బిలాహ్
   4) ఖాద్రి డి) షేక్ - అబ్దుల్ - ఖాద్రి - జిలాని
   1) 1-ఎ; 2-బి; 3-సి; 4-డి 2) 1-డి; 2-సి; 3-బి; 4-ఎ
   3) 1-ఎ; 2-బి; 3-డి; 4-సి 4) 1-డి; 2-సి; 3-ఎ; 4-బి

29. 'జ్ఞానలీలా', 'యోగా చింతామణి' అనే గ్రంథాలను రచించినవారు?
   1) కబీర్
   2) గురునానక్
   3) రామానందుడు
   4) నింబార్కుడు



రచయిత: గద్దె నరసింహారావు

సమాధానాలు

1-4; 2-3; 3-2; 4-1; 5-3; 6-1; 7-3; 8-1; 9-3; 10-2; 11-1; 12-3; 13-4; 14-3; 15-1; 16-1; 17-4; 18-1; 19-2; 20-4; 21-1; 22-3; 23-2; 24-3; 25-3; 26-2; 27-1; 28-1; 29-3.

(c) eenadu

భౌతికశాస్త్రం అంటే పదార్థ ధర్మాలు, శక్తి గురించి అధ్యయనం చేసే విజ్ఞానశాస్త్ర విభాగం. నిత్య జీవితంలో కొలతలు ప్రాముఖ్యతను కలిగి ఉంటాయి. ఎందుకంటే ఉదయం లేస్తూనే సమయం చూడటం దగ్గరి నుంచి, కొనే పాలు, వాహనాల్లో నింపే పెట్రోల్... ఇలా ప్రతిదీ కొలతలతోనే ముడిపడి ఉంటుంది. ఒక భౌతిక రాశిని కచ్చితంగా వ్యక్తపరిచేందుకు సరైన యూనిట్ లేదా ప్రమాణం తప్పనిసరి. కొలతలు, వాటి రకాలు, ప్రాధాన్యతతో పాటు ఆయా భౌతిక రాశులను ఎలాంటి ప్రమాణాలతో కొలుస్తారు తదితర విషయాలపై పోటీపరీక్షార్థులు అవగాహన కలిగి ఉండాలి.



ఏపీపీఎస్సీ పరీక్షల ప్రత్యేకం
ఫిజిక్స్

పరిమాణం సరిపోతే 'అదిశ'.. దిశతోనూ వర్ణిస్తే 'సదిశ'!

కొలతలు - ప్రమాణాలు

భౌతిక రాశులు

ఏ రాశులను అయితే కొలవగలమో వాటిని 'భౌతిక రాశులు' అంటారు.

ఉదా: పొడవు, ద్రవ్యరాశి, వైశాల్యం, ఘనపరిమాణం, కాలం మొదలైనవి.

✦ భౌతిక రాశులను కొలిచేందుకు ఒక ప్రామాణిక రాశితో పోలుస్తారు. దీన్నే యూనిట్ అంటారు.

✦ కొలవడానికి వీలు లేకపోతే అవి భౌతిక రాశులు కావు.

ఉదా: ఆకలి, దప్పిక, కోపం, ప్రేమ మొదలైనవి.

ప్రాథమిక రాశి: ఏ భౌతిక రాశి అయితే స్వతంత్రంగా ఉంటూ ఇతర రాశులపై ఆధారపడదో దాన్ని ప్రాథమిక రాశి అంటారు. ప్రాథమిక రాశుల ప్రమాణాలను 'ప్రాథమిక ప్రమాణాలు' అంటారు.

ఉత్పన్న రాశులు: ఏ భౌతిక రాశి ఇతర రాశులపై ఆధారపడి ఉంటుందో, అదేవిధంగా ప్రాథమిక రాశుల నుంచి నిర్వచించే వాటిని 'ఉత్పన్న రాశులు' అంటారు. ఈ రాశుల ప్రమాణాలను 'ఉత్పన్న ప్రమాణాలు' అంటారు.

ప్రాథమిక రాశులు - ప్రామాణిక పద్ధతులు

ప్రాథమిక రాశులను కొలవడానికి, నిర్వచించడానికి కొన్ని ప్రామాణిక పద్ధతులు ఉంటాయి. మొదటగా కేవలం మూడు భౌతిక రాశులను మాత్రమే పరిగణనలోకి తీసుకున్నారు. అవి:

- పొడవు (Length)
- ద్రవ్యరాశి (Mass)
- కాలం (Time)

F.P.S. పద్ధతి: ఈ పద్ధతిలో పొడవును అడుగుల్లో, ద్రవ్యరాశిని పౌండ్లలో, కాలాన్ని సెకన్లలో కొలుస్తారు. బ్రిటిష్‌వారు పరిపాలించిన చాలా దేశాల్లో ఈ పద్ధతి అమల్లో ఉండేది. నేటికీ వాడుక భాషలో పొడవు, ఎత్తు లేదా లోతులను అడుగుల్లోనే చెబుతుంటాం.

C.G.S. పద్ధతి: ఈ పద్ధతిలో పొడవును సెంటీమీటర్లలో, ద్రవ్యరాశిని గ్రాముల్లో, కాలాన్ని సెకన్లలో కొలుస్తారు.

M.K.S. పద్ధతి: ఈ పద్ధతిలో పొడవును మీటర్లలో, ద్రవ్యరాశిని కిలోగ్రాముల్లో, కాలాన్ని సెకన్లలో కొలుస్తారు. C.G.S. పద్ధతిలో చిన్న ప్రమాణాలు ఉండటం వల్ల రోజువారీగా ఆ ప్రమాణాల్లో కొలవడం కష్టం కాబట్టి M.K.S. పద్ధతిని కనుక్కున్నారు.

SI పద్ధతి: శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం పెరగడం, అప్పటివరకు ఉన్న మూడు భౌతిక రాశులు అన్ని అంశాలను స్పృశించలేకపోవడంతో మరికొన్ని భౌతిక రాశులను ప్రాథమిక రాశులుగా గుర్తించారు. మొత్తం ఏడు ప్రాథమిక రాశులు, రెండు పూరక రాశులు లేదా అనుబంధ రాశులతో అంతర్జాతీయంగా SI పద్ధతిని ఏర్పాటు చేశారు.

ప్రమాణాలు - పాటించాల్సిన నియమాలు

ఒక శాస్త్రవేత్త పేరును భౌతిక రాశి ప్రమాణంగా ఉపయోగించినప్పుడు, దాన్ని సంకేతంగా రాసేటప్పుడు పెద్ద అక్షరాలతోనే రాయాలి.

ఉదా: న్యూటన్ (N), కెల్విన్ (K), పాస్కల్ (Pa).

- శాస్త్రవేత్త పేరు కాకుండా వేరే ప్రమాణాన్ని వాడినప్పుడు ఎల్లప్పుడూ చిన్న అక్షరంతోనే రాయాలి. **ఉదా:** మీటరు (m), సెకన్ (s).
- ఒకవేళ శాస్త్రవేత్త పేరును ప్రమాణంగా ఉపయోగిస్తూ, ఇతర ప్రమాణాన్ని పూర్తిగా రాయాలంటే చిన్న అక్షరాలతో మాత్రమే రాయాలి. **ఉదా:** newton, joule, metre, second
- ప్రమాణం సంకేతాన్ని ఎల్లప్పుడూ ఏక వచనంలోనే రాయాలి. బహువచనంలో రాయకూడదు. **ఉదా:** 50 m అని రాయాలి. 50 ms అని రాయకూడదు.
- రెండు లేదా అంతకంటే ఎక్కువ ప్రమాణాలను ఉపయోగించి ఒక భౌతిక రాశిని కొలిచినట్లయితే, ఆ సంకేతాల మధ్య కొంత ఖాళీ లేదా చుక్కను ఉపయోగించాలి. **ఉదా:** న్యూటన్ మీటర్ అనే సంకేతాన్ని N m అని లేదా N.m అని రాయవచ్చు.
- ఒకవేళ ప్రమాణాల్లో హారం ఉన్నట్లయితే దాన్ని రుణ ఘాతాంకం ఉన్న ప్రమాణంలా రాయాలి. **ఉదా:** m/s^2 బదులు ms^{-2} అని రాయవచ్చు.

భౌతిక రాశులు, వాటి ప్రమాణాలు:

- పొడవు (L) - మీటరు (m)
- ద్రవ్యరాశి (M) - కిలోగ్రాం (kg)
- కాలం (T) - సెకను (s)
- పదార్థ పరిమాణం - మోల్ (mol)
- కాంతి తీవ్రత - కాండిలా (cd)
- విద్యుత్ ప్రవాహం (I) - ఆంపియర్ (A)
- ఉష్ణోగ్రత (T) - కెల్విన్ (K)

పూరక రాశులు లేదా అనుబంధ రాశులు:

సమతల కోణం - రేడియన్ (rad)
ఘన కోణం - స్టెరేడియన్ (sr)

భౌతిక రాశులు - ప్రామాణిక నిర్వచనాలు

భౌతిక రాశులను కొలవడానికి ఉపయోగిస్తున్న ప్రమాణాలను అనేక రకాలుగా నిర్వచించినప్పటికీ, SI పద్ధతిలో ప్రామాణిక నిర్వచనాలను సూచించారు. అవి:

మీటరు: సాధారణ పీడనం వద్ద క్రిప్టాన్ పరమాణువు నుంచి వెలువడే నారింజ రంగు కాంతి తరంగదైర్ఘ్యానికి 1,650,763.73 రెట్ల దూరాన్ని ఒక మీటరుగా పరిగణించవచ్చు.

కిలోగ్రాం: పారిస్‌లోని అంతర్జాతీయ తూనికలు, కొలతల ప్రయోగశాలలో 0° C వద్ద ఉంచిన ప్లాటినం - ఇరీడియం మిశ్రమ లోహ స్తూపం ద్రవ్యరాశిని ఒక కిలోగ్రాం అంటారు. దీన్ని ప్రమాణంగా తీసుకుని మిగతా తూనికలను తయారు చేస్తారు.

సెకను: సి.జి.ఎం. Cs^{133} పరమాణువు 9,192,631,770 కంపనాలు చేయడానికి పట్టే సమయాన్ని ఒక సెకను అంటారు.

భౌతిక రాశులు - రకాలు

భౌతిక రాశులను మరొక విధంగా రెండు రకాలుగా వర్గీకరించవచ్చు. అవి:

అదిశ రాశులు: ఒక భౌతిక రాశిని పూర్తిగా వర్ణించడానికి కేవలం దాని పరిమాణం సరిపోతే దాన్ని 'అదిశరాశి' అంటారు.

ఉదా: దూరం, ద్రవ్యరాశి, కాలం, వడి, సాంద్రత మొదలైనవి.

సదిశ రాశులు: ఒక భౌతిక రాశిని వర్ణించడానికి దాని పరిమాణం, దిశ రెండూ అవసరమైతే వాటిని 'సదిశ రాశులు' అంటారు.

ఉదా: స్థానభ్రంశం, వేగం, త్వరణం, బలం మొదలైనవి.



రచయిత
వట్టిపల్లి కృష్ణ కిశోర్
విషయ నిపుణులు

1001 Word of the Day

Tantamount

Telugu meaning: తుల్యమైన, సమానమైన

English meaning: The word tantamount (ట్యాన్టమౌంట్) is an adjective that describes something that is equivalent in seriousness or effect to something else.

Synonyms: Equivalent, Comparable

Antonyms: Different, Unequal

Usage: 1. Ignoring the safety guidelines in such a hazardous environment is tantamount to inviting serious accidents and legal consequences.

2. His refusal to answer the question was tantamount to admitting that he was involved in the issue.

Current Affairs



Bengaluru-based space startup GalaxEye placed its first commercial satellite 'Drishti' in orbit aboard SpaceX's Falcon-9 rocket on 3 May 2026 from Vandenberg, California. Terming it the "world's first OptoSAR satellite", the firm said the launch was a milestone in the advancement of Earth observation technologies and reinforcing India's growing capabilities in the global space sector.



Indian National Centre for Ocean Information Services (INCOIS) received the prestigious Subhas Chandra Bose 'Aapda Prabandhan Puraskar' 2025 on 2 May 2026, for its outstanding contributions to disaster management and ocean hazard early warning services. The award was presented by Union Minister of Communication Jyotiraditya M. Scindia to institute director T.M. Balakrishnan Nair.



The Finance Ministry on 2 May 2026 notified 100% foreign direct investment (FDI) in the insurance sector under the automatic route. While 100% foreign investment will be allowed in insurance companies and intermediaries, including brokers, under the automatic route, the cap is 20% for Life Insurance Corporation (LIC), said the Foreign Exchange Management (Non-debt Instruments) (Second Amendment) Rules, 2026.

Noted lyricist and writer Prasoon Joshi was appointed the chairman of Prasar Bharati, India's public service broadcaster, the ministry of information and broadcasting said on 2 May 2026. This comes months after the ministry accepted previous chairman Navneet Kumar Sehgal's resignation from the post.

For more Current Affairs: Scan QR code


కార్ల్ మార్క్స్

జనరల్ నాలెడ్జ్ స్టడీ జోన్

ఈయన జర్మనీకి చెందిన ప్రముఖ తత్వవేత్త, ఆర్థికవేత్త, చరిత్రకారుడు, సామాజిక శాస్త్రవేత్త. ఆర్థిక వ్యవస్థల స్వభావం, వర్గ సంబంధాలు, సామాజిక మార్పులు, మానవ ప్రవర్తనలపై అధ్యయనాలు చేసి 'మార్క్సిజాన్ని' అభివృద్ధి చేశారు. కీలకమైన పాశ్చాత్య సాంఘికశాస్త్ర భావనలకు, సిద్ధాంతాలకు మార్క్స్ పునాదులు వేశారు. అవన్నీ ఆర్థిక, విద్యా, సామాజిక రంగాలను ఎంతగానో ప్రభావితం చేశాయి. శాస్త్రీయ సామ్యవాద స్థాపకుడు; సామాజిక శాస్త్ర విభాగానికి చెందిన తొలితరం మార్గదర్శకుల్లో ఒకరైన **కార్ల్ మార్క్స్ జయంతి నేడు (మే 5).** ఈ సందర్భంగా పోటీపరీక్షల కోణంలో ఆయన జీవితంలోని ముఖ్య విషయాలు తెలుసుకుందాం..!

బాల్యం - వృత్తి జీవితం..

పూర్తి పేరు కార్ల్ హైన్రిచ్ మార్క్స్. 1818, మే 5న అప్పటి ప్రష్యా రాజ్యంలో భాగంగా ఉన్న ట్రియర్‌లోని బ్రూకెన్‌గాస్సేలో (ప్రస్తుతం జర్మనీలో ఉంది) జన్మించారు. 12 ఏళ్ల వయసు వరకు తండ్రి హెన్రిచ్ మార్క్స్ వద్దే చదువుకున్నారు. తర్వాత ట్రియర్‌లోని ఫ్రెడ్రిక్ - విల్హెల్మ్ జిమ్నాసియంలో చేరారు. కార్ల్ చిన్నతనం నుంచే సామాజిక అంశాల పట్ల ఆసక్తితో ఉండేవారు.



✦ 1835లో న్యాయశాస్త్రం అభ్యసించేందుకు బాన్ యూనివర్సిటీలో చేరారు. అక్కడ పొయిట్స్ క్లబ్ అనే రాడికల్ గ్రూప్‌లో సభ్యుడయ్యారు. తండ్రికి అది నచ్చక ఆయన్ను బెర్లిన్ యూనివర్సిటీకి మార్చారు. 1836-41 కాలంలో కార్ల్ అందులోనే ఉండి న్యాయశాస్త్రం, తత్వశాస్త్రం, చరిత్ర అభ్యసించారు. ఆ సమయంలో 'యంగ్ హెగెలియన్స్' అనే రాడికల్ గ్రూప్ ఆయన్ను ప్రభావితం చేసింది. ఆ గ్రూప్ అప్పటి రాజకీయాలు, మత సంస్థలను విమర్శిస్తూ ఉండేది.


✦ 1841లో జెనా విశ్వవిద్యాలయం నుంచి తత్వశాస్త్రంలో పీహెచ్‌డీ పట్టా అందుకున్నారు. డెమోక్రిటియన్ - ఎపిక్యూరియన్ ప్రకృతి తత్వశాస్త్రాల మధ్య వ్యత్యాసం అనే సిద్ధాంత వ్యాసానికి ఆయనకు డాక్టరేట్ లభించింది.

మార్క్స్ సంపాదకత్వం వహించిన పత్రిక వివరాలు, ఆయన ప్రముఖ రచనలు, మార్క్స్ సిద్ధాంతంలోని అయిదు సూత్రాలు, ఇతర జీవిత విశేషాలతోపాటు యూజీసీ నెట్, యూపీఎస్సీ, ఎస్ఎస్‌సీ తదితర పోటీ పరీక్షల్లో వీటి గురించి అడిగిన పలు ప్రశ్నలు - జవాబులతో రూపొందించిన ఈబుక్‌తో పాటు జనరల్ నాలెడ్జ్‌కి సంబంధించి కీలక అంశాలు, మంత్లీ కరెంట్ అఫైర్స్ ఈబుక్స్, ప్రాక్టీస్ టెస్ట్స్ 'జనరల్ నాలెడ్జ్ & కరెంట్ అఫైర్స్ కోర్సు'లో అందుబాటులో ఉన్నాయి. వివరాల కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

జనరల్ స్టడీస్ - భారతదేశ సమాజం

దివ్యాంగులు

సమాజం ఆమోదించిన ప్రవర్తనా రీతులను కాకుండా ఆలోచన, ప్రత్యక్ష, సంజ్ఞానాత్మక ఉద్వేగపరమైన అసమతుల లక్షణాలుంటే ఆ స్థితిని మానసిక అనారోగ్యం అంటారు. దివ్యాంగులు సాధారణ వ్యక్తుల్లా సమాజంలో ఉన్న అవకాశాలు, వనరులను వినియోగించుకోలేరు. వివక్షకు, సామాజిక వెలికి గురవుతున్నారు.



వైకల్యం అనేది శారీరకంగా లేదా మానసికంగా ఉంటుంది. వినలేకపోవడం, చూపు లేకపోవడం, మాటలు రాకపోవడం, నడవలేకపోవడం, కాళ్లు, చేతులకు సంబంధించినవి శారీరక వైకల్యాలు. అయితే బుద్ధిమాంద్యం (మెంటల్ రిటార్డేషన్) అనేది పిల్లల్లో ప్రజ్ఞ తక్కువగా ఉండటం వల్ల ఏర్పడే మానసిక వైకల్యం.

నిర్వచనాలు, ప్రాథమిక భావనలు

వికలాంగులు అనడానికి బదులు ప్రత్యేక సామర్థ్యం కలిగినవారు లేదా దివ్యాంగులు అని పిలుస్తున్నారు.

- దివ్యాంగుల సంక్షేమం అనేది కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వ శాఖ పరిధిలోకి వస్తుంది. ఒక వ్యక్తి సాధారణ స్థితిలో చాటుకునే సామర్థ్యాన్ని చూపెట్టలేకపోవడాన్ని వికలాంగత్వం లేదా అశక్తత అని కూడా అంటారు. ఒకటి కంటే ఎక్కువ వైకల్యాలు ఉంటే బహుళ వైకల్యం అంటారు.

ఉదా: మాట్లాడలేకపోవడం, వినలేకపోవడం

అభ్యసన వైకల్యం:

అభ్యసన వైకల్యం అనే పదాన్ని మొదటిసారి శ్యామూల్ కిర్క్ ప్రవేశపెట్టారు. ప్రత్యేక అవసరాలున్న పిల్లలను డోర్ 12 రకాలుగా వర్గీకరించారు. అభ్యసన వైకల్యం అనేది భాష/చదవడం/రాయడం లేదా గణితానికి సంబంధించింది.

అశక్తతల రూపాలు, మాట్లాడటం, భాషాపరమైన సమస్యలు, పఠన వైకల్యం, రాతపరమైన సమస్యలు, జన్యుపరమైన కారణాల వల్ల వచ్చే ముఖ్యమైన అశక్తతలు, భారతదేశంలో అశక్తతల తీవ్రత, వికలాంగుల కోసం పనిచేస్తున్న సంస్థలు మొదలైన అంశాలతో పాటు మాదిరి ప్రశ్నలతో సహా పూర్తి సమాచారం 'ఈనాడు ఈప్రతిభ' వెబ్‌సైట్‌లో 'జనరల్ స్టడీస్ ఈ-బుక్స్' కోర్సులో అందుబాటులో ఉంది. మరిన్ని వివరాలకు క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

Latest Updates

Officer Grade-B Posts

Reserve Bank of India Services Board (RBISB) released a short notification for the recruitment of Officers in Grade 'B' (Direct Recruit - DR) for the panel year 2026. The total number of posts is 60. The application fee is Rs.850 + GST. Eligible candidates can apply online before 20 May 2026.

Assistant Executive Posts

NTPC Limited, New Delhi, is inviting applications for recruitment to the post of Assistant Executive on a fixed-term basis. The total number of posts is 250. The application fee is Rs.500. The last date for online applications is 7 May 2026.

NTA - JIPMAT 2026 Admissions

The National Testing Agency (NTA) has released the notification for the Joint Integrated Program in Management Admission Test (JIPMAT) - 2026 for admissions to the Integrated Program in Management (IPM) offered jointly by IIM Bodh Gaya and IIM Jammu for the academic year 2026 - 2027. The application fee is Rs.2200. Eligible candidates can apply online before 10 May 2026.

Did You Apply..?

Today (May 5) is the last date for the following Jobs

✦ 43 Senior Assistant Engineer Posts at BEL. ***Eligibility:*** Diploma.

✦ 30 Officer posts in Punjab National Bank. ***Eligibility:*** B.E./B.Tech.

For more information and other notifications - scan QR code

Time, Distance & Speed

1. If a man travels to Railway station from his home by scooter at a speed of 40 km/hr, he missed the train by 30 min and if he travels at a speed of 60 km/hr he reached the station 10 min before the train arrival. What is the minimum speed to catch the train on time?

A) $50\frac{1}{3}$ km/hr B) $53\frac{1}{3}$ km/hr
C) $54\frac{1}{3}$ km/hr D) $57\frac{1}{3}$ km/hr
E) None of the above

2. A person can cover a certain distance in 2 hrs 12 min by covering $\frac{2}{5}$ of the distance at 12 km/hr and the remaining distance at 15 km/hr. Find the total distance.

A) 30 km B) 40 km C) 27 km
D) 50 km E) 42 km

3. Ramu starts his journey from Bengaluru to Chennai and Simultaniously Gopi starts from Chennai to Bengaluru. After crossing each other they finish their remaining distance in $1\frac{5}{7}$ hrs and $2\frac{1}{3}$ hrs respectively. What is Gopi speed if Ramu speed is 42 km/hr?

A) 30 km/hr B) 33 km/hr
C) 36 km/hr D) 40 km/hr
E) 52 km/hr

4. Aravind travels from town A to town B and Surabhi from town B to town A, both starting at the same time along the same route. After meeting each other, Aravind takes 6 hrs to reach town B while Surabhi takes 24 hrs to reach town A. If Aravind travelled at a speed of 54 km/hr then the distance in km between town A and town B.

A) 952 km B) 972 km
C) 1072 km D) 1052 km
E) 911 km

5. A policeman noticed a thief at a distance 150 m. The thief starts running and the policeman chases him. The policeman and the thief run at a speed 12 km/hr and 9 km/hr respectively. In which distance the policeman catches the theif.

A) 450 m B) 600 m C) 500 m
D) 550 m E) 300 m

6. Two persons P and Q walk form A to B, a distance of 27 km at 5 km/hr and 4 km/hr speed respectively P reaches at B and returned immediately and meets Q at C. Find the distance from A to C.

A) 30 km B) 24 km C) 27 km
D) 22 km E) 21 km

Bank Exams

Quantitative Aptitude

7. Ravali rides her bike at an average speed of 40 km/hr and reaches her destination in 7 hours. Padma covers same distance in 5 hours. If Ravali increases her average speed by 10 km/hr and Padma increases by 4 km/hr. What would be the difference in their time to reach distination.

A) 50 min B) 52 min C) 54 min
D) 56 min E) 39 min

8. If Vijay started at his usual time and went to his office by cycle at a speed of 12 km/hr, he would arrive at his destination at 2 PM. If the speed at 6 km/hr, starting 2 hours early then he would reach at 5 PM. If he started at 9 AM and cycled at 25 km/hr, at what time he would reach his destination.

A) 11 hrs 15 min B) 11 hrs 24 min
C) 11 hrs 30 min D) 12 hrs 24 min
E) None of the above

9. Length of train A is 60 mts less than train B and they cross a pole in 24 sec and $\frac{108}{7}$ sec respectively. If speed of train B is 126 km/hr and length of a bridge is $\frac{5}{9}$ th length of train B, then find the time taken by train A to cross the bridge.

A) 12 sec B) 20.5 sec C) 39 sec
D) None E) 18 sec

10. A train passes a platform 80 mts long in 28 sec and a man standing on plotform in 19 sec. Then the speed of train is how much.

A) 32 km/hr B) 30 mts/sec
C) 32 mts/sec D) 30 km/hr
E) None of the above

11. A train 120 m long at a speed of 54 km/hr crosses another train 128 m long coming from opposite direction in 8 sec. What is the speed of second train?

A) $54\frac{3}{5}$ km/hr B) $54\frac{5}{3}$ km/hr
C) $57\frac{5}{3}$ km/hr
D) $57\frac{3}{5}$ km/hr
E) None of the above

Scan the QR code for Key

These model questions were prepared by
Dr. Vangala Srinivas, Subject Expert

(c) eenadu

చదువు
■ e-mail: edc@eenadu.in
21
మంగళవారం మే 5, 2026
ఈనాడు

బోధన, పరిశోధనలకు నెట్ ప్రామాణికం

మీరు చదువుకున్న సబ్జెక్టుల్లో ఎంత సమర్థులో చెప్పడానికి నేషనల్ ఎలిజిబిలిటీ టెస్టు(నెట్) ప్రామాణికంగా నిలుస్తోంది. ఈ స్కోరుతో బోధన రంగంలో అత్యున్నత అవకాశాలు సొంతం చేసుకోవచ్చు. అలాగే ప్రతి నెలా స్టైపెండ్ అందుకుంటూ పరిశోధనల్లో కొనసాగవచ్చు. యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్(యూజీసీ) ఆధ్వర్యంలో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్టీఏ) ఏటా ఈ పరీక్షను రెండు సార్లు నిర్వహిస్తోంది. ఇటీవలే జూన్-2026 ప్రకటన వెలువడింది.

నెట్ 87 సబ్జెక్టుల్లో రాసుకోవచ్చు. ఈ సారి స్టాటిస్టిక్స్ కొత్తగా చేరింది. భాషలు తప్పించి, మిగిలిన సబ్జెక్టుల ప్రశ్నపత్రాలు ఇంగ్లిష్, హిందీ మాధ్యమాల్లో ఉంటాయి. ఇందులో అర్హత సాధించడానికి 3 కేటగిరీలు ఉన్నాయి. అవసరాల ప్రకారం వాటిలో ఏదైనా ఎంచుకోవచ్చు.

కేటగిరీ-1: ఎంపికైనవారు ప్రతి నెలా యూజీసీ నిర్దేశిత స్టైపెండ్ (జేఆర్ఎఫ్) పొందుతూ పరిశోధన(పీహెచ్‌డీ) కొనసాగించవచ్చు. వీరు అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులకు, జేఆర్ఎఫ్ లేకుండా జరిపే పీహెచ్‌డీ ప్రవేశాలకూ అర్హులే.

కేటగిరీ-2: ఇందులో అవకాశం వస్తే జేఆర్ఎఫ్ దక్కదు. కానీ అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులకు, పీహెచ్‌డీ ప్రవేశాలకూ అర్హులే.

కేటగిరీ-3: వీరు పీహెచ్‌డీలో ప్రవేశానికే అర్హులు. జేఆర్ఎఫ్, అసిస్టెంట్ ప్రొఫెసర్ కోసం అర్హత ఉండదు.

పరీక్ష

ఆన్‌లైన్‌లో 300 మార్కులకు నిర్వహిస్తారు. ప్రతి ప్రశ్నకు రెండు మార్కులు చొప్పున 150 ఆబ్జెక్టివ్ ప్రశ్నలు వస్తాయి. రుణాత్మక మార్కులు లేవు. పరీక్ష వ్యవధి 3 గంటలు. పేపర్-1 టీచింగ్ అండ్ రిసెర్చ్ ఆప్టిట్యూడ్ అందరికీ ఉమ్మడిగా ఉంటుంది. ఇందులో 50 ప్రశ్నలకు వంద మార్కులు. రెండో పేపర్ 200 మార్కులకు. వంద ప్రశ్నలు వస్తాయి. ఈ ప్రశ్నాపత్రం ఎంచుకున్న విభాగం/సబ్జెక్టు నుంచి ఉంటుంది.



సన్నద్ధత

- యూజీసీ నెట్ ఆన్‌లైన్ వెబ్‌సైట్‌లో సబ్జెక్టుల వారీ సిలబస్ వివరాలు ఉంచారు. సన్నద్ధతకు అందులో పేర్కొన్న అంశాలే ప్రామాణికం.
- సంబంధిత సబ్జెక్టులో పరిజ్ఞానం ఎలా ఉందో తెలుసుకునేలా ప్రశ్నలు ఉంటాయి. వీటిని పలు అంశాల మేళవింపుతో అడుగుతారు.
- ముందుగా ప్రాథమికాంశాలను అధిక ప్రాధాన్యంతో చదవాలి. వీటిపై అవగాహన కోసం ఇంటర్మీడియట్, యూజీ(డిగ్రీ) పాఠ్యపుస్తకాలు పూర్తిగా అధ్యయనం చేయాలి. ఆ తర్వాతే పీజీ పాఠ్యాంశాలపై దృష్టి పెట్టాలి. అలాగే రిఫరెన్స్‌లు అవసరం మేరకు చదివితే సరిపోతుంది.
- ఎక్కువ ప్రశ్నలు నేరుగా కాకుండా పలు అంశాలు జోడించి అడుగుతారు. అందువల్ల సబ్జెక్టులో లోతైన పరిజ్ఞానం కోసం ప్రతి అంశాన్నీ సూక్ష్మ స్థాయిలో క్షుణ్నంగా చదవాలి. ముఖ్యాంశాలు నోట్సు రాసుకోవాలి. పరీక్షకు ముందు వీటినే మళ్లీ మననం చేసుకోవాలి.
- పరీక్షను సమర్థంగా ఎదుర్కోవడానికి గత ప్రశ్నాపత్రాలు దిక్సూచిలా నిలుస్తాయి. వీటి ద్వారా ఏ అంశాలకు ప్రాధాన్యం ఇవ్వాలి, ఏం చదవాలి, ఎలా చదవాలి, ఇంకా వేటిపై దృష్టి సారించాలో తెలుస్తుంది.
- అధ్యయనం పూర్తయిన తర్వాత కనీసం పది నమూనా పరీక్షలు రాయాలి. ఫలితాలు విశ్లేషించుకోవాలి. తప్పులు పునరావృతం కాకుండా, స్కోరు మెరుగుపర్చుకోవాలి.
- రుణాత్మక మార్కులు లేనందున తెలియని ప్రశ్నలకూ బాగా ఆలోచించి జవాబులు గుర్తించాలి. ప్రశ్నకు ఒకటి కంటే ఎక్కువ సమాధానాలు ఉన్నా, అందులో పొరపాట్లు ఉన్నా బోనస్ మార్కులు ఇస్తారు. ఏదో ఒక ఆప్షన్ సమాధానంగా గుర్తిస్తేనే ఈ మార్కులు కలుపుతారు. అందుకే అన్ని ప్రశ్నలకూ జవాబు ఇవ్వడమే మంచిది.

వివరాలు

విద్యార్హత: సంబంధిత సబ్జెక్టులో 55 శాతం మార్కులతో పీజీ. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ నాన్ క్రీమీ లేయర్, దివ్యాంగులు, థర్డ్ జెండర్లకు 50 శాతం మార్కులు చాలు. ప్రస్తుతం పీజీ కోర్సులు చదువుతున్నవారూ అర్హులే. నాలుగేళ్ల బ్యాచిలర్ కోర్సులు పూర్తిచేసుకున్నవారూ దరఖాస్తు చేసుకోవచ్చు. వీరికి డిగ్రీలో 75 శాతం మార్కులు అవసరం. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్‌లకు 70 శాతం చాలు. యూజీతో జేఆర్ఎఫ్, పీహెచ్‌డీల్లో ప్రవేశానికే అర్హులు. పీజీ లేనందున అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులకు పోటీ పడలేరు. నాలుగేళ్ల యూజీ చివరి ఏడాది కోర్సుల్లో ఉన్నవారూ దరఖాస్తు చేసుకోవచ్చు.

వయసు: అసిస్టెంట్ ప్రొఫెసర్ అర్హత పొందడానికి, పీహెచ్‌డీ ప్రవేశానికీ వయసు నిబంధన లేదు. జేఆర్ఎఫ్‌కు జూన్ 1, 2026 నాటికి 30 ఏళ్లలోపు ఉండాలి. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ నాన్ క్రీమీ లేయర్, దివ్యాంగులు, థర్డ్ జెండర్లు, మహిళలకు గరిష్ఠ వయసులో ఐదేళ్ల సడలింపు వర్తిస్తుంది.

ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ: మే 20.

దరఖాస్తు ఫీజు: జనరల్/అన్ రిజర్వ్‌డ్ రూ.1150. జనరల్(ఈడబ్ల్యూఎస్), ఓబీసీ(ఎన్‌సీఎల్) రూ.600; ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు, థర్డ్ జెండర్లకు రూ.325.

పరీక్షలు: జూన్ 22 నుంచి 30 వరకు ఉంటాయి.

వెబ్‌సైట్: https://ugcnet.nta.nic.in/

ప్రయోజనాలు

- జూనియర్ రిసెర్చ్ ఫెలోషిప్(జేఆర్ఎఫ్) అవకాశం వచ్చినవారు మేటి సంస్థల్లో పరిశోధన (పీహెచ్‌డీ)లో చేరవచ్చు. ప్రతి నెలా రూ.37,000 మొదటి రెండేళ్లు చెల్లిస్తారు. అనంతరం ఎస్ఆర్ఎఫ్‌కు అర్హత సాధిస్తే రూ.42,000 చొప్పున స్టైపెండ్ అందుతుంది. సంస్థ వసతి కల్పించకపోతే స్టైపెండ్‌లో 30 శాతం వరకు హెచ్ఆర్ఏ చెల్లిస్తారు. ఏటా కంటింజెన్సీ గ్రాంటు అందుతుంది.
- ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు, జాతీయ, రాష్ట్రీయ విశ్వవిద్యాలయాల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులకు పోటీ పడవచ్చు.
- డీమ్డ్ విశ్వవిద్యాలయాలు, ప్రైవేటు విద్యా సంస్థలు మేటి స్కోరు ఉన్నవారికి అధిక వేతనంతో ఉద్యోగాలిస్తున్నాయి.
- పలు పోటీ, ప్రవేశ పరీక్షల నిమిత్తం శిక్షణ ఇస్తోన్న సంస్థలూ ఫ్యాకల్టీ సభ్యుల ఎంపికలో నెట్ స్కోరుకు ప్రాధాన్యమిస్తున్నాయి. ఎక్కువ స్కోరుతో అధిక వేతనం ఆశించవచ్చు.
- జాతీయ స్థాయిలో ఎస్సీ, దివ్యాంగ, ఓబీసీ విభాగాల్లో నేషనల్ ఫెలోషిప్పులు పొందడానికి నెట్ అర్హత తప్పనిసరి.
- కొన్ని ప్రభుత్వ, అనుబంధ సంస్థలు (మహారత్న, నవరత్న కంపెనీలు) నెట్ స్కోరుతో మేనేజ్‌మెంట్ ట్రెయినీ హోదాతో లీగల్, హ్యూమన్ రిసోర్సెస్, మార్కెటింగ్ విభాగాల్లో ఉద్యోగాలు అందిస్తున్నాయి.
- ప్రైవేటు సంస్థల నియామకాల్లోనూ నెట్ అర్హులకు ప్రాధాన్యం లభిస్తోంది.

డిప్యూటీ మేనేజర్లు

నేషనల్ హైవేస్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఎన్‌హెచ్ఐడీసీఎల్).. డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ప్రాతిపదికన డిప్యూటీ మేనేజర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- డిప్యూటీ మేనేజర్ (టెక్నికల్): 85 పోస్టులు

అర్హత: సివిల్ ఇంజినీరింగ్‌లో డిగ్రీతో పాటు గేట్(2024/ 2025/ 2026) స్కోరు ఉండాలి. **వేతన శ్రేణి:** నెలకు రూ.50,000- రూ.1,60,000.

వయసు: 34 ఏళ్లు మించకూడదు. ఓబీసీలకు మూడేళ్లు, ఎస్సీ, ఎస్టీలకు ఐదేళ్లు, దివ్యాంగులకు 10-15 ఏళ్ల సడలింపు ఉంటుంది.

ఎంపిక: విద్యార్హతలు, షార్ట్‌లిస్ట్, గేట్ స్కోరుతో.

ఆన్‌లైన్ దరఖాస్తులు: 09.05.2026 నుంచి 08.06.2026 వరకు.

వెబ్‌సైట్: https://www.nhidcl.com/homepage

ఎన్ఐఆర్‌డీహెచ్‌లో

ఐసీఎంఆర్- నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ రిసెర్చ్ ఇన్ డిజిటల్ హెల్త్(ఎన్ఐఆర్‌డీహెచ్), దిల్లీ.. తాత్కాలిక ప్రాతిపదికన ప్రాజెక్ట్ టెక్నికల్ సపోర్ట్ పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తోంది.

- ప్రాజెక్ట్ టెక్నీషియన్ సపోర్ట్-II: 04
- ప్రాజెక్ట్ టెక్నీషియన్ సపోర్ట్-I: 03

అర్హత: పదో తరగతి తర్వాత ఎంఎల్‌టీ/డీఎంఎల్‌టీ/ఐటీఐ, ఇంటర్మీడియట్, డిగ్రీతో పాటు పని అనుభవం.

వేతనం: నెలకు ప్రాజెక్ట్ టెక్నీషియన్ సపోర్ట్-Iకు రూ.18,000; ప్రాజెక్ట్ టెక్నీషియన్ సపోర్ట్-IIకు రూ.20,000.

వయసు: ప్రాజెక్ట్ టెక్నీషియన్ సపోర్ట్-Iకు 28 ఏళ్లు; ప్రాజెక్ట్ టెక్నీషియన్ సపోర్ట్-IIకు 30 ఏళ్లు మించకూడదు. **ఇంటర్వ్యూ తేదీ:** 12.05.2026.

వేదిక: ఐసీఎంఆర్ - నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ రిసెర్చ్ ఇన్ డిజిటల్ హెల్త్, అన్సారీనగర్, న్యూదిల్లీ.

వెబ్‌సైట్: https://www.icmr.gov.in/employment-opportunities

యంగ్ ప్రొఫెషనల్స్

ఐసీఎంఆర్- రీజనల్ మెడికల్ రిసెర్చ్ సెంటర్, భువనేశ్వర్.. తాత్కాలిక ప్రాతిపదికన యంగ్ ప్రొఫెషనల్ పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలను నిర్వహిస్తోంది.

- యంగ్ ప్రొఫెషనల్-II (అడ్మిన్): 01
- యంగ్ ప్రొఫెషనల్-I (సైంటిఫిక్- బయోఇన్ఫర్మేటిక్స్): 01

అర్హత: పోస్టులను అనుసరించి ఏదైనా విభాగంలో డిగ్రీ, పీజీతో పాటు పని అనుభవం ఉండాలి.

వేతనం: నెలకు యంగ్ ప్రొఫెషనల్-Iకు రూ.30,000; యంగ్ ప్రొఫెషనల్-IIకు రూ.42,000. **వయసు:** యంగ్ ప్రొఫెషనల్-Iకు 35 ఏళ్లు; యంగ్ ప్రొఫెషనల్-IIకు 40 ఏళ్లు మించకూడదు.

ఇంటర్వ్యూ తేదీలు: మే 13, 14.

వేదిక: అనెక్స్ బిల్డింగ్ ఐసీఎంఆర్- ఆర్ఎంఆర్‌సీఎస్ఈ, చంద్రశేఖరపూర్, భువనేశ్వర్.

వెబ్‌సైట్: https://www.icmr.gov.in/employment-opportunities

సెంట్రల్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్

సెంట్రల్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ పలు పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- అకౌంట్స్ ఆఫీసర్: 01
- పర్చేస్ ఆఫీసర్: 01
- కంపెనీ సెక్రటరీ: 01

అర్హత: పోస్టును అనుసరించి సీఏ/ఐసీడబ్ల్యూఏ, బీఈ/బీటెక్, లా డిగ్రీ, ఎంబీఏ/పీజీపీఎం/పీజీడీఎంతో పాటు ఉద్యోగానుభవం ఉండాలి.

వయసు: 30 ఏళ్లు మించకూడదు.

వేతన శ్రేణి: నెలకు రూ.40,000- రూ.1,40,000.

దరఖాస్తు ఫీజు: రూ.500; ఎస్సీ, ఎస్టీ, పీడబ్ల్యూబీడీలకు ఫీజు లేదు.

ఎంపిక: రాత పరీక్ష, ఇంటర్వ్యూ, ధ్రువపత్రాల పరిశీలనలతో.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 30.05.2026

వెబ్‌సైట్: https://www.celindia.co.in/

ఐఐఎస్ఈఆర్‌లో

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రిసెర్చ్ (ఐఐఎస్ఈఆర్), మొహాలీ.. రెగ్యులర్ ప్రాతిపదికన వివిధ హోదాల్లో నాన్-టీచింగ్ ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- నాన్ టీచింగ్: 40 పోస్టులు

హోదాలు: సూపరింటెండెంట్ ఇంజినీర్, డిప్యూటీ రిజిస్ట్రార్, డిప్యూటీ లైబ్రేరియన్, సీనియర్ సూపరింటెండెంట్, నర్సు, జూనియర్ ఇంజినీర్ (సివిల్/ఎలక్ట్రికల్), జూనియర్ టెక్నికల్ అసిస్టెంట్, జూనియర్ ఆఫీస్ అసిస్టెంట్ (మల్టీ స్కిల్), అటెండెంట్.

అర్హత: పోస్టులను అనుసరించి పది/ఇంటర్/ సంబంధిత విభాగాల్లో కనీసం 50 శాతం మార్కులతో డిగ్రీ ఉండాలి. **ఎంపిక:** రాత పరీక్ష, స్కిల్ టెస్ట్ లేదా ఇంటర్వ్యూలతో.

దరఖాస్తు ఫీజు: జనరల్/ఓబీసీలకు రూ.1,298. ఈడబ్ల్యూఎస్‌లకు రూ.708. ఎస్సీ, ఎస్టీ, మహిళలు, దివ్యాంగులకు ఫీజు ఉండదు.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: జూన్ 15.

వెబ్‌సైట్: https://web.iisermohali.ac.in

ఎన్టీపీసీలో ఎగ్జిక్యూటివ్‌లు

నేషనల్ థర్మల్ పవర్ కార్పొరేషన్(ఎన్టీపీసీ) లిమిటెడ్ 250 అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ (ఆపరేషన్) పోస్టులను భర్తీచేయనుంది. ఎంపికైనవారు మూడేళ్లు విధుల్లో కొనసాగవచ్చు. బీటెక్, ఉద్యోగానుభవంతో దరఖాస్తు చేసుకోవచ్చు.



మొత్తం ఉద్యోగాల్లో.. అన్‌రిజర్వ్‌డ్‌కు 109, ఈడబ్ల్యూఎస్‌కు 25, ఓబీసీకి 39, ఎస్సీకి 42, ఎస్టీకి 35 కేటాయించారు. ముందుగా మూడేళ్ల కాలానికి తీసుకున్నప్పటికీ సంస్థ అవసరాలు, వ్యక్తిగత పనితీరుతో మరో రెండేళ్లు పొడిగించే అవకాశం ఉంటుంది. ఎంపికైనవారు ఎన్టీపీసీ ప్లాంట్లు/ భాగస్వామ్య/ అనుబంధ సంస్థల్లో ఎక్కడి నుంచైనా సేవలు అందించాలి.

ఎంపిక: విద్యార్హతలు, అనుభవంతో ఉంటుంది.

అర్హత: మెకానికల్/ ఎలక్ట్రికల్ బ్రాంచ్‌తో బీఈ/ బీటెక్ కనీసం 40 శాతం మార్కులతో పూర్తిచేయాలి. ఎస్సీ/ ఎస్టీ/ దివ్యాంగులకు పాస్ మార్కులు సరిపోతాయి. ఆపరేషన్/ పవర్ ప్లాంట్ నిర్వహణలో ఏడాది ఉద్యోగానుభవం ఉండాలి.

వయసు: 35 సంవత్సరాలు మించకూడదు. ఎస్సీ, ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీ - ఎన్‌సీఎల్‌కు మూడేళ్లు, దివ్యాంగులకు పదేళ్ల సడలింపు ఉంటుంది.

దరఖాస్తు ఫీజు: జనరల్, ఈడబ్ల్యూఎస్, ఓబీసీలకు రూ.500. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు, మాజీ సైనికోద్యోగులు, మహిళలకు ఫీజు ఉండదు.

వేతనం: నెలకు రూ.55,000 (కన్సాలిడేటెడ్). మూల వేతనానికి అదనంగా హెచ్ఆర్ఏ, నైట్‌షిఫ్ట్ అలవెన్స్, ఉద్యోగికి, కుటుంబం మొత్తానికి వైద్య సదుపాయాలు ఉంటాయి.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 07.05.2026

వెబ్‌సైట్: www.ntpc.co.in

సీఎస్ఈ బ్రాంచీతో బీటెక్ చదువుతున్నాను. దీని తర్వాత ఎల్ఎల్‌బీ చేయాలనుంది. ఈ నిర్ణయం మంచిదేనా?
- సూర్యనారాయణ.

బీటెక్ తర్వాత ఎల్ఎల్‌బీ?





కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ (సీఎస్ఈ) బ్రాంచీతో బీటెక్ పూర్తిచేసుకున్న తర్వాత ఎల్ఎల్‌బీ చేయాలనే ఆలోచన భవిష్యత్తులో వివిధ ఉపాధి అవకాశాలను పొందడానికి ఒక మంచి కెరియర్ మార్గంగా భావించవచ్చు. గతంలో ఇంజినీరింగ్ పూర్తి చేసిన వారు పూర్తిగా టెక్నికల్ రంగానికే పరిమితమయ్యేవారు. కానీ ఇప్పుడు వేగంగా మారుతోన్న ప్రపంచంలో టెక్నాలజీ ప్రతి రంగంలోనూ ప్రవేశించడంతో పాటు, ఆ టెక్నాలజీకి సంబంధించిన చట్టాలు, న్యాయ పరమైన అంశాలు కూడా ప్రాధాన్యం సంతరించుకున్నాయి. మీరు ఈ నేపథ్యంలో టెక్నికల్ విద్యతో పాటు న్యాయ విద్యను అభ్యసించడం ద్వారా ఒక ప్రత్యేకమైన నైపుణ్యం కలిగిన నిపుణుడిగా ఎదగడానికి అవకాశం ఉంది.

◆ బీటెక్ (సీఎస్ఈ) కోర్సు ద్వారా కంప్యూటర్లు, ప్రోగ్రామింగ్, డేటా, నెట్‌వర్కింగ్ లాంటి అంశాల్లో మేటి అవగాహన పొంది ఉంటారు. ఎల్ఎల్‌బీతో చట్టాలు, రాజ్యాంగం, న్యాయ వ్యవస్థ, హక్కులు, బాధ్యతలు లాంటి విషయాలను లోతుగా తెలుసుకుంటారు. డేటా చోరీ, ఆన్‌లైన్ మోసాలు, డిజిటల్ సెక్యూరిటీ లాంటి సమస్యలు పెరుగుతున్న ఈ కాలంలో టెక్నికల్ అవగాహన ఉన్న లాయర్లకు డిమాండ్ ఉంది. సాధారణ లాయర్లతో పోలిస్తే టెక్నాలజీని అర్థం చేసుకునే న్యాయ నిపుణులు కేసులను మరింత సమర్థంగా వాదించగల సామర్థ్యం కలిగి ఉంటారు.

◆ బీటెక్, ఎల్ఎల్‌బీ రెండు డిగ్రీల కలయికతో మీకు లభించే ఉపాధి అవకాశాలు కూడా విస్తృతంగా ఉంటాయి. సైబర్ లా స్పెషలిస్ట్‌గా, ఐటీ కంపెనీలలో లీగల్ అడ్వైజర్‌గా చేరవచ్చు. పేటెంట్లు, కాపీరైట్స్, సాఫ్ట్‌వేర్ హక్కులు లాంటి అంశాల్లో ఇంటలెక్చువల్ ప్రాపర్టీ లా నిపుణుడిగా ఎదగవచ్చు. డేటా ప్రైవసీ, కంప్లయన్స్, డిజిటల్ పాలసీ మేకింగ్ లాంటి రంగాల్లో కూడా ఉద్యోగావకాశాలు పెరుగుతున్నాయి. ప్రభుత్వం, కోర్టులు, కార్పొరేట్ రంగం, అంతర్జాతీయ సంస్థలు లాంటి విభిన్న రంగాల్లో స్థిరమైన కెరియర్ నిర్మించుకోవచ్చు.

◆ బీటెక్ తర్వాత ఎల్ఎల్‌బీ మార్గాన్ని ఎంచుకునే ముందు కొన్ని విషయాలను స్పష్టంగా ఆలోచించాలి. లా చదవడం అంటే కేవలం కోర్సు పూర్తి చేస్తే సరిపోదు. చట్టాలపై ఆసక్తి, విస్తృతంగా చదివే అలవాటు, విశ్లేషణా సామర్థ్యం, వాదన నైపుణ్యం లాంటి లక్షణాలు అవసరం. మీరు న్యాయ రంగంలో సేవలు అందించాలనుకుంటున్నారా లేదా కొత్త కోర్సు చేయాలనుకుంటున్నారా అనే విషయాన్ని ముందుగా నిర్ణయించుకోవాలి. పేరున్న విశ్వవిద్యాలయం/విద్యా సంస్థను ఎంచుకోవడం ఎంతో ముఖ్యం.

◆ సీఎస్ఈ తర్వాత ఎల్ఎల్‌బీ చేయడం ఒక వినూత్నమైన, భవిష్యత్తుకు అనుకూలమైన నిర్ణయం. ముఖ్యంగా ఈ డిజిటల్ యుగంలో టెక్నాలజీ, చట్టం కలయికకు చాలా ప్రాధాన్యం ఉంది. స్పష్టమైన లక్ష్యం, ఆసక్తితో ఈ మార్గాన్ని ఎంచుకుంటే ప్రత్యేకమైన స్థానం సంపాదించగలుగుతారు. మీ ఆసక్తులు, సామర్థ్యాలను దృష్టిలో పెట్టుకుని నిర్ణయం తీసుకుంటే ఈ ఎంపిక మీకు మంచి కెరియర్‌ను అందిస్తుంది.

– ప్రొ. బెల్లంకొండ రాజశేఖర్, కెరియర్ కౌన్సెలర్

కెరియర్, ఉన్నతవిద్యలకు సంబంధించి మీకు ఏ సందేహాలున్నా వాటిని మాకు పంపండి. నిపుణులు సమాధానాలు ఇస్తారు.

మా చిరునామా: **చదువు,** ఈనాడు కార్యాలయం, అనాజ్‌పూర్, అబ్దుల్లాపూర్‌మెట్ మండలం, రామోజీ ఫిల్మ్ సిటీ – 501 512
edc@eenadu.in

ఎన్ఎండీసీలో జూనియర్ ఇంజినీర్లు

నేషనల్ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎన్ఎండీసీ) లిమిటెడ్, హైదరాబాద్.. ఒప్పంద ప్రాతిపదికన మూడేళ్ల కాలానికి 59 జూనియర్ ఇంజినీర్ (మైనింగ్) పోస్టులను భర్తీచేయనుంది. మూడేళ్ల మైనింగ్ ఇంజినీరింగ్ డిప్లొమాతో దరఖాస్తు చేసుకోవచ్చు. సూపర్‌వైజరీ స్కిల్ అసెస్‌మెంట్‌తో నియామకాలు ఉంటాయి.

మొత్తం ఉద్యోగాల్లో అన్‌రిజర్వ్‌డ్‌కు 27, ఓబీసీ (ఎన్‌సీఎల్)కు 15, ఎస్సీకి 8, ఎస్టీకి 4, ఈడబ్ల్యూఎస్‌కు 5 కేటాయించారు. ధ్రువపత్రాల పరిశీలన అనంతరం అభ్యర్థులను సూపర్‌వైజరీ స్కిల్ అసెస్‌మెంట్‌కు ఎంపిక చేస్తారు. పుట్టిన తేదీ, విద్యార్హతలు, కుల ధ్రువీకరణకు సంబంధించిన ఒరిజినల్ సర్టిఫికెట్లను సమర్పించని వారిని తదుపరి దశకు ఎంపిక చేయరు. సూపర్‌వైజరీ స్కిల్ అసెస్‌మెంట్‌లో ప్రతిభతో మెరిట్ లిస్టును రూపొందిస్తారు.



గమనించాల్సినవి

- ఒకటికంటే ఎక్కువ దరఖాస్తులు పంపితే.. చివరి దాన్ని మాత్రమే పరిగణనలోకి తీసుకుంటారు.
- ఎంపికైనవారికి నెల రోజుల శిక్షణ ఉంటుంది.
- మూడేళ్ల కాలానికి ఎంపిక చేసినప్పటికీ సంస్థ అవసరాలు, వ్యక్తిగత పనితీరు ఆధారంగా ఒప్పంద కాలాన్ని పొడిగించే అవకాశం ఉంటుంది.
- తాజా ఉద్యోగ సమాచారం కోసం తరచూ సంస్థ వెబ్‌సైట్‌ను సందర్శించాలి.

వివరాలు

అర్హత: మూడేళ్ల మైనింగ్ ఇంజినీరింగ్ డిప్లొమా. ఫోర్‌మన్స్ సర్టిఫికెట్ ఆఫ్ కాంపిటెన్సీ ఉన్నవారికి ప్రాధాన్యమిస్తారు.

వయసు: 50 సంవత్సరాలు మించకూడదు. ఎస్సీ, ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీ (ఎన్‌సీఎల్)కి మూడేళ్లు, మాజీ సైనికోద్యోగులకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం సడలింపు వర్తిస్తుంది.

దరఖాస్తు ఫీజు: రూ.250. ఎస్సీ, ఎస్టీ, మాజీ సైనికోద్యోగులు, సంస్థ ఉద్యోగులకు ఫీజు ఉండదు.

వేతనం: నెలకు రూ.60,000 (కన్సాలిడేటెడ్ పే). అదనంగా హెచ్ఆర్ఏ, టీఏ, డీఏ, క్యాజువల్, మెడికల్ లీవ్‌లు ఉంటాయి. యాక్సిడెంటల్ గ్రూప్ ఇన్స్యూరెన్స్ సదుపాయం ఉంటుంది. అవుట్ పేషెంట్ ఖర్చుల నిమిత్తం ఏటా రూ.35,000 చెల్లిస్తారు.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 06.05.2026

వెబ్‌సైట్: https://www.nmdc.co.in/

(c) eenadu



ఇది జెన్ జీ ముద్ర!

రాజకీయ ముఖచిత్రాన్ని మార్చేసిన యువ ఓటర్లు

ఉపేక్షించలేనంత పెద్ద సంఖ్యలో యువ ఓటర్లు

పశ్చిమ బెంగాల్‌లో: **1.37** కోట్లు

అస్సాంలో: **1.28** కోట్లు

తమిళనాడులో: **1.22** కోట్లు

యువతరం ఎక్కువగా కోరుకుంటుంది..	తల్లిదండ్రులు ఓటేసింది గుర్తింపును చూసి
సమస్యల ఆధారితంగా పనిచేయడం.. ఉద్యోగ కల్పనపై దృష్టి.. భద్రత, మంచి పాలన	జెన్ జీ ఓటేస్తోంది.. జవాబుదారీతనానికి

పశ్చిమబెంగాల్ అధికార టీఎంసీపై జనాగ్రహం

- 25 వేలకు పైగా 'పశ్చిమబెంగాల్ స్కూల్ సర్వీస్ కమిషన్' నియామకాలను సుప్రీంకోర్టు రద్దు చేయడం సరిదిద్దలేని కళంకంగా మారింది
- కోటి మందికి పైగా యువ నిరుద్యోగులు...
- టీఎంసీ యుబశ్రీ నగదు పథకాన్ని.. యువత లంచంగా భావించడం

అస్సాం గుర్తింపు ఓటు

- ఓటర్లలో దాదాపు 29% మంది 18 నుంచి 29 ఏళ్ల మధ్య వారే
- ఉమ్మడి పౌరస్మృతికి వ్యతిరేకంగా 2019-20 మధ్య జరిగిన ఆందోళనలతో పెరిగిన రాజకీయ చైతన్యం
- యువతలో ఉన్న గుర్తింపు ఆపేక్షను అనుకూలంగా మార్చుకున్న భాజపా.. వరుసగా మూడో సారి అధికారాన్ని నిలబెట్టుకుంది

కేరళ కొంపముంచిన ఉదాసీనత

ఓటర్లలో 50 లక్షల మంది 18–30 ఏళ్ల మధ్య వయసువారు
(చరిత్రలో ఇదే తక్కువ శాతం)

- ఉన్నత విద్యావంతులు, వివిధ దేశాల్లో ఉద్యోగాలు చేస్తున్న జన్ జీ తరం పరిపాలనలో నాణ్యతకు ఓటేసింది
- యువత ఉదాసీనతను వీడి మౌలిక సదుపాయాల నిర్వహణలో భాగమైంది
- సామాజిక మాధ్యమాల్లో ప్రచారం అభ్యర్థుల విజయంపై ప్రభావం చూపింది

తమిళనాడు రాజకీయ ప్రక్రియలో నేరుగా పాలుపంచుకున్న అధికశాతం జన్ జీ తరం

- దాదాపు 2.28 కోట్ల మంది ఓటర్లు 20-40 ఏళ్ల మధ్య వయసువారే
- ఈ ఎన్నికలను 'కొత్త తరం ఎన్నిక.. ఈల విప్లవం'గా విజయ్ ప్రజల్లోకి తీసుకెళ్లడం పనిచేసింది
- మ్యానిఫెస్టో వాగ్దానాలు (డ్రగ్స్ రహిత రాష్ట్రం, ఉద్యోగ హామీ, తనఖా లేకుండా విద్యారుణాలు, విద్యార్థులకు (పెట్టుబడుల కోసం) ఆర్థిక సహాయం ప్రభావం చూపాయి
- 60 ఏళ్లుగా కొనసాగుతున్న డీఎంకే లేకుంటే అన్నాడీఎంకే సంప్రదాయానికి ఈ ఎన్నికలు స్వస్తి పలికాయి

జన్ జీ టీవీకేనే ఎందుకు ఎంచుకుందంటే!

- స్టాలిన్ ఐదేళ్ల పాలన.. జన్ జీ తరానికి తొలి రాజకీయ అనుభవం. ఇది వారిని నిరుత్సాహానికి గురిచేసింది
- ఫ్యాన్ కల్చర్.. పొలిటికల్ కల్చర్‌గా రూపాంతరం చెందింది



కోల్‌కతాలో భాజపా జెండాతో యువకులు



చెన్నైలో ఈల ఊదుతున్న టీవీకే మద్దతుదారు

ఆరంభం అదుర్స్

తొలి పోటీతోనే ఆ పార్టీలకు సంచలన విజయాలు



రాజకీయ పార్టీల సాధారణ లక్ష్యం అధికార సాధనే. దేశంలో ఎన్నో పార్టీలు ఉన్నప్పటికీ పోటీ చేసిన తొలి ఎన్నికల్లోనే ఆ లక్ష్యానికి చేరుకోవడం కొన్ని పక్షాలకే సాధ్యం. అటువంటి సంచలన విజయాలు నమోదు చేసి దేశ రాజకీయ చరిత్రపై చెరగని ముద్ర వేసిన పార్టీలివీ...

ఎంజీపీ: గోవాలో క్రియాశీలమైన రాజకీయ పక్షం.. మహారాష్ట్రవాది గోమంతక్ పార్టీ. పోర్చుగీస్ వలస పాలన నుంచి 1961లో విముక్తి పొందిన గోవా(దమన్, దీవు కూడా అప్పుడు కలిసే ఉన్నాయి)లో మొట్టమొదటి అధికార పార్టీగా ఎంజీపీకి విశేష ప్రాధాన్యం ఉంది. 30 స్థానాలున్న గోవా అసెంబ్లీకి 1963 డిసెంబరులో నిర్వహించిన తొలి ఎన్నికల్లో ఎంజీపీ ఘన విజయం సాధించింది.

ఏఐఏడీఎంకే: తమిళనాడు అసెంబ్లీకి 1977 జూన్ 10న నిర్వహించిన ఎన్నికల్లో సినీ నటుడు ఎంజీఆర్ నేతృత్వంలోని ఏఐఏడీఎంకే ఘన విజయం సాధించింది. ఎంజీఆర్ రాష్ట్ర ముఖ్యమంత్రి పదవిని చేపట్టారు. డీఎంకే నుంచి బహిష్కృతుడైన ఎంజీఆర్ 1972లో కొత్త రాజకీయ పార్టీని స్థాపించారు.

తెదేపా: సినీనటుడు ఎన్.టి.రామారావు 1982 మార్చి 29న ఏర్పాటు చేసిన తెలుగుదేశం పార్టీ తొమ్మిది నెలల వ్యవధిలోనే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో భారీ ఆధిక్యంతో విజయం సాధించింది. 1983 జనవరిలో అధికార పగ్గాలు చేపట్టింది.

అస్సాం గణ పరిషత్: 1985 అక్టోబరులో ఆవిర్భవించిన అస్సాం గణ పరిషత్ (ఏజీపీ) రెండు నెలల అనంతరం నిర్వహించిన అసెంబ్లీ ఎన్నికల్లో 107 స్థానాల్లో అభ్యర్థులను పోటీకి దించి 67 చోట్ల గెలుపొందింది. 33 ఏళ్ల యువకుడు ప్రఫుల్ల కుమార్ మహంత ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి పదవి చేపట్టారు.

బిజూ జనతా దళ్: తన తండ్రి బిజూ పట్నాయక్ మరణానంతరం జనతా పార్టీ నుంచి 1997లో విడిపోయిన నవీన్‌పట్నాయక్.. బిజూ జనతా దళ్‌ను ఏర్పాటు చేశారు. 2000 సంవత్సరంలో ఒడిశా అసెంబ్లీకి నిర్వహించిన ఎన్నికల్లో భాజపాతో కలిసి పోటీ చేశారు. కూటమి విజయంతో నవీన్ పట్నాయక్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టారు.

ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్): 2013 దిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో అనూహ్య విజయం సాధించి రాష్ట్ర పార్టీ హోదాను ఆప్ పొందింది. సొంత ప్రభుత్వం ఏర్పాటుకు 8 స్థానాలు తక్కువ కావడంతో కాంగ్రెస్, జనతా దళ్ మద్దతు తీసుకుంది.

తమిళగ వెట్రి కళగం(టీవీకే): సినీనటుడు విజయ్ నేతృత్వంలో రెండేళ్ల క్రితం ఆవిర్భవించిన టీవీకే.. ఎన్నికల బరిలోకి దిగిన తొలి ప్రయత్నంలోనే సంచలన విజయాలు నమోదు చేసింది. సోమవారం వెలువడిన అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో తమిళనాడులో అతిపెద్ద పార్టీగా టీవీకే ఆవిర్భవించింది.


జాతీయ స్థాయిలో....

జనతాపార్టీ: జాతీయ రాజకీయాల్లో జనతా పార్టీ ఓ సంచలనం. ఎమర్జెన్సీ ఎత్తివేత అనంతరం విపక్షాలకు చెందిన పలువురు నేతలు 1977 జనవరిలో జనతా పార్టీ పేరుతో ఒకే రాజకీయ వేదికపైకి వచ్చారు. అదే ఏడాది మార్చిలో నిర్వహించిన లోక్‌సభ ఎన్నికల్లో 30 ఏళ్ల కాంగ్రెస్ పార్టీ ఏకఛత్రాధిపత్యానికి జనతా పార్టీ గండికొట్టింది.

జనతాదళ్: 1988 అక్టోబరు 11న విశ్వనాథ్ ప్రతాప్ సింగ్ నేతృత్వంలో రూపుదాల్చిన జనతాదళ్... 1989 నవంబరులో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో 143 సీట్లు సాధించింది. భాజపా, వామపక్షాల మద్దతుతో నేషనల్ ఫ్రంట్ పేరుతో కేంద్రంలో ప్రభుత్వం ఏర్పాటుచేసింది. ఆ ఎన్నికల్లో 197 సీట్లతో కాంగ్రెస్ అతిపెద్ద పార్టీగా అవతరించినప్పటికీ ప్రభుత్వం ఏర్పాటుకు ముందుకు రాలేదు. – నేషనల్ డెస్క్

శ్యామాప్రసాద్ ముఖర్జీ గడ్డ ఇది..

బెంగాల్‌పై భాజపాకు అందుకే అంత ఆసక్తి



పశ్చిమ బెంగాల్ కోసం తాము తీవ్రంగా పోరాడటానికి శ్యామాప్రసాద్ ముఖర్జీయే కారణమని భాజపా చెబుతోంది. ఆ పార్టీ ఆయనను తమ పితామహుడిగా భావిస్తుంది. అందుకే ఆ రాష్ట్రంలో జెండా ఎగరేయాలని ఎప్పటి నుంచో ప్రయత్నిస్తోంది.

- బెంగాల్ టైగర్‌గా పేరున్న శ్యామాప్రసాద్ ముఖర్జీ పేరుతో కోల్‌కతాలో ప్రధాన రోడ్డు ఒకటి ఉంది. ఈ ప్రాంతంలోనే మమతా బెనర్జీ ఇల్లు, ఆమె నియోజకవర్గం భవానీపూర్ ఉన్నాయి. ఇప్పుడీ ప్రాంతం భాజపాకు పట్టం కట్టింది.
- శ్యామాప్రసాద్ తండ్రి అశుతోష్ ముఖర్జీ. ఆయన గణిత శాస్త్రవేత్త, న్యాయవాది, కలకత్తా హైకోర్టు జడ్జి, కలకత్తా విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్‌గా సేవలందించారు. జాదవ్‌పూర్ వర్సిటీలాంటి పలు విద్యా సంస్థల స్థాపనలో పాలుపంచుకున్నారు.

1929లోనే..

శ్యామాప్రసాద్ ముఖర్జీ 1929లో భారత జాతీయ కాంగ్రెస్‌లో చేరారు. బెంగాల్ అసెంబ్లీలో అడుగుపెట్టారు. 1939లో ఆయన బెంగాల్ హిందూ మహాసభ సభ్యుడయ్యారు. మరుసటి ఏడాదే దానికి అధ్యక్షుడయ్యారు. క్విట్ ఇండియా ఉద్యమానికి వ్యతిరేకంగా ఆయన వ్యవహరించారు. మహాత్మా గాంధీ హత్యతో ఆయన హిందూ మహాసభతో సంబంధాలను తెంచుకున్నారు.


- తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ ప్రభుత్వంలో శ్యామా ప్రసాద్ క్యాబినెట్ మంత్రి అయ్యారు. ఆ తర్వాత ప్రభుత్వం నుంచి బయటకు వచ్చారు. జాతీయవాద పార్టీని స్థాపించే లక్ష్యంతో ఆరెస్సెస్‌ను సంప్రదించారు. 1951లో ఆయన భారతీయ జనసంఘ్‌ను (భాజపా పూర్వరూపం) స్థాపించారు. 1951లో జరిగిన ఎన్నికల్లో 3 పార్లమెంటు సీట్లను ఆ పార్టీ గెలుచుకుంది. అదే దిల్లీలో అధికారం సాధించడానికి తమకు తొలి మెట్టని భాజపా చెబుతూ ఉంటుంది. భాజపాను బయటి పార్టీగా మమతా బెనర్జీ విమర్శించినప్పుడల్లా శ్యామాప్రసాద్ ముఖర్జీ పేరును ఆ పార్టీ ముందుకు తెచ్చింది.
- భారత్‌లో పశ్చిమ బెంగాల్ భాగంగా ఉందంటే అది శ్యామాప్రసాద్ చలవేనని భాజపా చెబుతోంది. అంతేకాదు పంజాబ్‌లోని మెజారిటీ ప్రాంతం భారత్‌లో ఉండటానికీ ఆయనే కారణమని అంటోంది.

– నేషనల్ డెస్క్



కోల్‌కతాలో రంగులు పూసుకుంటూ సంబరాలు చేసుకుంటున్న కమలం పార్టీ శ్రేణులు

5 అసెంబ్లీల తీర్పు





గువాహటి, కోల్‌కతాలలో భాజపా శ్రేణుల సంబరాలు

విజిలేగా అని తీసిపారేస్తే...



ఈనాడు, చెన్నై: డీఎంకే, అన్నాడీఎంకే రెండు కూటములూ టీవీకేను చాలా తేలిగ్గా తీసుకున్నాయి. అసలు విజయ్ తమకు పోటీనే కాదని తీసిపారేశాయి. ప్రచారంలో ఎక్కడా టీవీకే ప్రస్తావనే తీసుకురాలేదు. పోటీ తమ రెండు కూటముల మధ్యే అని ప్రగల్భాలకు పోయాయి. అలా పక్కన పెట్టిన టీవీకేనే తమిళులు ఆదరించారు. విజయ్ మార్పుతెస్తారన్న క్రేజ్‌తో యువత, మహిళలు పెద్దఎత్తున ఓటు వేశారు. టీవీకే 'విజిల్' శబ్దాన్ని మార్మోగించారు. ఈస్థాయి ఫలితాలను రెండు కూటములు ఊహించలేదు. వారి అంచనాల్ని ఓటర్లు తలకిందులు చేశారు.

యువతే మార్చారు

తొలిసారి ఓటుహక్కు పొందిన యువత, కళాశాల విద్యార్థులు, ఉద్యోగులు, కార్మికులు పెద్దఎత్తున టీవీకేకు మద్దతుగా నిలిచారు. మహిళలూ ఆసక్తి చూపారు. సామాజిక మాధ్యమాల్లో తమ అభిప్రాయాల్ని బాహాటంగా పంచుకోవడంతో ఈ మార్పు ప్రవాహంలా మారింది. ఈసారి మార్పునకు ఓటేయాలని పిల్లలు సైతం తల్లిదండ్రుల్ని కోరారు. ఇది తీవ్ర మార్పునకు కారణమైంది. విదేశాల్లో స్థిరపడిన వందల కుటుంబాలు విజయ్ కోసం తరలొచ్చాయి. ఇవన్నీ కలిసి ఓటులా పోటెత్తాయి.

నెట్టింట వైరల్

యువత క్రేజ్‌కు తగ్గట్లు టీవీకేలో ఐటీ విభాగం సామాజిక మాధ్యమాల ద్వారా తమ పార్టీ నినాదాన్ని బలంగా తీసుకెళ్లింది. విజయ్ మాటల్ని భావోద్వేగంతో జనాల్లోకి తీసుకెళ్లడం, పెద్దఎత్తున యువతకు చేరేలా వాటిని షేర్ చేయడం తీవ్ర ప్రభావాన్ని చూపింది. టీవీకే పాటలు సైతం కొత్త ఊపును తెచ్చాయి.

ఆకట్టుకునే మ్యానిఫెస్టో

యువత, మహిళలు, వారి సాధికారత, ఉపాధి అవకాశాలతో రూపొందించిన టీవీకే మ్యానిఫెస్టో.. తీవ్ర ప్రభావం చూపింది. పెళ్లయ్యే యువతులకు 8గ్రాముల బంగారం, సిల్క్‌చీరలు అందించే పథకం, మహిళలకు నెలానెలా రూ.2,500 సాయం లాంటి హామీలు ఓట్ల వర్షం కురిపించాయి. రేషన్ దుకాణాల్లో, పాఠశాలలు, కాలేజీల్లో శానిటరీ న్యాప్‌కిన్లు ఉచితంగా ఇస్తామన్నారు. కుటుంబాలకు ఏడాదికి 6 ఉచిత గ్యాస్ సిలిండర్లు, 29 ఏళ్లు దాటిన నిరుద్యోగులకు భృతి ఇస్తాననడం లాంటివి గెలిపించాయి.

సామాజిక పరిధి చెరిపేసి..

ఎన్నికలంటే సామాజికవర్గాల ఓట్లపై పార్టీలు దృష్టిపెడుతుంటాయి. ఈ పరిమితుల్ని విజయ్ చెరిపేశారు. కులమతాలకు అతీతంగా విజయ్‌కి మద్దతు లభించింది. విజయ్ మాటలపై ప్రజలు నమ్మకాన్ని ఉంచారు.

మళ్లీ పరివర్తన్

- 2011లో జరిగినట్లే ఇప్పుడూ..
- బెంగాల్‌లో బద్దలైన కోటలు

పశ్చిమ బెంగాల్ అంటేనే ప్రభంజనం. దశాబ్దాలపాటు ఆ రాష్ట్రాన్ని ఏలిన కమ్యూనిస్టులను మమతా బెనర్జీ 2011లో మట్టి కరిపించారు. 15 ఏళ్లు తిరిగింది. సీన్ రివర్స్ అయింది. ఇంట గెలిచి రచ్చ గెలుస్తానని, ఇక దిల్లీ రాజకీయాల్లోకి రాబోతున్నానని సవాల్ విసిరి చెప్పిన ముఖ్యమంత్రి మమతా బెనర్జీకి.. బెంగాల్ ఓటర్లు నిష్క్రమణ మార్గాన్ని చూపించారు. ఈ క్రమంలో అనేక అంశాల్లో ఆనాటి పరిణామాలు, ప్రస్తుత పోకడ మధ్య సారూప్యతలు కనిపిస్తున్నాయి. పొరిబర్తన్ (పరివర్తన, మార్పు) అని మమత ఆనాడు ఇచ్చిన నినాదమే ఇప్పుడూ ప్రతిధ్వనించింది.. కాకపోతే ఆమెకు వ్యతిరేకంగా!

2011లో ఏం జరిగింది?



- దీర్ఘకాలంపాటు కమ్యూనిస్టుల పాలనలో ఉన్న బెంగాల్‌లో పాలన గాడి తప్పింది. సమాంతర ప్రభుత్వం నడిచేది. రోజువారీ జీవనంపైనా దాని ప్రభావం పడేది. సిండికేట్ల హవా కొనసాగేది. ప్రభుత్వం మౌన ప్రేక్షక పాత్రకు పరిమితమైతే పార్టీదే పైచేయిగా నిలిచేది.
- నందిగ్రామ్ వద్ద పోలీసు కాల్పుల్లో 14 మంది ప్రాణాలు కోల్పోయారు. అది ప్రభుత్వంపై తీవ్ర ప్రభావం చూపించింది.
- పారిశ్రామిక అశాంతి ఎక్కువగా ఉండేది. నిరుద్యోగులకు అవకాశాలు కరవై అసంతృప్తిని పెంచాయి.
- ముఖ్యమంత్రిగా ఉన్న బుద్ధదేవ్ భట్టాచార్య తనకు కంచుకోటలాంటి జాదవ్‌పూర్‌లో ఓటమి చవిచూశారు.
- అవినీతి విచ్చలవిడిగా పెరిగిపోయింది. పార్టీలో అడిగే వారే కరవయ్యారు.


2026లో ఏం జరిగింది?



- 15 ఏళ్ల దీదీ పాలనపై ప్రజల్లో విముఖత పెరిగింది. ఆర్‌జీకర్ ఆసుపత్రిలో వైద్య విద్యార్థినిపై హత్యాచార ఘటన తర్వాత రాష్ట్రంలో మహిళల భద్రతపై పెద్దఎత్తున విమర్శలు వచ్చాయి.
- సిద్ధాంతాలు, క్రమ శిక్షణ స్థానంలో అక్రమ వసూళ్లు, కట్ మనీ పెరిగిపోయాయి.
- ప్రభుత్వ ఉద్యోగాల్లో అవినీతి పెచ్చరిల్లింది.
- సోషల్ మీడియాలో అవినీతిపై విస్తృత ప్రచారం. బలమైన భాజపా క్యాడర్.

ముఖ్యమంత్రుల ఓటమి

నిన్న కేజ్రీవాల్.. నేడు మమత, స్టాలిన్



ఈనాడు, దిల్లీ: రాష్ట్రాలకు ముఖ్యమంత్రులుగా పనిచేసినవారు శాసనసభ ఎన్నికల్లో వ్యక్తిగతంగానూ ఓటమిని చవిచూడటం ఇటీవలి కాలంలో పరిపాటిగా మారింది. ఆప్ తరఫున ముఖ్యమంత్రిగా పనిచేసిన అరవింద్ కేజ్రీవాల్ 2025లో జరిగిన దిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయారు. సోమవారం ప్రకటించిన అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో పశ్చిమబెంగాల్‌లోని భవానీపురం నియోజకవర్గం నుంచి రాష్ట్ర ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఓటమిపాలయ్యారు. 2021లోనూ ఆమె నందిగ్రామ్‌లో ఓటమిని చవిచూసి, తర్వాత జరిగిన ఉప ఎన్నికల్లో గెలిచి ముఖ్యమంత్రి బాధ్యతలు చేపట్టారు. తాజా ఎన్నికల్లో తమిళనాడులోని కొలాథుర్ నియోజకవర్గం నుంచి పోటీచేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి స్టాలిన్ పరాజయం చవిచూశారు. ఒడిశా ముఖ్యమంత్రిగా పనిచేసిన నవీన్ పట్నాయక్ 2024 ఎన్నికల్లో రెండు అసెంబ్లీ స్థానాల నుంచి పోటీచేసి ఒకచోట ఓడిపోయారు. పంజాబ్ ముఖ్యమంత్రిగా పనిచేసిన చరణ్‌జిత్‌సింగ్ చన్నీ సైతం 2022 అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమిపాలయ్యారు. 2023 తెలంగాణ ఎన్నికల్లోనూ గజ్వేల్, కామారెడ్డి స్థానాల నుంచి పోటీచేసిన అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్‌కు కామారెడ్డిలో ఓటమి తప్పలేదు. 2017 హిమాచల్ ప్రదేశ్ ఎన్నికల్లో ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రేమ్‌కుమార్ ధుమాల్, ఉత్తరాఖండ్ సీఎంగా ఉన్న హరీష్ రావత్, గోవా ముఖ్యమంత్రిగా ఉన్న లక్ష్మీకాంత్ పర్సేకర్ ఓడిపోయారు. అంతకుముందు.. 2013 ఎన్నికల్లో దిల్లీ ముఖ్యమంత్రి షీలాదీక్షిత్, 2011లో పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి బుద్ధదేవ్ భట్టాచార్య, 2005లో బిహార్ ముఖ్యమంత్రి రబ్రీదేవి ఓటమిని చవిచూశారు. 1989లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని హిందూపురం, కల్వకుర్తి నుంచి పోటీచేసిన ఎన్.టి.రామారావు కల్వకుర్తి నియోజకవర్గం నుంచి ఓడిపోయారు.



నాన్నా! మనమే గెలిచాం

ఊమెన్ చాందీ తనయుడి భావోద్వేగం

ఇంటర్నెట్ డెస్క్: కేరళ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ సారథ్యంలోని యూడీఎఫ్ కూటమి 102 స్థానాలతో ఘనవిజయం సాధించగా.. దివంగత ముఖ్యమంత్రి ఊమెన్ చాందీ తనయుడు చాందీ ఊమెన్ పుథుప్పల్లీ నుంచి భారీ విజయం నమోదు చేశారు. తన ప్రత్యర్థి, ఎల్డీఎఫ్ అభ్యర్థి కేఎం రాధాకృష్ణన్‌పై 52,907 ఓట్ల మెజార్టీతో గెలిచారు. ఈ సందర్భంగా 'నాన్నా.. మనమే గెలిచాం' అంటూ ఫేస్‌బుక్ వేదికగా చాందీ ఊమెన్ భావోద్వేగంతో కూడిన పోస్టు పెట్టారు. ఈ పోస్టుకు తన తండ్రి సమాధి పక్కన నిలబడి ఉన్న ఫొటోను జత చేశారు. గతంలో ఊమెన్ చాందీ ఈ స్థానం నుంచే దశాబ్దాలపాటు రాజకీయ జైత్రయాత్రను కొనసాగించారు. ఆయన మరణానంతరం జరిగిన 2023 ఉప ఎన్నికల్లో, ప్రస్తుత అసెంబ్లీ ఎన్నికల్లోనూ పుథుప్పల్లీ నుంచి చాందీ ఊమెన్ ఘనవిజయం సాధించారు.

పోస్టర్లకు దూరం.. సైకిలుపై ప్రచారం

ఎన్నికల ప్రచారంలో పుథుప్పల్లీ ఓటర్లను కలిసేందుకు చాందీ ఊమెన్ (40) సైకిలుపై నియోజకవర్గమంతా తిరిగారు. ఖర్చులను తగ్గించుకోవాలనే ఉద్దేశంతో ఫ్లెక్సీలు, పోస్టర్లను పూర్తిగా దూరం పెట్టిన ఈ యువనేత ఓటర్లను తానే స్వయంగా కలుసుకొని ఆకట్టుకున్నారు. ప్రచార నిధుల్ని తన నియోజకవర్గంలోని నిరాశ్రయులకు ఇళ్ల కోసం వినియోగిస్తానంటూ ప్రకటించి తండ్రికి తగ్గ తనయుడిగా ప్రశంసలు అందుకున్నారు.

ధోనీ కంటే పాపులర్!

విజయ్ గెలుపుపై పీకే అంచనాలు నిజమైన వేళ పాత వ్యాఖ్యలు వైరల్

పట్నా: తమిళ సూపర్‌స్టార్ విజయ్ సారథ్యంలోని టీవీకే పార్టీ తాజా అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో ఏకైక పెద్ద పార్టీగా అవతరించిన నేపథ్యంలో.. ప్రస్తుత ఎన్నికల భవితవ్యం గురించి జన్‌సురాజ్ పార్టీ వ్యవస్థాపకుడు ప్రశాంత్ కిశోర్ (పీకే) గతంలో చేసిన వ్యాఖ్యలు సోమవారం బాగా వైరల్ అయ్యాయి. డీఎంకే, ఏఐడీఎంకే కూటములతో కలవకుండా ఒంటరిగా పోటీ చేస్తే విజయ్‌కు 'మంచి అవకాశాలు' ఉంటాయంటూ ఈ మాజీ ఎన్నికల వ్యూహకర్త తన అంచనాలను ముందే ప్రకటించారు.




అప్పట్లో విజయ్ ఏర్పాటుచేసిన ఓ కార్యక్రమంలో ప్రజలను ఉద్దేశించి పీకే మాట్లాడుతూ.. "మీరందరూ అభిమానించే సూపర్‌స్టార్‌కు ఈ రాష్ట్రంలో అధికార పగ్గాలు చేపట్టడంలో సహకరించి తమిళనాడులో చెన్నై సూపర్‌కింగ్స్ (సీఎస్‌కే) కెప్టెన్ మహేంద్రసింగ్ ధోనీ కంటే ప్రసిద్ధుడైన బిహారీ కావాలని నేను ఎదురుచూస్తున్నా" అని సరదాగా వ్యాఖ్యానించారు. ధోనీ స్వరాష్ట్రం ఝార్ఖండ్ పాతికేళ్ల కిందట బిహార్ నుంచి వేరుపడి ప్రత్యేకరాష్ట్రంగా ఏర్పడిన విషయం తెలిసిందే. 'విజయ్ పార్టీ రాజకీయాల్లో ఇంకా అపరిపక్వ దశలోనే ఉంది కదా?' అని ఓ విలేకరి ప్రశ్నించగా.. "ఆశే అన్నిటికంటే పెద్ద వ్యూహం. అదే మన జీవితాలను నడిపిస్తుంది' అని పీకే ఆ వాదనను కొట్టిపారేశారు. కొత్తగా రాజకీయాల్లోకి వచ్చిన విజయ్‌కు ఈ వ్యాఖ్యలు ఎంతో కొంత మేలు చేశాయి. పీకే వ్యాఖ్యల వీడియోలు ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతున్నాయి.

విజయ్ మా నాయకుడు.. పొత్తులపై నిర్ణయం తనదే

తండ్రి ఎస్.ఎ.చంద్రశేఖర్ స్పందన

చెన్నై: తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో పెద్ద పార్టీగా అవతరించిన టీవీకే ప్రభుత్వ ఏర్పాటుకు కావలసిన మెజారిటీకి (118) కాస్త దూరంలో ఆగిపోవడంతో.. ఫలితాల తదనంతర పొత్తులపై పలు ఊహాగానాలు చెలరేగుతున్నాయి. ఇదే విషయం ప్రముఖ సినీ దర్శకుడు, టీవీకే అధినేత విజయ్ తండ్రి అయిన ఎస్.ఎ. చంద్రశేఖర్‌ను మీడియా ప్రశ్నించగా.. తండ్రిగా తన పాత్రకు, పార్టీ వ్యూహాత్మక కార్యకలాపాలకు వ్యత్యాసం పాటిస్తూ ఆయన చాలా జాగ్రత్తగా స్పందించారు.



'నిర్ణయం తీసుకునే స్థానంలో నేను లేను. నేను విజయ్‌కు తండ్రి మాత్రమే. అతడే మా నాయకుడు. పొత్తులపై నిర్ణయం ఆయనే తీసుకుంటారు. నేను ఎటువంటి రాజకీయ సలహాలూ ఇవ్వను" అని స్పష్టం చేశారు. ఎన్నికల ఫలితాల్లో తన కుమారుడి ప్రదర్శన చూసి గర్వపడుతున్నానని, తన మీద ప్రజలు పెట్టుకున్న అంచనాలను విజయ్ కచ్చితంగా నిజం చేస్తాడన్నారు. "తమిళనాడు గురించి తన మదిలో ఎన్నో కలలు ఉన్నాయి. అతణ్ని పనిచేయనివ్వండి. ప్రధాన పోటీ టీవీకే, డీఎంకేల మధ్య ఉంటుందని రెండేళ్ల కిందట రాజకీయాల్లోకి వచ్చినప్పటి నుంచీ విజయ్ చెబుతూనే ఉన్నాడు. ఫలితాల్లో అదే నిజమని తేలింది. రాజకీయాల్లోకి రావడం ఉన్నట్టుండి తీసుకున్న నిర్ణయం కాదు. సమాజానికి సేవ చేయాలన్న ప్రణాళిక విజయ్‌కు 20 ఏళ్లుగా ఉంది. దానికి ఇదే అనువైన సమయంగా మారింది" అన్నారు.

(c) eenadu



మాట్లాడుతున్న ఎంపీ భరత్. చిత్రంలో ఏపీ ప్రభుత్వ ఉత్తర అమెరికా ప్రత్యేక ప్రతినిధి కోమటి జయరామ్

విశాఖలో పెట్టుబడులు పెట్టండి

● ప్రవాసాంధ్రులకు ఎంపీ భరత్ పిలుపు

ఈనాడు, అమరావతి: శరవేగంగా అభివృద్ధి చెందుతున్న విశాఖపట్నంలో పెట్టుబడులు పెట్టాలని ప్రవాసాంధ్రుల్ని ఎంపీ భరత్ కోరారు. అమెరికాలో కాలిఫోర్నియాలోని మిల్పీటస్‌లో ఏపీ ప్రభుత్వ ఉత్తర అమెరికా ప్రత్యేక ప్రతినిధి కోమటి జయరామ్ ఆధ్వర్యంలో.. నిర్వహించిన మీట్ అండ్ గ్రీట్ కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ... స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో భాగంగా దేశంలోనే ఎక్కడా లేని విధంగా పారిశ్రామికవేత్తలకు కూటమి ప్రభుత్వం రాయితీలు, ప్రోత్సాహకాలు ఇస్తోందన్నారు. ఏపీలో పెట్టుబడులు పెట్టడానికి ఇదే మంచి తరుణమని.. సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో తెదేపా ఎన్నారై విభాగం నాయకులు వెంకట్ కోగంటి, శ్రీకాంత్ దొడ్డపనేని, భక్త భల్లా, సుధీర్ ఉన్నం పాల్గొన్నారు.

రూ.7 వేల కోట్ల రుణానికి ప్రభుత్వ హామీ

ఈనాడు, అమరావతి: గ్రామీణ విద్యుదీకరణ సంస్థ లిమిటెడ్ (ఆర్ఈసీ) నుంచి రాష్ట్ర విద్యుత్ సమన్వయ కమిటీ/డిస్కంలు తీసుకునే రూ.7,000 కోట్ల దీర్ఘకాలిక రుణానికి హామీ ఇచ్చేందుకు అనుమతిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు తగిన చర్యలు చేపట్టాలని ఏపీపీసీసీ కన్వీనర్, డిస్కంల సీఎండీలను ఆదేశించింది.

ఎన్టీఆర్ వైద్య సేవ అదనపు సీఈవో బదిలీ

ఈనాడు, అమరావతి: ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్ట్ అదనపు సీఈవో కె.అప్పారావును ప్రభుత్వం బదిలీ చేసి, విజయవాడ జీజీహెచ్ పరిపాలన అధికారిగా నియమించింది. డిప్యుటేషన్‌పై ఎన్టీఆర్ ట్రస్ట్‌లో విధులు నిర్వహిస్తున్న ఈయనను మాతృశాఖ అయిన ప్రజారోగ్య, కుటుంబ సంక్షేమ శాఖకు పంపిస్తూ, జీజీహెచ్‌కు బదిలీ చేస్తూ సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది.

వైకాపా నేత అమర్‌నాథ్ అనుచరుల భూదందా

● తెదేపా కేంద్ర కార్యాలయంలో బాధితుడి ఫిర్యాదు

ఈనాడు, అమరావతి: రెవెన్యూ అధికారుల్ని ప్రలోభ పెట్టి తన భూమిని మాజీ మంత్రి, వైకాపా నేత గుడివాడ అమర్‌నాథ్, స్థానిక ఎంపీపీ అనుచరులు కబ్జా చేశారని అనకాపల్లి జిల్లా బుచ్చయ్యపేట మండలం నీలకంఠపురానికి చెందిన రామకృష్ణంరాజు వాపోయారు. తనకు న్యాయం చేయాలని కోరుతూ మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. వివిధ సమస్యలతో వచ్చిన బాధితుల నుంచి మంత్రి కొల్లు రవీంద్ర, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ సోమవారం వినతులు స్వీకరించారు. స్థానిక వైకాపా నాయకుడు, సర్పంచి కలిసి బలవంతంగా తన పట్టా భూమిని లాక్కొని, వ్యవసాయం చేయనివ్వకుండా అడ్డుకుంటున్నారని విజయనగరం జిల్లా గుర్ల మండలం కెల్లి గ్రామానికి చెందిన రాజారావు ఫిర్యాదు చేశారు.



ఎప్‌సెట్ రాసేందుకు షేక్‌పేట నారాయణమ్మ కళాశాల వద్ద నిరీక్షిస్తున్న విద్యార్థులు. చిత్రంలో వారి తల్లిదండ్రులు

తొలిరోజు తెలంగాణ ఎప్‌సెట్ అగ్రికల్చర్‌కు 92.90% హాజరు

● 12న రెస్పాన్స్ షీట్లు, ప్రాథమిక కీ

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణలో ఎప్‌సెట్ అగ్రికల్చర్-ఫార్మసీ విభాగం పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఉదయం, మధ్యాహ్నం జరిగిన రెండు విడతల్లో మొత్తం 60,586 మందికిగాను 56,287 మంది(92.90%) హాజరయ్యారు. జేఎన్‌టీయూహెచ్‌లో ఉదయం ప్రశ్నపత్రాల కోడ్‌ను నిర్ణయించే కార్యక్రమంలో రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఛైర్మన్ ఆచార్య వి.బాలకిష్టారెడ్డి, జేఎన్‌టీయూహెచ్ వైస్‌ఛాన్సలర్ టి.కిషన్‌కుమార్‌రెడ్డి, కన్వీనర్ విజయకుమార్‌రెడ్డి, విద్యామండలి కార్యదర్శి ఆచార్య శ్రీరాం వెంకటేశ్, రిజిస్ట్రార్ కె.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. పరీక్ష పూర్తికాగానే కంప్యూటర్‌పై మార్కులు కనిపించే విధంగా ఈసారి అధికారులు వినూత్న సంస్కరణకు శ్రీకారం చుట్టిన సంగతి తెలిసిందే. దీంతో విద్యార్థులు తమకు ఎన్ని మార్కులు వచ్చాయో ఆసక్తిగా చూసుకున్నారు. అగ్రికల్చర్ విభాగం పరీక్షలు బుధవారం ఉదయం, ఇంజినీరింగ్ విభాగం పరీక్షలు ఈ నెల 11న పూర్తవుతాయని, 12న విద్యార్థుల రెస్పాన్స్ షీట్‌తోపాటు ప్రాథమిక కీని వెబ్‌సైట్‌లో ఉంచుతామని కన్వీనర్ విజయకుమార్‌రెడ్డి తెలిపారు.

వడదెబ్బతో ముగ్గురి మృతి

వీపనగండ్ల, చేవెళ్ల గ్రామీణం, కౌటాల, న్యూస్‌టుడే: తెలంగాణలో ఎండల తీవ్రత కారణంగా సోమవారం ముగ్గురు వడదెబ్బకు గురై మృతి చెందారు. వనపర్తి జిల్లా వీపనగండ్లకు చెందిన పశువుల కాపరి బొడ్డుపల్లి మురళి(45), రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండలం కమ్మెట శివారులో గుర్తుతెలియని వ్యక్తి(40), కుమురంభీం జిల్లా కౌటాల మండలకేంద్రంలోని మార్కెట్ ఏరియాకు చెందిన దివిటి తిరుపతి(45) వడదెబ్బకు గురై మరణించారు.

ప్రమాణాలు ప్రపంచస్థాయికి..

● బోధనలో నాణ్యత పెంచేందుకు విదేశాల్లో ఉపాధ్యాయుల అధ్యయనాలు

● సింగపూర్‌లో విద్యావిధానంపై శిక్షణ

● మన విద్యార్థులు అంతర్జాతీయంగా పోటీపడేలా సన్నద్ధత



సింగపూర్‌లో శిక్షణ పొందుతున్న ఉపాధ్యాయులు

ఈనాడు, అమరావతి: ప్రపంచస్థాయి ప్రమాణాలకు అనుగుణంగా ప్రభుత్వ పాఠశాలల్లో బోధన నాణ్యతను పెంచేందుకు సర్కారు శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా.. గతేడాది రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు పొందిన 37 మందిని అంతర్జాతీయ ఎక్స్‌పోజర్ విజిట్ కార్యక్రమం కింద సింగపూర్‌కు పంపించింది. రాష్ట్రంలోని ప్రతి విద్యార్థీ ప్రపంచంలో ఏ మూలన ఉన్న వారితోనైనా పోటీ పడాలనేది ముఖ్యమంత్రి చంద్రబాబు ఆకాంక్ష. ఇందుకు పాఠశాల నుంచే పునాది పడాలని, మౌలిక సదుపాయాల కల్పనకే పరిమితం కాకుండా బోధనలో నాణ్యతను పెంచే కార్యక్రమాలను విద్యాశాఖ చేపట్టింది. సింగపూర్‌లోని ప్రతిష్ఠాత్మక నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషన్(ఎన్ఐఈ), ఫిన్లాండ్‌లోని యూనివర్సిటీ ఆఫ్ తుర్కుతో ఒప్పందాలు కుదుర్చుకుంది. ఈ తరహా గ్లోబల్ నెట్‌వర్కింగ్‌లో మంత్రి లోకేశ్ కీలక పాత్ర పోషించారు. ఉపాధ్యాయులు కేవలం సమాచారాన్ని అందించే వారిలా కాకుండా.. పిల్లల్లో ఆలోచనలను ప్రేరేపించే లెర్నింగ్ ఫెసిలిటేటర్లుగా మారాలనే ఉద్దేశంతో ఈ శిక్షణ కార్యక్రమాన్ని లోకేశ్ స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. సింగపూర్‌లోని ఎన్ఐఈలో 37 మంది ఉపాధ్యాయులకు సోమవారం శిక్షణ ప్రారంభమైంది. ఈనెల 8 వరకు అక్కడి విద్యావిధానంపై టీచర్లు అధ్యయనం చేస్తారు. ప్రతి రోజూ ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు శిక్షణ తరగతుల్లో ఉపాధ్యాయులు పాల్గొంటారు. డిజైనింగ్ లెర్నింగ్, ఇన్‌స్పైరింగ్ థింకింగ్ నినాదంతో శిక్షణ కొనసాగుతుంది. 'అనిశ్చిత కాలంలో విద్య, ఎదుర్కొంటున్న సవాళ్లు', సింగపూర్ విద్యా విధానంపై అవగాహన, బోధన ప్రణాళిక రూపకల్పన, ఇషున్ సెకండరీ స్కూల్ సందర్శన, విశ్లేషణాత్మక ఆలోచన, బోధనపై చర్చ, అధ్యాపకులకు అవసరమైన సమన్వయ నైపుణ్యాలపై అవగాహన, ఏపీలోని తరగతి గదులను భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా సిద్ధం చేయడంపై శిక్షణ ఉంటుంది. శిక్షణ పూర్తి చేసుకున్న వారు రాష్ట్రంలోని ఇతర ఉపాధ్యాయులకు మెంటార్లుగా వ్యవహరిస్తూ.. తాము నేర్చుకున్న అంశాలపై అవగాహన కలిగిస్తారు. ఫిన్లాండ్‌లోని యూనివర్సిటీ ఆఫ్ తుర్కుకి మరో 29 మంది ఉపాధ్యాయులను పంపేందుకు విద్యాశాఖ ప్రణాళిక రూపొందించింది.

గుణాత్మక మార్పునకు నాంది

అంతర్జాతీయ జ్ఞానాన్ని క్షేత్రస్థాయికి తీసుకువెళ్లేలా ప్రణాళికను రూపొందించాం. టీచర్లను విదేశాలకు పంపించడం.. విద్యావ్యవస్థలో గుణాత్మక మార్పునకు నాంది. టీచర్లు సింగపూర్‌లో తెలుసుకునే మెలకువలు. . మన రాష్ట్రంలోని తరగతి గదులను 'ఫ్యూచర్ రెడీ'గా మారుస్తాయి.

– బి.శ్రీనివాసరావు, ఎస్పీడీ, సమగ్ర శిక్షా అభియాన్

రాష్ట్రంలో విద్యుత్ సేవలు మెరుగు

● ప్రజల సంతృప్త స్థాయి 77.3 శాతం

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో విద్యుత్ సేవలపై 77.3 శాతం మంది సంతృప్తి వ్యక్తం చేసినట్లు పబ్లిక్ పాజిటివ్ పర్సెప్షన్‌లో తేలిందని ఇంధన శాఖ తెలిపింది. సేవలు ఇంకా మెరుగుపడాల్సి ఉందని 22.7 శాతం మంది అభిప్రాయాన్ని వ్యక్తం చేసినట్లు పేర్కొంది. ఆర్టీజీఎస్ నివేదిక ప్రకారం అధికారులు ఈ వివరాలను తెలిపారు. '2024 జూన్ నుంచి 2025 మే వరకు ప్రజల సంతృప్త స్థాయి 61.3 శాతంగా ఉంది. ఏడాది వ్యవధిలో విద్యుత్ సరఫరాపై సంతృప్తస్థాయి 16 శాతం పెరిగింది. వినియోగదారులకు మెరుగైన సేవలు అందించడంపై దృష్టి పెట్టడంతో ప్రజల నుంచి సానుకూలత క్రమేణా పెరిగింది' అని పేర్కొన్నారు.

మూడు ప్రశ్నల ద్వారా ప్రజాభిప్రాయ సేకరణ

◆ మీకు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా జరుగుతుందా?

◆ మీ ఇంటికి నాణ్యమైన విద్యుత్ అందుతుందా?

◆ విద్యుత్ సిబ్బంది మీకు అందుబాటులో ఉంటున్నారా?

◆ ఈ ప్రశ్నలతో అన్ని జిల్లాల్లో ప్రజల నుంచి అభిప్రాయాన్ని ఆర్టీజీఎస్ ద్వారా సేకరించారు. ఈపీడీసీఎల్‌లో 77.8 శాతం, ఎస్పీడీసీఎల్ 76.1 శాతం, సీపీడీసీఎల్‌లో 78.1 శాతం మంది ప్రజలు సానుకూలత వ్యక్తం చేశారు.

◆ విశాఖపట్నం ఉత్తర, దక్షిణ నియోజకవర్గాల్లో విద్యుత్ సేవలపై 85.2 శాతం మంది సానుకూలత వ్యక్తం చేశారు. ఆ తర్వాత నెల్లూరు గ్రామీణ(84.8 శాతం), విజయవాడ తూర్పు(84.7 శాతం), నెల్లూరు నగరం(83.7 శాతం) ప్రజలు సానుకూలత తెలిపారు.

◆ రాప్తాడులో 70.8 శాతం, రాయచోటి, పుట్టపర్తి 70.3 శాతం, కళ్యాణదుర్గం 69.4 శాతం, ఉరవకొండ నియోజకవర్గంలో 68.8 శాతం మంది సానుకూలతతో అట్టడుగు స్థానాల్లో ఉన్నాయి.

'కేరళ విజయం'తో తెలంగాణ కాంగ్రెస్‌లో జోష్!

ఈనాడు, హైదరాబాద్: కేరళలో కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ కూటమి సాధించిన అసాధారణ విజయంతో తెలంగాణలో ఆ పార్టీ నేతల్లో ఉత్సాహం రెట్టింపయింది. సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పొన్నం ప్రభాకర్, సీతక్క, శ్రీధర్‌బాబు, ఇతర నేతలు కేరళ వెళ్లి పలు నియోజకవర్గాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వీరు పర్యటించిన పలు చోట్ల కాంగ్రెస్ మంచి విజయాలు సాధించింది. రేవంత్‌రెడ్డిని కేరళ అసెంబ్లీ ఎన్నికల ప్రచారానికి స్టార్ క్యాంపెయినర్‌గా కాంగ్రెస్ నియమించడంతో స్వయంగా వెళ్లి కోవలం, మావెలిక్కర, పథానపురం, నేమం, కొచ్చిన్, తిరువనంతపురం తదితర ప్రాంతాల్లో రోడ్ షోలు, ప్రచార సభల్లో పాల్గొని కాంగ్రెస్‌ను గెలిపించాలని ప్రజలను కోరారు. యూడీఎఫ్ మ్యానిఫెస్టో విడుదల కార్యక్రమంలోనూ రేవంత్‌రెడ్డి పాల్గొన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరిస్తూ.. కేరళనూ ప్రగతి పథంలోకి తీసుకెళ్లడానికి పార్టీని గెలిపించాలని తాము చేసిన ప్రచారానికి అక్కడి ప్రజలు స్పందించి మద్దతు పలికారని రాష్ట్ర నేతలు తెలిపారు. కేరళలో స్ఫూర్తిదాయకమైన విజయానికి కారకులైన నాయకులు, కార్యకర్తలు, పార్టీ శ్రేణులకు హృదయపూర్వక అభినందనలని సీఎం రేవంత్‌రెడ్డి సోమవారం ఎక్స్‌లో తెలిపారు. ఈ చరిత్రాత్మక విజయానికి నేతృత్వం వహించిన పార్టీ నాయకత్వానికి, ముఖ్యంగా రాహుల్‌గాంధీ, ఖర్గే, ప్రియాంక గాంధీ, కేసీ వేణుగోపాల్, ఏఐసీసీ ఇన్‌ఛార్జి దీపాదాస్ మున్షీ, పార్టీ నాయకులు, కేడర్‌కు అభినందనలు తెలియజేస్తున్నానని పేర్కొన్నారు. 'కేరళ, తెలంగాణ గొప్ప రాష్ట్రాలు. ఇరు రాష్ట్రాల ప్రజలు విలువలు, ప్రజాస్వామ్యస్ఫూర్తి గల వారు. అభివృద్ధిని విశ్వసిస్తారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆధ్వర్యంలో గొప్ప భవిష్యత్తు కోసం కేరళ ప్రజలు సిద్ధంగా ఉన్నారు. నాపై ప్రేమ కురిపించిన అక్కడి ప్రజలకు ధన్యవాదాలు' అని సీఎం తెలిపారు.

ఎన్‌హెచ్ఎం స్టేట్ ప్రోగ్రామ్ మేనేజర్‌గా విజయలక్ష్మి

వైద్యారోగ్య శాఖలో పలువురికి పదోన్నతిపై బదిలీ

ఈనాడు, అమరావతి: ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖలో డిప్యూటీ డైరెక్టర్ (పరిపాలన) హోదాలో ఉన్న పలువురు అధికారులకు ప్రభుత్వం జాయింట్ డైరెక్టర్లుగా పదోన్నతి కల్పిస్తూ బదిలీ చేసింది. ఈ మేరకు సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది.

◆ వైద్య విద్య సంచాలకు(డీఎంఈ)ల కార్యాలయంలో డీడీగా విధులు నిర్వహిస్తున్న జె.విజయలక్ష్మిని జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్ఎం) స్టేట్ ప్రోగ్రామ్ మేనేజర్‌గా ప్రభుత్వం నియమించింది.

◆ నేషనల్ అర్బన్ హెల్త్ మిషన్ (ఎన్‌యూహెచ్ఎం) స్టేట్ నోడల్ అధికారి వి.వెంకటశేషారెడ్డిని పదోన్నతిపై డీఎంఈ కార్యాలయానికి బదిలీ చేసి, పరిపాలన వ్యవహారాలు, ఇతర అసైన్‌మెంట్ల బాధ్యతలు అప్పగించింది.

◆ విశాఖపట్నంలోని వైద్యారోగ్య ప్రాంతీయ సంచాలకుల కార్యాలయం డీడీ ఎస్.సృజనను ఎన్‌యూహెచ్ఎం స్టేట్ ప్రాజెక్టు మేనేజర్‌గా నియమించింది.

◆ ఏపీ శాక్స్ ప్రధాన కార్యాలయం డీడీ ఆర్.గణపతిరావును డీఎంఈ కార్యాలయానికి బదిలీ చేసి, అక్కడ మౌలిక సదుపాయాలు, ఔషధాలు, డయాగ్నోస్టిక్స్ సేవల పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించింది.

◆ రాజమహేంద్రవరంలోని వైద్యారోగ్య ప్రాంతీయ సంచాలకుల కార్యాలయ డీడీ ఎల్.శ్రీనివాసరావుకు పదోన్నతిపై ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్ట్ ఈవో (పరిపాలన)గా నియమించింది.

కొందరి ఇగోయిజం వల్ల తెలంగాణలో భాజపా నాశనం: రాజాసింగ్

గోషామహల్, న్యూస్‌టుడే: 'పశ్చిమబెంగాల్, అస్సాం, పుదుచ్చేరిలలో చాలా మంచి ఫలితాలు వచ్చాయి. అక్కడి కార్యకర్తలు సంబరాల్లో మునిగితేలారు. తెలంగాణలోనూ ఎందుకు సంబరాలు చేసుకుంటున్నారో అర్థం కావడం లేదు. వేరే వాళ్ల పెళ్లి చేసుకుంటే మనం ఇక్కడ డ్యాన్స్ చెయ్యాల్సిన పరిస్థితులు ఇంకా ఎన్నేళ్లు?' అంటూ గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ వ్యాఖ్యానించారు. తెలంగాణ భాజపా నేతలు కొందరిని ఉద్దేశించి తాను చేసిన వ్యాఖ్యలతో వీడియో విడుదల చేశారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావుకు పూర్తి స్వేచ్ఛ ఇస్తే ఇక్కడా 100 శాతం భాజపా ప్రభుత్వం వస్తుందని అన్నారు. కొంత మంది ఇగోయిజం వల్ల రాష్ట్రంలో పార్టీ సర్వనాశనం అవుతోందని అన్నారు. దాన్ని పక్కనపెట్టాలని సూచించారు.

తమిళ రాజకీయాల్లో సరికొత్త అధ్యాయం

విజయ్‌కి కేటీఆర్ అభినందనలు

ఈనాడు, హైదరాబాద్: తమిళనాడు రాజకీయాల్లో టీవీకే అధినేత విజయ్ సరికొత్త అధ్యాయానికి తెరలేపారని కేటీఆర్ ఓ ప్రకటనలో తెలిపారు. "సమకాలీన రాజకీయాల్లో సంచలనం అనే పదానికి అసలు సిసలు అర్థం నేడు తమిళనాడులో కనిపిస్తోంది. విజయ్ నాయకత్వంలో ఆ రాష్ట్రం మరింతగా అభివృద్ధి పథంలో పయనిస్తుందని ఆకాంక్షిస్తున్నా" అని పేర్కొన్నారు.

ఎన్‌డీడీబీకి నార్ముల్ డెయిరీ

ఈనాడు, హైదరాబాద్: నష్టాల్లో ఉన్న నల్గొండ-రంగారెడ్డి జిల్లాల పాల ఉత్పత్తిదారుల పరస్పర సహాయ సహకార సంఘం(నార్ముల్)ను జాతీయ పాడి అభివృద్ధి మండలి(ఎన్‌డీడీబీ)కి అప్పగించేందుకు తెలంగాణ ప్రభుత్వం కుదుర్చుకున్న అవగాహన ఒప్పందానికి ఆ రాష్ట్ర మంత్రి మండలి ఆమోదం తెలిపింది. ప్రభుత్వ విజ్ఞప్తి మేరకు నార్ముల్ బాధ్యతలు తీసుకునేందుకు ఎన్‌డీడీబీ అంగీకరించింది.

పంట ఉత్పత్తులన్నీ రాష్ట్రాలే కొనాలంటే అసాధ్యం: తుమ్మల

తాండూరు, న్యూస్‌టుడే: కేంద్రం మద్దతు ధరలు ప్రకటించి, వ్యవసాయ ఉత్పత్తులను రాష్ట్రాలే కొనుగోలు చేయాలంటే అసాధ్యమని తెలంగాణ వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పష్టంచేశారు. వికారాబాద్ జిల్లా తాండూరులో రైతు వారోత్సవాలను ప్రారంభించిన అనంతరం తెలంగాణ సేంద్రియ యాప్, ఉద్యాన పంటల సావనీర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "రైతుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని ఆనాడు కేంద్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవసాయ ఉత్పత్తులకు మద్దతు ధరలను ప్రకటించింది. వరి కొనుగోలుకు ఎఫ్‌సీఐ, పప్పుధాన్యాలకు నాఫెడ్, పత్తి కొనుగోలుకు సీసీఐని ఏర్పాటు చేసింది. ప్రస్తుత భాజపా ప్రభుత్వం ఆ సంస్థలను పట్టించుకోవడం లేదు. తెలంగాణలో అత్యధికంగా 1.73 కోట్ల టన్నుల ధాన్యం పండితే.. ప్రభుత్వం 90 లక్షల టన్నుల కొనుగోలుకు ప్రయత్నిస్తోంది. మిగిలింది కొనాలని కేంద్రాన్ని అడిగితే 30 లక్షల టన్నులే తీసుకుంటామని చెప్పింది" అని విమర్శించారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ కమిషనర్ సురేంద్రమోహన్, ఆర్యవైశ్య కార్పొరేషన్ ఛైర్మన్ కల్వ సుజాత తదితరులు పాల్గొన్నారు.



యాప్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి తుమ్మల. చిత్రంలో ఎమ్మెల్యేలు మనోహర్‌రెడ్డి, కాలె యాదయ్య, కల్వ సుజాత తదితరులు

ధాన్యం కొనుగోలు కేంద్రంలో కుప్పకూలిన రైతు

నకిరేకల్, న్యూస్‌టుడే: ధాన్యం కొనుగోలు కేంద్రంలో రైతు కుప్పకూలి మృతిచెందిన ఘటన తెలంగాణలోని నల్గొండ జిల్లా నకిరేకల్ మండలం నెల్లిబండలో జరిగింది. బంధువుల కథనం ప్రకారం.. నకిరేకల్ పురపాలిక పరిధి బాబన్‌సాహెబ్‌గూడకు చెందిన రైతు ఎండీ నజీరోద్దీన్(68) సోమవారం ఉదయం నెల్లిబండ పీఏసీఎస్ కొనుగోలు కేంద్రంలో పోసిన ధాన్యం రాశి వద్దకు వచ్చి టార్పాలిన్‌ను తొలగిస్తూ ఒక్కసారిగా కిందపడిపోయారు. 108 వాహనంలో వైద్యశాలకు తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. గుండెపోటుకు గురైనట్లు భావిస్తున్నారు. వరికోత యంత్రం కోసం మూడు నాలుగు రోజులుగా ఎండలో తిరిగారని వడదెబ్బకూ గురై ఉండవచ్చని బంధువులు తెలిపారు. నజీరోద్దీన్‌కు 2 ఎకరాల 33 గుంటల భూమి ఉండగా మరో ఎకరానికిపైగా కౌలుకు తీసుకుని వరి సాగు చేశారు. కౌలుకు తీసుకున్న పొలంలో కోసిన ధాన్యాన్ని రెండు రోజుల క్రితం కొనుగోలు కేంద్రానికి తీసుకొచ్చారని, ఆదివారం సాయంత్రం కురిసిన వర్షానికి కేంద్రంలోని రాశి తడిసిందా లేదా అని చూసుకునేందుకు వచ్చారని రైతులు వివరించారు. నజీరోద్దీన్‌కు ఇద్దరు కుమారులు కాగా వారికి వివాహాలయ్యాయి. భార్య ఇటీవలే అనారోగ్యంతో మృతి చెందారు. నజీరోద్దీన్ మృతదేహానికి ఎమ్మెల్యే వేముల వీరేశం నివాళి అర్పించారు.



రైతు ఎండీ నజీరోద్దీన్

కొలిక్కిరాని నగల దోపిడీ కేసు

ఈనాడు, కరీంనగర్: కరీంనగర్‌లోని పీఎంజే జ్యువెలరీ షోరూం దోపిడీ కేసులో దొంగలు ఇంకా దొరకలేదు. 16 పోలీసు బృందాలు వీరి ఆచూకీ కోసం తెలంగాణతోపాటు సరిహద్దు రాష్ట్రాల్లో గాలిస్తున్నాయి. ఆదివారం ఐదుగురు దుండగులు సిబ్బందిపై కాల్పులు జరిపి కిలోన్నర బంగారు ఆభరణాల్ని ఎత్తుకెళ్లిన సంఘటన తెలిసిందే. ద్విచక్రవాహనాలపై పారిపోయిన దుండగులు సీసీ కెమెరాలకు చిక్కకుండా గ్రామాల మీదుగా వెళ్లినట్లు పోలీసులు గుర్తించారు. దీన్నిబట్టి వారు ముందస్తుగానే రెక్కీ నిర్వహించారని అనుమానిస్తున్నారు. మరోవైపు నగల దుకాణ యజమాని 1.600 కిలోల ఆభరణాలు ఎత్తుకెళ్లారని, వీటి విలువ రూ.2 కోట్లకుపైగా ఉంటుందని పోలీసులకు ఫిర్యాదు ఇచ్చారు. దొంగలు దుకాణంలోనే వదిలేసిన ఒక బ్యాగుపై 'ఐ లవ్ నందూర్బార్' అని ఉండటంతో మహారాష్ట్ర ప్రాంతంలో తయారైనట్లు గుర్తించి ఆరా తీస్తున్నారు. దాదాపు 100 మందికి పైగా పోలీసులు దొంగలను పట్టుకునేందుకు శ్రమిస్తున్నారు.

మస్కట్‌లో చిక్కుకున్న మహిళకు రాష్ట్ర ప్రభుత్వ అండ

● స్వస్థలానికి తీసుకొచ్చేందుకు మార్గం సుగమం

● ఏపీఎన్ఆర్టీ సొసైటీ చొరవను అభినందించిన సీఎం చంద్రబాబు

ఈనాడు, అమరావతి: ఒమన్ రాజధాని మస్కట్‌లో చిక్కుకున్న అన్నమయ్య జిల్లా మహిళకు రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలిచింది. వాల్మీకిపురం గ్రామానికి చెందిన షహ్నాజ్.. గతేడాది నవంబరులో ఉద్యోగం కోసం మస్కట్ వెళ్లారు. ఉద్యోగం నచ్చక తిరిగి వచ్చేందుకు ప్రయత్నించడంతో అక్కడి వారు ఆమెను నిర్బంధించారు. ఖర్చుల పేరుతో ఏజెంట్ కార్యాలయం వారు రూ.2 లక్షలు డిమాండ్ చేశారని, ఫోన్ కూడా స్వాధీనం చేసుకున్నారని షహ్నాజ్ భర్త అబూబకర్.. ఏపీఎన్ఆర్టీ సొసైటీకి ఫిర్యాదు చేశారు. దీంతో రాష్ట్ర ప్రభుత్వం స్పందించింది. ఏపీఎన్ఆర్టీ సొసైటీ సాయంతో ఎంబసీకి లేఖ రాయడంతో పాటు పోలీసుల జోక్యంతో ఏజెంట్లతో చర్చలు జరిపారు. ఖర్చులు భరించి షహ్నాజ్‌ను తిరిగి ఏపీకి పంపడానికి ఏజెంట్లు అంగీకరించారు. ఈ నెల 7న షహ్నాజ్ స్వస్థలానికి చేరుకోనున్నారు. వలస కార్మికుల భద్రతకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు స్పష్టంచేశారు. ఏపీఎన్ఆర్టీ సొసైటీ చొరవను అభినందించారు.

రాష్ట్రంలో త్యాగరాజ ఆరాధనోత్సవాలను నిర్వహించాలి

ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్

ఈనాడు, అమరావతి: 'భారతదేశ గొప్ప సంగీత సంతులలో ఒకరైన త్యాగరాజు 259వ జయంతి రోజున ఆయనకు నివాళులు. ఆంధ్రప్రదేశ్‌లో రాష్ట్ర స్థాయి త్యాగరాజ ఆరాధనోత్సవాలను నిర్వహించాలి. ప్రముఖ సంగీత విద్వాంసులు, పండితులు, విద్యార్థులు ప్రపంచం నలుమూలల నుంచి ఈ ఉత్సవాల్లో పాల్గొనేలా చూడాలి. సాంస్కృతికశాఖ సహకారంతో త్యాగరాజు కంపోజిషన్లకు సంబంధించిన అరుదైన రికార్డింగులు, స్క్రిప్టులు, మౌఖిక సంప్రదాయాలు, ఇతరాలను డిజిటలైజ్ చేయాలి' అని ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ అభిలషించారు. ఆయన సోమవారం ఎక్స్ వేదికగా స్పందించారు. 'తమిళనాడులోని తిరువయ్యూరులో త్యాగరాజ ఆరాధనను ఎంత భక్తితో నిర్వహిస్తారో చూశాను. కర్ణాటకలోని హంపిలోనూ అదే భక్తి కనిపిస్తుంది. ఆంధ్రప్రదేశ్‌లోని ప్రకాశం జిల్లా కాకర్ల గ్రామంలో త్యాగరాజు జన్మించడం తెలుగు ప్రజలకు ఎంతో గర్వకారణం. రాష్ట్రంలో కూడా ఆయన ఉత్సవాలు నిర్వహించుకోవడం మన బాధ్యత' అని అభిప్రాయపడ్డారు.

పీసీసీఎఫ్ అధ్యక్షతన చెట్ల సంరక్షణ సలహా కమిటీ

ఈనాడు, అమరావతి: మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు చేపట్టేటప్పుడు చెట్ల నరికివేతను వీలైనంత తగ్గించటానికి తీసుకోవాల్సిన చర్యల సిఫారసు కోసం అటవీ దళాల అధిపతి(పీసీసీఎఫ్) ఛైర్మన్‌గా చెట్ల సంరక్షణ సలహా కమిటీని రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది. సీసీఎల్ఏ, మున్సిపల్, పంచాయతీ రాజ్, వ్యవసాయ శాఖ, రహదారులు, భవనాల శాఖ, నీటిపారుదల శాఖ తదితర విభాగాల నుంచి పలువురు అధికారులను ఈ కమిటీలో సభ్యులుగా నియమించింది. ఈమేరకు అటవీ శాఖ ముఖ్య కార్యదర్శి కాంతిలాల్ దండే సోమవారం ఉత్తర్వులిచ్చారు.

◆ రాష్ట్రంలో ఘన వ్యర్థాల నిర్వహణ నియమావళి-2026ను సమర్థంగా అమలు చేసేందుకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అధ్యక్షతన రాష్ట్రస్థాయి అమలు కమిటీని ప్రభుత్వం నియమించింది. కాలుష్య నియంత్రణ మండలి ఛైర్మన్ దీనికి కో ఛైర్మన్‌గా వ్యవహరిస్తారు. వివిధ శాఖల అధికారులు సభ్యులుగా ఉంటారు. ఈ మేరకు అటవీ శాఖ ముఖ్య కార్యదర్శి కాంతిలాల్ దండే సోమవారం ఉత్తర్వులు జారీచేశారు.

కాంగ్రెస్ ముక్త భారత్ లక్ష్యానికి ఈ ఫలితాలు దోహదం: బండి సంజయ్



కరీంనగర్‌లోని ఎంపీ క్యాంపు కార్యాలయం వద్ద డోలు వాయిస్తున్న మహిళా కార్పొరేటర్లతో బండి సంజయ్, పార్టీ నేతలు

తెలంగాణచౌక్ (కరీంనగర్), న్యూస్‌టుడే: ఎన్నికల్లో భాజపా విజయం సాధించడం కార్యకర్తలకు స్ఫూర్తిదాయకమని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ పేర్కొన్నారు. సోమవారం కరీంనగర్‌లో ఎంపీ క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మంత్రి మాట్లాడారు. "ఇది త్రిమూర్తుల విజయం(మోదీ, అమిత్ షా, నితిన్ నబీన్). కాంగ్రెస్ ముక్త భారత్ లక్ష్యానికి ఈ ఫలితాలు దోహదం చేస్తాయి. ఒక్క కేరళలో కాంగ్రెస్ గెలిచినంత మాత్రాన సీఎం రేవంత్‌రెడ్డి గేమ్ ఛేంజర్ అవుతారా? తమిళనాడు, అస్సాం, పుదుచ్చేరిలలో కూడా ఆయన ప్రచారం చేశారు కదా? అక్కడెందుకు కాంగ్రెస్ ఓడిపోయింది? రాహుల్‌గాంధీ నాయకత్వంలో ఇప్పటివరకు 99 ఎన్నికల్లో కాంగ్రెస్ ఓడిపోయింది. తెలంగాణలో ఆరు గ్యారంటీల అమలుకే దిక్కులేదు. కానీ, ఇక్కడి ప్రజల సొమ్మును కేరళలో ఖర్చు చేశారు. దేశంలో కాషాయ గాలి వీస్తోంది. తెలంగాణలోనూ వీయడం ఖాయం" అని పేర్కొన్నారు.

భవన నిర్మాణ అనుమతికి రూ.లక్ష డిమాండ్

ఏసీబీకి పట్టుబడ్డ టౌన్ ప్లానింగ్ ఉద్యోగిని



బాయిని శ్రీలత

రహ్మత్‌నగర్, న్యూస్‌టుడే: భవన నిర్మాణానికి అనుమతి ఇచ్చేందుకు టౌన్ ప్లానింగ్ జూనియర్ అసిస్టెంట్ రూ.లక్ష లంచం తీసుకుంటూ సోమవారం ఏసీబీకి పట్టుబడ్డారు. ఏసీబీ డీఎస్పీ మాజీద్ అలీఖాన్ కథనం ప్రకారం.. హైదరాబాద్ బోరబండ సర్కిల్ పరిధిలోని ఓ డివిజన్‌కు చెందిన వెంకటేశ్.. భవన నిర్మాణ అనుమతుల కోసం జీహెచ్ఎంసీ బోరబండ సర్కిల్ 37 టౌన్ ప్లానింగ్ అధికారులను సంప్రదించారు. మీ సేవ అనుమతుల నుంచి నిర్మాణం పూర్తయ్యే వరకు అన్ని అనుమతులు తాను చూసుకుంటానని శ్రీలత చెప్పారు. అందుకు రూ.5 లక్షలు ఖర్చవుతుందని, అడ్వాన్స్‌గా రూ.లక్ష ఇవ్వాలని డిమాండ్ చేశారు. దీంతో వెంకటేశ్ ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. సోమవారం మధ్యాహ్నం యూసుఫ్‌గూడలోని ఓ సూపర్ మార్కెట్ వద్ద రూ.లక్ష తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు శ్రీలతను పట్టుకున్నారు. అనంతరం ఆమెను యూసుఫ్‌గూడలోని బోరబండ సర్కిల్ కార్యాలయానికి తరలించి, రికార్డులను తనిఖీ చేశారు. నాంపల్లిలోని ఏసీబీ ప్రత్యేక న్యాయమూర్తి ముందు హాజరు పరిచారు.

నగరాల సమస్యలపై 'ఐడియాథాన్'

ఈనాడు, హైదరాబాద్: నగరాలు ఎదుర్కొంటున్న సమస్యలకు సృజనాత్మక పరిష్కారం చూపేలా దేశవ్యాప్తంగా విద్యార్థులకు 'అర్బన్ ఎక్స్ ఛాలెంజ్ ఎ ఐడియాథాన్-2026'ను నిర్వహిస్తున్నారు. తెలంగాణ ప్రభుత్వం, మున్సిపల్ పరిపాలన శాఖ, అర్బన్ ఇన్నోవేషన్ అండ్ ఇంక్యుబేషన్ సెంటర్, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అర్బన్ మేనేజ్‌మెంట్(ఎన్ఐయూఎం) సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ పోటీలో దేశవ్యాప్తంగా డిగ్రీ, పీజీ విద్యార్థులు పాల్గొనవచ్చు. పూర్తి వివరాలను www.nium.org.in. వెబ్‌సైట్ ద్వారా పొందవచ్చు.